

'ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరి గొంతు వినడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉండాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 40

శుక్రవారం 2-5-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



రాజస్తాన్ రాయల్స్ అవుట్

ఏడో విజయంతో 'టాప్'లోకి వచ్చిన ముంబై ఇండియన్స్ -15లో



జీఎస్టీ వసూళ్ల రికార్డు

ఏప్రిల్‌లో రూ.2.37 లక్షల కోట్లు... 12.6 శాతం పెరుగుదల -15లో



ఎవరినీ వదిలిపెట్టం!

ప్రతి ఉగ్రచర్యకూ ప్రధాని మోదీ నాయకత్వంలోని భారత్ తగిన సమాధానం ఇస్తుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా తేల్చిచెప్పారు.


- వివరాలు 6లో ▶



ఉద్రిక్తతలు ఆగిపోవాల్సిందే

భారత్, పాకిస్తాన్ మధ్య త్వరగా శాంతియుత పరిస్థితులు నెలకొనాలని అమెరికా విదేశాంగ మంత్రి రూబియో అన్నారు.

- వివరాలు 6లో ▶



దెబ్బతీయాలనుకుంటున్నారా?

పహల్గాం ఉగ్రదాడిపై న్యాయ విచారణ జరపాలంటూ భద్రతా దళాల నైతిక స్థైర్యాన్ని దెబ్బతీస్తారా అని సుప్రీంకోర్టు ప్రశ్నించింది.

- వివరాలు 6లో ▶



ఖనిజ ఒప్పందం ఖరారు

డొనాల్డ్ ట్రంప్ అన్నంత పనీ చేశారు. ఉక్రెయిన్‌లోని అరుదైన ఖనిజ సంపదను దక్కించుకోవడంలో అడుగు ముందుకేశారు.

- వివరాలు 6లో ▶

ఏడాదిలోగా చేయాలి

కేంద్రం కులగణన నిర్ణయంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

- ప్రధాని మోదీ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం..అభినందిస్తున్నాం
- ముందు విధివిధానాలేమిటో స్పష్టం చేయాలి.. ప్రజల సూచనలు స్వీకరించాలి
- రహస్యంగా కాకుండా అందర్నీ భాగస్వాముల్ని చేయాలి
- మంత్రుల ఉపసంఘాన్ని, నిపుణుల కమిటీ ఏర్పాటు చేయాలి
- రాజకీయంగా లబ్ధి పొందాలన్న ఆత్రుత వారి మాటల్లో కనిపిస్తోంది... పహల్గాం దాడి నుంచి పక్కదారి పట్టించడానికా? బిహార్ ఎన్నికల కోసమా?
- ఏదైనా సరే.. బలహీనవర్గాలకు ప్రయోజనం కలిగే కార్యక్రమానికి సహకరిస్తామన్న సీఎం



మీడియాతో మాట్లాడుతున్న సీఎం రేవంత్. చిత్రంలో కేకే, మధుయాష్కీ

సాక్షి, హైదరాబాద్: కులగణన విధివిధానాలేమిటో కేంద్రం తొలుత స్పష్టం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. రహస్యంగా కాకుండా పార్లమెంటరీ వ్యవస్థలో అందర్నీ ఈ ప్రక్రియలో భాగస్వాములను చేయాలని కోరారు. దీనిపై తక్షణమే మంత్రివర్గ ఉప సంఘాన్ని, నిపుణులతో కూడిన అధికారిక కమిటీని నియమించాలని సూచించారు. అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకోవాలని చెప్పారు. తూతూమంత్రంగా కాకుండా శాస్త్రీయంగా కులగణన చేపట్టాలని, ఏడాదిలోగా ప్రక్రియ పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. గురువారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో..మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు కె.కేశవరావు, హర్కర వేణుగోపాల్, ఎంపీ అనిల్ కుమార్‌యాదవ్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, రాజ్‌ఠాకూర్, బీర్ల ఐలయ్య వివిధ కార్పొరేషన్ల చైర్మన్లతో కలిసి ఆయన మాట్లాడారు. ముఖ్యాంశాలు సీఎం మాటల్లోనే..

రాహుల్ ప్రతిపాదనను గౌరవించడం గొప్పతనం

మా ఒత్తిడికి తలొగ్గి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర ప్రభుత్వం కులగణన చేపట్టాలని నిర్ణయించడాన్ని స్వాగతిస్తున్నాం. ఒకవేళ పహల్గాం దాడి నుంచి పక్కదారి పట్టించడానికో, బిహార్ ఎన్నికలు దృష్టిలో పెట్టుకునే నిర్ణయం తీసుకున్నా సరే. దేశవ్యాప్తంగా బలహీనవర్గాలకు ప్రయోజనం కలుగుతున్నప్పుడు.. ప్రభుత్వపరంగా, రాజకీయంగా ఇందుకు పూర్తిగా సహకరిస్తాం. మా అనుభవాలను పంచుకోవడానికి, కేంద్రంతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నాం. భారత్‌జోడో యాత్రలో రాహుల్‌గాంధీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే రాష్ట్రాల్లో కులగణన చేపడ్తామని, కేంద్రంలో అధికారంలోకి వస్తే జనగణనతో పాటు కులగణన చేస్తామని హామీ ఇచ్చారు. రాహుల్‌గాంధీ ప్రతిపాదనను

మిగతా 12వ పేజీలో ▶

ఆర్థిక అనారోగ్యం ఏడాదిలో నయమవుతుంది

అప్పటివరకు ఓపికగా, ప్రభుత్వానికి అండగా ఉండాలి

- మే డే ఉత్సవాల్లో సీఎం రేవంత్‌రెడ్డి
- రాష్ట్రంలో పదేళ్ల పాటు ఆర్థిక విధ్వంసం జరిగింది
- పరిస్థితి ఇప్పుడిప్పుడే గాడిన పడుతోంది
- కార్మికుల సంక్షేమం కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం

- వివరాలు 2లో



రిజిస్ట్రార్ జనరల్ నుంచే నేరుగా తాజా జాబితా

కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయం

- మృతిచెందిన ఓటర్ల పేర్లను ఎప్పటికప్పుడు తొలగించే వెసులుబాటు
- అత్యంత నవీకరించిన ఓటర్ల జాబితాకు అవకాశం

న్యూఢిల్లీ: ఎప్పటికప్పుడు పాత పేర్ల తొలగింపు, సవరణలతో అత్యంత కచ్చితత్వంతో ఆధునీకరించిన ఓటర్ల జాబితాను సిద్ధంచేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. మృతిచెందిన ఓటర్ల పేర్లు ఓటర్ల జాబితా నుంచి వెనువెంటనే తొలగించాలని నిర్ణయించింది. ఎవరైనా ఓటర్ మృతిచెందితే అధికారికంగా తమకు సమాచారం వచ్చేదాకా వేచిచూడకుండా నేరుగా

మిగతా 12వ పేజీలో ▶



నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలం అగ్రహారం తండాలో వారం రోజులుగా మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదంటూ ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

గొంతెండిపోతోంది!

వేసవి తీవ్రత పెరుగుతుండటంతో రాష్ట్రంలో తాగునీటి సమస్య

- పలు జిల్లాల్లో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న వైనం
- మిషన్ భగీరథ కింద తాగునీటి సరఫరాకూ అంతరాయం
- జలాశయాలు, చెరువుల్లో నీటిమట్టాలు తగ్గడమే కారణం
- పట్టణ ప్రాంతాల్లోనూ ప్రజల ఇక్కట్లు

క్షేత్రస్థాయిలో పరిస్థితులపై 'సాక్షి' పరిశీలన

- వివరాలు 3లో

తెలంగాణలో చేసింది కుల సర్వేనే..

కులగణన కాదు.. అది కూడా తూతూమంత్రమే



- కేంద్రం చేపట్టే కులగణన శాస్త్రీయంగా ఉంటుంది
- చట్టసవరణ తర్వాత 2026లో కులగణన మొదలు
- కులగణనపై రాహుల్‌గాంధీ మాటలు సిగ్గుచేటు
- కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి

- వివరాలు 2లో

సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్.. ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ సహా పలు అఖిల భారత సర్వీసులకు అభ్యర్థులను ఎంపిక చేసే అత్యంత క్లిష్టమైన ఎంపిక ప్రక్రియ. ఈ ప్రక్రియలో జనరల్ స్టడీస్ నుంచి ఆప్షనల్ సబ్జెక్ట్ వరకు అన్నిటిపై.. అభ్యర్థులకు ఉన్న అవగాహనను లోతుగా పరీక్షిస్తారు. ఈ క్రమంలో ఆప్షనల్ సబ్జెక్ట్ ఎంతో కీలకంగా నిలుస్తోంది. ఇందులో పొందే మార్కులే తుది విజయాన్ని నిర్దేశిస్తున్న పరిస్థితి. దీంతో అకడమిక్‌గా టెక్నికల్, సైన్స్, మెడిసిన్ వంటి నాన్-ఆర్ట్స్ నేపథ్యాల అభ్యర్థుల్లో 85 శాతం మంది హ్యుమానిటీస్ సబ్జెక్ట్‌లనే ఆప్షనల్ సబ్జెక్ట్‌గా ఎంచుకుంటున్నారు. ఫలితాల్లోనూ సత్తా చాటుతున్నారు. వీళ్లంతా అంతవరకు తాము చదువుకున్న సబ్జెక్ట్ వదిలేసి.. అందుకు భిన్నంగా హ్యుమానిటీస్ వైపు ఎందుకు మళ్లుతున్నారు.. ఎలా విజయం సాధిస్తున్నారు.. ఈ కారణాలపై విశ్లేషణ.

..: సాక్షి, స్పెషల్ డెస్క్ :..

→ **శక్తిదూబె..** సివిల్స్-2024లో జాతీయ స్థాయిలో మొదటి ర్యాంకు సాధించిన అభ్యర్థి. బెనారస్ హిందూ యూనివర్సిటీ నుంచి బయో కెమిస్ట్రీ పూర్తి చేసుకున్న ఆమె.. సివిల్స్‌లో మాత్రం ఆప్షనల్ సబ్జెక్ట్‌గా పొలిటికల్ సైన్స్ అండ్ ఇంటర్నేషనల్ రిలేషన్స్ ఎంచుకున్నారు.

→ తెలుగు రాష్ట్రాల్లో మొదటి స్థానంలో, జాతీయ స్థాయిలో 11వ ర్యాంకు సాధించిన **సాయి శివాని** ఎలక్ట్రానిక్స్‌లో ఇంటిగ్రేటెడ్ బీటెక్ చేసి.. ఆంత్రోపాలజీని ఆప్షనల్‌గా ఎంచుకున్నారు.

ఇంజనీరింగ్, సైన్స్ నేపథ్యాల అభ్యర్థులు.. సివిల్స్‌లో ఆప్షనల్ విషయంలో మాత్రం హ్యుమానిటీస్‌కు ప్రాధాన్యం ఇస్తున్నారనడానికి మచ్చుకు రెండు ఉదాహరణలివి.

వీరిద్దరే కాదు.. 2017 నుంచి 2021 వరకు 76% మంది టెక్, సైన్స్, మెడిసిన్ నేపథ్యాల విజేతలు కాగా.. వీరిలో 85% మంది హ్యుమానిటీస్‌ను ఆప్షనల్‌గా ఎంచుకోవడం విశేషం.

సివిల్స్ విజేతలు

అక్కడ సైన్స్.. ఇక్కడ ఆర్ట్స్..

టెక్ గ్రాడ్యుయేట్ల చూపు హ్యుమానిటీస్ వైపు..

అకడమిక్స్‌లో ఇంజనీరింగ్, మెడిసిన్, సైన్స్.. ఆప్షనల్స్‌లో మాత్రం హ్యుమానిటీస్..

సివిల్స్ అభ్యర్థుల్లో 85% మంది ఎంపిక అవే.. వనరుల లభ్యత, శిక్షణ సదుపాయమే కారణం



సక్సెస్ రేటు..

2017 నుంచి 2021 వరకు సివిల్స్‌లో ఇంజనీరింగ్ అకడమిక్ నేపథ్యం ఉన్న 63.7% అభ్యర్థులు పరీక్షలు రాస్తే.. ఇంజనీరింగ్ ఆప్షనల్ సబ్జెక్టుగా ఎంచుకుని విజేతలైంది మాత్రం కేవలం 5.5%.

అకడమిక్ నేపథ్యం	అభ్యర్థుల శాతం	సంబంధిత ఆప్షనల్ సబ్జెక్ట్ విజేతల శాతం
ఇంజనీరింగ్	63.7	5.5
సైన్స్	7.2	7.3
మెడికల్ సైన్స్	5.5	2.1
హ్యుమానిటీస్	23.6	85.1

వనరుల లభ్యతే కారణం..

హ్యుమానిటీస్‌ను ఆప్షనల్ సబ్జెక్ట్‌గా ఎంచుకుంటున్న వారు సైతం.. అందులో నాలుగు సబ్జెక్ట్‌లకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. అవి పొలిటికల్ సైన్స్, సోషియాలజీ, ఆంత్రోపాలజీ, జాగ్రఫీ. ఆప్షనల్ సబ్జెక్ట్‌గా హ్యుమానిటీస్ విభాగంలోని ఒక సబ్జెక్ట్ ఎంచుకోవడానికి ప్రధాన కారణంగా వినిపిస్తున్న అంశం.. వనరుల లభ్యత. సివిల్ సర్వీసెస్ ఎంపిక ప్రక్రియలో రెండో దశలోని మెయిన్స్‌లో రెండు పేపర్లుగా 500 మార్కులకు ఉండే ఆప్షనల్ సబ్జెక్ట్ పరీక్ష నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో.. ఆ సబ్జెక్ట్‌కు సంబంధించి పరిపూర్ణ అవగాహన తప్పనిసరి. మెటీరియల్ లభ్యత, శిక్షణ సదుపాయం విషయంలో హ్యుమానిటీస్ సబ్జెక్ట్‌లకు సంబంధించి పుష్కలమైన వనరులు అందుబాటులో ఉన్నాయి. కోచింగ్ ఫ్యాకల్టీలో సైతం 90 శాతం మంది ఈ సబ్జెక్ట్‌లలోనే అందుబాటులో ఉంటున్నారు. విశ్లేషణాత్మక వ్యక్తీకరణ సులభంగా ఉండడం కూడా ఈ సబ్జెక్ట్‌లను ఎంచుకోవడానికి కారణమని విజేతలు, కోచింగ్ నిపుణులు సైతం అభిప్రాయపడుతున్నారు. న్యూమరికల్ పాఠ్యాంశాలు ఉండే మ్యాథ్స్, సైన్స్‌లు సహనానికి పరీక్షగా మారుతున్నాయి.

జీఎస్ పేపర్లకు సమయం ఆదా..

హ్యుమానిటీస్‌ను ఆప్షనల్‌గా ఎంచుకోవడం వల్ల అభ్యర్థులకు కలిసొస్తున్న మరో అంశం.. జనరల్ ఎస్సే, జనరల్ స్టడీస్(జీఎస్) పేపర్లకు సమయం ఆదా చేసుకునే అవకాశం. ఒక జనరల్ ఎస్సే, నాలుగు జనరల్ స్టడీస్ పేపర్లు ఉండే మెయిన్స్ పరీక్షలో అత్యధిక శాతం అంశాలు సమకాలీన, భౌగోళిక అంశాలు, అంతర్జాతీయ సంబంధాలు, పరిపాలన, చరిత్ర, ఆర్థిక అంశాల నుంచే ఉంటున్నాయి. దీంతో హ్యుమానిటీస్‌లోని ఏ సబ్జెక్ట్‌ను ఆప్షనల్‌గా ఎంచుకున్నా.. ఎస్సే, జీఎస్ పేపర్లతో కలిపి చదివే అవకాశం ఉంటోంది. సివిల్స్ మెయిన్స్ ఆప్షనల్స్ విషయంలో హ్యుమానిటీస్ సబ్జెక్ట్‌లైన ఆంత్రోపాలజీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, పాలిటీలకు ఎప్పటి నుంచో స్కోరింగ్ సబ్జెక్ట్‌లనే పేరుంది.

విధుల్లోనూ ఉపయోగం

హ్యుమానిటీస్ సబ్జెక్ట్‌ను ఎంచుకుంటే.. భవిష్యత్తులో సివిల్ సర్వీస్ అధికారులుగా నిర్వర్తించాల్సిన విధుల విషయంలోనూ స్పష్టత ఏర్పడుతుందనే అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఉదాహరణకు పాలిటీ, గవర్నెన్స్, ఎథిక్స్, ఇంటెగ్రిటీ, ఆప్టిట్యూడ్ వంటి అంశాలనే పరిగణనలోకి తీసుకుంటే.. పాలన పరంగా అనుసరించాల్సిన వ్యూహాలు, పాలనా దక్షతకు సంబంధించిన అంశాలతో సిలబస్‌ను కూర్చారు. దీనిపై పట్టు సాధించడం ద్వారా విజేతలుగా నిలిస్తే భవిష్యత్తులో విధి నిర్వహణలోనూ సమర్థవంతంగా వ్యవహరించొచ్చు అనే అభిప్రాయం వినిపిస్తోంది.

ఆప్షనల్ సబ్జెక్ట్ అంటే

సివిల్ సర్వీసెస్ ఎంపిక ప్రక్రియలోని రెండో దశ మెయిన్స్‌లో మొత్తం ఏడు పేపర్లు ఉంటాయి. వీటిలో రెండు పేపర్లు ఆప్షనల్ సబ్జెక్ట్ పేపర్-1, ఆప్షనల్ సబ్జెక్ట్ పేపర్-2గా ఉంటాయి. ప్రతి అభ్యర్థి తప్పనిసరిగా యూపీఎస్సీ 2025 పేర్కొన్న 26 సబ్జెక్ట్‌ల నుంచి ఒక సబ్జెక్ట్‌ను ఆప్షనల్‌గా ఎంచుకోవాలి. మొత్తం 1,750 మార్కులకు ఉండే మెయిన్స్ పరీక్షలో ఆప్షనల్ సబ్జెక్ట్‌కే 29 శాతం వెయిటేజీ ఉంటోంది.

నాలుగైదు నెలల్లో పట్టు సాధించే అవకాశం



→ హ్యుమానిటీస్ ఆప్షనల్స్ విషయంలో అభ్యర్థులకు కలిసొస్తున్న అంశం.. మంచి గ్రాహక శక్తి ఉన్న అభ్యర్థి నాలుగైదు నెలల్లో సంబంధిత సబ్జెక్ట్‌లో పట్టు సాధించే అవకాశం ఉండడమే. ఇక ఇంజనీరింగ్ విద్యార్థులకు అకడమిక్ అభ్యసనం కోణంలో స్వతహాగా అనలిటికల్ స్కిల్స్ లభిస్తున్నాయి. ఇది కూడా వారికి కలిసొస్తున్న అంశమే.

- వి. గోపాలకృష్ణ, డైరెక్టర్, బ్రెయిన్ ట్రీ ఐఏఎస్ అకాడమీ

మన దృక్పథాన్ని విశ్లేషించే అవకాశం



→ హ్యుమానిటీస్ ఆప్షనల్స్ విషయంలో సమాధానం ఇచ్చేటప్పుడు మన దృక్పథాన్ని, అప్పటి వరకు చదివిన అంశాలను పూర్తి స్థాయిలో విశ్లేషించే అవకాశం ఉంటుంది. ఎగ్జామ్ పాయింట్ ఆఫ్ వ్యూలో టెక్నికల్ సబ్జెక్ట్స్‌కు లోతైన అవగాహన అవసరం. సివిల్స్ ప్రిపరేషన్ గడువుతో పోల్చుకుంటే ఇది కొంత కష్టమైన ప్రక్రియ. అందుకే టెక్ నేపథ్యం ఉన్న వారు హ్యుమానిటీస్‌ను ఆప్షనల్‌గా ఎంచుకుంటున్నారు. అలాగే హ్యుమానిటీస్ విషయంలో కోచింగ్ తీసుకోలేని వారికి కూడా విస్తృతమైన వనరులు అందుబాటులో ఉన్నాయి. అంతేకాకుండా సబ్జెక్ట్‌ను అర్థం చేసుకోవడమూ సులభం. నా ఆప్షనల్ ఆంత్రోపాలజీ పరిధి ఎక్కువే అయినప్పటికీ.. సిలబస్‌లోని అంశాలను బేరీజు వేసుకుని చదివాను.

- ఇ. సాయి శివాని, సివిల్స్-2024లో 11వ ర్యాంకు (తెలుగు రాష్ట్రాల్లో టాపర్)

సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ - 2024 గణాంకాలు

5.8 లక్షలు హాజరైన అభ్యర్థులు	**14,627** మెయిన్స్‌కు ఎంపికైన వారు
2,845 ఇంటర్వ్యూకు ఎంపికైన వారు	**1009** విజయం సాధించిన వారు

క్లుప్తంగా...



కులగణన పూర్తయ్యే వరకు ఉద్యమాలు చేస్తాం

జాజుల శ్రీనివాస్‌గౌడ్, చిరంజీవులు

సాక్షి, హైదరాబాద్ : కులగణన చేస్తానన్న కేంద్ర ప్రభుత్వం.. వాటి పూర్తి వివరాలు వెల్లడించే వరకు వివిధ దశల్లో ఉద్యమాలు చేస్తామని బీసీ సంక్షేమ సంఘం హెచ్చరించింది. దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని కేంద్ర నిర్ణయంపై హర్షం వ్యక్తం చేసింది. కులగణన చేస్తానన్న మోదీకి, చేయాలని డిమాండ్ చేసిన రాహుల్‌కు ధన్యవాదాలు తెలిపింది. ఢిల్లీలో జరిగిన బీసీల పోరుగర్జన సభలో పాల్గొని కేంద్ర ప్రభుత్వం నుంచి సానుకూల నిర్ణయం వెల్లడి కావడానికి సహకరించిన సీఎం రేవంత్‌రెడ్డిని గురువారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి బీసీ సంఘాల నేతలు అభినందించారు. అనంతరం సచివాలయ మీడియా పాయింట్ బయట బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, బీసీ ఇంటలెక్చువల్ ఫోరం చైర్మన్ చిరంజీవులు మాట్లాడారు. కులగణన ఉద్యమానికి విజయ సంకేతంగా ఈనెల 6న దేశవ్యాప్తంగా బైక్ ర్యాలీ నిర్వహిస్తామన్నారు.

కులగణనలో ఇతర మతాల వారు ఉండరా?: జగ్గారెడ్డి



సాక్షి, హైదరాబాద్: కులగణనలో ఇతర మతాల వారు ఉండరని కిషన్‌రెడ్డి ఎలా చెబుతారని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ప్రశ్నించారు. కిషన్‌రెడ్డికి ఇష్టం లేదని ముస్లింలు, ఇతర మతాల వారిని కులగణనలోకి తీసుకోరనడం శోచనీయమని, ఇక్కడ పుట్టిన ముస్లిం, క్రిస్టియన్లు కూడా భారతదేశ ప్రజలే అని గుర్తుంచుకోవాలన్నారు. గాంధీభవన్‌లో గురువారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, ఈ అంశంపై ప్రధాని స్పందనను బట్టి కాంగ్రెస్ మాట్లాడుతుందన్నారు.



ఆ'లైన్' ఎక్కడుందో మనవాళ్లకు కనపడటం లేదట..!

ఆర్థిక అనారోగ్యం ఏడాదిలో నయం

- అప్పటివరకు ఓపికగా, ప్రభుత్వానికి అండగా ఉండాలి
- మే డే ఉత్సవాల్లో సీఎం రేవంత్‌రెడ్డి
- రాష్ట్రంలో పదేళ్ల పాటు ఆర్థిక విధ్వంసం జరిగింది
- పరిస్థితి ఇప్పుడిప్పుడే గాడిన పడుతోంది
- కార్మికుల సంక్షేమం కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో పొంగులేటి, పొన్నం, యాదయ్య, శంకర్, రాజ్‌ఠాకూర్, జనక్‌ప్రసాద్

సాక్షి, హైదరాబాద్: అనారోగ్యంగా ఉన్న రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టేందుకు మరో ఏడాది సమయం పడుతుందని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. రాష్ట్రంలో పదేళ్ల పాటు ఆర్థిక విధ్వంసం జరిగిందని, మిగులు బడ్జెట్‌తో ఉన్న రాష్ట్రాన్ని రూ.8.29 లక్షల కోట్ల అప్పుల్లో ముంచారని విమర్శించారు. కాంట్రాక్టర్లకు రూ.50 వేల కోట్లు బకాయిలు పెట్టారని, ఇతర విభాగాల్లో రూ.1.20 లక్షల కోట్ల మేర చెల్లింపులు చేయలేదని అన్నారు. అనవసరమైన ఖర్చుతో ఆర్థిక దోపిడీకి పాల్పడ్డ గత పాలకులు వేల కోట్ల ఆస్తులు సంపాదించుకున్నారని ఆరోపించారు. ఫామ్‌హౌస్‌లు, పేపర్లు, టీవీలు అంటూ వ్యాపార సామ్రాజ్యాలను నిర్మించుకున్నారన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఒక్కొక్కటిగా సరిదిద్దుతున్నామని, పరిస్థితి ఇప్పుడిప్పుడే గాడిన పడుతోందని తెలిపారు. మే డే పురస్కరించుకుని గురువారం రవీంద్రభారతిలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉత్సవాల్లో సీఎం పాల్గొని కార్మికులనుద్దేశించి ప్రసంగించారు.

15 నెలలుగా నిద్రలేని రాత్రులు..

'రాష్ట్ర అభ్యున్నతి కోసం 15 నెలలుగా నేను, నా సహచర మంత్రులు ఎన్నో నిద్రలేని రాత్రులు గడుపుతున్నాం. ఒక పద్ధతి ప్రకారం నష్టాలను నివారిస్తూ ముందుకు వెళుతున్నాం. కార్మికుల సంక్షేమం కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. సింగరేణి లాభాల్లో వాటా కింద కార్మికులకు బోనస్ ఇచ్చాం. ఆర్టీసీలో కారుణ్య నియామకాలు చేపట్టాం. త్వరలో గిగ్ వర్కర్స్ పాలసీని తీసుకురాబోతున్నాం. ఇది దేశానికే ఆదర్శంగా మారుతుందని భావిస్తున్నాం. కార్మికుల విషయంలో గత ప్రభుత్వం తీవ్ర వివక్ష చూపింది. ఆర్టీసీ కార్మికుల సమ్మెను అణచివేసి 50 మంది కార్మికులను పొట్టన పెట్టుకుంది..'అని రేవంత్ ఆరోపించారు.

సమ్మె చేస్తే నష్టాలు తప్పవు

'ఇప్పుడు కూడా ఆర్టీసీ కార్మికులు సమ్మె చేయాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. సమస్య ఏదైనా మంత్రి దృష్టికి తీసుకురండి. వీలైనంత త్వరగా పరిష్కరిస్తాం. ఆర్టీసీ ఇప్పుడిప్పుడే లాభాల్లోకి వస్తోంది. ఇలాంటి సమయంలో సమ్మె చేస్తే సంస్థ తీవ్ర నష్టాల్లో కూరుకుపోతుంది. ఆర్టీసీ కార్మికులు పంతాలు, పట్టింపులకు పోవద్దు. ఈ సంస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత కార్మికులదే. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని పూర్తిగా ప్రజల ముందుంచాం. మీరేం చెబితే అదే చేస్తాం. ఇది మీ ప్రభుత్వం. రాష్ట్ర ప్రభుత్వానికి నెలకు రూ.22,500 కోట్ల రాబడి ఉంటే అన్ని పథకాలను అమలు చేయవచ్చు. కానీ ప్రస్తుతం వస్తున్న ఆదాయం రూ.18,500 కోట్లు మాత్రమే. ఏడాదిన్నరలో రూ.1.58 లక్షల కోట్లు అప్పులు చేస్తే అందులో రూ.1.52 లక్షల కోట్లు గత ప్రభుత్వం చేసిన అప్పుల వాయిదాలు, వడ్డీలు చెల్లించడానికే సరిపోయింది. మరో ఏడాది పాటు వేచి చూస్తే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. ఆ తర్వాత సమస్యల పరిష్కారం వేగవంతం అవుతుంది. అప్పటివరకు ఓపికగా ప్రభుత్వానికి అండగా ఉండాలి..'అని ముఖ్యమంత్రి కోరారు.

గత పాలకులు విషం చిమ్ముతున్నారు..

'పదేళ్ల పాటు రాష్ట్రాన్ని పాలించిన కపట నాటక సూత్రధారి ఇప్పుడు మళ్లీ బయలుదేరాడు. కేసీఆర్ చేసిన గాయాల్ని ప్రజలు ఇంకా మరిచిపోలేదు. పదేళ్ల పాటు ప్రజలను పట్టించుకోకుండా మరోమారు అధికారం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాడు. సమస్యలను పరిష్కరిస్తూ, సంక్షేమ కార్యక్రమాలను చేపడుతున్న ప్రజా ప్రభుత్వంపై అక్కసుతో గత పాలకులు విషం చిమ్ముతున్నారు. ప్రజలు ఓట్లేసి అసెంబ్లీకి పంపితే ఇష్టారీతిన మాట్లాడుతున్నారు. ప్రజలు వారి విషపు చూపుల్లో చిక్కుకోవద్దు. కేసీఆర్ దళితుడిని ముఖ్యమంత్రిని చేయలేదు. కనీసం ప్రధాన ప్రతిపక్ష నాయకుడిగా అయినా అవకాశం ఇవ్వాలి..'అని రేవంత్ అన్నారు.

శ్రమశక్తి అవార్డుల ప్రదానం

కార్మిక శాఖ ఆధ్వర్యంలో శ్రమశక్తి అవార్డుల కోసం ఎంపిక చేసిన సంస్థలు, వ్యక్తులకు గురువారం రవీంద్రభారతిలో వాటిని ప్రదానం చేశారు. మొత్తం 11 సంస్థలు, 37 మంది వ్యక్తిగతంగా అవార్డులకు ఎంపికయ్యారు. హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజి బోర్డు, గ్రాన్యుల్స్ ఇండియా లిమిటెడ్, క్రిమెటివ్ స్టైజ్/టెన్సిల్ స్ట్రక్చర్స్ మాన్యుఫాక్చరింగ్ తదితర సంస్థలు సీఎం నుంచి అవార్డులు అందుకున్నాయి. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, వీర్లపల్లి శంకర్, రాజ్‌ఠాకూర్, కనీస వేతన సలహా బోర్డు చైర్మన్ జనక్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో చేసింది కుల సర్వేనే

- కులగణన కాదు.. అది కూడా తూతూమంత్రమే
- కేంద్రం చేపట్టే కులగణన శాస్త్రీయంగా ఉంటుంది
- చట్టసవరణ తర్వాత 2026లో కులగణన మొదలు
- కులగణనపై రాహుల్‌గాంధీ మాటలు సిగ్గుచేటు
- కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించింది కులగణన కాదని.. కుల సర్వే మాత్రమేనని కేంద్ర మంత్రి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు జీ కిషన్‌రెడ్డి విమర్శించారు. ఆ సర్వేను కూడా తూతూమంత్రంగానే నిర్వహించారని ఆరోపించారు. గురువారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'తెలంగాణ ప్రభుత్వం సర్వే వివరాలను ఒకసారి పబ్లిష్ చేసి, లోపాలుంటే మరోసారి సర్వే చేసింది. ఇష్టం వచ్చినట్లు సర్వే చేశారు తప్ప.. అందులో శాస్త్రీయత లేదు. అది బీసీ వ్యతిరేక సర్వే. ఈ విషయం రాహుల్ గాంధీకి అర్థం కాలేదు. తెలంగాణ, కర్ణాటకలో చేపట్టిన కులగణన హడావుడిగా, ఏదో సాధించామని చెప్పుకునేందుకు చేశారు. ఇందులో చిత్తశుద్ధి లేదు, ఇది కులగణన కూడా కాదు. కులాలకు సంబంధించిన సర్వే మాత్రమే. తెలంగాణలో ఉన్న రాంగ్ రోల్ మోడల్ మాకు అవసరం లేదు. మారుమూల ప్రాంతాలకు కూడా వెళ్లి సమగ్రంగా జనగణన చేస్తాం. శాస్త్రీయ పద్ధతిలో కులగణన జరుగుతుంది. మేము చేపట్టబోయే కులగణనలో ఎట్టి పరిస్థితుల్లోనూ ముస్లింలను బీసీల్లో చేర్చం. మత ప్రాతిపదికన ఎవరినీ బీసీల్లో చేర్చే ప్రసక్తే లేదు' అని స్పష్టం చేశారు. ఈ కులగణన చరిత్రపుటల్లో నిలిచిపోతుందన్నారు.

రాహుల్‌గాంధీ మాటలు సిగ్గుచేటు

తన ఒత్తిడి వల్లే కేంద్ర ప్రభుత్వం కులగణన నిర్ణయం తీసుకుందని కాంగ్రెస్ రాహుల్‌గాంధీ చెప్పడం సిగ్గుచేటని కిషన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డిలకు భయపడి తీసుకున్న నిర్ణయం కాదని స్పష్టం చేశారు. 'ఎద్దులబండి కింద నడుస్తున్న కుక్క.. మొత్తం బండిని తానే మోస్తున్నానని అనుకుంటుంది. అలాగే కాంగ్రెస్ పార్టీ కూడా. తాము చెప్పినట్లే ప్రభుత్వాన్ని నడిపిస్తామని చెప్పుకుంటోంది. ఇది హాస్యాస్పదం'అని ఎద్దేవా చేశారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తీర్పుకు కట్టుబడే కులగణన ఉంటుందని తెలిపారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ప్రజలను మతం పేరుతో విడగొడుతున్న కాంగ్రెస్ పార్టీ.. కులాల పేరుతోనూ సమాజాన్ని విచ్ఛిన్నం చేసే కుట్ర చేస్తోందని ఆరోపించారు. 'కులగణన చేపట్టేందుకు సెన్సెస్ యాక్ట్ 1948లో సవరణ తీసుకొచ్చి 'కులం'అనే పదాన్ని ఓ పారామీటర్‌గా చేర్చాలి. వచ్చే పార్లమెంటు సమావేశాల్లో ఈ సవరణ తీసుకొచ్చిన తర్వాతే జనగణనపై ముందుకెళ్తాం. 2026లో జనగణన మొదలయ్యే అవకాశం ఉంది'అని కిషన్‌రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి ఉన్నవే మూడు రాష్ట్రాలని, అవి కూడా తుమ్మితే ఊడిపోయే ముక్కులాంటివని ఎద్దేవా చేశారు.

తెలంగాణ అభివృద్ధికి అడ్డంకిగా కిషన్‌రెడ్డి, బండి సంజయ్

- బీఆర్ఎస్‌తో దోస్తీ కట్టి కాంగ్రెస్ ప్రభుత్వంపై విషం కక్కుతున్నారు
- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ అభివృద్ధికి కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ అడ్డంకిగా మారారని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ఆరోపించారు. రాష్ట్రంలో నిర్వహించిన కులగణనను తప్పుల తడక అనడం ఈ ఇద్దరు నాయకుల దిగజారుడుతనానికి నిదర్శనమని గురువారం ఆయన ఒక ప్రకటనలో విమర్శించారు. బీఆర్ఎస్‌తో దోస్తీ కట్టి కాంగ్రెస్ ప్రభుత్వంపై నిత్యం విషం కక్కడం వీరికి అలవాటుగా మారిందని ధ్వజమెత్తారు. కులగణనపై కేంద్రం తీసుకున్న నిర్ణయంతో రాహుల్ గాంధీ సంకల్పం సిద్ధించిందని, రాహుల్ ఆలోచన మేరకు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల బృందం కులగణనను శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించిందని పేర్కొన్నారు. శాసనసభలో 8 మంది బీజేపీ ఎమ్మెల్యేల సాక్షిగా ఏకగ్రీవ తీర్మానంతో బీసీల కులగణనకు చట్టబద్ధత కల్పించామని పేర్కొన్నారు. బీసీల పట్ల బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే పార్లమెంట్‌లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని, 50 శాతం రిజర్వేషన్ల పరిమితి ఎత్తివేసేలా పార్లమెంట్‌లో చట్టం చేయాలని డిమాండ్ చేశారు. బీసీ బిల్లు చట్టబద్ధత కోసం ప్రధాని మోదీకి లేఖ రాసే దమ్ము కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, సంజయ్‌లకు ఉందా అని ప్రశ్నించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక కేంద్ర మంత్రులమన్న విషయం మరిచి మాట్లాడటం వారి అహంకారానికి పరాకాష్ట అని మహేశ్‌గౌడ్ దుయ్యబట్టారు. పారదర్శక సర్వేపై తప్పుడు ఆరోపణలు చేయడానికి బీసీ బిడ్డగా బండి సంజయ్ ఆత్మ పరిశీలన చేసుకోవాలని హితవు పలికారు. కేంద్రం జనగణనతో పాటు కులగణన చేయాలని తీసుకున్న నిర్ణయం కాంగ్రెస్ విజయం అని, కేంద్రం దేశవ్యాప్తంగా కులగణన ఎప్పుడు నిర్వహిస్తుందో ప్రకటించాలని డిమాండ్ చేశారు. చరిత్రాత్మక కులగణన, ఎస్సీ వర్గీకరణ, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల నిర్ణయాలతో దేశానికి ఆదర్శంగా తెలంగాణ నిలిచిందని ఆయన అన్నారు.



నూతన వధూవరులతో కేసీఆర్ దంపతులు

కార్యకర్త కుమారుడి పెళ్లికి కేసీఆర్ దంపతులు

మర్కూక్(గజ్వేల్): మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు గురువారం సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లిలో బీఆర్ఎస్ కార్యకర్త కుమారుడి వివాహానికి హాజరయ్యారు. గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ భాగ్యమ్మ, వెంకటేశం దంపతుల కుమారుడు, స్థానిక మండల విస్తరణాధికారి విష్ణు వివాహ వేడుకకు కేసీఆర్ దంపతులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కల్యాణ మండపంలో సుమారు 30 నిమిషాల పాటు ఉండి కల్యాణాన్ని తిలకించారు. అనంతరం తన వ్యవసాయ క్షేత్రానికి వెళ్లిపోయారు. ఆయనతో పాటు ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ రాంచంద్రం యాదవ్‌లు పాల్గొన్నారు.

కార్మికుల రెక్కల కష్టం వెలకట్టలేనిది: కేసీఆర్

పారిశ్రామిక అభివృద్ధిలో తెలంగాణను ఆదర్శంగా నిలిపారు

సాక్షి, హైదరాబాద్: ఉత్పత్తిలో భాగమై జాతి సంపదను సృష్టిస్తున్న కార్మికుల రెక్కల కష్టానికి వెలకట్టలేమని, వారి త్యాగం అసామాన్యమైనదని బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావు అన్నారు. అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా కార్మిక, శ్రామిక, కర్షక లోకానికి కేసీఆర్ గురువారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. మేడే స్ఫూర్తితో, రాష్ట్రంలోని శ్రామికుల హక్కులను కాపాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన చర్యలు వారి జీవన భద్రతకు భరోసాను పెంచాయన్నారు. పారిశ్రామిక అభివృద్ధిలో తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలబెట్టామని చెప్పారు. రాష్ట్రంలో నూతన పారిశ్రామిక విధానాలను అమలు చేసి ప్రపంచ పెట్టుబడులను ఆకర్షించామని తెలిపారు. లక్షలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలను కల్పించామని కేసీఆర్ పేర్కొన్నారు. ఉత్పత్తి సేవా రంగాల్లో పాల్గొనే మహిళా కార్మికులకు ప్రత్యేక సౌకర్యాలు, హక్కులను కల్పించి అండగా నిలిచామన్నారు. సింగరేణి కార్మికులు, ఆటోడ్రైవర్లు, పారిశ్రామిక కార్మికులు సహా అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న శ్రామికులకు అన్ని రకాలుగా భరోసా కల్పించామన్నారు.

కార్మికుల కష్టం మీద జాతి సంపద: కేటీఆర్

కార్మికుల రెక్కల కష్టమే జాతి సంపదను సృష్టిస్తుందని, వారి త్యాగం వెల కట్టలేనిదంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మేడే శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్ పాలనలో ఆర్టీసీ కార్మికుల వేతనాల పెంపుతో కార్మికులకు సంక్షేమ బోర్డుల ద్వారా అండగా నిలిచామన్నారు. మేడే స్ఫూర్తితో కార్మిక ఐక్యత, సమానత్వం కోసం కలిసి నడుద్దామని పిలుపునిచ్చారు. శ్రామిక శక్తి దేశానికి వెన్నెముక అని, కార్మికుల అవిశ్రాంత, అంకిత భావానికి గుర్తింపుగా నిలిచిన రోజే కార్మిక దినోత్సవమని మాజీ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు.

మొక్కుబడిగా కులగణన చేస్తే ఊరుకోం

మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: కులగణనపై కేంద్రం ఉత్త మాటలు చెప్పకుండా అందరికీ నమ్మకం కలిగించాలని, మొక్కుబడిగా చేస్తే ఊరుకోమని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. కులగణన చేపడతామన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని, అయితే వెంటనే జనగణనతో పాటు కులగణన చేపట్టాలని కేంద్రాన్ని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. గురువారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ మాజీ ఎంపీ లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌లతో కలసి ఆయన మీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కులగణనకు సంబంధించి స్పష్టమైన విధానాలు ప్రకటించాలని, కులగణనపై పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం తీర్మానం పెడితే రాజ్యసభలో ప్రాతినిధ్యం ఉన్న బీఆర్ఎస్ మద్దతు ఇస్తుందని పేర్కొన్నారు. చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు లభిస్తేనే బడుగులకు సంపూర్ణ న్యాయం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. అదే విధంగా విద్యా, ఉద్యోగ రంగాల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని, బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ బీసీలను ఎప్పుడూ ఓటు బ్యాంకుగానే చూసిందని విమర్శించారు. కులగణనలో తెలంగాణ.. దేశానికి రోల్ మోడల్ అని సీఎం అంటున్నారని, కానీ బీసీల జనాభాను తక్కువ చేసి చూపిస్తే అది ఆదర్శం ఎట్లా అవుతుందని ప్రశ్నించారు. 11 సార్లు కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, ఇంత కాలం బీసీ కులగణన ఎందుకు చేయలేకపోయిందని నిలదీశారు.

గొంతెండిపోతోంది!

వేసవి తీవ్రత పెరుగుతుండటంతో రాష్ట్రంలో తాగునీటి సమస్య

- పలు జిల్లాల్లో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న వైనం
- మిషన్ భగీరథ కింద తాగునీటి సరఫరాకూ అంతరాయం
- జలాశయాలు, చెరువుల్లో నీటిమట్టాలు తగ్గడమే కారణం
- పట్టణ ప్రాంతాల్లోనూ ప్రజల ఇక్కట్లు
- క్షేత్రస్థాయిలో పరిస్థితులపై 'సాక్షి' పరిశీలన


ఆసిఫాబాద్ జిల్లా లింగాపూర్ మండలం జాములధర పరిధి మోతిగూడ గ్రామస్తులు 2 కిలోమీటర్లు కాలినడకన వెళ్లి కొలంగూడ బావి నుంచి నీటిని తెచ్చుకుంటున్నారు. మండల కేంద్రంలోని కొన్ని ఇళ్లకే భగీరథ నీళ్లు అందుతున్నాయి.


గాంధారి మండలంలోని నేరేల్ తండాలో ట్యాంకర్ నుంచి నీటిని పట్టుకుంటున్న ప్రజలు

సాక్షి, హైదరాబాద్ / సాక్షి న్యూస్ నెట్‌వర్క్: రాష్ట్రంలో వేసవి ఎండలు మండిపోతుండటంతో తాగునీటి ఎద్దడి మొదలయ్యింది. వివిధ జిల్లాల్లో పగటి ఉష్ణోగ్రతలు ఇప్పటికే 40 డిగ్రీలు దాటాయి. రాబోయే నెల రోజుల్లో వేసవి తీవ్రత పెరిగితే ఆ మేరకు తాగునీటి సమస్యలు కూడా మరింత పెరిగే అవకాశం ఉంది. మిషన్ భగీరథ కింద తాగునీటి సరఫరా జరుగుతున్న ప్రాంతాల్లో కూడా ప్రజలు మంచినీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు జిల్లాల నుంచి అందుతున్న సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. జలశయాలు, చెరువులు లేనిచోట్ల ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బోర్ల ద్వారా భగీరథ ఓవర్‌హెడ్ ట్యాంకులకు మంచినీటిని సరఫరా చేస్తారు. అయితే జలాశయాల్లో నీటి మట్టాలు తగ్గడం, చాలాచోట్ల చెరువులు ఎండిపోవడం, భూగర్భ జలాలు ఎండిపోవడంతో సమస్య తలెత్తుతోంది. ప్రస్తుతం ఉమ్మడి నల్లగొండ, ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్ తదితర జిల్లాల్లోని కొన్ని మారుమూల ప్రాంతాలు, గ్రామాల్లో మిషన్ భగీరథ తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్టు సమాచారం. రాష్ట్రవ్యాప్తంగా పలు పట్టణాలు, గ్రామాల్లో నెలకొన్న తాగునీటి కష్టాలను 'సాక్షి' పరిశీలించింది.

ఏజెన్సీ ప్రాంతాల్లో ఇక్కట్లు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మిషన్ భగీరథ నీరు సరిగా సరఫరా కాక ముఖ్యంగా ఏజెన్సీ మారుమూల ప్రాంతాల్లో ఇబ్బందులు వస్తున్నాయి. ఇంద్రవెల్లి, జైనూర్, లింగాపూర్, సిర్పూర్ యూ మండలాల్లో గిరిజనులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్నిచోట్ల బోర్లు, ట్యాంకులతో సరఫరా చేస్తున్నారు. మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం రాజారంలో బోర్ మోటార్ చెడిపోయి నెలలు గడుస్తున్నా మరమ్మతు చేయకపోవడంతో వాటర్ ట్యాంక్‌తో నీటిని సరఫరా చేస్తున్నారు.

అరకొరగానే భగీరథ నీళ్లు

నిజామాబాద్ జిల్లాలోని ఇందల్వాయి మండలం, మోపాల్ మండలాల్లో నీటి సమస్య ఉంది. దీంతో గ్రామ పంచాయతీ వాటర్ ట్యాంకుల ద్వారా నీటి సరఫరా చేస్తున్నారు. మోపాల్ మండలంలోని పలు తండాలు ముంపు గ్రామాలు కావడంతో ఇక్కడ మిషన్ భగీరథ పైపులైన్లు వేయలేదు. బిచ్కుంద మండలంలోని పలు గ్రామాల్లో నీటి సమస్య తీవ్రంగా ఉంది. పలు గ్రామాల్లో భూగర్భ జలాలు అడుగంటి బోర్లు ఎండిపోయాయి. గాంధారి, తాడ్వాయి, లింగంపేట, రామారెడ్డి మండలాల్లోనూ తాగునీటి ఎద్దడి నెలకొంది. మిషన్ భగీరథ నీరు సక్రమంగా సరఫరా కావడం లేదు.

బోర్లు ఎండిపోయాయి..



"సూర్యాపేట పట్టణంలోని అంజనాపురి కాలనీ దగ్గర వజ్ర టౌన్‌షిప్‌కు మిషన్ భగీరథ పైప్ లైన్ వేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. భూగర్భ జలాలు అడుగంటడంతో బోర్లు ఒట్టిపోయాయి. కాలనీ మొత్తం మంచినీటి సమస్య ఎదుర్కొంటోంది. అధికారులు స్పందించి మా కష్టాలు తీర్చాలి.

– గుగులోతు మంగమ్మ, వజ్ర టౌన్‌షిప్

సూర్యాపేట మున్సిపాలిటీలో ఇదే పరిస్థితి

ఉమ్మడి నల్లగొండ జిల్లా సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని 48 వార్డుల్లో దాదాపు 17 వేల మిషన్ భగీరథ కనెక్షన్లు ఉన్నాయి. పట్టణంలో రోజు విడిచి రోజు గంట సేపు నీటి సరఫరా చేస్తున్నారు. అవి గృహ అవసరాలకు ఏమాత్రం సరిపోవటం లేదని స్థానికులు చెబుతున్నారు. శివారు ప్రాంతాలైన భాషా నాయక్ తండా, పిల్లలమర్రి బీబీ గూడెం, కాసింపేట, రామకోటి తండా, అంజనాపురి కాలనీల్లోనూ నీటి కొరత ఉంది. కొన్నిచోట్ల భగీరథ కనెక్షన్లు ఇవ్వకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

కొత్త గ్రామాలకే కొద్దిగా ఇబ్బంది

ప్రస్తుతం మిషన్ భగీరథ నీటి సరఫరాలో పెద్దగా ఇబ్బందులేవీ ఎదురుకావడం లేదు. రాష్ట్రంలోని వివిధ రిజర్వాయర్లలో తగినంత నీటి నిల్వలున్నందున (మూడునెలలకు సరిపడేలా) మా పథకానికి ఎలాంటి సమస్యలు లేవు. కొత్తగా ఏర్పడిన గ్రామాలకు తప్ప దాదాపుగా అన్నింటికీ బల్క్ సప్లయ్ జరుగుతోంది. ఇటీవల ఆయా ప్రాంతాల్లో పిడుగులు పడడం, పవర్ పోవడం వల్ల మోటార్లను ఆపేయడంతో స్వల్పంగా అంతరాయం ఏర్పడుతోంది. ప్రతిరోజూ 98 శాతం గ్రామాలకు కుటుంబానికి 100 లీటర్ల చొప్పున సరఫరా అవుతోంది. మిషన్ భగీరథకు సంబంధించిన ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓ అండ్ ఎం) పకడ్బందీగా నిర్వహిస్తున్నాం. రాష్ట్రంలో ఎక్కడైనా నీటి సరఫరాలో సమస్యలుంటే వెంటనే మాకు సమాచారం వస్తుంది. ఉదయం పూట గంట పాటు తాగునీటి సరఫరాపై అధికారులతో సమీక్షిస్తాం. సమస్యలున్న ప్రాంతాలను గుర్తించి నీటి సరఫరా చేసేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తాం.

– జి.కృపాకర్‌రెడ్డి, ఈఎన్‌సీ, మిషన్ భగీరథ

వాగునీళ్లే శరణ్యం



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం దంతెలబోరు గ్రామ పంచాయతీ ఎర్రబోరు గ్రామంలో మిషన్ భగీరథ పైపు లైన్ ద్వారా నీళ్లు రావడం లేదు. ఉన్న చేతిపంపు పనిచేయడం లేదు. దూరంలో ఉన్న వాగు నుంచి మంచినీళ్లు తెచ్చుకోవాల్సి వస్తోంది. నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలంలోని అగ్రహారం తండాలో గత వారం రోజులుగా మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదు. గ్రామపంచాయతీకి సంబంధించిన బోర్లు సైతం రిపేర్‌లో ఉండడంతో వ్యవసాయ పొలాల్లోని బోరు బావుల నీటిని ప్రజలు వినియోగిస్తున్నారు.

పట్టణాల్లోనూ నీటి ఘోష

రోజు విడిచి రోజు గంట నీటి సరఫరా కూడా కష్టం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని పలు పట్టణాలు కూడా మంచినీటి సమస్యతో అల్లాడుతున్నాయి. జలాశయాల్లో నీటిమట్టాలు తగ్గడం, భూగర్భ జలాలు అడుగంటడం, మిషన్ భగీరథను పట్టించుకోకపోవడం, పురపాలక శాఖ ప్రణాళికల్లో లోపాలు.. పలు ప్రాంతాల్లో నీటి సంక్షోభానికి కారణమవుతున్నాయి. కరీంనగర్, నిజామాబాద్, ఖమ్మం, రామగుండం వంటి కార్పొరేషన్లతో పాటు మహబూబ్‌నగర్, నల్లగొండ, మిర్యాలగూడ, పెద్దపల్లి, జగిత్యాల, సిరిసిల్ల, కొత్తగూడెం, మెదక్ వంటి మునిసిపాలిటీల్లో కూడా తాగునీటి సమస్య తీవ్రరూపం దాల్చింది. పట్టణాల్లో ఎగువ మధ్య తరగతి, ఉన్నతాదాయ వర్గాలు ఇంట్లోనే బోర్ నీటికి 'ఆర్‌వో' మిషన్‌ను అనుసంధానం చేసుకున్నప్పటికీ కొన్ని పట్టణాల్లో భూగర్భ జలాలు కూడా అడుగంటడంతో బోరు నీరు కూడా అందని పరిస్థితి ఏర్పడింది. దీంతో ప్రతిరోజూ 15 లీటర్ల వాటర్ క్యాన్లు కొనుగోలు చేస్తున్న వారి సంఖ్య ఎప్పటికప్పుడు పెరుగుతోంది. కాగా రాష్ట్రంలో గత ఏడాదితో పోలిస్తే భూగర్భ జలాల స్థాయి సగటున 2.5 మీటర్ల మేర తగ్గడంతో బోర్లు, బావులు వట్టిపోతున్నాయి. దీంతో జూన్ రెండో వారం వరకు పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

కరీంనగర్‌లో..: కరీంనగర్ కార్పొరేషన్‌లో ప్రతిరోజూ నీటి సరఫరా ప్రాజెక్టును 2021లో ప్రారంభించారు. పక్కనే ఉన్న మానేరు డ్యాం నుంచి నేరుగా తాగునీటిని ఫిల్టర్ చేసి ప్రజలకు అందించే ప్రాజెక్టు గత ప్రభుత్వ హయాంలోనే ప్రారంభమయ్యింది. కొన్ని ప్రాంతాలకు రెండు మూడేళ్ల పాటు ప్రతిరోజూ నీటి సరఫరా జరిపినప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల్లో ఈ ఏడాది రోజు విడిచి రోజు మాత్రమే సరఫరా చేస్తున్నారు. నగరంలోని కోర్టు ట్యాంక్ మోటార్ కాలిపోవడంతో పాటు, బేస్ కూలిపోవడం, ప్యానెల్ బోర్డులో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో గత కొద్ది రోజులుగా కోర్టు రిజర్వాయర్ పరిధిలో తాగునీటి సరఫరా సరిగా జరగడం లేదు.

మిర్యాలగూడలో 10 రోజులకోసారి..: నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని 38 వార్డుల్లో కనీసం 22 వార్డుల్లో 10 రోజులకోసారి మాత్రమే నీరు వస్తోంది. మిగతా రోజుల్లో ప్రజలు ప్రైవేటు ట్యాంకర్లను ఆశ్రయిస్తున్నారు. ఒక్క ట్యాంకర్ ధర రూ.1,300 దాటిపోయిందని ప్రజలు వాపోతున్నారు. నిజామాబాద్‌లో మొత్తం 35 వేలకు పైగా నీటి కనెక్షన్‌లున్నాయి. అయితే నిజామాబాద్‌లో 70 శాతానికి పైగా జనం ఆర్‌వో, మినరల్, ఫిల్టర్ నీటినే తాగుతున్నారు. మిషన్ భగీరథ ప్రధాన పైపులైన్లు చాలాచోట్ల లీకవడంతో సరిగ్గా సరఫరా జరగడం లేదు. కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని విద్యానగర్, అశోక్‌నగర్, ఎన్జీవోస్, స్నేహపురి, శ్రీరాంనగర్, తదితర కాలనీల్లో బోర్లు వట్టిపోయాయి. గోదావరి జలాలు రెండు రోజులకోసారి వస్తున్నాయని కాలనీవాసులు చెబుతున్నారు.

కొత్తగూడెంలో ఒకేఒక్క నీటి ట్యాంకర్: కొత్తగూడెం మున్సిపాలిటీలో మిషన్ భగీరథ పైపులకు కనెక్షన్ ఇవ్వకపోవడం వల్ల నిరుపయోగంగా ఉన్నాయి. కిన్నెరసాని పైప్ లైన్‌లో లీకేజీతో సమస్య ఏర్పడింది. ఒకే ఒక్క నీటి ట్యాంకర్ ఉండడం వల్ల పట్టణంలోని 36 వార్డులకు నీటిని అందించలేకపోతున్నారు. మహబూబ్‌నగర్, నల్లగొండ, ఖమ్మం, భద్రాచలం, నర్సంపేట, జనగాం, భువనగిరి తదితర పట్టణాల్లోనూ నీటి సమస్య ఎక్కువైంది.

'కాళేశ్వరం'పై నేడు పుస్తకావిష్కరణ

ముఖ్య అతిథులుగా హరీశ్‌రావు, నిరంజన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సాగునీటిరంగ నిపుణులు శ్రీధర్ దేశ్‌పాండే రచించిన 'కాళేశ్వరం ప్రాజెక్టు : ప్రశ్నలు–విమర్శలు–వక్రీకరణలు– వివరణలు'' సాగునీటిరంగంలో తెలంగాణ పదేండ్ల ప్రస్థానం' పుస్తకాలను తెలంగాణ వికాస సమితి ఆధ్వర్యంలో ఆవిష్కరించనున్నట్లు సమితి ప్రధాన కార్యదర్శి ఎర్రోజు శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. నాంపల్లిలోని తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో శుక్రవారం సాయంత్రం 5 గంటలకు ఈ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. ఈ పుస్తకావిష్కరణ సభకు ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి టి.హరీశ్‌రావు, గౌరవ అతిథిగా మాజీమంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి హాజరవుతుండగా, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ సభాధ్యక్షత వహిస్తారని వివరించారు. విశిష్ట అతిథులుగా జలవనరుల అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వి.ప్రకాశ్, అంబేడ్కర్ వర్సిటీ మాజీ వీసీ కె.సీతారామారావు, టీఎన్జీవో మాజీ అధ్యక్షుడు జి.దేవీప్రసాదరావు తదితరులు పాల్గొంటారని తెలిపారు. సాహితీవేత్తలు, కవులు, కళాకారులు, ఉద్యమకారులు సభకు హాజరై విజయవంతం చేయాలని ఎర్రోజు శ్రీనివాస్ కోరారు.


దుష్ప్రచారంలో నంబర్ వన్ కాంగ్రెస్: హరీశ్



సాక్షి, హైదరాబాద్: పాలన చేతకాకపోయినా, సమాధానం చెప్పే దమ్ము లేకపోయినా.. దుష్ప్రచారంలో మాత్రం కాంగ్రెస్ పార్టీ నంబర్ వన్ అని ఎమ్మెల్యే హరీశ్ రావు మండిపడ్డారు. తాను పార్టీ మారతానని.. కొత్త పార్టీ పెడతానని.. సోషల్ మీడియా వేదికగా కాంగ్రెస్ ఐటీ సెల్ చేస్తున్న ప్రచారంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఐటీ సెల్ సోషల్ మీడియా ద్వారా చేస్తున్న ఇలాంటి వికృత చేష్టలు.. ఆ పార్టీ దివాలాకోరు, దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని ఎక్స్‌లో పేర్కొన్నారు. ఇలాంటి చిల్లర చేష్టలు మానుకోకపోతే, చట్టపరమైన చర్యలకు ఉపక్రమిస్తామని హరీశ్ రావు హెచ్చరించారు

బీసీ బిల్లు ఆమోదం బాధ్యత కేంద్రానిదే..

బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ఆమోదించిన బిల్లును పార్లమెంటులో ఆమోదింపజేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ స్పష్టం చేశారు. ఆయన బీసీ కమిషన్ కార్యాలయంలో గురువారం సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్‌లతో కలిసి విలేకరులతో మాట్లాడారు. జనగణనలో కులగణన చేయాలన్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు. ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం కుల సర్వేను శాస్త్రీయంగా నిర్వహించి, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని.. ఈ ఏడాది మార్చి 17న అసెంబ్లీలో రెండు బిల్లులు ఆమోదించిందని గుర్తు చేశారు. ప్రస్తుతం ఈ బిల్లులను పార్లమెంటు ఆమోదించాల్సి ఉందన్నారు.

గ్రామాల్లో మరింత మెరుగ్గా చెత్త సేకరణ

- త్వరలో చెత్త సేకరణ పర్యవేక్షణకు కొత్త యాప్
- వారం, పది రోజుల్లో ఇది అందుబాటులోకి
- ఇప్పటికే ఉన్న యాప్‌లో కొత్తగా మరో ఆప్షన్

సాక్షి, హైదరాబాద్: గ్రామ పంచాయతీల్లో మరింత మెరుగ్గా చెత్త సేకరణ, నిర్వహణకు పంచాయతీరాజ్ శాఖ చర్యలు చేపడుతోంది. ప్రస్తుతం పీఎస్ యాప్ ద్వారా పంచాయతీ కార్యదర్శులు ప్రతి రోజు కాలువలు, వీధులను శుభ్రపరిచే సమాచారాన్ని, ఫొటోలను అప్ లోడ్ చేస్తున్నారు. అయితే, కార్యదర్శులు ఇతర అధికారుల పర్యవేక్షణ ఉంటున్నా పల్లెల్లో చెత్త సేకరణ సరిగ్గా జరగడం లేదని విమర్శలు ఉన్నాయి. పంచాయతీల్లో చెత్త డంపింగ్ విషయంలోనూ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా పంచాయతీరాజ్ అధికారులతో సమీక్ష సందర్భంగా మంత్రి సీతక్క ఈ అంశంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఇందుకు అనుగుణంగా చెత్త సేకరణ పర్యవేక్షణ కోసం ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక కొత్త యాప్ వారం, పది రోజుల్లో అందుబాటులోకి రానున్నట్టు తెలుస్తోంది. దీంతో పాటు ఇప్పటికే అందుబాటులో ఉన్న పీఎస్ యాప్‌లో పీఆర్‌ఆర్‌డీ శాఖ మరో ఆప్షన్‌ను చేర్చింది. పంచాయతీ సెక్రెటరీ మొబైల్ యాప్‌లో వేస్ట్ కలెక్షన్ మేనేజ్‌మెంట్ కోసం అదనంగా పెట్టిన ఆప్షన్‌కి ప్రస్తుతానికి 'స్వచ్ఛదనం' అనే పేరు పెట్టారు. ఈ ఆప్షన్ ద్వారా ప్రతి రోజు గ్రామంలో ఎన్ని ఇళ్ల నుంచి చెత్త సేకరించారు, ఎంత చెత్త పోగయ్యింది, అందులో తడి చెత్త, పొడి చెత్త ఎంత.. వంటి సమాచారాన్ని పంచాయతీ కార్యదర్శులు అప్ లోడ్ చేయనున్నారు. ఈ యాప్‌లో అప్ లోడ్ చేసిన సమాచారాన్ని పై అధికారులు పర్యవేక్షించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. సేకరించిన చెత్తను ఎక్కడో ఒక చోట పడేయకుండా తగిన చర్యలు తీసుకోనున్నారు. తడి చెత్తను 60 రోజుల్లో ఎరువుగా మార్చనున్నారు. ఇందుకు అనుగుణంగా కేజీ తడి చెత్త 60 రోజుల్లో 150 గ్రాముల ఎరువుగా మారనుంది. కాగా, చెత్త, ఇతర వ్యర్థాలను ఎట్టి పరిస్థితుల్లోనూ గ్రామాల్లో ఎక్కడ పడితే అక్కడ డంప్ చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కిందిస్థాయి అధికారులను ఆదేశించారు. కొత్తగా తీసుకుంటున్న చర్యల ద్వారా గ్రామాల్లో ఒక్కో వ్యక్తి కనీసం 100 గ్రాముల చెత్తను జనరేట్ చేస్తారని అంచనా వేస్తున్నారు. ఈ లెక్కకు అనుగుణంగా ఆ గ్రామంలో మనుషులను బట్టి అంత మేర చెత్త సేకరణ జరగకపోతే.. పారిశుధ్య నిర్వహణ సరిగా లేనట్లుగా అధికారులు భావిస్తారు. అలాంటి సందర్భంలో పంచాయతీ కార్యదర్శిని అప్రమత్తం చేసి చెత్త సేకరణ ప్రక్రియను మెరుగు పరిచేలా ఆదేశించనున్నారు. ఈ చర్యలతో నిత్యం చెత్త సేకరణ ప్రక్రియను పర్యవేక్షించడం ద్వారా గ్రామాల్లో స్వచ్ఛదనం మరింత మెరుగవుతుందని అధికారులు భావిస్తున్నారు.

గాలివాన బీభత్సం

- భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో పలుచోట్ల కూలిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
- తోటల్లో రాలిపోయిన మామిడికాయలు, నేల వాలిన వరి పంట


భూపాలపల్లిలో ఎగిరిపోయిన ఓ హోటల్ పైకప్పు రేకులు

సాక్షి నెట్‌వర్క్: జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో బుధవారం రాత్రి, అలాగే గురువారం గాలివాన బీభత్సం సృష్టించింది. భూపాలపల్లి పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో ఇళ్ల పైకప్పులు ఎగిరిపోయాయి. కాటారం మండలం రేగులగూడెం, ధన్వాడ, శంకరాంపల్లి, జాదారావుపేట గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఆరబోసిన ధాన్యం స్వల్పంగా తడిసింది. మల్హర్ మండలంలో గాలివాన దుమారంతో బుధవారం రాత్రి 8 గంటల నుంచి గురువారం రాత్రి వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. గణపురం మండలంలో ప్రధాన రహదారిపై భారీ వృక్షాలు నేలకొరిగాయి. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు కూలిపోయాయి. తోటల్లో మామిడికాయలు పెద్దఎత్తున నేలరాలాయి. రేగొండ మండల పరిధిలో భాగిర్తిపేట, తిరుమలగిరి గ్రామాలలో అరటి, మామిడి తోటలకు నష్టం వాటిల్లింది. రేగొండ, కొత్తపల్లిగోరి మండలాల పరిధిలో పొట్ట దశలో ఉన్న వరి పంటంతా నేలవాలింది. ములుగు జిల్లా కేంద్రంలో బుధవారం రాత్రి 8 గంటల నుంచి 9:30 గంటల వరకు గాలివాన బీభత్సం సృష్టించింది. దీంతో రైతులు ధాన్యం రాశులపై పరదాలు కప్పారు. గురువారం ఉదయం ధాన్యం ఆరుతుందని కప్పిన పరదాలను తొలగించిన రైతులు చదును చేసే క్రమంలో మళ్లీ ఒక్కసారిగా కురిసిన వర్షంతో ధాన్యం పూర్తిగా తడిసింది. భారీ గాలి దుమారానికి ములుగు, వెంకటాపురం(ఎం) మండలాల్లో విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. గోవిందరావుపేట మండల పరిధిలోని పలు గ్రామాల్లో సుమారు 500 ఎకరాల్లోని వరి పంట నేలవాలింది.

మేడే స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు

కార్మిక దినోత్సవంలో జాన్‌వెస్లీ

సాక్షి, హైదరాబాద్: మేడే స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలను నిర్మించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ పిలుపునిచ్చారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం జనగణనతోపాటు కులగణనను చేపడతామంటూ ప్రకటించిందని, దానికి నిర్దిష్ట కాలపరిమితిని విధించాలని డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్‌లోని సీపీఎం రాష్ట్ర కార్యాలయం ఎంబీ భవన్‌లో మేడే వేడుకల సందర్భంగా ఆయన అరుణపతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ, ఆనాడు ఎనిమిది గంటల పనివిధానం కోసం కార్మికులు పోరాడితే కేంద్రంలోని మోదీ ప్రభుత్వం 12 గంటల పనివిధానాన్ని అమలు చేస్తున్నదని విమర్శించారు. కనీస వేతనాలు అమలు కావడం లేదని, కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కేంద్రం కాలరాస్తున్నదని చెప్పారు. సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేసే హక్కు లేకుండా లేబర్ కోడ్‌లను తెస్తున్నదని విమర్శించారు. పెట్టుబడిదారులు దోపిడీ చేసేందుకు అనుకూలంగా మోదీ ప్రభుత్వం చట్టాలను తెస్తోందని విమర్శించారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక లక్షకుపైగా రైతులు ఆత్మహత్య చేసుకున్నారని వివరించారు. పేదలకు రేషన్ కార్డు మీద 14 రకాల సరుకులు ఇవ్వాలని జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు.


విద్యారంగ బలోపేతానికి సిద్ధం

ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు రాష్ట్ర ఉపాధ్యాయులు సిద్ధంగా ఉన్నారని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి చెప్పారు. వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును.. శ్రీపాల్ రెడ్డి గురువారం కలిశారు. ఉపాధ్యాయ పెండింగ్ బిల్లులు తక్షణమే మంజూరు చేయాలని కోరారు. ఆయన వెంట పీఆర్‌టీయూటీఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుండు లక్ష్మణ్, పుల్గం దామోదర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బి.మోహన్ రెడ్డి, హెచ్‌ఎంల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజగంగారెడ్డి తదితరులు ఉన్నారు.

త్వరలో కృష్ణా ట్రిబ్యునల్-2 అమల్లోకి..?

- ఈనెల 7న రాష్ట్రాలతో కేంద్ర జలశక్తిశాఖ మంత్రి సమావేశం
- తీర్పుపై గెజిట్ ప్రచురణ విషయంలో అభిప్రాయ సేకరణ



సాక్షి, హైదరాబాద్: కృష్ణా జలాల పంపిణీపై జస్టిస్ బ్రిజేశ్‌కుమార్ నేతృత్వంలో కృష్ణా ట్రిబ్యునల్-2 జారీ చేసిన తీర్పును అమల్లోకి తీసుకురావడంలో భాగంగా గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసే అంశాన్ని కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఈ విషయంలో అభిప్రాయ సేకరణ కోసం ఈ నెల 7న కేంద్ర జలశక్తిశాఖ మంత్రి సీఆర్.పాటిల్ సంబంధిత రాష్ట్రాల నీటిపారుదల శాఖ మంత్రులతో సమావేశం కానున్నారు. కృష్ణా జలాల పంపిణీపై 2013 నవంబరు 29న కృష్ణా ట్రిబ్యునల్-2 తీర్పు వెలువరించింది. తీర్పును అమల్లోకి తెస్తూ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయరాదని కోరుతూ నాటి ఉమ్మడి ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణ సైతం ఈ కేసులో ఇంప్లీడ్ అయ్యింది. సుప్రీంకోర్టులో విచారణ పెండింగ్‌లో ఉంది. రాష్ట్ర విభజన నేపథ్యంలో కృష్ణా జలాల్లో ఉమ్మడి ఏపీకి ఉన్న వాటాను ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య పంపిణీ చేసే బాధ్యతలను కృష్ణా ట్రిబ్యునల్-2కే కేంద్రం అప్పగించింది. దీనిపై ట్రిబ్యునల్‌లో విచారణ జరుగుతోంది. ఉమ్మడి ఏపీకి కేటాయించిన 1,005 టీఎంసీలను తెలుగు రాష్ట్రాలకు పంచడానికి మాత్రమే విచారణ జరుగుతున్న ట్రిబ్యునల్ తీర్పును అమల్లోకి తెస్తూ గెజిట్ ప్రకటన జారీ చేయాలని మహారాష్ట్ర, కర్ణాటక కోరుతున్నాయి. ఈ నేపథ్యంలో కర్ణాటక, మహారాష్ట్ర, ఏపీ, తెలంగాణ రాష్ట్రాల నీటిపారుదల శాఖ మంత్రులతో ఈనెల 7న న్యూఢిల్లీలో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సమావేశమై ఈ అంశంపై చర్చించనున్నారు. ఈ భేటీలో రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం కుదిరితే గెజిట్ ప్రకటన జారీ చేసే అవకాశముంది. దీంతో కృష్ణా ట్రిబ్యునల్-2 తీర్పు అమల్లోకి రానుంది. ప్రధానంగా ఆల్మట్టి ప్రాజెక్టు ఎత్తును 519 అడుగుల నుంచి 524 అడుగులకు పెంచడం, ఇతర బేసిన్లో ఉన్న కోయిన ప్రాజెక్టుకు 92 టీఎంసీల నీటిని కేటాయించడంపై ఉమ్మడి ఏపీ అభ్యంతరం తెలిపింది.

ఇంకా కృష్ణా ట్రిబ్యునల్-1 కేటాయింపులే..

కృష్ణా ట్రిబ్యునల్-1 (బచావత్ ట్రిబ్యునల్) కృష్ణాలో 2,060 టీఎంసీల లభ్యత ఉందని నిర్ధారించి మహారాష్ట్రకు 560, కర్ణాటకకు 700, ఉమ్మడి ఏపీకి 800 టీఎంసీల కేటాయింపులు జరిపింది. దీనికి అదనంగా రీజనరేట్ అయిన 11 టీఎంసీలను కూడా జోడించింది. కృష్ణా ట్రిబ్యునల్-2 తీర్పు అమల్లోకి రాకపోవడంతో 1976లో అమల్లోకి వచ్చిన కృష్ణా ట్రిబ్యునల్-1 కేటాయింపులే ఇంకా అమలవుతున్నాయి. వందేళ్లలో కచ్చితంగా 75 ఏళ్ల పాటు వచ్చే వరద (75 శాతం లభ్యత) ఆధారంగా 2,060 టీఎంసీల నీటిలభ్యత కృష్ణాలో ఉందని కృష్ణా ట్రిబ్యునల్-1 తేల్చింది. 65 శాతం లభ్యత ఆధారంగా కృష్ణాలో 2,578 టీఎంసీల లభ్యత ఉందని కృష్ణా ట్రిబ్యునల్-2 నిర్ధారించి ఉమ్మడి ఏపీకి 1,005, కర్ణాటకకు 907, మహారాష్ట్రకు 666 టీఎంసీల కేటాయింపులు చేసింది. 65 శాతం లభ్యతతో నీటి కేటాయింపులు చేస్తే దిగువ రాష్ట్రాలు నష్టపోతాయని ఉమ్మడి ఏపీ అభ్యంతరం తెలిపింది. ఈ నేపథ్యంలో 7న జరగబోయే సమావేశంలో ఏకాభిప్రాయం కుదిరితేనే కృష్ణా ట్రిబ్యునల్-2ను అమల్లోకి తెస్తూ గెజిట్ ప్రకటన వస్తుంది.

మీరు కరుణించబడాలి అంటే నమాజ్‌ను స్థాపించండి, విధిదానం (జకాత్) ఇవ్వండి మరియు సందేశహరునికి విధేయులుగా ఉండండి!
– ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, 2 మే 2025

చివరకు కులగణన వైపే మొగ్గు

కులగణన ప్రతిపాదనపై గత కొన్నేళ్లుగా కారాలూ మిరియాలూ నూరుతూ వచ్చిన బీజేపీ నేతృత్వం లోని ఎన్డీయే ప్రభుత్వం ఎట్టకేలకు తన వైఖరి మార్చుకుంది. వచ్చే జనగణనతోపాటే కులగణన కూడా చేయాలని ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన రాజకీయ వ్యవహారాల కేబినెట్ కమిటీ భేటీ బుధవారం నిర్ణయించటం దేశ చరిత్రలో ఒక కీలకమైన మలుపు. అయితే ఇప్పటికే అయిదేళ్లుగా వాయిదా పడుతూవస్తున్న జనగణన ఎప్పుడు ప్రారంభిస్తారన్న అంశంలో స్పష్టత లేదు. స్వాతంత్ర్యానంతరం అణగారిన కులాలు సైతం విద్యావకాశాలను అందుకోవటం, ఉన్నతోద్యోగాలు సాధించటం వంటి పరిణామాల కారణంగా ఆ వర్గాల్లో చైతన్యం పెరిగింది. జనాభా దామాషా ప్రాతిపదికన అవకాశాలు దక్కటం లేదన్న అసంతృప్తి ఎక్కువైంది. అందుకే కులగణన జరపాలన్న డిమాండ్ ముందుకొచ్చింది. దేశంలో దీన్ని మొట్టమొదట స్వాగతించిన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. 2021లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం కులగణన జరపాలని కేంద్రాన్ని కోరుతూ అసెంబ్లీలో తీర్మానంచేసి పంపింది. 2024 జనవరిలో గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా వేగవంతంగా, శాస్త్రీయంగా కులగణన నిర్వహించారు. బిహార్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలు సైతం కులగణన చేశాయి. అయితే బీజేపీ మొదటినుంచీ ఈ డిమాండును వ్యతిరేకించింది. 2021 జులై 20 నాడు పార్లమెంటులో సభ్యులు అడిగిన ప్రశ్నకు జవాబిచ్చిన ఆనాటి కేంద్ర హోం శాఖ సహాయమంత్రి నిత్యానందరాయ్ 'జనగణనలో ఎప్పటిలా ఎస్సీ, ఎస్టీ వర్గాల జనాభా లెక్కల సేకరణ మినహా ఇతర కులాల లెక్కింపు జరపరాదన్నది కేంద్రప్రభుత్వ విధానపరమైన నిర్ణయం' అని ప్రకటించారు. బయట ఎక్కడా నేరుగా కులగణనను వ్యతిరేకిస్తూ బీజేపీ నేతలు ప్రకటనలు చేయకపోయినా, సమాజాన్ని విచ్ఛిన్నం చేయటానికి కాంగ్రెస్ కులాన్ని ఉపయోగించుకుంటున్నదని విమర్శించేవారు. మొన్నటికి మొన్న పహల్‌గామ్‌లో ఉగ్రవాదులు నావికాదళ లెఫ్టినెంట్ వినయ్ నర్వాల్‌ను మతం ఏమిటో కనుక్కుని కాల్చిచంపటాన్ని ప్రస్తావించి 'వారడిగింది మతం... కులంకాదు' అని ఛత్తీస్‌గఢ్ బీజేపీ ట్వీట్ చేసింది. అయితే కులగణన చేయటమే సరైందని ఆరెస్సెస్ భావిస్తున్నదని రెండు నెలల క్రితం ఒక ఆంగ్లపత్రిక వెల్లడించినప్పటినుంచీ దీనిపై కేంద్రం సానుకూల నిర్ణయం తీసుకోవచ్చన్న అంచనాలు మొదలయ్యాయి.

జనాభా లెక్కలతోపాటు కులగణన కూడా జరిగితే దేశంలో దాదాపు వందేళ్ల తర్వాత ఆ ప్రక్రియ మళ్లీ అమల్లోకొచ్చినట్టవుతుంది. ఆఖరుసారి వలస పాలకుల హయాంలో 1931లో కులాలవారీ జనాభా లెక్కేశారు. అప్పట్లో 4,147 కులాలున్నట్టు తేల్చారు. 1901లో ఈ సంఖ్య 1,646. తర్వాత 1941లో కూడా కొంతవరకూ జనాభా లెక్కల్లో కులాన్ని గణించారుగానీ రెండో ప్రపంచ యుద్ధ కారణంగా మధ్యలోనే ఆగిపోయింది. స్వాతంత్ర్యానంతరం ఎస్సీ, ఎస్టీల వివరాలు మాత్రమే సేకరిస్తున్నారు. పీపుల్ ఆఫ్ ఇండియా ప్రాజెక్టు 1992లో జరిపిన ఒక సర్వే ప్రకారం దేశంలో 4,635 కులాలున్నాయి. 2010లో అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ కులగణన నిర్వహిస్తామని వాగ్దానం చేశారు. అనంతరం సాంఘికార్థిక సర్వేకింద 2011–12 మధ్య ఆ లెక్కలు తీశారు. కానీ ఆ డేటాను బయటపెట్టలేదు. ఇటీవల జనగణనపై కాంగ్రెస్ పట్టుబట్టడం మొదలైంది. మతంపై ప్రధానంగా కేంద్రీకరించే బీజేపీ ఇందుకు ససేమిరా సమ్మతించబోదని, అందువల్ల ఎన్నికల్లో కులగణన తనకు ప్రధాన ఆయుధంగా మారుతుందని ఆ పార్టీ భావించింది. కానీ బీజేపీ హఠాత్తుగా మనసు మార్చుకోవటంతో కాంగ్రెస్‌కు చెప్పుకోదగ్గ నినాదం లేకుండా పోయింది.

అణగారిన కులాలు అడిగాయని కాదు... కులం ఒక వాస్తవం అయినప్పుడూ, సమాజంపై దాని ప్రభావం అమితంగా వున్నప్పుడూ ఎవరి సంఖ్య ఎంతో తేల్చటం ప్రభుత్వాల బాధ్యత. ఇన్నాళ్లూ దాన్ని విస్మరించారు. ఇందువల్ల రెండు రకాల సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. సంక్షేమ ఫలాలు లక్షిత వర్గాలకు సరిగా చేరటం లేదు. ఇప్పటికీ విద్యాగంధం అంటని, ప్రభుత్వ పథకాల సంగతే తెలియని కులాలవారు గణనీయంగావున్నారు. ఫలితంగా బడ్జెట్‌లలో గర్వంగా ప్రకటించుకునే పథకాలు ఆచరణలో నిరుపయోగం అవుతున్నాయి. ఇక ఇంద్ర సాహ్నీ కేసులో రిజర్వేషన్లు 50 శాతం మించరాదన్న సుప్రీంకోర్టు నిర్ణయం కోటా పెంపు ప్రయత్నాలకు అవరోధమవుతోంది. సమస్య వుందని ప్రభుత్వాలకు తెలిసినా, కొత్తగా తెరపైకొస్తున్న కులాలకు న్యాయం చేద్దామనుకున్నా అసాధ్యమవుతున్నది. అన్ని రంగాల్లోనూ ఆధిపత్య కులాల హవా కొనసాగుతోంది.

సమయానుకూల నిర్ణయాలు తీసుకోవటంలో, గాలివాలుకు అనుగుణంగా దూసుకెళ్లటంలో బీజేపీ దరిదాపుల్లోకొచ్చే రాజకీయపక్షం మరొకటి లేదు. వాస్తవానికి గత లోక్‌సభ ఎన్నికల ముందూ... మహారాష్ట్ర, హరియాణా అసెంబ్లీ ఎన్నికల సందర్భాల్లో కులగణనపై కేంద్రం నిర్ణయం ప్రకటిస్తుందని అందరూ భావించారు. అలాచేస్తే కాంగ్రెస్ డిమాండుకు తలొగ్గినట్టయ్యేది. పహల్‌గామ్ మారణకాండపై దేశవ్యాప్తంగా ఆగ్రహావేశాలు మిన్నంటుతున్నవేళ కులగణన నిర్ణయం తీసుకోవటంతో అది తన ఘనతేనని కాంగ్రెస్ చెప్పుకునే పరిస్థితి లేకుండాపోయింది. పైగా కేంద్రంలో ఎక్కువకాలం అధికారంలోవున్నా కులగణన జోలికి పోకపోవటం... 2011–12లో ఆ పని చేసినా దాన్ని సామాజికార్థిక సర్వేగా చెప్పటం ఆ పార్టీకి పెద్ద మైనస్. బిహార్ ఎన్నికలు సమీపిస్తున్నవేళ తీసుకున్నా తాజా నిర్ణయం నిస్సందేహంగా బీజేపీకి ఉపకరిస్తుంది. అయితే దీని వెంబడి రాగల ఇతరేతర డిమాండ్లతో ఆ పార్టీ ఎలా వ్యవహరిస్తుందన్నది చూడాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయనం, వసంత ఋతువు, వైశాఖ మాసం, **తిథి:** శు.పంచమి ప.2.40 వరకు, తదుపరి షష్ఠి; **నక్షత్రం:** ఆరుద్ర రా.6.19 వరకు, తదుపరి పునర్వసు; **వర్జ్యం:** లేదు; **దుర్ముహూర్తం:** ఉ.8.05 నుండి 8.56 వరకు, తదుపరి ప.12.21 నుండి 1.12 వరకు; **అమృత ఘడియలు:** ఉ.8.44 నుండి 10.15 వరకు

సూర్యోదయం : 5.38
సూర్యాస్తమయం : 6.15
రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు
శ్రీ శంకర జయంతి.

ఉగ్రవాదంపై పోరులో ఏకమైన దేశం

సందర్భం



గోపాలకృష్ణ గాంధీ

పహల్‌గామ్ ఊచకోత పట్ల భారత ప్రభుత్వం ఎంతో పరిపక్వత ప్రదర్శించింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తన సౌదీ అరేబియా పర్యటన అర్ధాంతరంగా ముగించుకున్నారు. తక్షణం కశ్మీర్ వెళ్లి పరిస్థితి ఏమిటో స్వయంగా తెలుసుకోవాలని హోం మంత్రిని ఆదేశించారు. ఉగ్రవాదులను పెంచి పోషిస్తున్న పాకిస్తాన్‌పై అప్పటికప్పుడు ఏయే చర్యలు చేపట్టాలో గుర్తించారు. వీసాలు రద్దు చేశారు. అటారీ చెక్ పోస్టు మూసేశారు. పాక్ హైకమిషన్ కీలక అధికారులను దేశం నుంచి బహిష్కరించారు. సింధూ నదీ జలాల ఒప్పందాన్ని సస్పెండ్ చేశారు. ఉగ్రదాడి సూత్రధారులకు తగిన గుణపాఠం చెప్పేందుకు వ్యూహ రచనా జరుగుతోంది.

''భారత రిపబ్లిక్‌తోనే ఆటలాడతారా, మీ అంతు చూస్తాం, ఖబడ్దార్!'' అంటూ ఇండియా పంపిన హెచ్చరిక ఇప్పటికే టెర్రరిస్టులకు అందేవుంటుంది. అత్యంత శక్తిమంతమైన రష్యా, అమెరికాల నుంచి, సౌదీ అరేబియా సహా మనకు విస్పష్టమైన మద్దతు లభించింది. ఇది ఈ సందేశానికి మరింత బలం చేకూర్చింది.

సాధారణ పరిస్థితుల్లో ఎన్ని భేదాభిప్రాయాలున్నా, కష్టకాలంలో అన్నీ మరచి ఒక్క తాటి మీద నిలవటం భారత ప్రజల విశిష్టత. ప్రస్తుత బాధకర సమయంలోనూ కోపంతో రగిలిపోతూ అందరం ఒక్కటయ్యాం. ఒక్కుమ్మడిగా మన ప్రభుత్వానికి సంఘీభావం ప్రకటించాం. భౌతికంగానూ బయటికొచ్చాం. మనం భాగ్యవంతులం కాకపోవచ్చు, కాని ఆపదలో అండగా నిలిచే సహజగుణ సంపన్నులం. కేంద్ర ప్రభుత్వం, జమ్ము కశ్మీర్ ప్రభుత్వం ఈ తరుణంలో ఏ చర్యలు తీసుకున్నా ఇండియా యావత్తూ వాటికి వెన్నుదన్నుగా నిలిచి ఉంటుంది. ఇండియా జాతీయ భద్రతకు పౌర సమాజం ఎప్పుడూ చేయూత ఇస్తుంది. ఇది కాలపరీక్షలో నిగ్గుదేలిన వాస్తవం.

యుద్ధం వస్తే సిద్ధమే!

రెండు దేశాల నడుమ యుద్ధం వస్తుందా? పహల్‌గామ్‌లో పాక్ అంతటి దుస్సాహసానికి పాల్పడితే మనం చేతులు ముడుచుకుని కూర్చోలేం. కానీ ఇవి మాత్రమే యుద్ధానికి దారి తీసే కారణాలు కావు. పాకిస్తాన్ మనకు వ్యతిరేకంగా అల్లుతున్న కథనాలు కూడా ఇందుకు పురిగొల్పుతున్నాయి. పహల్‌గామ్‌లో ఉగ్రదాడి పట్ల ప్రపంచవ్యాప్తంగా వ్యతిరేకత పెల్లుబికిన తర్వాత పాకిస్తాన్ తన ఆత్మరక్షణ కోసం ఎంతటి దుందుడుకు విమర్శలకూ వెనుకాడటం లేదు. ఇండియా సైనికపరంగా ఎలాంటి చర్య తీసుకున్నా, యుద్ధానికి 'మ్యాచ్' అయ్యే ప్రతిచర్యలు ఎదురవుతాయి. పరిస్థితి అంతదాకా వస్తే, ''అయితే సరే, అయితే సరే. మేం కూడా ఆ 'మ్యాచ్'ను ఎదుర్కొంటాం. ఘోర కృత్యాలకు తెగబడుతున్న ఉగ్రవాదాన్ని మా దేశంలో ఎట్టి పరిస్థితిల్లోనూ అనుమతించం'' అని మనం చెప్పి తీరాలి.



సాధారణ పరిస్థితుల్లో ఎన్ని భేదాభిప్రాయాలున్నా, కష్టకాలంలో అన్నీ మరచి ఒక్క తాటి మీద నిలవటం భారత ప్రజల విశిష్టత.

◆ యుద్ధానికి సిద్ధంగా ఉండటం వేరు, యుద్ధం కోసం ఉవ్విళ్లూరడం వేరు. యుద్ధం తాలూకు నిర్బంధాలు, ఫలితాలు ఎప్పుడూ బాధాకరంగానే ఉంటాయి.

◆ అణ్వస్త్ర నిగ్రహం మన విధానం. పాకిస్తాన్ కూడా ఇదే బాటలో పయనిస్తోందా? అది అణ్వస్త్రం సమకూర్చుకున్న చరిత్రే దాని ఉద్దేశాలను వెల్లడిస్తుంది.

ఈ సన్నద్ధతలో మనం గుర్తు పెట్టుకోవలసిన అంశం: యుద్ధానికి సిద్ధంగా ఉండటం వేరు, యుద్ధం కోసం ఉవ్విళ్లూరడం వేరు. యుద్ధం తాలూకు నిర్బంధాలు, ఫలితాలు ఎప్పుడూ బాధాకరంగానే ఉంటాయి. అదీ అణ్వస్త్ర దేశాల మధ్య యుద్ధం అంటే, దాని పరిణామాలు ప్రళయ సమానంగా ఉండగలవు. అణ్వస్త్రాలపై ఇండియా విధానాలు వివేకంతో కూడుకుని ఉంటాయి. అణ్వస్త్ర నిగ్రహం మన విధానం. పాకిస్తాన్ ఇదే బాటలో పయనిస్తోందా? అది అణ్వస్త్రం సమకూర్చుకున్న చరిత్రే దాని ఉద్దేశాలను వెల్లడిస్తుంది.

'ఒక్క దేశం'గా నిలబడదాం!

ఇండియా తన సైనిక వ్యూహాలను విజ్ఞతతో బేరీజు వేసుకుని ఏది సరైన మార్గమో నిర్ణయించుకోగలదు. మనం ప్రభుత్వాన్ని సంపూర్ణంగా, బేషరతుగా విశ్వాసంలోకి తీసుకోవాలి. ఇక, దేశంలో మతపరమైన విద్వేషాలు రెచ్చగొట్టేవారు కొందరు ఉంటారు. వారికి అవకాశం ఇవ్వకుండా ప్రభుత్వానికి మనం సహకరించాలి. ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న వారికి మనం ఇలా చెప్పాలి: ''ద్విజాతి సిద్ధాంతం ప్రతిపాదించి మీరు వేరే దేశాన్ని సాధించుకున్నారు. మతాల మధ్య విద్వేషాన్ని రెచ్చగొట్టి మా 'వన్ నేషన్'ను విభజించాలని చేసే ప్రయత్నాలు మేం సహించేది లేదు. హిందువులు, ముస్లిములు, సిక్కులు... వీరందరికీ మా 'వన్ నేషన్' మాతృభూమి. 'ఇండియా దటీజ్ భారత్' విలువలకు నిలయం. మీ క్రూరాతి క్రూరమైన వక్రబుద్ధికి ఇవి అర్థం కావు.''

1948 జనవరి 30న 'తీస్ జనవరి మార్గ్'లో మంచు కప్పిన గడ్డి మీద రక్తం చిందినట్లే, ఈ ఏప్రిల్ 22న పహల్‌గామ్ అందమైన కొండ లోయల మీద చిందిన రక్తం... మానవత్వం మీద బుల్లెట్ల దౌష్ట్యానికి నిదర్శనం. అయినప్పటికీ మానవత్వం మీద మన విశ్వాసాన్ని అది చాటి చెబుతోంది.

మత విద్వేషాలను రెచ్చగొట్టడం ద్వారా తీసుకురావాలని చూస్తున్న 'ఉగ్రవాదపు రెండో దశ'ను నిరోధించి, మన మన మధ్య ఒక్క నెత్తుటి బొట్టు చిందనీయకుండా సాయుధ బలగాలకు పౌరదళాలుగా మన సమైక్య సంఘీభావం ప్రకటించాలి. టెర్రరిస్టులకు, టెర్రరిజానికి పుట్టినిల్లు అయిన పాకిస్తాన్‌లోనూ హింసాద్వేషాలను వ్యతిరేకించే విజ్ఞులు ఉన్నారు. పహల్‌గామ్ ఘటన పట్ల కలత చెందినవారు, మేధావులు అక్కడ కొద్దిమంది కాదు... ఎక్కువగానే ఉంటారు. వారెవరో మనకు తెలియాల్సినంతగా తెలియడం లేదు. అలాంటివారు ఈ సమయంలో మతతత్వ గుంపులను, వ్యక్తులను గట్టిగా వ్యతిరేకిస్తారని ఆశిద్దాం.

గొప్ప భారతీయుడైన లాల్ బహదూర్ శాస్త్రి ఇచ్చిన పిలుపును గుర్తు చేసుకుంటూ, భారత దేశం ఈ సవాలును విజయవంతంగా తిప్పికొట్టాలని ఆశిద్దాం. ఆయన ఇచ్చిన 'జై జవాన్, జై కిసాన్' నినాదానికి 'జై ఇన్సాన్' (ఇన్సాన్ అంటే మానవ్) కూడా చేర్చుదాం. మన మతం మానవత్వం అనీ, దుష్టత్వం కాదనీ పహల్‌గామ్ సాయుధ దుండగులకు చెప్పి తీరాలి. ''ఖబడ్దార్, ఇండియాతో, ఇండియా మానవత్వంతో ఆటలొద్దు'' అని మరోసారి చెబుదాం!

వ్యాసకర్త పశ్చిమ బెంగాల్ మాజీ గవర్నర్
('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

ఐక్యంగా నిలబడటం మనకు తెలుసు!

అభిప్రాయం



జహీరా బేగం

సిసలైన ఉద్వేగాలు సాటి మనుషులకు అర్థమవుతాయి. ఉద్వేగాలలోని నిజాయితీ ఉద్దేశాలలో ఉండదు. 'పహల్‌గామ్' ఘటన తరువాత ఏర్పడిన ఉద్వేగాలనూ, ఉద్దేశాలనూ కాస్త ముందు వెనుకలుగా వేరు చేసి మనమంతా ఒక్కటిగా శత్రువును ఎదుర్కొందాం అనే సందేశాన్ని ఇవ్వడంలో దేశవాసులు దాదాపు సఫలీకృతమయ్యారనే చెప్పాలి. అయితే అదంత సులువు కాలేదు. ఉద్దేశాలున్నవారు వాట్సప్‌లలో మునివేళ్లను కదిలించినంత వేగంగా ఉద్వేగాలున్నవారు కదిలించలేకపోయారు. అయినప్పటికీ వేగంగా మేలుకొని జవాబు చెప్పడానికి ప్రయత్నించారు. ఇందుకు అల్లాహ్‌కు కృతజ్ఞతలు చెప్పుకోవాల్సిందే.

ఏప్రిల్ 22న కశ్మీర్ పహల్‌గామ్ ఉగ్రదాడిలో 26 మంది అమాయక పర్యాటకులు మరణించారన్న వార్త వినగానే ముందు మనిషిగా, తర్వాత ముస్లింగా ఎంతో బాధను, ఆందోళనను అనుభవించాను. దేశంలోని కోట్ల ముస్లింలు ఇటువంటి పాశవిక దాడికి తీవ్రంగా నాలాగే బాధ పడ్డారు. మతం అడిగి ఇలాంటి దాడి చేశారన్న వార్త వారిని వేదనలో, విషాదంలో ముంచెత్తింది. ఈ తీవ్ర ఘటన తాలూకు విషాదాన్ని అనుభవించాలా, లేకుంటే తమకు ఏ సంబంధమూ లేకపోయినా జరిగే విద్వేష ప్రచారానికి కలత పడాలా అనే ఆందోళనలో వారు తల్లడిల్లారు. అయితే ఎవరైతే చావు నోటి వరకూ వెళ్లి వచ్చారో వారే ఈ పరిస్థితిని కుదుట పరచగలిగారు. మానవీయత ఉన్న కశ్మీరీలు తమ ప్రాణాలకు వారి ప్రాణాలను ఎలా అడ్డు పెట్టి కాపాడారో చెప్పిన కథనాలు దేశ ప్రజలకూ, ముఖ్యంగా ముస్లింలకూ ఊరటనిచ్చాయి.

కశ్మీర్ విషయంలో భారత్–పాకిస్తాన్‌ల మధ్య చాలా కాలంగా సాగుతున్న వైరం లెక్కలేనంత మందిని బలిదీసుకున్నా గత దాడులన్నీ సైన్యంపై జరిగితే, ఈసారి పర్యాటకులపై హిందూ మతం పేరిట జరిగింది. ఈ దాడి వెనుక ఉగ్రవాదుల ప్రధాన ఉద్దేశం దేశాన్ని సంక్షోభంలోకి నెట్టడం, కశ్మీర్‌ను ప్రపంచ దృష్టికి తీసుకురావడం. ఈ ఉగ్రచర్యకు పాల్పడినవారు, వారికి ఆర్థిక సాయం అందించినవారు, స్పాన్సర్లు... పహల్‌గామ్ అమాయకుల ప్రాణాలను బలి దీసుకోవడంలో పాత్ర పోషించినవారే. వారందరినీ ఈ దాడికి జవాబుదారీగా చేసి, న్యాయస్థానం ఎదుట నిలబెట్టాలి.

◆ భారతం చెప్పిందే మన సందేశం. కౌరవులు, పాండవుల మధ్య ఏ ఫిర్యాదులైనా ఉండొచ్చు... బయటి శత్రువుకు మేము నూటా ఐదుగురం అన్నాడు ధర్మరాజు.

మతం అడగడం సిగ్గుచేటు

ప్రపంచంలోని ఏ మతగ్రంథం కూడా ప్రజలను చంపమని చెప్పలేదు. ఈ ఉగ్రదాడిలో బాధితుడి మతాన్ని అడగడం, అతను హిందువా, ముస్లిమా అని గుర్తించడానికి కల్మా పఠించమనడం సిగ్గుచేటు. శాంతిని కోరే భారతీయ ముస్లింలు ఇలాంటి నీచత్వాన్ని ఏ మాత్రం హర్షించరు. నిజమైన మానవుడంటే ప్రాణాలను కాపాడేవాడే కానీ ప్రాణాలను తీసేవాడు కాదు. ఖురాన్‌లోని సూరహ్ అల్–మాయిదా వచనం 5:32 'ఒక అమాయకుడిని చంపేవాడు మొత్తం మానవాళిని చంపినట్లే' అని చెబుతుంది. ఈ సూరహ్ కరుణ, సానుభూతి, బలహీనుల రక్షణను ప్రోత్సహిస్తుంది. తాను ముస్లిం అని చెప్పుకొనే వ్యక్తి ఈ భూమిపై ఏ మానవుడినీ చంపడు.

భారతదేశ ప్రజలు కోరుకునేది మత విద్వేషాలు కాదు. భారత దేశం ప్రపంచంలోని అన్ని దేశాల శరణార్థులను స్వీకరించిందే తప్ప, ఈ దేశం నుండి ఏ వ్యక్తిని ఇతర ప్రాంతాలకు శరణార్థిగా పంపలేదు. అదే ఈ దేశానికున్న ఘనత. ఇది గొప్ప ఆధ్యాత్మిక ప్రేమగల దేశం. ప్రపంచంలోని ఇతర దేశాల్లో నివసిస్తున్న ముస్లింలతో పోలిస్తే భారతదేశంలో ముస్లింలకు అత్యున్నత గౌరవం, రక్షణ దొరుకుతున్నాయి. ఉగ్రవాదంపై పోరాటంలో ఇక్కడి ముస్లింల పాత్ర ఇప్పుడు కీలకంగా మారింది.

ఇప్పుడు మనం ఏం చేయాలి? ఏ మతాన్నీ కలవరపెట్టకుండా, ద్వేషించకుండా నిరసనలు, ప్రదర్శనలు నిర్వహించవచ్చు. రాజకీయ నాయకుల ప్రసంగాలు, మీడియా వ్యాఖ్యలను ఒక తటస్థ స్థితికి తేవాలి. సమస్యకు పరిష్కారం వెతకాలి. అన్ని మతాల ఆధ్యాత్మిక నాయకులు, సాధువులు, ముస్లిం, హిందూ మతాధికారులు, అన్ని మత పాఠశాలలు, ఇతర విద్యాసంస్థల అధిపతులు, ఉపాధ్యాయులు ఇందులో భాగం కావాలి. అన్ని మతాలను ప్రేమించడం ద్వారా ప్రజల్లో ఐక్యత, ఉమ్మడి విలువలను తీసుకురావాలి. ప్రభుత్వాన్నో, ఫలానా రాజకీయ పార్టీనో విమర్శించి చేతులు దులుపుకోకుండా ఉగ్రవాదాన్ని బలంగా ఎదుర్కోవడానికి నిర్ణయాత్మక చర్యలు తీసుకోవడమే ఇప్పుడు మన ముందున్న బాధ్యత.

దేశం ఇలాంటి విపత్కర పరిస్థితి ఎదుర్కొంటున్న సమయంలో మీడియా దేశంలోని భిన్నవర్గాలను బలోపేతం చేయాలి. అంతేకానీ రాజకీయ పార్టీలు, మతాల పేరుతో వర్గాలను విభజించకూడదు. ముస్లింల వల్లే తాము బతికి ఉన్నామని చెప్పిన బాధితుల కుటుంబాల మాటలను మీడియా కూడా ప్లే చేయాలి. దురదృష్టవశాత్తు కొన్ని మీడియా సంస్థలు ఇలా చేయడం లేదు. పౌర హక్కులు, మానవ హక్కుల కార్యకర్తల్లాగే ఇప్పుడు మతస్వేచ్ఛ కార్యకర్తలు అవసరం. మత విద్వేషాన్ని ఆపేందుకు వారి తోడ్పాటు కావాలి.

భారత్–పాక్ అణుశక్తిని కలిగి ఉన్న దేశాలు. ఒకసారి యుద్ధం మొదలైందంటే ఇది ఎక్కడ ముగుస్తుందో తెలియదు. అందుకే యుద్ధ కాంక్షను ఆపి, శాంతి వైపు చర్చలు జరపాలి. స్నేహపూర్వక దేశాలతో కూర్చుని ఈ సమస్యను పరిష్కరించాలి. యుద్ధమనేది అంతిమ పరిష్కారం. ఉగ్రదాడిలో అమాయకులు తమ ప్రాణాలు కోల్పోయారు. ఆ అమరవీరులకు వందనం చేద్దాం. భారతం చెప్పిందే మన సందేశం. కౌరవులు, పాండవుల మధ్య ఏ ఫిర్యాదులైనా ఉండొచ్చు... బయటి శత్రువుకు మేము నూటా ఐదుగురం అన్నాడు ధర్మరాజు. బయట శత్రువు కన్నెత్తి చూస్తే ఈ దేశంలోని అన్ని మతాల వారు ఐక్యమై సింహాల్లా గర్జించగలరని చాటడమే ఇప్పుడు కావలసింది. జై భారత్. జై హింద్.

వ్యాసకర్త సామాజిక కార్యకర్త, యూఎస్‌ఏ

చెరిపేస్తే చెరిగిపోతుందా చరిత్ర?

విశ్లేషణ




ఎన్. వేణుగోపాల్

నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రిసర్చ్ అండ్ ట్రయినింగ్ (ఎన్సీఈఆర్టీ) 2025–26 విద్యాసంవత్సరం నుంచి అమలు లోకి రావడం కోసం ప్రచురించిన ఏడో తరగతి పాఠ్య పుస్తకం మొదటి భాగం వెలువడిన సందర్భంగా అందులో గతం నుంచి కొనసాగిన, రద్దయిపోయిన, మారిన అంశాల గురించి వార్తా కథనాలు ఈ సోమవారం సంచలనం సృష్టించాయి.

పాఠ్య పుస్తకాలు మార్చడాన్ని ఎవరూ తప్పు పట్టనక్కరలేదు. తప్పనిసరిగా పాఠ్య పుస్తకాలు ఎప్పటికప్పుడు మారవలసిన అవసరం ఉంటుంది. ఆ రంగంలో కొత్త పరిశోధనలు జరిగి కొత్త ఆవిష్కరణలు బైటపడినప్పుడు ఆ కొత్త విషయాలు విద్యార్థులకు అందుబాటులోకి తేవడానికి పాఠ్య పుస్తకాలలో మార్పులూ చేర్పులూ చేయవలసి ఉంటుంది. కానీ ఎన్సీఈఆర్టీ పాఠ్య పుస్తకాలలో గత కొద్ది సంవత్సరాలుగా చేస్తున్న మార్పులూ, చేర్పులూ, తొలగింపులూ ఆ యా శాస్త్ర రంగాలలో జరిగిన నూతన అన్వేషణలకు సంబంధించినవి కావు. అవి ఆ సంస్థనూ, విద్యా శాఖనూ, భారత ప్రభుత్వాన్నీ ఇవాళ నడుపుతున్నవారి భావజాలానికి తక్షణ ప్రయోజనాలకు అనుగుణమైనవి. ఏదో ఒక భావజాలం మాత్రమే చెప్పడం విద్యార్థుల చిన్నారి మనసులను కుంచింపజేసి, కళ్లకు గంతలు కట్టడమే. అలాగే ఐదు సంవత్సరాల పాలనాధికారం కోసం గద్దెనెక్కిన వారు తమ తక్షణ ప్రయోజనాలను చిన్నారి పిల్లల మనసులపై సుదూర ప్రభావం పడేలా నింపడం అనుచితం.

ఇప్పుడు ఏడో తరగతి కోసం కొత్తగా విడుదల చేసిన 'ఎక్స్‌ప్లోరింగ్ సొసైటీ – ఇండియా అండ్ బియాండ్ (భాగం 1)' అనే పుస్తకం ఇప్పటివరకూ ఉండిన చరిత్ర, భౌగోళిక శాస్త్రం, పౌరనీతి (సామాజిక, ఆర్థిక జీవనం) అనే మూడు విడివిడి పుస్తకాలను తొలగించి ఆ స్థానంలో ఒకే సమగ్ర పుస్తకంగా తయారయింది. రెండో భాగం కూడా త్వరలో వెలువడుతుందని అంటున్నారు గానీ, ఈ పుస్తకం వరకే చూస్తే చాలా మార్పులు కనబడుతున్నాయి. 'ప్రపంచం', 'గత వైభవ దృశ్యం', 'మన సాంస్కృతిక వారసత్వం – జ్ఞాన సంప్రదాయాలు', 'పాలన – ప్రజాస్వామ్యం', 'మన చుట్టూ ఉన్న ఆర్థిక జీవనం' అనే ఐదు ఇతివృత్తాలతో ఈ పుస్తకం ఉంది. అంతకు ముందరి ఏడో తరగతి చరిత్ర పుస్తకం ఏడో శతాబ్ది నుంచి భారత చరిత్రను పరిచయం చేయగా దానికి భిన్నంగా ప్రస్తుత పుస్తకం ఆరో శతాబ్దితో ముగుస్తుంది. అందువల్ల పాత పుస్తకంలో ఉండిన మధ్య యుగాల చరిత్ర, ఢిల్లీ సల్తనత్, ముఘల్ పాలన వంటి పాఠాలు లేకుండా పోయాయి. చరిత్రలో ఒక భాగాన్ని చిన్నారి పిల్లల పాఠ్యాంశాల్లోంచి తొలగించినంత మాత్రాన ఆ చరిత్రను రద్దు చేయగలమని అనుకోవడం హాస్యాస్పదం.

కోవిడ్ తర్వాత చిన్నారి విద్యార్థుల మీద పాఠ్యాంశాల భారం ఎక్కువగా ఉండగూడదనే సదుద్దేశంతో పాఠ్యాంశాల హేతుబద్ధీకరణ పేరుతో కొన్ని పాఠ్యాంశాలను కుదించడం ప్రారంభించారు. ముఘల్ చరిత్రలో కొంత భాగాన్ని, డార్విన్ జీవ పరిణామవాద సిద్ధాంతాన్ని, పీరియాడిక్ టేబుల్‌ను పాఠ్యాంశాలలో కుదించారు. ప్రస్తుత పుస్తకం మరొక అడుగు ముందుకు వేసి కొన్ని పాఠ్యాంశాలను పూర్తిగానే తొలగించింది. అయితే 'భారం తగ్గించడం కోసం పాఠ్యాంశాల తగ్గింపు, తొలగింపు' అనే సూత్రం కూడా చిత్తశుద్ధితో పాటించలేదు. కొన్ని కొత్త పాఠాలు వచ్చి చేరాయి. 'భూమి పుణ్యభూమి ఎలా అవుతుంది' అని ఒక అధ్యాయం చేర్చి, ప్రత్యేక స్థలాలను మతాలు ఎలా పవిత్రంగా భావిస్తాయో ఒక పాఠం చేర్చారు. ద్వాదశ జ్యోతిర్లింగాల గురించి, చార్ ధామ్ యాత్ర గురించి, శక్తి పీఠాల గురించి ఏడో తరగతి పిల్లలకు పాఠాలు పెట్టారు. అలాగే 'అరవై ఆరు కోట్ల మంది పాల్గొన్న కుంభమేళా' గురించి పాఠం చేర్చారు. కౌటిల్యుడి అర్థశాస్త్రం, పాణిని వ్యాకరణం, ఆర్యభట్టు ఖగోళ శాస్త్రం, గుప్త సామ్రాజ్యంలో శాస్త్ర పరిశోధనలు వంటి ప్రాచీన భారత మేధా కృషి గురించి పాఠాలు చేర్చారు. వర్ణ–కుల వ్యవస్థ ప్రాచీన భారత సమాజంలో స్థిరత్వం సాధించడంలో నిర్వహించిన పాత్ర గురించి ఒక పాఠం పెట్టి, బ్రిటిష్ వారు వచ్చిన తర్వాత కుల వ్యవస్థ కరడుగట్టి అసమానతలకు దారి తీసిందని రాశారు. ఆరో శతాబ్దం నుంచి ఇరవై ఒకటో శతాబ్దానికి గంతు వేసి ప్రస్తుత ప్రభుత్వపు 'మేక్ ఇన్ ఇండియా', 'బేటీ బచావో బేటీ పఢావో', 'అటల్ సొరంగం' నిర్మాణం వంటి విషయాలు రాశారు.



◆ మనం ఏకీభవించినా ఏకీభవించకపోయినా చరిత్రలో జరిగిన వాస్తవ ఘటనలను చెప్పకుండా ఉండాలనుకుంటే ఆ మేరకు పిల్లల మనసులలో ప్రమాదకరమైన ఖాళీలు ఏర్పడతాయి.


ఇలా మనం ఏకీభవించినా ఏకీభవించకపోయినా చరిత్రలో జరిగిపోయిన వాస్తవ ఘటనలను, పరిణామాలను చెప్పకుండా ఉండాలనుకుంటే ఆ మేరకు చిన్నారి పిల్లల మనసులలో, పరిజ్ఞానంలో అనవసరమైన, ప్రమాదకరమైన ఖాళీలు, శూన్యాలు ఏర్పడతాయి. ఉద్దేశపూర్వకంగా ఖాళీలు వదలడం జ్ఞాన సముపార్జన శక్తిని ధ్వంసం చేసే, ఆలోచనా శక్తిని కురచబరిచే పద్ధతి. ఎటువంటి విషయమైనా చెప్పి, దాని పట్ల విమర్శనాత్మకంగా ఉండాలనే సందేశం ఇవ్వవలసిన చోట, కొన్ని విషయాలను తుడిచేయగలమని అనుకోవడం అనుచితం.

ఈ పద్ధతి ఎన్సీఈఆర్టీ వంటి ప్రామాణిక సంస్థ విశ్వసనీయతను దెబ్బతీస్తుంది. అది పాఠశాల విద్యా ప్రమాణాలను అభివృద్ధి చేయడానికి 1961లో కేంద్ర ప్రభుత్వం రూపొందించిన అత్యున్నత ప్రమాణాల స్వతంత్ర సంస్థ. అది చేసే అనేక పనులలో భాగంగా పాఠ్యాంశాలను రూపొందించి, వాటి ఆధారంగా ఆ యా రంగాల నిపుణుల చేత పాఠ్యపుస్తకాలు రాయించి, మూడు నాలుగు అంచెల పర్యవేక్షణ, పరిశీలన, సవరణల తర్వాత అచ్చువేసి దేశవ్యాప్తంగా పంపిణీ చేసే పథకం 1970ల నుంచి సాగుతున్నది. ముఖ్యంగా ఆరో తరగతి నుంచి పన్నెండో తరగతి సామాజిక శాస్త్రాలు, విజ్ఞాన శాస్త్రాలు, భాషా సాహిత్యాల పుస్తకాలు ఆ యా తరగతుల వారు మాత్రమే కాక యూపీఎస్సీ పరీక్షార్థులు, సాధారణ పాఠకులు కూడా చదువుకునేంత ఆసక్తికరంగా తయారయ్యాయి. నిష్ణాతులు రాసిన, దశాబ్దాల పాటు అపారమైన గౌరవాన్ని చూరగొన్న ఆ పుస్తకాలను అడ్డదిడ్డంగా మార్చి, సంఘ్ శాఖలలో ఇన్నాళ్లుగా చెబుతున్న వక్రీకరించిన, సంకుచితమైన, కళ్లకు గంతలు కట్టే చరిత్రను ఇప్పుడు పాఠ్యపుస్తకాలకు ఎక్కిస్తున్నారు. ఎటువంటి పరిశోధన లేకుండా, వాస్తవాల పట్ల గౌరవం లేకుండా ఐటీ సెల్స్‌లో వండి వార్చిన అసత్యాల, అర్ధసత్యాల, వాట్సప్ యూనివర్సిటీ చరిత్రకు పాఠ్యపుస్తకాల గౌరవం కల్పిస్తున్నారు. భవిష్యత్ తరాన్ని ధ్వంసం చేస్తున్నారు.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

ధర్మ వ్యాప్తి

బౌద్ధమతాన్ని తార్కికంగా వివరించిన ప్రముఖ ఆచార్యుల్లో ధర్మకీర్తి ఒకడు. నలందా విశ్వవిద్యాలయంలో ఆచార్య ధర్మపాలునికి శిష్యుడై విద్యను ఆర్జించి భిక్షువయ్యాడు. దేశమంతా పర్యటించి అనేక చర్చల్లో, సదస్సుల్లో, సమావేశాల్లో పాల్గొన్నాడు. వాదంలో ధర్మ కీర్తిచే ఓడింపబడినవారు తమ ఓటమిని హుందాగా అంగీకరించకపోగా అవమానించడానికి పూనుకున్నారు. ఆయన రచించిన తాళపత్ర గ్రంథాలను సేకరించి, వాటిని కట్టగా కట్టి, కుక్క తోకకు ముడివేసి ఆ కుక్క పరుగులు తీసేట్టు దాన్ని గట్టి గట్టిగా కేకలు వేశారు. భయంతో ఆ కుక్క విచ్చలవిడిగా అటూ, ఇటూ పరుగులు పెట్టింది. దాని తోకకు కట్టిన ధర్మకీర్తి రచనలున్న తాళపత్రాలు చిందరవందరై గాలి వీచి అన్ని దిక్కులకు ఎగిరిపోయాయి. ఆ దృశ్యాన్ని చూసి ధర్మ కీర్తి ప్రత్యర్థులు పగలబడి నవ్వుతూ ధర్మకీర్తిని హేళన చేసి, చులకనగా మాట్లాడారు.



ఈ దెబ్బకు ఆయన దిగులు పడి కాళ్ళ బేరానికి వస్తాడని వారు ఆశించారు. కానీ ఆయన చాలా ప్రశాంతంగా, 'ఈనాడు, ఈ నా గ్రంథాలు ఎలాగైతే అన్ని దిక్కులకు ఎగిరిపోతున్నవో, అలాగే ఒక నాటికి నా భావాలు, నా కీర్తి దశ దిశలకు వ్యాపించి తీరుతుంది' అన్నాడు. అది అక్షరాలా నిజమైంది. ధర్మమే జయించింది. సత్యమే గెలిచింది.

టిబెట్‌లో నేటికీ బౌద్ధ భిక్షువులు ధర్మకీర్తి రచనలను పరమ ప్రామాణికమైనవిగా భావించి ఆయనను గౌరవిస్తారు. రాహుల్ సాంకృత్యాయన్ ధర్మకీర్తిని శ్లాఘిస్తూ 'విమర్శనాత్మకమైన వాదనా పటిమలోనూ, విస్పష్టమైన విశ్లేషణలోనూ, స్పష్టమైన భావుకతలోనూ ఆయనను మించిన వారు లేరు' అంటారు. 'న్యాయ బిందు', 'హేతుబిందు' వంటి ఎనిమిది గ్రంథాలు ధర్మకీర్తి కీర్తి ప్రతిష్ఠలను గగనానికి చేర్చాయి.

– రాచమడుగు శ్రీనివాసులు

నకిలీ పత్తి విత్తనాల కట్టడికి టాస్క్‌ఫోర్స్

- రంగంలోకి దిగిన పోలీస్, వ్యవసాయ శాఖ అధికారులు
- ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 10 మంది అరెస్టు
- రూ.కోటిన్నరకు పైగా విలువైన నకిలీ పత్తి విత్తనాలు స్వాధీనం

సాక్షి, హైదరాబాద్: నకిలీ పత్తి విత్తన ముఠాలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. రైతులు పత్తి సాగుకు సన్నద్ధమవుతున్న తరుణంలో తెలంగాణలోకి ఇతర రాష్ట్రాల నుంచి నాసిరకం విత్తన ముఠాల ఏజెంట్లు వస్తున్నారు. తక్కువ ధరను ఆశగా చూపి రైతులకు మొలకెత్తని, ఊరుపేరు లేని నాసిరకం విత్తనాలు అంటగట్టే ముఠాల పని పట్టేందుకు పోలీసులు ప్రత్యేక వ్యూహాలు సిద్ధం చేశారు. వ్యవసాయ, పోలీస్ అధికారులతో కలిపి ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. స్థానిక పోలీసులతో పాటు ఈ బృందాలతో తనిఖీలు ప్రారంభించారు. సీజన్ ఊపందుకోనున్న నేపథ్యంలో తనిఖీలు ముమ్మరం చేయాలని అధికారులు నిర్ణయించారు. వరుసగా మూడుసార్ల కంటే ఎక్కువ పట్టుబడిన నిందితులపై పీడీ యాక్ట్‌లు సైతం నమోదు చేస్తున్నారు. నకిలీ పత్తి విత్తనాలు ప్రధానంగా వస్తున్న కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ ప్రాంత సరిహద్దుల్లోనూ నిఘా పెంచారు. మరోవైపు రైతుల్లోనూ నాసిరకం విత్తనాలు కొనుగోలు చేయకుండా అవగాహన కల్పిస్తున్నారు. విత్తన కొనుగోలు సమయంలో లేబుల్స్ సక్రమంగా ఉండేలా..అధికారి డీలర్ వద్ద నుంచే విత్తనాలు కొనేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రధానంగా నకిలీవి విక్రయించే అవకాశం ఉన్నట్టు బీజీ–3 పత్తి విత్తనాల అక్రమ రవాణాపై అధికారులు ప్రత్యేక నిఘా పెడుతున్నారు.

ఇదీ టాస్క్‌ఫోర్స్ టీం

నకిలీ విత్తనాలను గుర్తించడంతోపాటు విత్తన ముఠాలపై చర్యలకు ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ టీంలో వ్యవసాయ శాఖ అధికారులు, విత్తన సర్టిఫికేషన్ అధికారులు, సీడ్ కార్పొరేషన్ అధికారులు, పోలీసులు భాగస్వాములుగా ఉన్నారు.



ఈ ఏడాది మే 1 వరకు నమోదైన కేసులు ఇలా...

ఆదిలాబాద్ జిల్లా: మార్చి 3న మల్లిడి గ్రామంలో నకిలీ పత్తి విత్తనాలను అక్రమంగా రవాణా చేస్తున్న ఐదుగురిని అరెస్టు చేశారు. రూ.6.85 లక్షల విలువైన 2.74 క్వింటాళ్ల పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు.

- మార్చి 9న సుర్జాపూర్‌లో రూ. 3.50 లక్షల విలువైన 1.40 క్వింటాళ్ల పత్తి విత్తనాలను అక్రమంగా తరలిస్తున్న ఇద్దరిని అరెస్టు చేశారు.

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా: కర్ణాటక నుంచి మంచిర్యాలకు నిషేధిత బీజీ–3 పత్తి విత్తనాలను సరఫరా చేస్తున్న రాకెట్‌ను మార్చి 19న శామీర్‌పేట్ పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారుల సహకారంతో సైబరాబాద్ స్పెషల్ ఆపరేషన్స్ టీమ్ (ఎస్ఓటీ) ఛేదించింది. ట్రక్ డ్రైవర్‌ను అరెస్టు చేయడంతో పాటు, రూ.98.75 లక్షల విలువైన 3,750 కిలోల విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు.

వికారాబాద్ జిల్లా: వికారాబాద్ జిల్లా టాస్క్‌ఫోర్స్, కరణ్‌కోట్ పోలీసులు ఏప్రిల్ 12న రూ.44 లక్షల విలువైన 22 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలు స్వాధీనం చేసుకొని ఇద్దరిని అరెస్టు చేశారు.

విద్యుత్ షాక్‌తో తల్లీకొడుకు దుర్మరణం



జయమ్మ, శ్రీకాంత్

తాడూరు: విద్యుత్ షాక్‌కు గురై తల్లీకొడుకులు మృతిచెందిన విషాదకర సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. తాడూరు మండలం తుమ్మలసూగూర్ గ్రామానికి చెందిన వడ్ల శ్రీనివాసచారి, భార్య జయమ్మ(40), కొడుకు శ్రీకాంత్(16) కొంతకాలంగా ఇంటి ఆవరణలో పిండిగిర్ని ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం పిండి గిర్ని దగ్గర విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కావడంతో తల్లీకొడుకు కిందపడిపోయారు. గమనించిన స్థానికులు వారిని నాగర్‌కర్నూల్ జిల్లా ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కాగా.. శ్రీకాంత్ బుధవారం ప్రకటించిన పదో తరగతి ఫలితాల్లో 358 మార్కులతో పాసయ్యాడు. భార్య, కొడుకు ఒకేసారి చనిపోవడంతో శ్రీనివాసచారి బోరున విలపించాడు. బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి పరామర్శించారు. విద్యుత్ అధికారులతో మాట్లాడి ప్రభుత్వపరంగా ఆదుకునేలా చూడాలని ఆదేశించారు.

ఫెయిలవుతానేమోనని విద్యార్థిని ఆత్మహత్య

జోగిపేట(అందోల్): డిగ్రీ పరీక్షల్లో ఫెయిలవుతానేమోనని భయంతో ఒక విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల కథనం మేరకు.. భరత్ నగర్ కాలనీలో నివసిస్తున్న ప్రైవేట్ ఉద్యోగి షైమొద్దీన్ కూతురు పర్వజున్నీసా (18).. జోగిపేటలోని శ్రీ సాయి డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం చదువుతోంది. ఫస్ట్ సెమిస్టర్ పరీక్షల్లో ఫెయిలవడంతో తిరిగి సప్లిమెంటరీ పరీక్షలు రాసింది. ఇందులోనూ ఫెయిలవుతానేమోనన్న భయంతో బుధవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది.

భూమి ఆక్రమించారని రైతు ఆత్మహత్య

- ఆరుగురిపై కేసు నమోదు

జగిత్యాల క్రైం: తన భూమిని ఆక్రమించుకున్నారని మనస్తాపానికి గురైన ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల ప్రకారం.. జగిత్యాల రూరల్ మండలం పొరండ్ల గ్రామానికి చెందిన పడిగెల మల్లారెడ్డి (46)కి గ్రామంలో ఎకరంన్నర భూమి ఉంది. సదరు భూమితోపాటు శివారులో ఉన్న ఆరుగుంటల స్థలాన్ని కూడా అదే గ్రామానికి చెందిన ఆరుగురు తమదేనంటూ ఆక్రమించుకున్నారు. చంపేస్తామంటూ బెదిరిస్తుండటంతో మనస్తాపానికి గురైన మల్లారెడ్డి గురువారం ఇంట్లోనే క్రిమిసంహారక మందు తాగాడు. కుటుంబ సభ్యులు ఆయనను జగిత్యాలలోని ఓ ఆస్పత్రిలో చేర్పించారు. వైద్యుల సూచన మేరకు కరీంనగర్‌కు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య అనూష ఫిర్యాదు మేరకు పడిగెల గంగారెడ్డి, జనార్దన్‌రెడ్డి, రాజిరెడ్డి, రమ, రాజవ్వ, లచ్చవ్వపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై సుధాకర్ తెలిపారు.

ముగ్గురు చిన్నారులను మింగిన చెరువు

- ఈతకు వెళ్లి అన్న, చెల్లి, మరో బాలుడు మృతి



శ్రవణ్‌కుమార్ గణేశ్‌రెడ్డి రక్షిత

పెద్దకొత్తపల్లి: సరదాగా చెరువులో దిగిన ముగ్గురు చిన్నారులు ప్రమాదవశాత్తు నీట మునిగి మృతిచెందారు. ఈ విషాదకర సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లిలో చోటుచేసుకుంది. పెద్దకొత్తపల్లికి చెందిన ధర్మారెడ్డి, నవిత దంపతుల కుమారుడు గణేశ్‌రెడ్డి (13), కూతురు రక్షిత (10), సుధాకర్, రాధ దంపతుల కుమారుడు శ్రవణ్‌కుమార్ (7) ప్రస్తుతం వేసవి సెలవులు కావడంతో గురువారం సాయంత్రం చెరువులో ఈత కొట్టేందుకు వెళ్లారు. అయితే ప్రమాదవశాత్తు ముగ్గురూ నీటమునిగి మృతిచెందారు. చెరువు కట్టపై దుస్తులు గమనించిన స్థానికులు సమీపంలో గేదెలు మేపుతున్న శ్రవణ్‌కుమార్ అన్న రాజేశ్‌కు చెప్పారు. రాజేశ్ అక్కడే ఉన్న రైతుకు విషయం చెప్పడంతో పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎస్ఐ సతీశ్ ఘటనా స్థలానికి చేరుకుని గ్రామస్తుల సహాయంతో మృతదేహాలను వెలికి తీయించి.. పోస్టుమార్టం నిమిత్తం నాగర్‌కర్నూల్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. కాగా హైదరాబాద్ బండ్లగూడలోని సరస్వతి శిశుమందిర్‌లో గణేశ్‌రెడ్డి 7వ తరగతి, రక్షిత 5వ తరగతి, శ్రవణ్‌కుమార్ స్థానిక ప్రాథమిక పాఠశాలలో 2వ తరగతి చదువుతున్నాడు. కాగా, చిన్నారులు గణేశ్‌రెడ్డి, రక్షిత తల్లి నవిత రెండేళ్ల క్రితమే మృతిచెందింది.

ఎవరినీ వదిలిపెట్టం!



- పహల్గాంలో దాడికి పాల్పడిన ప్రతి ఒక్కరినీ వేటాడుతాం
- కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా హెచ్చరిక
- దేశంలో ఉగ్రవాదం అంతమయ్యే దాకా పోరాటం ఆగదని వెల్లడి

న్యూఢిల్లీ: ప్రతి ఉగ్రవాద చర్యకూ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని భారత్ తగిన సమాధానం ఇస్తుందని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తేల్చిచెప్పారు. పిరికిపందల్లా దాడులకు పాల్పడి అదే గొప్ప విజయంగా భావిస్తూ పొంగిపోవద్దని ఉగ్రవాదులకు హితవు పలికారు. ఇది నరేంద్ర మోదీ నేతృత్వంలోని భారత్ అనే సంగతి గుర్తుపెట్టుకోవాలని చెప్పారు. ఒకరి తర్వాత ఒకరిపై వరుసగా ప్రతీకారం తీర్చుకుంటామని ఉగ్రవాదులను ఘాటుగా హెచ్చరించారు. దేశంలో ఉగ్రవాదాన్ని ప్రతి మూల నుంచీ అంతం చేస్తామని పునరుద్ఘాటించారు. ఒక్క అంగుళం భూభాగంలోనూ ఉగ్రవాదం అనేది లేకుండా కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. అనుకున్నది సాధించి తీరుతామని ప్రతిజ్ఞ చేశారు. ఆయన గురువారం ఢిల్లీలో ఓ కార్యక్రమంలో ప్రసంగించారు. ఉగ్రవాదంపై తాము ప్రారంభించిన పోరాటానికి అంతర్జాతీయ సమాజం మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ పోరాటంలో 140 కోట్ల మంది భారతీయుల మద్దతే కాకుండా ప్రపంచవ్యాప్తంగా అందరి మద్దతు కావాలని చెప్పారు. ఉగ్రవాదాన్ని నామరూపాల్లేకుండా చేయడానికి ప్రపంచమంతా ఒక్కతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. మనమంతా చేతులు కలిపి పనిచేస్తే ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో పెకిలించి వేయొచ్చని తెలిపారు. ఇండియాలో దాడులకు పాల్పడి, ప్రజల ప్రాణాలను బలితీసుకున్న ముష్కరులకు తగిన శిక్ష విధించడం తథ్యమని అన్నారు. ఉగ్రవాదం పూర్తిగా అంతమయ్యే దాకా తమ పోరాటం ఆగదని వెల్లడించారు. పహల్గాంలో దాడికి పాల్పడిన ప్రతి ఒక్క ముష్కరుడినీ వేటాడుతామని అమిత్ షా స్పష్టంచేశారు. వారు శిక్ష నుంచి ఎప్పటికీ తప్పించుకోలేరని అన్నారు. మోదీ ప్రభుత్వం ఏ ఒక్కరినీ వదిలిపెట్టబోదని చెప్పారు. 26 మందిని హత్య చేసి, గెలిచామనుకుంటే అది పొరపాటే అవుతుందని వ్యాఖ్యానించారు. ఉగ్రవాదుల అరాచకాలను సహించే ప్రసక్తే లేదన్నారు.

ఇంట్లోకి చొరబడండి!



- పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను స్వాధీనం చేసుకోండి
- ఈ అవకాశం వదులుకోవద్దు
- కేంద్రానికి ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ విజ్ఞప్తి

న్యూఢిల్లీ: పాకిస్తాన్‌కు గట్టిగా బుద్ధి చెప్పాలంటే పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోకి ప్రవేశించి, అక్కడే బైఠాయించాలని ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ కేంద్ర ప్రభుత్వానికి సూచించారు. పీఓకేను స్వాధీనం చేసుకోవాలని కోరారు. పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా నిర్ణయాత్మక సైనిక, వ్యూహాత్మక చర్యలు చేపట్టాలని అన్నారు. ఆయన గురువారం మీడియా సమావేశంలో మాట్లాడారు. భారత సైన్యం దాడులు చేస్తుందన్న భయంతో పాకిస్తాన్ సైనికాధికారులు విదేశాలకు పారిపోతుండడంపై స్పందించారు. అది చాలా మంచి పరిణామం అని చెప్పారు. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోకి చొరబడి, అక్కడే మకాం వేయడానికి ఇదే సరైన సమయమని పేర్కొన్నారు. ఈ అవకాశం వదులుకోవద్దని స్పష్టంచేశారు. ఉగ్రవాదుల ఇళ్లలోకి ప్రవేశించి మరీ దాడులు చేస్తామంటూ ప్రధాని మోదీ గతంలో హెచ్చరించారని, ఇప్పుడు ఆ పని చేసి చూపించాలని అన్నారు. పీఓకేను మన అధీనంలోకి తెచ్చుకోవాల్సిందేనని అసదుద్దీన్ ఒవైసీ తేల్చిచెప్పారు. పీఓకే భారత్‌కే చెందుతుందంటూ పార్లమెంట్‌లో ఇప్పటికే ఒక తీర్మానం ఆమోదించినట్లు గుర్తుచేశారు. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని కోరారు. పార్లమెంట్ మద్దతు ఉంది కాబట్టి వెనుకంజ వేయాల్సిన అవసరం లేదన్నారు.

ఉగ్రదాడులకు చరమగీతం పాడాలి

హైదరాబాద్‌లో లుంబినీ పార్కులో, దిల్‌సుఖ్‌నగర్‌లో ఉగ్రవాద దాడులు జరిగాయని అసదుద్దీన్ ఒవైసీ ప్రస్తావించారు. ఉగ్రవాదులు ముంబైలో భీకర దాడులకు పాల్పడ్డారని, 2019లో పుల్వామాలో మన జవాన్లను ముష్కరులు బలి తీసుకున్నారని చెప్పారు. ముంబైలో వీటీ స్టేషన్‌లో జరిగిన ఉగ్రవాద దాడుల్లో ఓ తెలుగు పండితుడు నవవధువు అయిన తన కుమార్తెను పోగొట్టుకున్నాడని తెలిపారు. నిజామాబాద్‌కు చెందిన ఆ నవ వధువు చేతికి గోరింటాకు ఉందన్నారు. గత ఏడాది వైష్ణోదేవి ఆలయం వద్ద జరిగిన ఉగ్రదాడిలో ఏడుగురు పర్యాటకులు మరణించారని వెల్లడించారు. ఉగ్రవాదంపై కఠినంగా వ్యవహరించాలని ప్రతిపక్షాలు తరచుగా కోరుతూనే ఉన్నాయని చెప్పారు. ''అధికారంలో మీ చేతుల్లోనే ఉంది, ఇలాంటి దాడులకు చరమగీతం పాడండి'' అని కేంద్ర ప్రభుత్వానికి ఒవైసీ విజ్ఞప్తి చేశారు.

ఉద్రిక్తతలు ఆగిపోవాల్సిందే

సంయమనం పాటించండి

- భారత్, పాకిస్తాన్‌లకు మార్కో రూబియో విజ్ఞప్తి
- ఎస్.జైశంకర్, షెహబాజ్ షరీఫ్‌లకు అమెరికా విదేశాంగ మంత్రి ఫోన్
- రెండు దేశాల మధ్య శాంతియుత పరిస్థితులు నెలకొనాలని ఆకాంక్ష



జైశంకర్ మార్కో రూబియో షెహబాజ్ షరీఫ్

న్యూయార్క్/వాషింగ్టన్/న్యూఢిల్లీ: భారత్, పాకిస్తాన్ మధ్య యుద్ధ వాతావరణం నెలకొనడం పట్ల అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో తీవ్ర ఆందోళన వ్యక్తంచేశారు. ఇరు దేశాల మధ్య సాధ్యమైనంత త్వరగా శాంతియుత పరిస్థితులు నెలకొనాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. ఆయన బుధవారం రాత్రి భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్, పాకిస్తాన్ అధ్యక్షుడు షెహబాజ్ షరీఫ్‌లతో వేర్వేరుగా ఫోన్‌లో మాట్లాడారు. పహల్గాం ఉగ్రదాడి, తదనంతర పరిణామాలపై చర్చించారు. భారత్–పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలు పెరగడం ఎవరికీ మేలు చేయదని అన్నారు. ఘర్షణ వాతావరణం సమసిపోయేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్.జైశంకర్‌తో మార్కో రూబియో మాట్లాడుతూ.. పహల్గాం ఉగ్రదాడిలో 26 మంది పర్యాటకులు మరణించడం పట్ల తీవ్ర విచారం వ్యక్తంచేశారు. ఉగ్రవాదంపై జరిగే పోరాటంలో భారత్‌కు తమ సహకారం ఉంటుందని పునరుద్ఘాటించారు. మానవాళికి పెనుముప్పుగా మారిన ఉగ్రవాదం అంతం కావాలని చెప్పారు. ఉద్రిక్తతలు తగ్గించుకొనే విషయంలో భారత్, పాక్ కలిసి పనిచేయాలని, పూర్తిస్థాయిలో సంయమనం పాటించాలని కోరారు. దక్షిణాసియాలో శాంతిభద్రతల పరిరక్షణకు చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎస్.జైశంకర్ స్పందిస్తూ.. పహల్గాంలో దాడికి పాల్పడిన ముష్కరులను, వారి వెనుక ఉన్న అసలైన కుట్రదారులను చట్టం ముందు నిలబెట్టి, శిక్షించక తప్పదని పేర్కొన్నారు. ఇదే విషయాన్ని 'ఎక్స్'లో పోస్టు చేశారు.

భారత్‌కు పాక్ సహకరించాలి

పహల్గాం ఉగ్రదాడిపై జరుగుతున్న దర్యాప్తుకు పాకిస్తాన్ ప్రభుత్వం సహకరించాల్సిందేనని మార్కో రూబియో తేల్చిచెప్పారు. ఆయన పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌తో మాట్లాడుతూ ఈ సంగతి ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఇండియాతో నేరుగా సంప్రదింపులు జరుపుతూ ఉద్రిక్తతలు సడలిపోయేలా చర్యలు చేపట్టాలని హితవు పలికారు. పహల్గాంలో 26 మందిని పొట్టనపెట్టుకున్న ముష్కరులకు సరైన శిక్ష పడేలా భారత్‌కు సహకారం అందించాలని చెప్పారు. పాకిస్తాన్ నుంచి నిర్మాణాత్మక చర్యలను కోరుకుంటున్నామని రూబియో వెల్లడించారు. పహల్గాం ఉగ్రదాడి పట్ల తమ వైఖరిని షెహబాజ్ షరీఫ్ అమెరికా విదేశాంగ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఉగ్రవాదంపై పోరాటానికి తాము కట్టుబడి ఉన్నామని చెప్పారు. పాకిస్తాన్ సైతం ఉగ్రవాద బాధిత దేశమేనని, 90 వేల మందికిపైగా ప్రజలు ఉగ్రదాడుల్లో మరణించారని తెలిపారు. ఉగ్రవాదం వల్ల తమకు 192 బిలియన్ డాలర్ల నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తంచేశారు. పహల్గాం దాడితో తమకు ఎలాంటి సంబంధం లేదని మరోసారి వెల్లడించారు. పహల్గాం ఉగ్రదాడిపై పారదర్శకంగా దర్యాప్తు జరగాలని కోరుకుంటున్నామని చెప్పారు. ఉద్రిక్తతలు పెంచేలా ఎలాంటి వ్యాఖ్యలు చేయకుండా ఇండియాను కట్టడి చేయాలని రూబియోను కోరారు. సింధూనది జలాల ఒప్పందాన్ని ఇండియా నిలిపివేయడాన్ని షెహబాజ్ షరీఫ్ తప్పుపట్టారు. ఒప్పందాన్ని ఏకపక్షంగా నిలిపివేయడం చెల్లదని అన్నారు.

భారత్ హక్కుకు మద్దతిస్తున్నాం

తమను తాము రక్షించుకొనే హక్కు భారత్‌కు ఉందని, ఆ హక్కుకు తాము పూర్తి మద్దతు ఇస్తున్నామని అమెరికా రక్షణ శాఖ మంత్రి పీట్ హెగ్‌సెత్ స్పష్టంచేశారు. ఉగ్రవాదంపై పోరాటంలో భారత్‌కు తమ సహకారం కచ్చితంగా ఉంటుందన్నారు. ఆయన గురువారం భారత రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ధూర్త దేశమైన పాకిస్తాన్ ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తోందని రాజ్‌నాథ్ సింగ్ ఈ సందర్భంగా మండిపడ్డారు. ఉగ్రవాదాన్ని తాము ఎంతమాత్రం సహించడం లేదని హెగ్‌సెత్ బదులిచ్చారు. పహల్గాం ఉగ్రదాడిలో మరణించినవారికి సంతాపం ప్రకటించారు.

పాక్ సైనిక విన్యాసాలు



1. పాకిస్తాన్‌లోని జీలం జిల్లాలో శతఘ్నిని పరీక్షిస్తున్న పాక్ బలగాలు
2. ఆర్మీ చీఫ్‌తో పాటు నినాదాలిస్తున్న పాక్ సైనికులు
3. తిల్లా ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్‌లో దూసుకెళ్తున్న యుద్ధట్యాంక్‌లు

మైక్ వాల్జ్‌కు ఉద్వాసన

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ జాతీయ భద్రతా సలహాదారు(ఎన్ఎస్ఏ) మైక్ వాల్జ్‌పై వేటు వేశారు. సైన్యం కార్యకలాపాలకు ప్రత్యేకించిన సిగ్నల్ చాట్ గ్రూప్‌లో ఓ జర్నలిస్ట్ నంబర్‌ను జత చేయడం, యెమెన్‌లోని హౌతీలపై మార్చి 15వ తేదీన చేపట్టాల్సిన సైనిక చర్యలకు సంబంధించిన రహస్యంగా ఉండాల్సిన కీలకమైన అంశాలు వెలుగులోకి రావడం తెల్సిందే. ఈ విషయమై అప్పట్లో తీవ్ర చర్చ జరిగింది. అయినప్పటికీ వాల్జ్‌ను ట్రంప్ వెనకేసుకొచ్చారు. విమర్శలు ఎక్కువ కావడంతో గురువారం ఆయన వాల్జ్‌కు ఉద్వాసన పలికారని తెలుస్తోంది. జాతీయ భద్రతా ఉపసల హాదారుగా ఉన్న అలెక్స్ వాంగ్‌పైనా వేటు తప్పదని చెబుతున్నారు.

భద్రతా దళాల మనోధైర్యాన్ని దెబ్బతీయాలనుకుంటున్నారా?

పిల్ విచారణకు సుప్రీం నిరాకరణ

న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్రదాడిపై న్యాయవిచారణ జరపాలన్న అభ్యర్థనపై సర్వోన్నత న్యాయస్థానం తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేసింది. భద్రతా దళాల నైతిక స్థైర్యాన్ని దెబ్బతీసే ఉద్దేశ్యంతో ఇలాంటి ప్రజా ప్రయోజనవ్యాజ్యం(పిల్) వేస్తున్నారా? అని పిటిషన్‌దారులపై కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్‌ల ధర్మాసనం గురువారం విచారించింది. పహల్గాం దాడిపై దర్యాప్తును పర్యవేక్షించడానికి రిటైర్డ్ జడ్జిని నియమించాలని అభ్యర్థించడంపై ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. 'దేశంలోని ప్రతి పౌరుడు చేయిచేయి కలిపి ఉగ్రవాదంపై పోరాటం చేయాల్సిన కీలక సమయమిది. ఇలాంటి సందర్భంలో ఈ తరహా పిల్ దాఖలు చేయడం ద్వారా భద్రతా దళాల మనోధైర్యాన్ని దెబ్బతీయాలనుకుంటున్నారా? ఇలాంటి అంశాన్ని మా ముందుకు అస్సలు తీసుకునిరావొద్దు'' అని ధర్మాసనం పేర్కొంది. పిల్‌ను ఉపసంహరించుకోవాలని పిటిషనర్ తరఫు న్యాయవాదులకు సూచించింది.

హమ్‌దర్ద్ వ్యతిరేక వ్యాఖ్యల్ని 24 గంటల్లో తొలగించండి

రాందేవ్ బాబాకు ఢిల్లీ హైకోర్టు ఆదేశాలు

న్యూఢిల్లీ: హమ్‌దర్ద్ కంపెనీపై చేసిన అనుచిత వ్యాఖ్యలను సోషల్ మీడియా వేదికల నుంచి 24 గంటల్లోగా తొలగించాలని యోగా గురువు రాందేవ్‌ను ఢిల్లీ హైకోర్టు గురువారం ఆదేశించింది. హమ్‌దర్ద్ తయారీ రూహ్ అఫ్జా పానీయాన్ని 'షర్బత్ జిహాద్' అంటూ రాందేవ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. దీనిపై ఆ కంపెనీ కోర్టులో ధిక్కరణ పిటిషన్ వేసింది. హమ్‌దర్ద్ సహా పోటీదారుల ఉత్పత్తులకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు, వీడియోలు షేర్ చేయనంటూ గతంలో ఇచ్చిన హామీని రాందేవ్ ఉల్లంఘించారని పేర్కొంది. రాందేవ్ తన పతంజలి ఫుడ్స్ కంపెనీ తయారు చేసే 'గులాబ్ షర్బత్' అమ్మకాలు పెంచుకునేందుకు ఇలాంటి అభ్యంతరకర ప్రచారానికి దిగారని సందీప్ సేథి కోర్టుకు తెలిపారు. వాదనలు విన్న న్యాయస్థానం పైవిధంగా ఆదేశించడంతో పాటు ధిక్కరణ నోటీసులు జారీ చేసింది.

ఖనిజ ఒప్పందం ఖరారు

సంతకాలు చేసిన ఉక్రెయిన్–అమెరికా

- తవ్వకం, ఆదాయంలో ఇరు దేశాలకు సమాన వాటా
- పదేళ్ల పాటు అమల్లో ఉండనున్న ఒప్పందం



పత్రాలు చూపిస్తున్న అమెరికా ట్రెజరీ కార్యదర్శి బీసెంట్, ఉక్రెయిన్ ఆర్థిక మంత్రి సిర్దెంకో

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నంత పనీ చేశారు. ఉక్రెయిన్‌లోని అపారమైన అరుదైన ఖనిజ సంపదపై కన్నేసిన ఆయన దాన్ని చేజిక్కించుకోవడంలో అడుగు ముందుకేశారు. ఖనిజాలు తవ్వుకోడానికి అనుమతి ఇస్తేనే రష్యా–ఉక్రెయిన్ మధ్య యుద్ధాన్ని ముగించడానికి, శాంతిని నెలకొల్పడానికి సహకరిస్తానంటూ మెలికపెట్టి ఉక్రెయిన్‌ను దారికి తెచ్చుకున్నారు. ట్రంప్ ఒత్తిడికి ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తలొగ్గక తప్పలేదు. ఖనిజాలను సొంతం చేసుకోవడానికి ట్రంప్‌కు అనుమతి ఇచ్చేశారు. ఈ మేరకు ఉక్రెయిన్–అమెరికా మధ్య కుదిరిన ఒప్పందంపై స్థానిక కాలమానం ప్రకారం బుధవారం సంతకాలు జరిగాయి. అమెరికా ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బీసెంట్, ఉక్రెయిన్ ఆర్థిక మంత్రి యూలియా సిర్దెంకో సంతకాలు చేశారు. ఉక్రెయిన్ భూభాగంలోని గ్రాఫైట్, టైటానియం, అల్యూమినియం వంటి 20కిపైగా ముడి ఖనిజాలు ఇక అమెరికా పరం కానున్నాయి. అలాగే ఖనిజేతర వనరులైన ముడి చమురు, సహజ వాయువు డ్రిల్లింగ్‌కు సైతం అనుమతి లభించింది. ఒప్పందానికి సంబంధించిన పూర్తివివరాలను ఇరు దేశాలు ప్రస్తుతానికి రహస్యంగానే ఉంచాయి. ఈ కొత్త ఒప్పందాన్ని 'యూఎస్–ఉక్రెయిన్ రీఇన్వెస్ట్‌మెంట్ ఫండ్' అని పిలుస్తున్నారు. ఖనిజాలు తవ్వుకోడానికి అనుమతులు ఇచ్చినందుకు ప్రతిఫలంగా ఉక్రెయిన్ పునర్నిర్మాణ నిధిని ఏర్పాటు చేస్తారు. ఈ నిధికి ఉక్రెయిన్–అమెరికా సమానంగా డబ్బులు సమకూర్చాల్సి ఉంటుంది. వాస్తవానికి రెండు నెలల క్రితమే ఈ ఒప్పందంపై సంతకాలు జరగాల్సి ఉండగా అనూహ్యంగా ఆగిపోయింది. అప్పట్లో వైట్‌హౌస్‌లో ట్రంప్, జెలెన్‌స్కీ మధ్య మీడియా సమక్షంలో తీవ్రస్థాయిలో వాగ్వాదం జరిగిన సంగతి తెలిసిందే. ఒకరిపై ఒకరు అరుచుకున్నారు. అప్పటి నుంచి జరిగిన ప్రయత్నాలు ఫలించి, ఒప్పందం కుదిరింది. అమెరికాతో ఈ ఒప్పందం పదేళ్లపాటు అమల్లో ఉంటుందని ఉక్రెయిన్ ప్రధానమంత్రి డెనిస్ షిమీహల్ చెప్పారు. ఖనిజాల తవ్వకం, ఆదాయంలో ఇరు దేశాలకు సమాన వాటా లభిస్తుందన్నారు.

మూర్ఖుడిగా ఉండదల్చుకోలేదు: ట్రంప్

ఉక్రెయిన్‌కు తాము ఇప్పటిదాకా ఇచ్చిన దానికంటే అధికంగా తిరిగి పొందబోతున్నామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పారు. ఆయన బుధవారం మీడియాతో మాట్లాడారు. పెట్టిన పెట్టుబడికి తగిన ప్రతిఫలం పొందలేని మూర్ఖుడిగా తాను ఉండదల్చుకోలేదని అన్నారు. ఒకచోట డబ్బు ఖర్చు పెట్టినప్పుడు లాభపడాల్సిందేనని పరోక్షంగా తేల్చిచెప్పారు. మరోవైపు ఒప్పందాన్ని ఉక్రెయిన్ ప్రభుత్వం స్వాగతించింది. ఇది సమానమైన, గొప్ప అంతర్జాతీయ ఒప్పందమని అభివర్ణించింది. భవిష్యత్తులో అమెరికా నుంచి సైనిక సాయం పొందడానికి ఇది కీలకంగా మారుతుందని ఆకాంక్షించింది. అమెరికాతో బంధం బలపడాలని కోరుకుంటున్నట్లు తెలిపింది. అమెరికాతో కలిసి ఒక నిధిని ఏర్పాటు చేయబోతున్నామని, తమ దేశంలోకి అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించడానికి ఈ నిధి దోహదపడుతుందని వెల్లడించింది.

కీలకాంశాలు..

ఉక్రెయిన్–అమెరికా ఖనిజ ఒప్పందంలో కొన్ని కీలకాంశాలు కనిపిస్తున్నాయి. ఉక్రెయిన్‌కు 350 బిలియన్ డాలర్లు ఇచ్చామని, ఆ సొమ్ము తిరిగి ఇవ్వాలని ట్రంప్ గతంలో డిమాండ్ చేశారు. కొత్త ఒప్పందం ప్రకారం.. ఆ డబ్బును ఉక్రెయిన్ తిరిగి ఇవ్వాల్సిన అవసరం లేదు. రష్యా పట్ల ఇన్నాళ్లూ సానుకూలంగా మాట్లాడిన అమెరికా స్వరంలో మార్పు వచ్చింది. యుద్ధాన్ని ముగించే దిశగా రష్యాపై ఒత్తిడి పెంచబోతోంది. రష్యాకు సహకరించేవారిపై కఠిన చర్యలు ఉంటాయని అమెరికా సంకేతాలిచ్చింది. ఖనిజాలను తవ్వుకొనే అవకాశం అమెరికాకు ఇచ్చినప్పటికీ వాటిపై యాజమాన్య హక్కులు ఉక్రెయిన్‌కే దఖలు పరిచారు. యూరోపియన్ యూనియన్(ఈయూ)లో చేరాలన్న ఉక్రెయిన్ ఆకాంక్షను అమెరికా ఇకపై అడ్డుకోదు. ఈయూతోపాటు ఇతర దేశాల నుంచి పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానం స్వీకరించడానికి అమెరికా సహకరిస్తుంది. అమెరికా నుంచి సైనిక సాయం యథాతథంగా కొనసాగే అవకాశం ఉంది. అయితే, ఉక్రెయిన్ భద్రతకు అమెరికా పూర్తి గ్యారంటీ ఇవ్వలేదు.

ఆ ఖనిజాలకు ఎందుకంత ప్రాముఖ్యం?

ఇతర దేశాల్లో లేని అరుదైన ఖనిజ నిల్వలకు ఉక్రెయిన్ కేంద్రంగా మారింది. లిథియం, గ్రాఫైట్, మాంగనీస్, టైటానియం వంటివి నిక్షిప్తమ య్యాయి. 34 కీలక ఖనిజాల్లో 23 రకాల ఖనిజాలు ఇక్కడ ఉన్నాయి. ఇది ఉక్రెయిన్‌ను ప్రపంచంలోనే విలువైన ఖనిజ వనరులు కలిగిన దేశంగా నిలబెట్టింది. ఆధునిక కాలానికి అవసరమైన ఎలక్ట్రిక్ వాహనాలు, విండ్ టర్బైన్‌లు, సౌర ఫలకాలు, శక్తి నిల్వ వ్యవస్థలతో పాటు ఎలక్ట్రానిక్ పరికరాలు, ఆయుధాల తయారీకి అవసరమైన లిథియం, కోబాల్ట్ వంటివి ఉక్రెయిన్‌లో పుష్కలంగా ఉన్నా యి. ఇక ముడి ఇనుము, టైటానియం, మాంగనీస్, యురేనియం, నియోడిమియం, డిస్ప్రోసి యం, నియోబియం, టాంటాలమ్, బెరీలియం, కోబాల్ట్, మాంగనీస్, జిర్కోనియం వంటి ఖనిజాలకు లోటులేదు. ఈ ఖనిజాల కోసం అమెరికా ప్రధానంగా చైనాపై ఆధారపడాల్సి వస్తోంది. అందుకే ఉక్రెయిన్‌లోని ఖనిజ వనరులను దక్కించుకోవడంపై దృష్టి పెట్టింది. ప్రపంచంలోని మొత్తం ఖనిజ వనరుల్లో 5 శాతానికిపైగా ఉక్రెయిన్‌లోనే ఉండడం గమనార్హం.

భారత్ వీడే పాక్ పౌరులకు మరింత గడువు

న్యూఢిల్లీ: భారత్‌లో ఉంటున్న పాక్ పౌరులకు కొంచెం ఉపశమనం కలిగింది. దేశం వీడేందుకు ఇచ్చిన గడువును కేంద్రం గురువారం సడలించింది. ఏప్రిల్ 30న సరిహద్దును మూసివేస్తామని గతంలో ఇచ్చిన ఆదేశాలను సవరిస్తున్నట్లు హోం శాఖ తెలిపింది. తదుపరి ఆదేశాలు వచ్చేవరకు వాఘా–అటారీ సరిహద్దు గుండా తిరిగి వెళ్లేందుకు అనుమతించింది. 'ఈ ఉత్తర్వులను సమీక్షించాం. తదుపరి ఆదేశాలు వచ్చే వరకూ పాక్ పౌరులు అటారీలోని ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్ట్ నుంచి భారత్ విడిచి పాకిస్తాన్‌కు వెళ్లొచ్చు'అని తాజా ఉత్తర్వుల్లో పేర్కొంది. కేంద్రం ఆదేశించిన ఆరు రోజుల్లో 55 మంది దౌత్యవేత్తలు, వారి సహాయక సిబ్బంది సహా 911 మంది పాకిస్తానీయులు అటారీ–వాఘా సరిహద్దు పోస్ట్ ద్వారా భారత్‌ను వీడారు. ఇక పాకిస్తాన్ నుంచి 1,617 మంది భారతీయులు స్వదేశానికి వచ్చారు. వీరిలో దీర్ఘకాలం వీసా కలిగిన 224 మంది ఉన్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. మరికొందరు విమానాశ్రయాల ద్వారా మూడో దేశం గుండా పాక్ వెళ్లిపోయారని అధికార వర్గాలు తెలిపాయి.

హఫీజ్ సయీద్‌కు మరింత పటిష్ట భద్రత

ఇస్లామాబాద్: లష్కరే తోయిబా చీఫ్ హఫీజ్ సయీద్ భద్రతను పాకిస్తాన్ ప్రభుత్వం మరింత కట్టుదిట్టం చేసింది. పహల్గాం ఉగ్రదాడి వెనుక మాస్టర్‌మైండ్ అతడేనని భారత దర్యాప్తు సంస్థలు నిర్ధారణకు వచ్చాయి. ఈ నేపథ్యంలో లాహోర్‌లోని సయీద్ ఇంటికి భద్రతను మరింత పెంచారు. పాక్ సైనిక దళాల సిబ్బంది నిత్యం పహారా కాస్తున్నారు. చుట్టుపక్కల గట్టి నిఘా ఏర్పాటు చేశారు. సయీద్ భద్రతను పాక్ ఆర్మీ, ఐఎస్ఐతోపాటు లష్కరే తోయిబా ఉమ్మడిగా పర్యవేక్షిస్తున్నట్లు సమాచారం. అతడు ఉంటున్న ఇంటికి చుట్టూ 4 కిలోమీటర్ల దాకా అత్యాధునిక సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అపరిచితులు అటువైపు రాకుండా చర్యలు తీసుకుంటున్నారు. సాధారణ పౌరులను సయీద్ ఇంటివైపు అనుమతించడం లేదు. చీమ చిటుక్కు మన్నా వెంటనే తెలిసిపోయేలా నిఘా వ్యవస్థను ఏర్పాటు చేశారు.

వరసగా ఏడో రోజూ పాక్ ఉల్లంఘన

జమ్మూ: జమ్మూకశ్మీర్‌లోని నియంత్రణ రేఖ వెంబడి గురువారం వరుసగా ఏడో రోజు పాక్ బలగాలు కవ్వింపు చర్యలకు పాల్పడ్డాయి. 22న పహల్గాంలో ఉగ్రదాడి అనంతరం రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు తీవ్రరూపం దాల్చిన తర్వాత మంగళవారం డైరెక్టర్స్ జనరల్ ఆఫ్ మిలటరీ ఆపరేషన్స్(డీజీఎంవోస్) స్థాయి అధికారులు హాట్‌లైన్‌లో మాట్లాడుకున్నారని ఆర్మీ తెలిపింది. ఆ తర్వాత సైతం కుప్వారా, బారాముల్లా, రాజౌరీ జిల్లాల్లోని పలు సెక్టార్లలో పాక్ బలగాలు కాల్పులకు తెగబడ్డాయని, తాము వేగంగా, దీటుగా బదులిచ్చామని ఆర్మీ తెలిపింది.

పెళ్లి నగలు స్త్రీ ధనమే

విడాకులైనా ఆమెకే సొంతం ● కేరళ హైకోర్టు కీలక తీర్పు

తిరువనంతపురం: పెళ్లి సమయంలో వధువుకు బహుమతిగా ఇచ్చే బంగారు నగలు, నగదుపై హక్కెవరిదనే అంశంపై కేరళ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. వాటిని స్త్రీ ధనంగా పరిగణించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. అవి పూర్తిగా ఆ మహిళకే చెందుతాయని, చట్టబద్ధమైన పూర్తి హక్కులు ఆమెకే ఉంటాయని జస్టిస్ దివాన్ రామచంద్రన్, జస్టిస్ ఎంబీ స్నేహలతల ధర్మాసనం తెలిపింది. విడాకుల తర్వాత పెళ్లినాటి బంగారు నగలపై మహిళకు ఎలాంటి హక్కులేదంటూ ఫ్యామిలీ కోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ ఎర్నాకులంలోని కలమస్సెరికి చెందిన మహిళ వేసిన పిటిషన్‌పై ఈ మేరకు తీర్పు వెలువరించింది. దురదృష్టవశాత్తూ భర్త, అత్తింటి వారు అలాంటి విలువైన ఆస్తులను బలవంతంగా స్వాధీనం చేసుకున్న అనేక సందర్భాలున్నాయని కూడా ధర్మాసనం ఈ సందర్భంగా వ్యాఖ్యానించింది. అనధికారికంగా చేతులు మారే ఇటువంటి ప్రైవేటు ఆస్తులపై తమకు హక్కుందని ప్రకటించుకునేందుకు అవసరమైన పత్రాలు మహిళల వద్ద ఉండవని, ఇలాంటి సందర్భాల్లో కోర్టులు విచక్షణను ఉపయోగించాల్సి ఉంటుందని తెలిపింది. 2010లో వివాహం సమయంలో పుట్టింటి వారు తమకు 63 సవర్ల బంగారంతోపాటు, రెండు సవర్ల గొలుసును, బంధువుల నుంచి అదనంగా మరో 6 సవర్ల ఆభరణాలు బహుమతిగా వచ్చాయని పిటిషనర్ తెలిపారు. వీటిలో మంగళసూత్రం, ఒక బంగారు గాజు, రెండు రింగులను మాత్రమే తనవద్ద ఉంచి మిగతా అన్నిటినీ భద్రత కోసమంటూ అత్తింటి వారు తీసుకున్నారని తెలిపారు. అదనంగా మరో రూ.5 లక్షలు డిమాండ్ చేయడంతో పుట్టింటికి వెళ్లగొట్టారని తెలిపారు. భర్త తన నగలను బ్యాంకులో ఉంచినట్లు తెలిపే పత్రాలను ఆమె కోర్టుముందుంచారు. పరిశీలించిన ధర్మాసనం 59.5 సవర్ల బంగారాన్ని లేదా మార్కెట్ విలువ ప్రకారం డబ్బు ఇవ్వాలని భర్తను ఆదేశించింది. బంధువులిచ్చిన నగలు, ఇతర విలువైన వస్తువులను కూడా ఇప్పించాలంటూ పిటిషనర్ చేసిన వినతిపై ధర్మాసనం.. తగు ఆధారాలు లేనందున తామేమీ చేయలేమని తెలిపింది.

అజ్మీర్ హోటల్‌లో అగ్నిప్రమాదం

- నలుగురు మృతి, పలువురికి గాయాలు
- కాపాడుకునేందుకు బిడ్డను మూడో అంతస్తు కిటికీ నుంచి తోసేసిన మహిళ

అజ్మీర్: రాజస్తాన్‌లోని అజ్మీర్‌లో ఓ హోటల్‌లో అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో నలుగురు మృతి చెందారు. పలువురు గాయపడ్డారు. అజ్మీర్‌లోని నాజ్ హోటల్‌లో గురువారం ఉదయం 8 గంటల సమయంలో మంటలు చెలరేగాయి. కొద్ది సేపట్లోనే హోటల్‌ను చుట్టుముట్టాయి. ఇద్దరు పురుషులు, ఒక మహిళ, నాలుగేళ్ల చిన్నారి సహా నలుగురు ఊపిరాడక, కాలిన గాయాలతో మరణించారు. హోటల్‌లో ఉన్నవాళ్లు తమ ప్రాణాలు కాపాడుకునేందుకు భవనం నుంచి దూకేందుకు ప్రయత్నించారు. ఇద్దరు వ్యక్తులు కిటికీ నుంచి దూకి ప్రాణాలు కాపాడుకున్నారు. ఓ మహిళ తన బిడ్డను కాపాడేందుకు హోటల్ కిటికీ మూడో అంతస్తు నుంచి కిందకు విసిరేసింది. చిన్నారికి స్వల్ప గాయాలయ్యాయి. ఆమె కూడా భవనంపై నుంచి దూకేందుకు ప్రయత్నించగా హోటల్‌లో ఉన్నవారు అడ్డుకున్నారు.

ఇరుకైన వీధిలో ఉండటంతో..

హోటల్ ఇరుకైన వీధిలో ఉండటంతో అగ్నిమాపక సిబ్బంది, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టడం సవాలుగా మారింది. హోటల్‌లో చిక్కుకున్న వారిని రక్షించే ప్రయత్నంలో పలువురు పోలీసు అధికారులు, అగ్నిమాపక సిబ్బంది స్పృహ తప్పి పడిపోయినట్లు సమాచారం. ఎట్టకేలకు రెస్క్యూ ఆపరేషన్ పూర్తయింది. ఘటన జరిగిన సమయంలో హోటల్లో 18 మంది ఉన్నారు. వీరంతా ఢిల్లీ నుంచి తీర్థయాత్ర కోసం అజ్మీర్‌కు వచ్చిన సందర్శకులు. షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగి ఉంటుందని ప్రాథమికంగా భావిస్తున్నారు. మంటలు చెలరేగడానికి ముందు పెద్ద పేలుడు శబ్దం వినిపించిందని, ఏసీ పేలి ఉంటుందని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ఎలక్ట్రిక్ ప్యానెల్ నుంచి మంటలు మొదలయ్యాయని, అది క్షణాల్లోనే పెద్దదైందని హోటల్ మేనేజర్ తెలిపారు. ఘటనపై విచారణకు ఆదేశించారు. ఇరుకైన ప్రదేశంలో హోటల్ ఉండటంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.



అలా ఎస్కేప్... ఇలా అరెస్టు!
నగరంలో నమోదైన కేసులో వాంటెడ్‌గా ఉన్న నేరగాడు ఉమర్‌ను పట్టుకోవడానికి సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు ఢిల్లీ వెళ్లారు. 48 గంటల్లో అతడిని పట్టుకున్నారు. -8లో



హాలిడే హాబీ.. సంగీతమే ట్రెండీ..
నగరంలో సంగీత వాద్యాలలో ప్రావీణ్యంపై ఆసక్తి పెరుగుతోంది. సెలవుల్లో మ్యూజిక్‌కి జై కొడుతున్నారు విద్యార్థులు. - సిటీప్లస్‌లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం
38.0/25.0
నగరంలో శుక్రవారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్టంగా 38, కనిష్టంగా 25 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది.





మే డే.. నాట్యమాడే!

శ్రామిక జీవన సౌందర్యానికి ప్రతీకగా నిలిచేది మే డే. ఈ సందర్భంగా గురువారం నగరంలో ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రవీంద్ర భారతిలో జరిగిన మే డే వేడుకల్లో సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి.

అయోమయం.. ఆగమాగం

బల్దియా పాలన గందరగోళం

- కమిషనర్‌తో పాటు కొందరు ఏసీలు, జడ్సీలూ కొత్తవారే
- పది నెలల వ్యవధిలో మారిన నలుగురు కమిషనర్లు
- సమస్యల్ని సృష్టిస్తోన్న ఈ తరహా వ్యవహారం
- రాజకీయ పరంగానూ విమర్శలకు తావు



సాక్షి, సిటీబ్యూరో: కోటి మందికిపైగా ప్రజలకు వివిధ సేవలు, నగరంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించాల్సిన జీహెచ్‌ఎంసీకి పది నెలల్లో నలుగురు కమిషనర్లుగా రావడంతో పరిస్థితి అయోమయంగా మారింది. పాలన గందరగోళంగా తయారైంది. పది నెలల వ్యవధిలో రోనాల్డ్‌రాస్, ఆమ్రపాలి, ఇలంబర్తి తర్వాత ప్రస్తుతం కర్ణన్ కమిషనర్‌గా వచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హయాంలో జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ను తరచూ మారుస్తుండటం రాజకీయంగా విమర్శలతో పాటు పాలన పరంగా సమస్యలు సృష్టిస్తోంది. ఒక కమిషనర్ తనదైన శైలిలో కార్యక్రమాలను పట్టాలెక్కించే లోపునే మారిపోతుండటంతో పరిస్థితి ఎప్పటికప్పుడు మొదటికి వస్తోంది. రోనాల్డ్‌రాస్ తర్వాత ఆమ్రపాలిని కమిషనర్‌గా నియమించినప్పుడు ఉన్నవారిలో సీనియర్ అయినందున నియమించినట్లు సీఎం అప్పట్లో విలేకరులతో ఓ సందర్భంలో చెప్పారు. ప్రస్తుతం సీనియారిటీకీ సైతం తిలోదకాలిచ్చారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రోనాల్డ్‌రాస్, ఆమ్రపాలి మారడానికి కారణాలున్నాయి కానీ ఇలంబర్తిని మార్చడానికి కారణాలంటూ కనిపించడం లేదు. పైపెచ్చు ఇప్పుడిప్పుడే తగిన చర్యలతో జీహెచ్‌ఎంసీలో క్రమశిక్షణతోపాటు, అవినీతికి అడ్డుకట్ట పడుతుందని భావిస్తున్న తరుణంలో ఉన్నట్లుండి మార్చడంతో ఎందుకిలా చేస్తున్నారో తెలియడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఆయన వస్తారో.. రారో..

- తనకంటే జూనియర్‌ను కమిషనర్‌గా నియమించడంతో ఆయన వద్ద అడిషనల్ కమిషనర్‌గా పని చేయలేననే తలంపుతో కిల్లు శివకుమార్ నాయుడు సెలవుపై వెళ్లినట్లు జీహెచ్‌ఎంసీ వర్గాల్లో వినిపిస్తోంది. ఆయన జీహెచ్‌ఎంసీకి వస్తారో.. రారో తెలియాలంటే కొన్ని రోజులు ఆగాల్సిందే. మరోవైపు, దీర్ఘకాలిక సెలవులో ఉన్న అడిషనల్ కమిషనర్ స్నేహ శబరీష్ తిరిగి విధుల్లో చేరారు. ఆమెకు ఇంకా బాధ్యతలు కేటాయించలేదు. ఆమె సెలవులో వెళ్లడంతో ఆమె బాధ్యతల్ని ఇతరులకు అప్పగించారు. వారు తమదైన ప్రణాళిక, లక్ష్యాలతో పనులు చేస్తున్నారు. తిరిగి వారికా విధులు తప్పిస్తే మళ్లీ గందరగోళమేననే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.
- ఒకవేళ.. శివకుమార్ నాయుడు జీహెచ్‌ఎంసీకి ఇక రాని పరిస్థితుల్లో ప్రస్తుతం ఆయన పరిధిలో ఉన్న విద్యుత్, చెరువులు, ఎస్‌ఎన్‌డీపీ, భూసేకరణ విభాగాలను స్నేహశబరీష్‌కు అప్పగించవచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో ఆమె వివిధ విభాగాలను సమర్థంగా నిర్వహించడంతో వీటిని ఆమెకు అప్పగిస్తారని భావిస్తున్నారు. లేని పక్షంలో మళ్లీ కొత్త గందరగోళాలు తలెత్తుతాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. శివకుమార్ నాయుడు వద్ద ఉన్న హౌసింగ్ విభాగాన్ని ఇప్పటికే నళినీ పద్మావతికి అప్పగించారు. బదిలీపై జీహెచ్‌ఎంసీకి తిరిగి వచ్చిన భోర్ఖడే హేమంత్ సహదేవ్ రావు శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు.

అభివృద్ధి, సంస్కరణలు జరుగుతున్నా..
మరోవైపు.. జీహెచ్‌ఎంసీలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనుల్ని సరిగా ప్రచారం చేసుకోలేకపోతున్నారనే విమర్శలున్నాయి. రెగ్యులర్ సీపీఆర్‌ఓ లేకపోవడంతో మొక్కుబడి ప్రకటనలు తప్ప జీహెచ్‌ఎంసీలో ఎన్నో సంస్కరణలు, కొత్త కార్యక్రమాలు ప్రవేశపెట్టినా తెలియడం లేదు. పైపెచ్చు తరచూ తప్పుడు సమాచారం అందుతోందనే ఆరోపణలున్నాయి. గతంలో సీపీఆర్‌ఓ కార్యాలయం సమర్థంగా పనిచేసేది. ప్రస్తుతం ఆ విభాగాన్ని గాలికి వదిలేశారని చెబుతున్నారు.

మిస్ వరల్డ్ పోటీలపై పై ప్రత్యేక శ్రద్ధ
'మిస్ వరల్డ్ -2025' పోటీలకు హైదరాబాద్ వేదిక కావడంతో అందరి చూపూ నగరంపై పడింది. ఈ నేపథ్యంలో వివిధ మార్గాల్ని, ఆయా ప్రాంతాల్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడంపై ప్రస్తుతం దృష్టి సారించారు. పోటీల్లో పాల్గొనే వారు చార్మినార్, లాడ్‌బజార్, చౌమహల్లా ప్యాలెస్, పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్, శిల్పారామం, ఫలక్‌నుమా ప్రాంతాలను సందర్శించనుండటంతో ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక లైటింగ్ తదితర ఏర్పాట్లు చేయనున్నారు.

స్తంభించిన మెట్రో సర్వీసులు

- ఎల్‌బీనగర్–మియాపూర్ రూట్‌లో సాంకేతిక సమస్య
- 20 నిమిషాల పాటు రైళ్ల రాకపోకలకు అంతరాయం

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో మెట్రో సర్వీసులు మరోసారి స్తంభించాయి. ఎల్‌బీనగర్- మియాపూర్ కారిడార్‌లో సాంకేతిక సమస్యల కారణంగా మెట్రో సేవలకు అంతరాయం ఏర్పడింది. గురువారం మధ్యాహ్నం సుమారు 20 నిమిషాల పాటు మెట్రో సేవలు నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. సిగ్నలింగ్‌లో తలెత్తిన సమస్యల కారణంగా మెట్రో రైళ్లు ఆగిపోయినట్లు అధికారులు తెలిపారు. కేవలం 9 నిమిషాల వ్యవధిలో సమస్యను పరిష్కరించినప్పటికీ రైళ్ల పునరుద్ధరణకు మరికొంత సమయం పట్టినట్లు పేర్కొన్నారు. మెట్రో సేవలకు అంతరాయం ఏర్పడడంతో ఎల్‌బీనగర్, ఎంజీబీఎస్, నాంపల్లి, అమీర్‌పేట్, మియాపూర్ తదితర స్టేషన్లలో ప్రయాణికుల రద్దీ పెరిగింది. మెట్రోల కోసం ప్రయాణికులు పడిగాపులు కాశారు. సేవలను పునరుద్ధరించినప్పటికీ రద్దీ కారణంగా ఎదురుచూపులు తప్పలేదు. మెట్రో రైళ్ల నిర్వహణలో తరచూ సాంకేతిక సమస్యలతో రైళ్లు నిలిచిపోవడంపై ప్రయాణికుల్లో అసహనం వ్యక్తమవుతోంది.

మెట్రో బాదుడే!

నష్టాలను అధిగమించే యోచన

- చార్జీల పెంపునకు కసరత్తు
- త్వరలో 20 శాతం వడ్డింపు



సాక్షి, సిటీబ్యూరో: త్వరలో మెట్రో చార్జీలు పెరగనున్నాయి. కొంతకాలంగా చార్జీలను పెంచేందుకు ఎల్‌అండ్‌టీ హైదరాబాద్ మెట్రోరైల్ కసరత్తు చేపట్టిన సంగతి తెలిసిందే. వరుస నష్టాలను అధిగమించేందుకు చార్జీల పెంపు అనివార్యంగా మారినట్లు అధికారులు అంచనాకు వచ్చారు. ప్రస్తుతం రూ.6,500 కోట్ల నష్టాలతో నగరంలో మెట్రో రైళ్లు నడుస్తున్నాయి. కొద్దిరోజులుగా ప్రయాణికుల రాకపోకల్లోనూ హెచ్చుతగ్గులు నమోదవుతున్నాయి. సగటున 5 లక్షల మంది ప్రయాణిస్తున్నట్లు అంచనా ఉన్నప్పటికీ తరచూ 4.8 లక్షల నుంచి 5 లక్షలలోపే ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

మహాలక్ష్మి ఎఫెక్ట్..
సిటీ బస్సుల్లో మహాలక్ష్మి పథకం కింద ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించడంతో చాలా మంది మహిళలు వాటివైపే మొగ్గు చూపుతున్నారు. విద్యార్థినులు, ఉద్యోగినులు సైతం మెట్రో నుంచి సిటీబస్సుల వైపు మళ్లినట్లు సమాచారం. ఎల్‌బీనగర్-మియాపూర్, నాగోల్- రాయదుర్గం కారిడార్‌లలో ప్రయాణికుల రద్దీ ఉన్నా జేబీఎస్-ఎంజీబీఎస్ రూట్‌లో వీరి సంఖ్య రోజురోజుకూ పడిపోతోంది. ఈ క్రమంలో నష్టాలను ఎదుర్కొనేందుకు చార్జీల పెంపు మినహా మరో గత్యంతరం కనిపించడం లేదని ఓ అధికారి తెలిపారు.

ప్రభుత్వ అనుమతితో..
నగరంలో 2017 నుంచి మెట్రో సేవలు అందుబాటులోకి వచ్చాయి. అప్పటినుంచి చార్జీలు పెంచలేదు. ఇదే సమయంలో బెంగళూరు, చెన్నై, ఢిల్లీలో రెండు నుంచి మూడుసార్లు చార్జీలు పెంచినట్లు అధికారులు పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలోనే చార్జీలను పెంచాలని ప్రతిపాదించినప్పటికీ అప్పట్లో ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం అంగీకరించలేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మెట్రో నష్టాలపై ఎప్పటికప్పుడు తెలియజేస్తూనే చార్జీల పెంపు కోసం అనుమతిని కోరారు. ఈ క్రమంలోనే తాజాగా ప్రభుత్వం నుంచి సూత్రప్రాయంగా అనుమతి లభించినట్లు తెలిసింది.

కొద్దిరోజుల్లోనే స్పష్టత..
ఇప్పుడున్న చార్జీలపై గరిష్ఠంగా 20 శాతం వరకు పెంచే యోచన ఉంది. ప్రస్తుతం కనిష్ఠంగా రూ.10, గరిష్ఠంగా రూ.60 వరకు మెట్రో చార్జీలు ఉన్నాయి. 20 శాతం పెంచితే రూ.15 నుంచి రూ.75 వరకు పెరిగే అవకాశముందని అధికారులు తెలిపారు. మెట్రో చార్జీలు ఏ మేరకు పెరగనున్నాయనే అంశంపై కొద్ది రోజుల్లోనే స్పష్టత రానుందని అధికారులు పేర్కొన్నారు. చార్జీల పెంపు వల్ల ఇప్పుడున్న నష్టాలను అధిగమించేందుకు కొంతవరకు ఊరట లభిస్తుందని భావిస్తున్నారు.

డిజిటల్ డిస్‌ప్లేకు నో

స్టాండింగ్ కమిటీ తిరస్కారం



సాక్షి, సిటీబ్యూరో: దుకాణాలు, బ్యాంకులు తదితర సంస్థలకు ఎల్‌ఈడీ డిజిటల్ స్టాటిక్ బోర్డుల ఏర్పాటుకు జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ బ్రేక్ వేసింది. ఈ ప్రతిపాదనకు స్టాండింగ్ కమిటీ ఆమోదించలేదు. గతంలో తిరస్కరించిన చెరువుల పునరుద్ధరణకు నామినేషన్‌పై 'నీరి'ని టెక్నికల్ కన్సల్టెంట్‌గా నియమించే ప్రతిపాదనను మళ్లీ పెండింగ్‌లో పెట్టింది. నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన గురువారం జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశం వివిధ రహదారుల విస్తరణకు సిఫారసు చేసింది. సమావేశంలో 9 అంశాలతో పాటు 2 టేబుల్ అంశాలకు ఆమోద ముద్ర వేసినట్లు మేయర్ తెలిపారు. అడిషనల్, జోనల్ కమిషనర్లు ఆయా విభాగాలకు సంబంధించిన టెండర్లు తదితర నిర్ణయాలన్నింటినీ స్టాండింగ్ కమిటీలో ఆమోదం పొందిన తర్వాతే చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆమోదం లేకుండా ఎలాంటి నిర్ణయాలు తీసుకోరాదని సూచించారు. సమావేశంలో కమిషనర్ కర్ణన్, స్టాండింగ్ కమిటీ సభ్యులు, ఆయా విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

జలమండలికి 'ఉత్తమ యాజమాన్యం' అవార్డు


సాక్షి, సిటీబ్యూరో: జలమండలికి అవార్డుల పరంపర కొనసాగుతోంది. ఇప్పటికే వరల్డ్ వాటర్ అవార్డు, ఉత్తమ ఎస్టీపీ పురస్కారాన్ని అందుకోగా.. తాజాగా మరో అవార్డును తన ఖాతాలో వేసుకుంది. తమ సంస్థలో పని చేస్తున్న కార్మికుల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, తీసుకుంటున్న చర్యలు, స్నేహ పూర్వక సంబంధాలకు గానూ ఉత్తమ యాజమాన్యం పురస్కారాన్ని అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. గురువారం రవీంద్ర భారతిలో జరిగిన కార్మిక దినోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా జలమండలి ఎండీ అశోక్ రెడ్డి అందుకున్నారు. ప్రభుత్వ విభాగాల్లో జలమండలికి మాత్రమే ఈ అవార్డు దక్కడం విశేషం. అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో బోర్డు డైరెక్టర్ (పర్సనల్) మహమ్మద్ అబ్దుల్ ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.



సీఎం చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న అశోక్ రెడ్డి

అందంగా.. సుందరంగా..

- త్వరలో మిస్ వరల్డ్ పోటీలు
- సన్నద్ధమవుతున్న నగరం



సాక్షి, సిటీబ్యూరో: నగర విశిష్టతల్లో తలమానికంగా చేరనున్న మరో ప్రతిష్టాత్మక అంతర్జాతీయ కార్యక్రమం 'మిస్ వరల్డ్ 2025' పోటీలు. ఇందులో భాగంగా నగరాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దనున్నారు. ఈ ప్రణాళికల్లో భాగంగా ఇప్పటికే నిర్వహణ ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. ఈ నెల 7 నుంచి 31 వరకు మిస్ వరల్డ్ పోటీలు జరగడం నగరానికే గర్వకారణం. ఇందులో భాగంగా పలు ప్రత్యేక ప్రాంతాల్లో క్రౌన్ రూపంలో ప్రతిమలు, లైటింగ్ ఎఫెక్టులు, అధునాతన హంగులను రూపొందించనున్నారు. మిస్ వరల్డ్ పోటీలు జరిగే ప్రధాన ప్రాంతమైన హైటెక్స్ వేదిక సమీప ప్రాంతాలను అంతర్జాతీయ ప్రముఖులు హౌరా అనేలా రమణీయంగా తీర్చిదిద్దుతున్నారు. పలు ప్రాంతాల్లో కళ్లు మిరుమిట్లుగొలిపే థీమ్ లైటింగ్ ఏర్పాటు చేయనున్నారు. హైటెక్ సిటీలోని దుర్గం చెరువు, ఏఎంబీ మాల్, గచ్చిబౌలి, రాయదుర్గం మెట్రో స్టేషన్ల వద్ద సెల్ఫీ పాయింట్లు, స్వాగత తోరణాలు ఏర్పాటు చేస్తున్నారు. ప్రత్యేకంగా నూతనంగా రూపొందించిన మిస్ వరల్డ్ లోగోను కూడా ఈ ప్రచారంలో వినియోగిస్తున్నారు.

సందడి చేయనున్న గ్లోబల్ సెలబ్రెటీలు..
మిస్ వరల్డ్ పోటీల నేపథ్యంలో దాదాపు 130 దేశాల నుంచి అంతర్జాతీయ ప్రముఖులు నగరానికి రానున్నారు. ఈ క్రమంలో ఎయిర్‌పోర్ట్ రోడ్‌లో 130 దేశాలకు చెందిన జాతీయ పతాకాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ అంతర్జాతీయ అతిథుల కోసం ఇప్పటికే ట్రైడెంట్ హోటల్‌ను నెల రోజుల పాటు ముందస్తుగానే బుక్ చేయడంతో పాటు పలు 5 స్టార్, 3 స్టార్ హోటళ్లను వినియోగించుకోనున్నారు. మాజీ ప్రపంచ సుందరీమణులు, గ్లోబల్ సినీ ప్రముఖులు, విదేశాంగ ప్రముఖులు ఇతర విభిన్న రంగాలకు చెందిన సెలబ్రెటీలు నగరానికి విచ్చేయనున్నారు. శుక్రవారం (ఈ నెల 2న) నగరంలోని హైటెక్స్ వేదికగా మిస్ వరల్డ్ పోటీలకు సంబంధించిన సమగ్ర వివరాలను వెల్లడించనున్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సినీనటుడు సోనూసూద్, మాజీ మిస్ ఇండియా నందినీ గుప్తా ముఖ్య అతిథులుగా వస్తున్నట్లు సమాచారం. 10న జరగనున్న ప్రారంభ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొననున్నారు.

పట్టుతప్పిన పౌర సేవలు

ఆర్టీఏ పదోన్నతుల్లో ప్రతిష్టంభన

- ఆరు నెలలుగా ఇన్‌చార్జిల పాలన
- సిబ్బందికి, ఎంవీఐలకు మధ్య కొరవడిన సమన్వయం
- కొన్నిచోట్ల అధ్వానంగా రవాణా కార్యకలాపాలు
- బహిరంగంగానే ఏజెంట్ల 'వ్యవహారాలు'
- అసిస్టెంట్లకు అడ్డాలుగా మారిన కార్యాలయాలు



సాక్షి, సిటీబ్యూరో: రవాణా శాఖలో పదోన్నతులపై ప్రతిష్టంభన నెలకొనడంతో గ్రేటర్‌లోని పలు ప్రాంతీయ రవాణా కార్యాలయాలు ఆరు నెలలకుపైగా ఇన్‌చార్జుల ఏలుబడిలో కొనసాగుతున్నాయి. దీంతో పౌరసేవల నిర్వహణలో వివిధ విభాగాల మధ్య సమన్వయం కొరవడింది. పరిపాలన అధికారులు, ఉద్యోగులకు, మోటారు వాహన తనిఖీ ఇన్‌స్పెక్టర్లకు నడుమ సమన్వయం లేకపోవడంతో పలుచోట్ల డ్రైవింగ్ లైసెన్సులు, వాహనాల రిజిస్ట్రేషన్లు, బదిలీలు, ఫిట్‌నెస్ పరీక్షలు, యాజమాన్య బదిలీ వంటి పలు సేవల్లో వాహన వినియోగదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. మరోవైపు అన్నిచోట్ల ఏజెంట్ల కార్యకలాపాలు బహిరంగంగా కొనసాగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

అసిస్టెంట్లకు అడ్డాలుగా..
వాహనదారులు ఆన్‌లైన్‌లో స్లాట్ నమోదు చేసుకొని ఫీజులు చెల్లించినప్పటికీ లెర్నింగ్ లైసెన్సులు, శాశ్వత డ్రైవింగ్ లైసెన్సులు, వాహనాల రిజిస్ట్రేషన్ల కోసం ఆర్టీఏ కార్యాలయాలకు స్వయంగా వెళ్లాల్సి ఉంటుంది. ఈ క్రమంలో ఏజెంట్ల ద్వారా వచ్చే ఫైళ్లు సత్వరమే పరిష్కారమవుతుండగా, స్వయంగా వెళ్లే వినియోగదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. కొన్ని ప్రాంతీయ రవాణా కార్యాలయాలు మధ్యవర్తులకు ప్రధాన అడ్డాలుగా మారాయి. జూనియర్, సీనియర్ అసిస్టెంట్లు నిర్వహించాల్సిన విధుల్లో వాళ్లకు అసిస్టెంట్లుగా వ్యవహరించే దళారులే స్వయంగా ఆఫీసుల్లో తిష్టవేసి పనులు కానిస్తున్నారని హబ్సిగూడకు చెందిన ఓ వాహనదారు విస్మయం వ్యక్తం చేశారు. ఆర్టీఓలు విధులు నిర్వహించే చోట ఇలా ఏజెంట్లు నేరుగా కార్యాలయాల్లో పాగా వేసే పరిస్థితి లేదు. ప్రాంతీయ రవాణా అధికారుల పర్యవేక్షణ లేని కొన్ని కార్యాలయాల్లో ఇష్టారాజ్యంగా మారింది.

కొర్రీలతో బెంబేలెత్తించి..
మరోవైపు కొన్ని రవాణా కేంద్రాల్లో దళారుల ప్రమేయం లేకుండా వెళ్లే వాహనదారులను సిబ్బంది రకరకాల కొర్రీలు పెట్టి ముప్పుతిప్పలు పెడుతున్నారు. ఇటీవల కూకట్‌పల్లి యూనిట్ కార్యాలయంలో కొత్త ద్విచక్ర వాహన రిజిస్ట్రేషన్ కోసం స్వయంగా వెళ్లిన వ్యక్తిని సిబ్బంది తీవ్ర ఇబ్బందులకు గురి చేశారు. వాహనానికి సంబంధించిన ఒరిజినల్ డాక్యుమెంట్లు సహా దరఖాస్తు స్వీకరించి రసీదు అందజేసి.. నాలుగు రోజులైనా ఎలాంటి సమాచారం లభించకపోవడంతో సదరు వాహనదారు అధికారులను సంప్రదించారు. చిరునామా ధ్రువీకరణ కోసం విద్యుత్ బిల్లు, అఫిడవిట్ వంటి ఆధారాలను అందజేసినప్పటికీ మ్యారేజ్ సర్టిఫికెట్ జత చేస్తే తప్ప ఫైల్‌ను అప్రూవల్ చేయలేమని చెప్పడంతో సదరు వాహనదారు విస్తుపోయారు. సాధారణంగా దళారుల ద్వారా వస్తే ఇలాంటి డాక్యుమెంట్‌లు అవసరం లేకుండానే పనులు పూర్తి చేసి పంపిస్తారు. కానీ స్వయంగా వెళ్లేవాళ్లకు మాత్రం ఇలాంటి కొర్రీలు తప్పడం లేదు.

అడ్రస్‌లు ఏమారుస్తారు..
కొన్ని ప్రాంతీయ రవాణా కార్యాలయాల్లో దళారులు యథేచ్ఛగా నకిలీ చిరునామాలను సృష్టించి డ్రైవింగ్ లైసెన్సులు, వాహనాల బదిలీలు, రిజిస్ట్రేషన్లు వంటి పనులు చేయిస్తున్నారు. తప్పుడు చిరునామాలపై ఏకంగా డ్రైవింగ్ లైసెన్సులు ఇవ్వడం, వాహనాల రిజిస్ట్రేషన్ చేయడంతో ప్రభుత్వం అందజేసే విలువైన డాక్యుమెంట్లు అసాంఘిక శక్తుల చేతుల్లోకి వెళ్లే ప్రమాదం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

ముగ్గురు సైబర్ నేరగాళ్లకు అరదండాలు

నిందితుల్లో అకౌంట్ సప్లయర్, ఇద్దరు హోల్డర్స్

సాక్షి, సిటీబ్యూరో: ఇన్వెస్ట్‌మెంట్ స్కామ్‌తో ముడిపడి ఉన్న రెండు వేర్వేరు కేసుల్లో సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. రూ.2.43 కోట్ల స్కామ్‌లో అకౌంట్ హోల్డర్, రూ.17.39 లక్షల స్కామ్‌లో అకౌంట్ సప్లయర్‌తో పాటు హోల్డర్‌ను పట్టుకున్నట్లు డీసీపీ దార కవిత గురువారం తెలిపారు. నగరానికి చెందిన వ్యక్తికి (56) సోషల్‌మీడియా ద్వారా సిమ్కో సెక్యూరిటీ పేరుతో ఉన్న అప్లికేషన్ లింకు వచ్చింది. దీనిని డౌన్‌లోడ్ చేసుకున్న ఆయన వివిధ బ్యాంకు ఖాతాలను అనుసంధానించి పెట్టుబడులు పెట్టాడు. తొలినాళ్లల్లో లాభాలు వచ్చినా.. చివరికి రూ.2.43 కోట్లు నష్టపోవాల్సి వచ్చింది. ఈ మొత్తం డిపాజిట్ చేసిన తర్వాత విత్‌డ్రా చేసుకునే అవకాశం లేకుండా పోయింది. ఆపై ఆ అప్లికేషనే పని చేయలేదు. దీంతో తాను మోసపోయినట్లు గ్రహించిన బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. దర్యాప్తు చేపట్టిన అధికారులు బాధితుడి నగదులో కొంత మహారాష్ట్రకు చెందిన గుర్జోత్ సింగ్ ఖాతాలోకి వెళ్లినట్లు గుర్తించారు. అతడిని అరెస్టు చేసిన పోలీసులు విచారణ నేపథ్యంలో కమీషన్లకు ఆశపడి సోషల్‌మీడియా ద్వారా పరిచయమైన సైబర్ నేరగాళ్లకు తన ఖాతా వివరాలు ఇచ్చినట్లు గుర్తించారు. అతడిపై తెలంగాణలో రెండు, దేశ వ్యాప్తంగా 16 కేసులు ఉన్నట్లు తెలిపారు. నగరానికి చెందిన మరో వ్యక్తికి (40) ఫేస్‌బుక్ మెసెంజర్ ద్వారా కీర్తి రఘురామ్ అని చెప్పుకున్న మహిళ పరిచయం ఏర్పడింది. తాను దుబాయ్‌లో ఉంటానని, సాఫ్ట్‌వేర్ డెవలపర్ అని నమ్మబలికింది. ఇన్ఫోబైట్ ఐటీ సొల్యూషన్స్ వెబ్‌సైట్ ద్వారా పెట్టుబడులు పెడితే 70 శాతం లాభాలు వస్తాయని నమ్మించింది. తొలినాళ్లల్లో లాభాలు ఇచ్చినా చివరకు రూ.17.39 లక్షలు కాజేసింది. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. బాధితుడి నగదులో కొంత పూణేకు చెందిన మనీష్ దినేష్ సోనావానే ఖాతాలోకి వెళ్లినట్లు గుర్తించారు. అక్కడికి వెళ్లిన బృందం అతడిని పట్టుకోగా... తన బ్యాంకు ఖాతా వివరాలను పుణేకే చెందిన రోనాల్డ్ విన్సెంట్‌కు ఇచ్చి కమీషన్లు తీసుకున్నట్లు అంగీకరించాడు. ఇతడి ద్వారా ఆ వివరాలు ప్రధాన సూత్రధారులకు వెళ్లాయి. నగర సైబర్ క్రైమ్ పోలీసులు రోనాల్డ్‌ను సైతం అరెస్టు చేశారు.

అలా ఎస్కేప్... ఇలా అరెస్టు!

- ఢిల్లీలో సైబర్ నేరగాడిని పట్టుకున్న పోలీసులు
- తెలంగాణ భవన్ నుంచి తప్పించుకున్న ఉమర్
- సవాల్‌గా తీసుకున్న సిటీ సైబర్ క్రైమ్ కాప్స్
- స్థానిక పోలీసుల సహకారం లేకుండానే పట్టివేత



సాక్షి, సిటీబ్యూరో: నగరంలో నమోదైన కేసులో వాంటెడ్‌గా ఉన్న నేరగాడిని పట్టుకోవడానికి సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు ఢిల్లీ వెళ్లారు. సాంకేతిక ఆధారాలతో నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. కోర్టులో హాజరుపరిచి నగరానికి తీసుకువచ్చేందుకు తెలంగాణ భవన్‌లో ఉంచారు. అదను చూసుకున్న అతగాడు పోలీసుల నుంచి ఎస్కేప్ అయ్యాడు. హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు దీనిని సవాల్‌గా తీసుకున్నారు. ఢిల్లీ పోలీసులు కేసు నమోదు చేసినప్పటికీ.. వారి సహాయం లేకుండానే 48 గంటల్లో పట్టుకున్నారు. గత నెలలో జరిగిన ఈ ఎపిసోడ్ ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్‌లో నిందితుడిగా...

ఎస్సార్ నగర్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి (55) గత ఏడాది డిసెంబర్ 1న సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేశాడు. ఆన్‌లైన్ ద్వారా తనకు ఎర వేసిన సైబర్ నేరగాళ్లు తాము చెప్పినట్లు ఇన్వెస్ట్‌మెంట్స్ చేస్తే భారీ లాభాలు ఉంటాయని చెప్పారని, వారి మాటలు నమ్మిన తాను తొలినాళ్లల్లో లాభపడినా చివరకు రూ.72.4 లక్షలు కోల్పోయానని అందులో పేర్కొన్నాడు. 2024 సెప్టెంబర్-నవంబర్ మధ్యలో ఆ స్కామ్ జరిగినట్లు పోలీసుల దృష్టికి తీసుకువెళ్లాడు. దీని ఆధారంగా కేసు నమోదు చేసుకున్న అధికారులు సాంకేతికంగా దర్యాప్తు చేపట్టారు. ఢిల్లీలోని జామియానగర్‌లో ఫుడ్ డెలివరీ బాయ్‌గా పని చేస్తున్న మహ్మద్ ఉమర్, షహీన్‌బాగ్‌కు చెందిన విద్యార్థి ఇంతియాజ్ అహ్మద్ ఈ నేరంలో పాలు పంచుకున్నట్లు గుర్తించారు.

పీటీ వారెంట్ తీసుకున్నాక పరారీ...

ఈ నిందితులను అరెస్టు చేయడానికి సైబర్ క్రైమ్ ఠాణా ఇన్‌స్పెక్టర్ ఎస్.నరేష్ నేతృత్వంలోని బృందం గత నెల మూడో వారంలో ఢిల్లీ వెళ్లింది. ఏప్రిల్ 19న ఇద్దరు నిందితుల ఆచూకీ కనిపెట్టిన అధికారులు వారిని అరెస్టు చేశారు. మరుసటి రోజు అక్కడి సాకెట్‌లోని కోర్టులో హాజరుపరిచి హైదరాబాద్ తరలించడానికి ప్రిజనర్స్ ట్రాన్సిట్ (పీటీ) వారెంట్ తీసుకున్నారు. ఆ రోజు రైలు టిక్కెట్లు దొరక్కపోవడంతో మరుసటి రోజుకు (ఏప్రిల్ 21న) బుక్ చేసుకున్నారు. నిందితులిద్దరినీ తెలంగాణ భవన్‌కు తరలించిన పోలీసులు అక్కడి రూం నం.304లో బస చేశారు. అదే రోజు రాత్రి అదను చూసుకుని ఉమర్ పోలీసు కస్టడీ నుంచి పరారయ్యాడు. తెల్లవారుజామున ఒంటి గంట ప్రాంతంలో కాలకృత్యాలు తీసుకోవడానికంటూ వెళ్లిన ఉమర్.. ఎస్కార్ట్ కానిస్టేబుల్‌ను తోసేసి పారిపోయాడు.

పట్టువదలకుండా గాలింపు

దీంతో అప్రమత్తమైన పోలీసులు అతడి కోసం గాలించినా ఫలితం లేకపోవడంతో తిలక్‌మార్గ్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఉమర్‌పై మరో కేసు నమోదైంది. ఢిల్లీ ఠాణాలో కేసు నమోదైనప్పటికీ.. తమ కస్టడీ నుంచి పారిపోయిన నిందితుడిని తామే పట్టుకోవాలని నగర పోలీసులు భావించారు. హైదరాబాద్‌లో ఉన్న బృందం సాంకేతిక సహకారం అందించగా... ఢిల్లీలోని టీమ్ క్షేత్రస్థాయిలో గాలించింది. ఎట్టకేలకు 48 గంటల్లో ఉమర్ ఆచూకీ కనిపెట్టి పట్టుకోగలిగింది. ఆపై నగరానికి తీసుకువచ్చి కోర్టులో హాజరుపరిచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. ఢిల్లీలోని తిలక్‌మార్గ్ ఠాణాలో నమోదైన కేసులో అక్కడి పోలీసులు త్వరలో పీటీ వారెంట్‌పై తరలించనున్నారు. ఉమర్, అహ్మద్‌ను ప్రధాన సూత్రధారులకు బ్యాంకు ఖాతాలు అందించడంలో కీలకంగా వ్యవహరించారని పోలీసులు చెబుతున్నారు.

ఏపీకే ఫైల్ పంపి నగదు స్వాహా

– సిటీ సైబర్ ఠాణాలో కేసు నమోదు

సాక్షి, సిటీబ్యూరో: పార్శిల్ డెలివరీ అడ్రస్ మార్చడానికి కొరియర్ సంస్థ కస్టమర్ కేర్ నంబర్ కోసం ఆన్‌లైన్‌లో వెతికిన నగరవాసి సైబర్ నేరగాళ్ల వలకు చిక్కాడు. బాధితుడితో ఆండ్రాయిడ్ ప్యాకేజ్ కిట్ (ఏపీకే) ఫైల్ డౌన్‌లోడ్ చేయించిన కేటుగాళ్లు రూ.1.18 లక్షలు స్వాహా చేశారు. ఈ మేరకు గురువారం కేసు నమోదు చేసుకున్న సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. నగరానికి చెందిన రిటైర్డ్ ఉద్యోగికి (70) బ్లూడార్ట్ సంస్థ నుంచి కొరియర్ రావాల్సింది. అయితే అనివార్య కారణాల నేపథ్యంలో ఆ పార్శిల్ డెలివరీ అడ్రస్ మార్చాలని భావించాడు. దీనికోసం సదరు కొరియర్ సంస్థ కస్టమర్ కేర్ నెంబర్ కోసం గూగుల్‌లో వెతికారు. అందులో కనిపించిన ఓ నెంబర్ నిజమైనదిగా భావించి కాల్ చేశారు. అప్పుడు స్పందన లేనప్పటికీ కొద్దిసేపటికి బ్లూ డార్ట్ కొరియర్ సర్వీసెస్ ప్రతినిధి పేరుతో ఓ వ్యక్తి ఫోన్ చేశాడు. అతడి మాటలు నమ్మిన బాధితుడు డెలివరీ చిరునామా మార్చమని కోరాడు. ఆ పని చేయడానికి తమకు ఆన్‌లైన్ ద్వారా రూ.1 చెల్లించాలని చెప్పాడు. అలా చెల్లించే అవకాశం లేదంటూ నగరవాసి అతడికి చెప్పాడు. అలా అయితే తాము వాట్సాప్ ద్వారా ఓ లింకు పంపిస్తామని, దాని ఆధారంగా చెల్లింపులు చేయాలని కోరాడు. ఆపై బాధితుడి వాట్సాప్‌కు సపోర్ట్.కామ్.ఏపీకే అనే ఫైల్ వచ్చింది. ఆ లింకు తెరిచిన బాధితుడు అందులో కోరినట్లు తన ఆధార్ కార్డు కాపీని అప్‌లోడ్ చేశారు. ఏపీకే ఫైల్ కారణంగా ఫోన్ మొత్తం నేరగాళ్ల ఆధీనంలోకి వెళ్లిపోయింది. దానంతట అదే రెండుసార్లు స్విచ్చాఫ్ అయ్యింది. బాధితుడి ఫోన్‌ను ఏపీకే ఫైల్ ద్వారా యాక్సస్ చేసిన నేరగాళ్లు నెట్ బ్యాంకింగ్, ఇతర యూపీఐ యాప్స్ ఆధారంగా రూ.1,18,999 స్వాహా చేశారు. ఇది జరిగిన కొద్దిసేపటికి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి బాధితుడి ఖాతాలోకి రూ.40.71 జమ అయినట్లు, బ్యాలెన్స్ రూ.507.60 ఉన్నట్లు సందేశం వచ్చింది. తన ఖాతాలో ఉండాల్సిన మొత్తం మాయమైనట్లు గుర్తించిన బాధితుడు బ్యాంకును సంప్రదించగా రెండు అనధికార లావాదేవీల ద్వారా ఈ మొత్తం పోయిందని తెలిసింది. దీంతో ఆయన సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది.

సైబర్ మోసాలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్టు

బంజారాహిల్స్: నకిలీ సిమ్‌కార్డులను ఉపయోగించి సైబర్ నేరాలకు పాల్పడుతున్న ఓ వ్యక్తిని వెస్ట్‌జోన్ సైబర్ సెల్ సహాయంతో బంజారాహిల్స్ పోలీసులు అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి..తాడేపల్లిగూడెం ప్రాంతానికి చెందిన షేక్ మున్వర్ బాషా సిమ్ ప్రమోటర్‌తో పాటు ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో అతనికి కేటాయించిన డెమో సిమ్‌కార్డులను నకిలీ చిరునామాలతో ఉపయోగించి సైబర్ మోసాలకు పాల్పడుతున్నట్లుగా పోలీసులు గుర్తించారు. ఓఎల్ఎక్స్ వినియోగదారులను లక్ష్యంగా చేసుకుని ముఖ్యంగా ఐఫోన్ మొబైల్స్‌కు సంబంధించి ప్రకటలు ఇచ్చిన వారి వివరాలను సేకరిస్తారు. ఆ వివరాల ఆధారంగా ఆ ప్రకటనను తమ సొంత ప్రకటనగా మార్చుకుని మళ్లీ పోస్ట్ చేస్తాడు. ఫోన్‌ను కొనుగోలు చేయాలనుకునేవారు సదరు ప్రకటనను చూసి కాల్ చేస్తే మున్వర్, అతని అనుచరులు ఫోన్ ద్వారా సమన్వయం చేసుకుంటారు. ఫోన్ కొనాలనుకునే వ్యక్తిని, అసలైన ఫోన్ యజమానిని ఒక చోటకు వచ్చేలా చేస్తారు. ఫోన్ కొనుగోలు చేసిన వ్యక్తి ఆన్‌లైన్‌లో చెల్లించిన మొత్తం మున్వర్‌బాషా అకౌంట్‌లోకి రాగానే ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి అదృశ్యమవుతారు. ఇలా పలువురిని మోసం చేశారు. మున్వర్ రెండు తెలుగు రాష్ట్రాల్లో మూడు వేర్వేరు మొబైల్ నెంబర్లను ఉపయోగించి 14 నేరాలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. ఈ మేరకు అతడిని అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు.

సైబర్ నేరంలో దోషికి జైలు

సాక్షి, సిటీబ్యూరో: గతంలో పని చేసిన సంస్థ సర్వర్‌లోకి అక్రమంగా ప్రవేశించి, కీలక డేటాను అనధికారికంగా సేకరించి, దుర్వినియోగం చేసిన కేసులో దోషికి న్యాయస్థానం శిక్ష విధించింది. ఎస్ఐఎస్ ఇన్ఫోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ ఫిర్యాదు మేరకు నమోదైన కేసులో ఏడాది సాధారణ జైలు శిక్ష, రూ.25 వేల జరిమానా విధించినట్లు అధికారులు గురువారం తెలిపారు. న్యూ నల్లకుంటకు చెందిన అనసూయ వేమూరి 1994–2005 మధ్య ఎస్ఐఎస్ సంస్థలో ఎడిటోరియల్ సర్వీసెస్ చీఫ్ మేనేజర్‌గా పని చేశారు. ఆ సమయంలో తనకు ఉన్న యాక్సస్‌లను సంస్థను విడిచిపెట్టిన తర్వాత వినియోగించుకున్నారు. ఈ రకంగా సంస్థకు చెందిన కీలక డేటాను అనధికారికంగా యాక్సస్ చేసి దుర్వినియోగం చేశారు. దీనిపై సంస్థ 2009 జనవరిలో సీసీఎస్ ఆధీనంలోని సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ కేసులో నేరం నిరూపణ కావడంతో అనసూయకు కోర్టు శిక్ష విధించింది.

మహిళలే జట్టుకట్టి..

సెంట్రింగ్ దొంగల ముఠా ఆటకట్టు

- రూ.7లక్షల విలువైన సామగ్రి, రెండు ఆటోలు స్వాధీనం
- ఆరుగురు మహిళలతో సహా ఆటో డ్రైవర్ అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న మియాపూర్ ఏసీపీ శ్రీనివాస్ కుమార్



స్వాధీనం చేసుకున్న సామగ్రి, ఆటోలు

మియాపూర్: భవన నిర్మాణాల వద్ద విలువైన సామగ్రి, సెంట్రింగ్ వస్తువుల చోరీకి పాల్పడుతున్న మహిళల ముఠాను మియాపూర్ పోలీసులు అరెస్ట్ చేసి వారి నుంచి రూ.7లక్షల విలువైన అల్యూమినియం సెంట్రింగ్ సామగ్రి, రెండు ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. గురువారం మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరు సమావేశంలో మియాపూర్ ఏసీపీ శ్రీనివాస్ కుమార్, ఇన్‌స్పెక్టర్ క్రాంతి కుమార్, డీఐ రమేష్ నాయుడుతో కలిసి వివరాలు వెల్లడించారు. సైదాబాద్‌లోని సింగరేణి కాలనీకి చెందిన ముడావత్ పద్మ, నెనావత్ విజయ, బిల్లావత్ లక్ష్మీ, నెనావత్ అమృత, సభావత్ సునిత, వాడిత్య అనిత, ఆటోడ్రైవర్ నెనావత్ చందర్ ముఠాగా ఏర్పడి రాత్రి వేళల్లో భారీ భవన నిర్మాణ సముదాయాల వద్ద సెంట్రింగ్ సామగ్రి, ఇతర విలువైన వస్తువుల చోరీకి పాల్పడుతున్నారు. వీరిలో ఒకరు ఉదయం వేళల్లో కాలనీల్లో తిరుగుతూ సెక్యూరిటీ లేని భవనాలను ఎంచుకుని ముఠా సభ్యులకు సమాచారం అందిస్తారు. రాత్రి అందరూ కలిసి ట్రాలీ ఆటోలో తాము ఎంచుకున్న భవనం వద్దకు చేరుకుంటారు. అదను చూసుకుని సెంట్రింగ్ సామగ్రి, ఇతర విలువైన వస్తువులను ఆటోలో వేసుకుని తరలించేవారు. అనంతరం దానిని అమ్మి సొమ్ము చేసుకుంటారు. గత నెల 19న వీరు అర్ధరాత్రి మియాపూర్‌లోని ఓ భవనం వద్ద అల్యూమినియం సెంట్రింగ్ సామగ్రి చోరీకి పాల్పడ్డారు. భవన యజమాని ఫిర్యాదు మేరకు మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. సమీపంలోని సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా నిందితులు పద్మ, విజయ, లక్ష్మీ, అమృత, సునిత, అనిత, చందర్‌లను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించారు. ముడావత్ పద్మపై 16, విజయపై 7, అమృతపై 1, సునిత 2 కేసులున్నట్లు తెలిపారు. వీరు గతంలో జైలుకు వెళ్లి వచ్చినా తమ వైఖరి మార్చుకోకుండా చోరీలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన పోలీసులు రూ.7లక్షల సెంట్రింగ్ సామగ్రి, రెండు ఆటోలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

కొహెడలో భూ వివాదం

- ఇరువర్గాల ఘర్షణ
- నలుగురికి గాయాలు
- కేసు నమోదు చేసిన పోలీసులు

హయత్‌నగర్: ఓ భూ వివాదానికి సంబంధించి ఇరువర్గాలకు చెందిన వ్యక్తులు పరస్పరం దాడి చేసుకున్న ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. హయత్‌నగర్ పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కొహెడ సర్వే నంబర్ 951, 952లోని సుమారు 7.5 ఎకరాల భూమిని గ్రామానికి చెందిన కంగుల రాములు, పోచయ్యతో పాటు మరికొందరి నుంచి కంగుల గండయ్య, ఈదయ్య జీపీఏ చేసుకున్నారు. అనంతరం 1970లో సదరు స్థలంలో 170 ప్లాట్లు చేసి విక్రయించారు. అయితే ఈ జీపీఏ చెల్లదంటూ కంగుల కుటుంబానికి చెందిన వారసులు, ఇదే భూమిని 2013లో బ్రాహ్మణపల్లికి చెందిన సంరెడ్డి బాల్‌రెడ్డికి విక్రయించారు. ఆయన కొంత విస్తీర్ణంలో ఫాంహౌస్‌తో పాటు చుట్టూ ప్రహరీ నిర్మించారు. ఈ నేపథ్యంలో 2014 నుంచి ప్లాట్ల యజమానులు, బాల్‌రెడ్డికి మధ్య వివాదం కొనసాగుతోంది. దీనిపై ప్లాట్ల యజమానులు కోర్టును ఆశ్రయించగా 28 మార్చి 2025న జిల్లా న్యాయస్థానం వీరికి అనుకూలంగా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. వీటి ఆధారంగా ప్లాట్ల యజమానులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. దీంతో లే అవుట్ రోడ్లను ఆక్రమించి ఫాంహౌస్ నిర్మించారనే కారణంతో రెండు నెలల క్రితం హైడ్రా అధికారులు ఫాంహౌస్ చుట్టూ ఉన్న ప్రహరీని కూల్చేశారు. దీనిని సవాలు చేస్తూ బాల్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించడంతో హైడ్రా, పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులు ఇందులో జోక్యం చేసుకోవద్దని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఇదిలా ఉండగా కొంతమంది ప్లాట్ల ఓనర్లు గురువారం తమ స్థలాలను చదును చేసుకునేందుకు జేసీబీ తీసుకుని వెళ్లారు. దీనిని గమనించిన బాల్‌రెడ్డి, అతడి అనుచరులు దిలీప్‌రెడ్డి, శీలం శ్రీను తదితరులు ప్లాట్ల యజమానులైన సత్యనారాయణరెడ్డి, పండుగల వెంకటేశ్, నవీన్‌రెడ్డి, బద్రి అశోక్, రఘు వెంకట్‌రెడ్డితో వాగ్వాదానికి దిగారు. బాల్‌రెడ్డి వర్గం వారు రాళ్లు, కర్రలు, గడ్డి కత్తిరించే కత్తితో దాడి చేయడంతో సత్యనారాయణరెడ్డి, నవీన్, వెంకటేశ్‌కు గాయాలయ్యాయి. వీరి ప్రతిఘటనతో బాల్‌రెడ్డికి సైతం గాయాలయ్యాయి. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

హస్తంలో.. పదవుల కుస్తీ!

- కాంగ్రెస్ పార్టీ డివిజన్, బ్లాక్, మండల, జిల్లా పదవులకు పోటాపోటీ
- ఏళ్లుగా పార్టీనే నమ్ముకున్న వారికే సముచిత స్థానం కల్పించాలని డిమాండ్
- పాత, కొత్త నేతల మధ్య కుదరని సయోధ్య

సాక్షి, రంగారెడ్డిజిల్లా: కాంగ్రెస్‌లో పదవుల పందేరం మొదలైంది. జిల్లా ఏళ్లుగా పార్టీ జెండాను నమ్ముకుని పని చేస్తున్న నాయకులు ప్రభుత్వ నామినేటెడ్ పోస్టులతో పాటు పార్టీ మండల, డివిజన్, మున్సిపాలిటీ, జిల్లా స్థాయి పదవులు 'చే'జిక్కించుకునేందుకు ఎవరికి వారుగా ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఇందుకోసం తమకు తెలిసిన ముఖ్య నేతలతో సిఫార్సులు చేయిస్తున్నారు. ఇప్పటికే ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ పీసీసీ, డీసీసీ కార్యవర్గ సభ్యులతో సమావేశం నిర్వహించారు. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడంతో పాటు ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. ఈ క్రమంలో నిరుత్సాహంలో ఉన్న కేడర్‌కు నామినేటెడ్ పదవులను కట్టబెట్టి కొంత బూస్టింగ్ ఇవ్వాలని అధిష్టానం భావిస్తోంది. ఇందులో భాగంగా గురువారం రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని శంషాబాద్‌లో పార్టీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించింది. పార్టీ పరిశీలకులు సమావేశానికి హాజరై ముఖ్య నేతల అభిప్రాయాలు సేకరించారు. గ్రామ, మండల, మున్సిపాలిటీ, జిల్లా కమిటీ ఎంపికలో సామాజిక సమీకరణలు, సమర్థత గీటురాయిగా తీసుకోనున్నట్లు తెలిసింది. ఈనెల 20లోగా ఈ మొత్తం ప్రక్రియ పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు సమాచారం.

డీసీసీ పీఠం కోసం పోటాపోటీ

పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత సంస్థాగతంగా అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, చేవెళ్ల ఎమ్మెల్యేలు కారు దిగి హస్తం గూటికి చేరుకున్నారు. ఎమ్మెల్యేలతో పాటు అనుచర వర్గం సైతం వచ్చి చేరింది. పదేళ్లుగా బీఆర్ఎస్‌లో పని చేసి, కాంగ్రెస్ కేడర్‌ను అనేక విధాలా ఇబ్బందులకు గురి చేసినవారు పార్టీలోకి వలసరావడాన్ని సగటు కార్యకర్త జీర్ణించుకోలేకపోతున్నాడు. క్షేత్రస్థాయిలో కలిసి పని చేయలేని పరిస్థితి నెలకొంది. మీనాక్షినటరాజన్ ఇటీవల గాంధీభవన్ వేదికగా చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ముఖ్య నేతలతో ఏర్పాటు చేసిన సమావేశంలోనూ ఇదే అభిప్రాయం వ్యక్తమైంది. పాత, కొత్త నేతలను సమన్వయం చేయాల్సిన డీసీసీ ముఖ్యనేత ఈ విషయంలో చేతులెత్తేశారన్న విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో డీసీసీకి కొత్త బాస్‌ను నియమించనున్నారనే ప్రచారం కూడా ఉండటంతో ఈ పోస్టును దక్కించుకునేందుకు జిల్లాలోని పలువురు సీనియర్లు పోటీపడుతున్నారు. ఇప్పటికే తెలిసిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర పార్టీ ముఖ్య నేతలతో పైరవీలు ప్రారంభించారు.

పార్టీ, ప్రభుత్వ నామినేటెడ్ పోస్టులపై సీనియర్ల కన్ను

సమావేశానికి కీలకనేతల డుమ్మా

సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేయడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు గురువారం శంషాబాద్‌లోని కేఎల్‌సీసీ ఫంక్షన్‌హాల్‌లో పార్టీ విస్తృతస్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశానికి భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, నాగర్‌కర్నూలు ఎంపీ మల్లురవి, శాసనమండలి చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి గైర్హాజరయ్యారు. ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డి, జిల్లా పార్టీ పరిశీలకులు శివసేనరెడ్డి, సంతోష్, ధన్‌సింగ్, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, టీపీసీసీ ప్రచార కమిటీ అధ్యక్షుడు మధుయాష్కీగౌడ్, మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్ మాత్రమే హాజరయ్యారు. బీఆర్ఎస్‌ను వీడి ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి గాంధీ, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య సహా వారి అనుచరవర్గం కూడా సమావేశానికి హాజరు కాకపోవడం చర్చనీయాంశంగా మారింది. సమావేశానికి హాజరైన మెజార్టీ నేతలు ఇతర పార్టీల నుంచి వలస వచ్చిన వారికంటే ఏళ్లుగా పార్టీనే నమ్ముకుని పని చేస్తున్న సీనియర్ నాయకులకు పదవులు కట్టబెట్టాలని విజ్ఞప్తి చేశారు.

క్రికెట్ బెట్టింగ్ ముఠా అరెస్ట్



పోలీసుల అదుపులో నిందితులు

కవాడిగూడ: ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ పాల్పడుతున్న వ్యక్తులను సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్, దోమలగూడ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. దోమలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని హిమాయత్‌నగర్ స్ట్రీట్ నెంబర్ 8 పవని లింగయ్య అపార్ట్‌మెంట్‌లో క్రికెట్ ఆన్‌లైన్ బెట్టింగ్ పాల్పడుతున్న సమాచారం అందడంతో దాడి చేసిన పోలీసులు హిమాయత్‌నగర్‌కు చెందిన శ్రీరాజ్‌బూబ్, చిక్కడపల్లికి చెందిన సాయినాథ్, రేగళ్ల గోపీనాథ్‌లను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.1.2 లక్షల నగదు, మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నడి రోడ్డుపై కారు దగ్ధం



హయత్‌నగర్: రోడ్డుపై వెళుతున్న కారులో నుంచి ఒక్కసారిగా మంటలు రావడంతో దగ్ధమైన సంఘటన గురువారం హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. యాదాద్రి జిల్లా ఎలిమినేడు గ్రామానికి చెందిన వేణుగోపాల్‌రెడ్డి రేనాల్ట్ క్విడ్ కారులో భార్యతో కలిసి నగరానికి వస్తున్నాడు. హయత్‌నగర్ అంబేడ్కర్ సర్కిల్ సమీపంలో కారు ఇంజిన్‌లో నుంచి మంటలు వచ్చాయి. అప్రమత్తమైన వేణుగోపాల్‌రెడ్డి అతడి భార్య కారు దిగారు. క్షణాల్లో మంటలు వ్యాపించి కారు పూర్తిగా దగ్ధమైంది. ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పి వేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సీపీకి చెప్పి కేసు పెట్టిస్తా

- నా ఇష్టం వచ్చినట్లు బైక్ నడుపుతా
- అడగడానికి నీవెవరు
- హోంగార్డుపై వాహనదారుడి వీరంగం
- నార్సింగి పోలీసులకు ఫిర్యాదు

మణికొండ: నా వాహనం నా ఇష్టం వచ్చినట్టు నడుపుతా.. అడగడానికి నీవెవరు... హైదరాబాద్ పోలీస్ కమిషనర్(సీపీ)కు చెప్పి నీపై కేసు పెట్టిస్తా.. అంటూ ఓ ద్విచక్రవాహన దారుడు నార్సింగి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న హోం గార్డుపై వీరంగం సృష్టించిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నార్సింగి పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. గత నెల 29న నార్సింగి ట్రాఫిక్ హోంగార్డు రహమతుల్లా బండ్లగూడ చౌరస్తాలో విధులు నిర్వహిస్తున్నాడు. అదే సమయంలో రిలయన్స్ స్మార్ట్ మాల్ పక్కనున్న కాలనీ నుంచి ఓ వ్యక్తి బైక్‌పై మెయిన్ రోడ్డు పైకి వచ్చాడు. అయితే ఆ సమయంలో ట్రాఫిక్ ఎక్కువగా ఉండటంతో సైడ్ రూట్‌లో వెళ్లాలని హోంగార్డు అతడికి సూచించాడు. దీంతో ఆగ్రహానికి లోనైన అతను నేను ఎవరనుకుంటున్నావు.? నన్నే ఆపుతావా.? అంటూ హోంగార్డును బూతులు తిట్టాడు. అంతటితో ఆగకుండా హైదరాబాద్ సీపీకి చెప్పి నీపై కేసు పెట్టిస్తా.. అంటూ మొబైల్‌లో సీపీ నెంబర్ చూపి బెదిరించాడు. అతను వెళ్లగానే అతడి కుమారుడు వచ్చి మరో మారు హోంగార్డును అసభ్యంగా దూషించాడు. దీంతో హోంగార్డ్ రహమతుల్లా గురువారం నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు వాహనం నెంబర్ ఆధారంగా నిందితులను గుర్తించేందుకు చర్యలు చేపట్టారు.

బైక్ ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి



కేపీహెచ్‌బీకాలనీ: ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై రోడ్డు దాటుతున్న ఓ గుర్తు తెలియని వ్యక్తిని వేగంగా దూసుకొచ్చిన ఓ ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలకు గురైన ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ మౌనికా రెడ్డి సమాచారం మేరకు... కేపీహెచ్‌బీ కాలనీ రోడ్లపై తిరుగాడే ఓ గుర్తు తెలియని వ్యక్తి బుధవారం అర్ధరాత్రి 12:40 గంటల సమయంలో ఫోరం మాల్ ఎదురుగా ఉన్న ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై రోడ్డు దాటుతుండగా హైటెక్ సిటీ నుంచి జేఎన్‌టీయు వైపు వేగంగా దూసుకువచ్చిన ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. దీంతో గుర్తు తెలియని వ్యక్తి తలకు తీవ్ర గాయాలు కాగా అక్కడికక్కడే మృతి చెందాడు. డయల్ 100 ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించి ద్విచక్ర వాహనదారుడు అనిల్‌ను అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేపట్టారు. గుర్తు తెలియని వ్యక్తి ఆచూకీ, ఇతర వివరాలను తెలుసుకునేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిపై పోలీసులకు ఫిర్యాదు

హస్తినాపురం: ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తనను బెదిరిస్తున్నాడని అతనిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతూ కాంగ్రెస్ నాయకుడు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి గురువారం వనస్థలిపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇటీవల హస్తినాపురం కార్పొరేటర్ సుజాతనాయక్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు ఎల్‌బీనగర్ పోలీస్‌స్టేషన్ లో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైందని, సుజాతనాయక్‌కు తాను అండగా ఉంటున్నానని ఎమ్మెల్యే కోపంగా కోపంగా ఉన్నాడన్నారు. గురువారం తాను వనస్థలిపురంలో గ్రంథాలయసంస్థ భవన నిర్మాణ భూమిపూజ కార్యక్రమానికి హాజరుకాగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తన అనుచరులతో కలిసి దాడికి యత్నించాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎమ్మెల్యే నుంచి తనకు ప్రాణహాని ఉందని రక్షణ కల్పించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

చిన్నారుల సందడి



శ్రీనగర్‌కాలనీ: చిన్నారులు ఆడుతూ, పాడుతూ తాజా సమ్మర్ ఫ్రూట్స్‌ని తింటూ సందడి చేశారు. గురువారం మోతీనగర్ సంస్కార్ ది లైఫ్ స్కూల్‌లో ప్రీ ప్రైమరీ స్కూల్ సమ్మర్ క్లోజింగ్ డే సెలబ్రేషన్స్ ఘనంగా నిర్వహించారు. చిన్నారులు సమ్మర్ ఫ్రూట్స్‌ని కట్ చేసి తింటూ ఆహ్లాదంగా గడిపారు. అనంతరం ఫ్యాన్సీ డ్రస్సులతో, అదిరేటి గెటప్స్‌తో అలరిస్తూ సమ్మర్‌కి స్కూల్‌కి బైబై చెప్పి హాలీడేస్‌కి వెల్‌కల్ పలుకుతూ అలరించారు. స్కూల్ సీఈఓ మోహనవంశీ, డైరెక్టర్ మధుమతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీసీ ఉమెన్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షురాలిగా దీపాదేవి



ఫిలింనగర్: జాతీయ బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ ఉమెన్స్ వింగ్ ఉపాధ్యక్షురాలిగా బంజారాహిల్స్ రోడ్డునెంబర్–2లోని ఇందిరానగర్ బస్తీకి చెందిన సి.దీపాదేవిగౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు నేషనల్ బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఆమెకు నియామకపత్రాన్ని అందజేశారు. బీసీల అభ్యున్నతికి ఆమె చేస్తున్న కృషికి గుర్తింపుగా ఈ పదవి లభించింది.

బైక్ దొంగ అరెస్టు

వెంగళరావునగర్ : ద్విచక్ర వాహనాన్ని దొంగిలించిన ఓ యువకుడిని పోలీసులకు అప్పగించిన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. బేగంపేటకు చెందిన కె.శివ ఆటో డ్రైవర్. ఈ నెల30న అర్ధరాత్రి కార్మికనగర్ వచ్చి బేగంపేటకు వెళ్తుండగా మధురానగర్ మెట్రోస్టేషన్ సమీపంలో ఓ యువకుడు ద్విచక్ర వాహనాన్ని తోసుకుంటూ వెళ్తున్నాడు. శివ సాయం కావాలా అని అడగ్గా పెట్రోలు అయిపోయింది, కొద్దిదూరం తోయమని చెప్పాడు. దీంతో శివ తన ఆటో నడుపుతూ ద్విచక్ర వాహనాన్ని ఓ కాలితో తోస్తూ వెళ్తుండగా బైక్‌కు తాళం లేకపోవడాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు వచ్చి వివరాల ఆరా తీయగా సదరు బైక్ దొంగిలించినట్లు గుర్తించి అరెస్టు చేశారు.

సన్న బియ్యం సంబురం

ప్రారంభమైన సన్న బియ్యం పంపిణీ

- గత నెల ఎన్నికల కోడ్ కారణంగా నిలిచిన సన్నం బియ్యం
- హర్షం వ్యక్తం చేస్తున్న మహిళలు
- తొలి రోజే బారులు తీరిన లబ్ధిదారులు



ఫిలింనగర్‌లో సన్నబియ్యం కోసం రేషన్ షాపుల వద్ద బారులు తీరిన లబ్ధిదారులు

బంజారాహిల్స్: సన్న బియ్యం పంపిణీతో మహిళల ముఖాల్లో సంతోషం కనిపించింది. గురువారం అన్ని రేషన్ షాపుల్లో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. గత నెల హైదరాబాద్ జిల్లా ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా కోడ్ అడ్డంకితో సన్న బియ్యం పంపిణీ నిలిచిపోయింది. ఏప్రిల్ 25న కోడ్ ముగియడంతో మే 1వ తేదీ నుంచి హైదరాబాద్‌లో సన్న బియ్యం పంపిణీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దీంతో రేషనింగ్ ఖైరతాబాద్ సర్కిల్–7 పరిధి కిందకు వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజిగూడ, ఖైరతాబాద్, యూసుఫ్‌గూడ, రహ్మత్‌నగర్, ఎర్రగడ్డ, బోరబండ, వెంగల్‌రావునగర్, అమీర్‌పేట్, సనత్‌నగర్ డివిజన్ల పరిధిలోని 81 షాపుల్లో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో చేపట్టారు. ఎక్కడికక్కడ ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రేషనింగ్ ఖైరతాబాద్ సర్కిల్–7 పరిధిలోని 81 రేషన్ దుకాణాల్లో ఉదయం నుంచే బియ్యం కోసం లబ్ధిదారులు బారులు తీరారు. సర్కిల్ పరిధిలో మొత్తం తెల్లరేషన్ కార్డులు 79,531, అంత్యోదయ అన్నయోజన కార్డులు 3481, అన్నపూర్ణ కార్డులు 1, కలుపుకొని మొత్తం 83,013 కార్డులు ఉన్నాయి. వీటి పరిధిలో 2,92,282 మంది లబ్ధిదారులు ఉన్నారు. కార్డులోని ప్రతి ఒక్కరికి ఆరు కిలోల చొప్పున ఉచిత సన్నబియ్యం పంపిణీ చేపడుతున్నారు. ప్రతినెలా సర్కిల్ పరిధిలో 18 లక్షల 19 వేల 11 వేల కిలోల బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారు. ఇదిలా ఉండగా కొత్తగా మంజూరైన కార్డుదారులకు కూడా రేషన్ బియ్యం పంపిణీ జరిగింది.

సన్న బియ్యం ఇస్తుండటం ఆనందంగా ఉంది..



రేషన్ షాపులో సన్న బియ్యం తీసుకున్నాం. వండిన తర్వాత తెలుస్తుంది ఎలా ఉన్నాయో అని. చూసేందుకు మాత్రం చాలా బాగుతున్నాయి. ప్రభుత్వం రేషన్ షాపుల్లో సన్న బియ్యం ఇవ్వడం ఆనందంగా ఉంది.

సన్న బియ్యం ఇస్తున్నారని తెలుసుకొని వచ్చా..



ఖరీదైన సన్న బియ్యం రేషన్ షాప్‌లో ఉచితంగా ఇవ్వడం సంతోషంగా ఉంది. రేషన్ షాపుల సన్న బియ్యం ఇస్తున్నారని తెలుసుకొని వచ్చా. బియ్యం కూడా బాగున్నాయి. సన్నం బియ్యం కొనాలంటే దుకాణంలో మస్తు పైసలు అయితయ్.

ఇది వరకు బియ్యం జిగురుగా ఉండేవి..



ఇది వరకు రేషన్ షాపులో ఇచ్చే దొడ్డు బియ్యం వండితే జిగురుగా ముద్దుగా అయ్యేది. మేం ఆ బియ్యాన్ని తినలేక అమ్ముకోవడమో లేక పిండి పట్టించుకొని పిండి వంటల్లో వాడుకోవడానికో వాడుకునేవాళ్ళం. కానీ ఇప్పుడు సన్నం బియ్యం ఇస్తున్నారు కాబట్టి వాటిని తినేందుకు వాడుకుంటాం.

అక్రమ నిర్మాణాల సీజ్



ఓయూ కాలనీలో అక్రమ నిర్మాణాన్ని సీజ్ చేసిన జీహెచ్‌ఎంసీ అధికారులు



జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్–45లో సీజ్ చేసిన టౌన్‌ప్లానింగ్ సిబ్బంది

బంజారాహిల్స్: జీహెచ్‌ఎంసీ సర్కిల్–18 పరిధి కిందికి వచ్చే షేక్‌పేట ఓయూ కాలనీలోని ప్లాట్‌నెంబర్–555లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని హైకోర్టు ఆదేశాల మేరకు జూబ్లీహిల్స్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు నిర్మాణంలో ఉన్న అక్రమ భవనాన్ని గురువారం సీజ్ చేశారు. సిల్ట్ ప్లస్ 2 ఫ్లోర్లకు మాత్రమే అనుమతులు తీసుకున్న భవన యజమాని నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు లేకుండా జీ ప్లస్ 4 అంతస్తులతో పాటు పెంట్‌హౌస్ నిర్మించాడు. జీహెచ్‌ఎంసీ షోకాజ్ నోటీసులు జారీ చేసినప్పటికీ సదరు ప్లాట్ యజమాని పి.నారాయణరెడ్డి బేఖాతర్ చేస్తూ అనధికారిక ఫ్లోర్లను నిర్మించాడు. ఈ అక్రమ నిర్మాణంపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదంటూ హైకోర్టు తప్పుబట్టింది. తక్షణమే ఈ అనధికారిక నిర్మాణాలనుసీజ్ చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. దీంతో టౌన్‌ప్లానింగ్ ఏసీపీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సంబంధిత అధికారులు ఈ అక్రమ భవనాన్ని సీజ్ చేశారు.

జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్–45లో..

జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్–45లో జీహెచ్‌ఎంసీ అక్రమంగా నిర్మించిన భవనాన్ని జూబ్లీహిల్స్ సర్కిల్–18 టౌన్‌ప్లానింగ్ అధికారులు సీజ్ చేశారు. రోడ్డు నెంబర్–45లోని ప్లాట్‌నెంబర్–875/1లో సదరు ప్లాట్ యజమాని నిబంధనలు ఉల్లంఘించి మూడో అంతస్తు నిర్మించాడు. టౌన్‌ప్లానింగ్ అధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేసినా సదరు యజమాని బేఖాతర్ చేశాడు. దీంతో హైకోర్టు జీహెచ్‌ఎంసీ తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. అక్రమ నిర్మాణంపై ఎందుకు చర్యలు తీసుకోలేదంటూ ప్రశ్నించింది. దీంతో జూబ్లీహిల్స్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ ఏసీపీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సంబంధిత అధికారులు ఈ అక్రమ భవనాన్ని సీజ్ చేశారు.

వారినే ఆర్టీఐ కమిషనర్లుగా ఎంపిక చేయాలి

పంజగుట్ట: సమాచార కమిషనర్లను ఏ రాష్ట్రంలో అయినా స్క్రీనింగ్ కమిటీ, సెర్చ్ కమిటీ వారు సూచించిన పేర్లను మాత్రమే పరిగణలోకి తీసుకుంటారని, కాని తెలంగాణ రాష్ట్రంలో పార్టీలకు అనుకూలంగా ఉన్న వారిని ఎంపిక చెయ్యడం సరికాదని సమాచార హక్కు సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవులపల్లి కార్తిక్ రాజు అన్నారు. ఇప్పటికే పలువురిని ఎంపికచేసి వారి పేర్లతో కూడిన జాబితాను గవర్నర్ కార్యాలయానికి పంపినట్లు సమాచారం ఉందని వెంటనే ఆ జాబితాను నిలిపివేయాలని గురువారం గవర్నర్ కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చినట్లు పేర్కొన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పూర్తిస్థాయి సెలెక్షన్ కమిటీ లేకుండానే ప్రతిపక్ష నేతలు హాజరు కాకుండానే, సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్ ప్రకారం స్క్రీనింగ్ కమిటీ, సెర్చ్ కమిటీ వారు సూచించిన పేర్లను కాకుండా పార్టీకి అనుబంధంగా ఉన్నవారిని నియమిస్తే వారు పారదర్శకంగా ఎలా పనిచేస్తారని ప్రశ్నించారు. ఎంపిక కాబడినవారిలో ఒకరు గాంధీభవన్ పీఆర్‌ఓ, మరొకరు ముఖ్యమంత్రి పీఆర్‌ఓ, మరొకరు ఒక పార్టీ నుంచి కౌన్సిలర్‌గా గెలుపొంది పూర్తిస్థాయి అధికారాన్ని అనుభవించిన వ్యక్తి, అనేక రాజకీయ పార్టీలతో సంబంధాలు కలిగిన వ్యక్తిగా ఉన్నారని ఆరోపించారు.

మే నెలంతా పొగాకు వ్యతిరేక అవగాహన దినోత్సవాలు

పంజగుట్ట: సాధారణ క్యాన్సర్ వచ్చే దానికన్నా పొగాకు వాడే వారికి 30 శాతం అధికంగా క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని పలువురు ప్రముఖ వైద్యులు పేర్కొన్నారు. మే 31న ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని డాక్టర్ ఓ.ఎస్.రావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మే నెల మొత్తం పొగాకు వ్యతిరేక అవగాహన దినోత్సవాలుగా చేస్తున్న నేపథ్యంలో పొగాకు ఉత్పత్తుల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దంత వైద్యులు డాక్టర్ ఓ.నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గాంధీ ఆసుపత్రి అడ్మినిస్ట్రేషన్ హెచ్‌ఓడీ డాక్టర్ కె.టి.రావు, ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ వింధ్య వాసి, ఈఎండీటీ వైద్యులు డాక్టర్ చిట్టిబాబులు పాల్గొని మాటాఈలడారు. పొగాకు పొడిని ముక్కు ద్వారా పీలుస్తారని, గుట్కా రూపంలో నములు తారని, సిగిరెట్ రూపంలో తాగుతారని ఈ మూడు పద్ధతులు ఎంతో ప్రమాదమన్నారు. ఈ సమావేశంలో మ్యూజిక్ డైరెక్టర్ బల్లెపల్లి మోహన్, కుసుమ భోగరాజు తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ ఒత్తిడి మేరకే కులగణన



రాహుల్‌గాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఆళ్ల

హిమాయత్‌నగర్: పాదయాత్ర చేసి కేంద్ర ప్రభుత్వంపై రాహుల్ గాంధీ ఒత్తిడి తీసుకువచ్చిన నేపథ్యంలోనే మోదీ ప్రభుత్వం జనగణనతో పాటు కులగణన కూడా ప్రకటించారని జాతీయ ఓబీసీ ఇంటలెక్చువల్ ఫోరం అధ్యక్షుడు ఆళ్ల రామకృష్ణ పేర్కొన్నారు. గురువారం ఫోరం ఆధ్వర్యంలో హైదర్‌గూడ కూడలిలోని జ్యోతిరావు పూలే దంపతుల విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రాహుల్ గాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆళ్ల మాట్లాడుతూ.. కులగణన ప్రాముఖ్యతని ప్రజలకు వివరిస్తూ రాహుల్ గాంధీ కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు, మణిపూర్ నుంచి ముంబై వరకు వేలాది కిలోమీటర్ల పాదయాత్రతోనే కేంద్రం తలొగ్గిందన్నారు. బీసీ ఆజాద్ వికాస చైర్మన్ బత్తుల సిద్దేశ్వర పటేల్, కాంగ్రెస్ సీనియర్ నేత రామన్ గౌడ్, బీసీ సంఘాల నేతలు పాల్గొన్నారు.

ఆకృతి ఎగ్జిబిషన్ ప్రారంభం

సాక్షి,సిటీబ్యూరో: నగరంలోని తాజ్ కృష్ణ హోటల్‌లో ఆకృతి ఎలైట్ ఎగ్జిబిషన్‌ను ఆకృతి ఎగ్జిబిషన్ డైరెక్టర్ సశినాథ గురువారం ప్రారంభించారు. ఈ ఎగ్జిబిషన్ ఈనెల 1 నుంచి మే 3 వరకు కొనసాగుతుందని ఆయన వెల్లడించారు.



తాగునీటి కేంద్రాలు ప్రారంభం

సాక్షి ఎఫెక్ట్..

బంజారాహిల్స్: ప్రజల దాహార్తి తీర్చాల్సిన తాగునీటి కేంద్రాలు తాళాలు వేసి కనిపిస్తున్నాయంటూ వాటి పరిస్థితిపై 'దాహం తీర్చని కేంద్రాలు'శీర్షికన రెండు రోజుల క్రితం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి జలమండలి అధికారులు స్పందించారు. గురువారం బంజారాహిల్స్ రోడ్ నెం.10లోని తాగునీటి కేంద్రాన్ని జలమండలి డీటీపీ అమరేందర్‌రెడ్డి, సీజీఎం ప్రభు, జీఎం హరి శంకర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీటీపీ అమరేందర్‌రెడ్డి మాట్లాడుతూ..నగరంలో ఉన్న 42 తాగునీటి కేంద్రాలను అందుబాటులోకి తెస్తున్నట్లు వీటి ద్వారా రెండు నెలల పాటు పాదచారులకు, వాహనదారులకు ఉచితంగా తాగునీటిని అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బంజారాహిల్స్ డీజీఎం షీలారాణి, మేనేజర్ శివ పాల్గొన్నారు.



బసవతారకం కేన్సర్ ఆస్పత్రి వద్ద ఉచిత తాగునీటి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జలమండలి డీటీపీ అమరేందర్‌రెడ్డి

పిల్లలకు క్రీడలు.. పెద్దలకు యోగా

హైదరాబాద్‌లోని 5 స్టేడియాల్లో వేసవి శిబిరాలు

శ్రీనగర్‌కాలనీ: ఈ ఏడాది వేసవి శిక్షణ శిబిరాల్లో తొలిసారిగా పిల్లల తల్లిదండ్రులకు జుంబా డ్యాన్స్, యోగాలో ఉచితంగా శిక్షణ, పిల్లలకు ఆయా క్రీడల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు యూసుఫ్‌గూడలోని కోట్ల విజయ్‌భాస్కర్‌రెడ్డి (కేవీబీఆర్) ఇండోర్ స్టేడియం ఆఫీసర్ అలెగ్జాండర్ ఫ్రాన్సిస్ తెలిపారు. జంట నగరాల్లోని గచ్చిబౌలి, కేవీబీఆర్, ఎల్బీ, సరూర్‌నగర్, సైక్లింగ్ వ్యాలీ డ్రోమ్ స్టేడియాల్లో ఈ సౌకర్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. గురువారం కేవీబీఆర్ స్టేడియంలో వేసవి శిక్షణ శిబిరాన్ని జూబ్లీహిల్స్ కాంగ్రెస్ నాయకుడు నవీన్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అలెగ్జాండర్ మాట్లాడుతూ కేవీబీఆర్‌లో శిక్షణ శిబిరాలకు మంచి స్పందన ఉందని తెలిపారు. గతంలో పిల్లలకు బాస్కెట్‌బాల్, బ్యాడ్మింటన్, జిమ్నాస్టిక్స్, స్కేటింగ్, కరాటే, బాక్సింగ్‌లలో ఉదయం పూట మాత్రమే శిక్షణ ఉండేదని, ఈ ఏడాది ఉదయం, సాయంత్రం వేళల్లోనూ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. మొదటిసారిగా రెండు పూటలా వైద్య నిపుణులను అందుబాటులో ఉంచుతున్నట్లు పేర్కొన్నారు. తొలిరోజు శిక్షణ శిబిరాలకు 150 మందిపైగా పిల్లలకు హాజరయ్యారని తెలిపారు.

పేదలందరికీ రేషన్ కార్డులు ఇచ్చిన ఘనత వైఎస్సార్‌దే



ఫిలింనగర్‌లో సన్న బియ్యం పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దానం

బంజారాహిల్స్: ఒకప్పుడు అతి తక్కువ మందికి మాత్రమే రేషన్ కార్డులు ఇచ్చేవారని కానీ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో ప్రతి పేద కుటుంబానికి రేషన్ కార్డులు ఇచ్చారని మాజీ మంత్రి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ గుర్తు చేశారు. గురువారం భగత్‌సింగ్ కాలనీ రేషన్ షాపు వద్ద ప్రభుత్వం ఏర్పాటుచేసిన సన్నబియ్యం పథకాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..వైఎస్సార్ ముందుచూపుతో రేషన్ కార్డు ఉన్న వారందరికీ ఆరోగ్యశ్రీని కల్పించడం వల్ల కొన్ని లక్షల కుటుంబాలకు మేలు జరిగిందన్నారు. అందుకే ఇప్పుడు తమ ప్రభుత్వం కూడా పేదలను గుర్తించి వారందరికీ రేషన్ కార్డులు అందిస్తున్నామన్నారు. పేదింటవారు కూడా ధనవంతులు తినే సన్న బియ్యాన్ని తినాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ సన్నబియ్యం పథకాన్ని తీసుకొచ్చిందని ఈ పథకంతో ప్రతి ఇంట్లో పండుగ వాతావరణం ఉంటుందని అన్నారు. రేషనింగ్ ఇన్‌స్పెక్టర్ శంకర్, రేషన్ షాపు డీలర్ శ్రీనివాసులు, ఫిలింనగర్ 18 బస్తీల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మామిడి నర్సింగ్‌రావు, భగత్‌సింగ్ కాలనీబస్తీ అధ్యక్షుడు సహదేవ్, పద్మ పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల్లో సత్తా చాటిన నిహిత



అవార్డులు అందుకున్న విద్యార్థులు

ఫిలింనగర్: శ్రీఅరబిందో వార్షిక చరిత్ర వ్యాసరచన పోటీల్లో జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌కు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థిని నిహిత బోజెడ్ల రెండో బహుమతి గెలుచుకుంది. ఈ పోటీల్లో వివిధ రాష్ట్రాల నుంచి 1500 మందికి పైగా విద్యార్థులు పాల్గొనగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుంచి గెలిచిన ఏకైక విద్యార్థినిగా నిహిత నిలిచింది. ఇటీవల బెంగళూరులోని గ్రీన్‌పార్క్ హోటల్‌లో జరిగిన బహుమతుల పంపిణీ కార్యక్రమంలో బెంగళూరు దక్షిణ నియోజకవర్గం ఎంపీ తేజస్వి సూర్య ఆమెను సత్కరించి, ట్రోఫీ, నగదు పురస్కారం, సర్టిఫికెట్‌ను అందజేశారు. జూబ్లీహిల్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు మురళీముకుంద్ ఈ సందర్భంగా ప్రతిభ చాటిన నిహితను ప్రశంసించారు. ప్రిన్సిపాల్ కాంచనవల్లి విజేతను అభినందించారు.

ఘనంగా కార్మిక దినోత్సవం



ఎల్వీప్రసాద్ ఆస్పత్రి ముందు జెండా ఎగురవేస్తున్న కార్మికులు



బోరబండలో మాట్లాడుతున్న బాబా ఫసియుద్దీన్



కల్యాణ్‌నగర్‌లో డాక్టర్ పీవీ రవిశేఖర్‌రెడ్డి, కార్మిక నేత సాయి శేషగిరి

ప్రపంచ కార్మిక దినోత్సవ వేడుకలు గురువారం వాడవాడలా ఘనంగా జరిగాయి. ఎర్రచొక్కాలు ధరించిన కార్మికులు ఎర్ర జెండాలు చేతబట్టుకొని కదం తొక్కారు. ఆస్పత్రులు, హోటళ్లు, క్లబ్‌లు, మాల్స్, దుకాణాలు తదితర ప్రాంతాల వద్ద కార్మికులు జెండాలు ఎగురవేసి తమ ఐక్యతను చాటుకున్నారు. కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి అనే నినాదాలతో ఆయా ప్రాంతాలు దద్దరిల్లాయి. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, పంజగుట్ట, ఖైరతాబాద్, సోమాజిగూడ, ఇందిరానగర్, శ్రీనగర్ కాలనీ, శ్రీకృష్ణానగర్ ప్రాంతాల్లో ఎర్ర జెండాలతో కార్మిక దినోత్సవ వేడుకలు అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి.

– బంజారాహిల్స్ జోన్ బృందం



జెండా ఆవిష్కరిస్తున్న ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్



హిమాయత్‌నగర్‌లో మేడే సందర్భంగా ప్రదర్శన నిర్వహించిన కార్మికులు



ఇందిరానగర్‌లో ఫెడరేషన్ కార్యాలయం వద్ద..



నిమ్స్‌లో జరిగిన మేడే ఉత్సవాల్లో మాట్లాడుతున్న డైరెక్టర్ బీరప్ప

సాక్షి
శుక్రవారం । 2 । మే । 2025

నగరంలో నేడు

- శ్రీనగర్‌కాలనీలోని శ్రీసత్యసాయి నిగమాగమంలో ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు నేషనల్ సిల్క్ ఎక్స్‌పో అందుబాటులో ఉంటుంది. ఈ ప్రదర్శనలో డైరెక్ట్ వీవర్స్ 50 శాతం రాయితీపై అమ్మకలు నిర్వహించనున్నారు.
- నాంపల్లి తెలుగు వర్సిటీ ఆడిటోరియంలో శ్రీధర్ దేశ్ పాండే రచనలు సాగునీటి రంగంలో తెలంగాణ పదేండ్ల ప్రస్థానం, కాళేశ్వరం ప్రాజెక్టు : ప్రశ్నలు- విమర్శలు- వక్రీకరణలు- వివరణలు పుస్తకావిష్కరణ సభ సాయంత్రం 5 గంటలకు జరుగుతుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో క్విస్ట్ లైట్ పేరిట చిత్ర ప్రదర్శన ఉదయం 11 గంటల నుంచి రాత్రి సాయంత్రం 6 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- కేపీహెచ్‌బీకాలనీలో లులుమాల్‌లో లులు బిగ్ చాకో దేస్ ఫెస్టివల్ ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కోకో మిలన్ యాక్టివిటీస్, చిన్నారులకు పెయింటింగ్, డ్రాయింగ్, త్రీడీ యానిమేషన్ చిత్రాలు, వీడియోలతో ఇంగ్లీష్ పద్యాలు, పాటలపై శిక్షణ అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్‌లో ఫుడ్ ఇండియా ఎక్స్-2025 ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు జరుగుతుంది.
- బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని తాజ్ కృష్ణా హోటల్‌లో ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు లైఫ్ స్టైల్ ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో వేసవి సెలవులు సందర్భంగా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం1 గంట వరకు సమ్మర్ ఆర్ట్ క్యాంప్ జరుగుతుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

10 ఫలితాల్లో డీపీఎస్ సత్తా

సాక్షి,సిటీబ్యూరో: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో 'దిల్‌సుఖ్‌నగర్ పబ్లిక్ స్కూల్'(డీపీఎస్) సత్తా చాటినట్లు యాజమాన్యం ప్రకటించింది. పాఠశాలలో ఐదు బ్రాంచీల నుంచి పదో తరగతి పరీక్షలకు 934 మంది విద్యార్థులు హాజరు కాగా, ముగ్గురు విద్యార్థులు 590పైగా, 32 మంది 580 పైగా, 78 మంది 570 పైగా, 594 మంది 550పైగా మార్కులను సాధించినట్లు పేర్కొంది. ప్రతిభ గల విద్యార్థులందరికీ రుద్ర మెమోరియల్ మెరిట్ అవార్డు పేరిట 590 మార్కులపైన వచ్చిన విద్యార్థులకు రూ.50 వేలు, 580 పైన వచ్చిన వారికి రూ.30 వేలు, 570 ఆపైన వచ్చిన వారికి రూ. 20 వేలు నగదు అందిస్తున్నట్లు వివరించింది. ప్రతీ సంవత్సరం 5వ తరగతి నుంచి 9వ తరగతి వరకు రుద్ర మెమోరియల్ స్కాలర్ షిప్ టెస్టు నిర్వహించి మెరిట్ ఆధారంగా ఫీజులో 50 శాతం రాయితీ ఇస్తున్నామని పేర్కొంది.

కలిసిమెలిసి పని చేస్తేనే అభివృద్ధి

సినీనటుడు శుభలేఖ సుధాకర్



క్లబ్ ఉద్యోగులకు కానుకలు అందజేస్తున్న సినీనటులు రోషన్, శుభలేఖ సుధాకర్

ఫిలింనగర్: కార్మికులు, యాజమాన్యం కలిసిమెలిసి పనిచేస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని అప్పుడే అందరూ సంతోషంగా ఉంటారని సినీనటుడు శుభలేఖ సుధాకర్ అన్నారు. మేడే సందర్భంగా గురువారం ఫిలింనగర్ కల్చరల్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన మేడే వేడుకల్లో ఆయన కోర్టు సినిమా హీరో రోషన్‌తో కలిసి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఒక పెద్ద వ్యవస్థ నడవాలంటే ఎన్నో లక్షల మంది పనిచేయాల్సిందేనని ఉద్యోగం చేసే ప్రతి ఒక్కరూ కార్మికుడేనని అన్నారు. హక్కులను సాధించుకునేందుకు కార్మికులంతా కలిసికట్టుగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా క్లబ్‌లో పనిచేస్తున్న కార్మికులను వారు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కె.ఎస్.రామారావు, ఎస్.ఎన్.రెడ్డి, ఏడిద సతీష్, భవానీ తదితరులు పాల్గొన్నారు.

తమ్మిడికుంట చెరువును పరిశీలించిన ఎమ్మెల్యే

మాదాపూర్: చెరువుల అభివృద్ధిలో ఎన్ని ఆటంకాలు ఎదురైనా పనులు ఆగకుండా చూడాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ తెలిపారు. గురువారం మాదాపూర్‌లోని తమ్మిడి కుంట చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువులో మురుగునీరు కలవకుండా చూడాలని అధికారులకు సూచించారు. చెరువు పరిసరాలను ఆహ్లాదకరంగా మార్చాలన్నారు. అభివృద్ధి కార్యక్రమాల వివరాలను అధికారులు వివరించారు. కార్యక్రమంలో హైడ్రా ఇంజినీర్లు మోహన్, నాగరాజు, ఇన్‌స్పెక్టర్ మల్లేష్‌తో పాటు డీపీఆర్‌లు రూపొందించిన విమోస్ టెక్నోక్రాట్స్ కన్సల్టెంట్ యూనస్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్.. అప్‌డేషన్..!

- పాత కార్డుల్లో కొత్త సభ్యుల చేర్పునకు ఆమోదం
- ఇప్పటికే 20 శాతం ప్రక్రియ పూర్తి
- మే నెల కోటా విడుదల
- కొత్త సభ్యుల చేరిక దరఖాస్తుల ఎనిమిదేళ్ల నిరీక్షణకు తెర



సాక్షి,సిటీబ్యూరో: రేషన్ కార్డుదారుల పరేషాన్‌కు ఇక తెరపడనుంది. లబ్ధిదారులకు శుభవార్త. సరిగ్గా ఎనిమిదేళ్ల నిరీక్షణకు మోక్షం లభిస్తోంది. పాత రేషన్‌కార్డుల్లో కొత్త సభ్యుల(యూనిట్) ఆమోద ప్రక్రియ ఆరంభమైంది. పౌర సరఫరాల శాఖ ఆన్‌లైన్ ద్వారా కొత్త సభ్యుల చేర్పుల కోసం అందిన దరఖాస్తులను పరిశీలిస్తూ ఒక్కొక్కటిగా ఆమోదిస్తోంది. అయితే రేషన్‌కార్డు కలిగిన కుటుంబంలోని కొత్త సభ్యుల పేర్లను ఆమోదిస్తున్నప్పటికీ ఏడేళ్ల వయసు దాటిన వారికి మాత్రమే రేషన్ కోటా కేటాయిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే పెండింగ్ దరఖాస్తుల్లో సుమారు 20 శాతం మేర పరిష్కరించి మే నెల రేషన్ కోటా కూడా కేటాయించింది. మిగతా దరఖాస్తులను కూడా దశలవారీగా పరిష్కరించేందుకు పౌర సరఫరాల శాఖ చర్యలు చేపట్టింది.

ఆరు లక్షలపైనే కొత్త సభ్యులు..

గ్రేటర్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిరిగి జిల్లాల్లో పాత రేషన్ కార్డుల్లో కొత్త సభ్యుల చేర్పుల కోసం సుమారు మూడు లక్షలపైనే దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు ఆన్‌లైన్ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. గత ఎనిమిదేళ్లుగా రేషన్‌కార్డుల్లోని సభ్యులు (యూనిట్లు) వివిధ సాకులతో తొలగింపునకు గురవుతున్నా కొత్త సభ్యుల చేర్పుల దరఖాస్తులకు మాత్రం అతీగతీ లేదు. ఈ వ్యవధిలో ఉమ్మడి కుటుంబాలు రెండు, మూడుగా ఏర్పడగా, మరోవైపు కుటుంబంలో మరి కొందరు కొత్త సభ్యులుగా చేరారు. సుమారు మూడు లక్షల కుటుంబాలు ఆరు లక్షల కొత్త సభ్యుల పేర్ల నమోదు కోసం దరఖాస్తు చేసుకున్నట్లు తెలుస్తోంది. వాస్తవంగా రేషన్ కార్డుల్లో కొత్త సభ్యుల చేర్పులు కోసం దరఖాస్తుల స్వీకరణ నిరంతర ప్రక్రియగా కొనసాగుతుండగా, మొన్నటి వరకు ఆమోదించే ఆప్షన్ లేకుండా పోయింది. అయితే రేషన్‌కార్డులోని సభ్యుల తొలగింపు ఆప్షన్ మాత్రం కొనసాగుతూ వస్తోంది. తాజాగా కొత్త సభ్యులు చేర్పుల ఆప్షన్‌కు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో ఆమోద ప్రక్రియ ప్రారంభమైంది.

హైదరాబాద్ పరిధిలోని రేషన్‌కార్డుల్లో కొత్త సభ్యుల చేర్పుల కోసం దరఖాస్తులు ఇలా..

పౌర సరఫరాల శాఖ సర్కిల్	దరఖాస్తులు
మలక్‌పేట-1	12,805
యాకుత్‌పురా-2	18,825
చార్మినార్-3	24,129
నాంపల్లి-4	5,430
మెహిదీపట్నం-5	17,143
అంబర్‌పేట-6	9,294
ఖైరతాబాద్-7	15,047
బేగంపేట్-8	10,926
సికింద్రాబాద్-9	8,626

అర్హుల పేర్లకు ఆమోదం

పాత రేషన్ కార్డుల్లో కొత్త సభ్యుల ఆమోదం ప్రక్రియ కొనసాగుతోంది. మీ సేవా ఆన్‌లైన్ ద్వారా వచ్చిన ప్రతి పెండింగ్ దరఖాస్తులను పరిశీలించి అర్హులైన సభ్యుల పేర్లను ఆమోదిస్తున్నాం. ఇప్పటికే కొన్ని కొత్త యూనిట్లకు నెలవారీ రేషన్ కోటా కేటాయించాం. మరి కొన్ని కొత్త యూనిట్లకు వచ్చే నెల నుంచి రేషన్ కోటా కేటాయిసాం. ఆందోళన చెందవద్దు

\- రమేష్, జిల్లా పౌర సరఫరాల అధికారి, హైదరాబాద్

అన్ని మతాల్లోనూ కులగణన చేయాలి

కేంద్రాన్ని కోరిన ప్రొఫెసర్ కంచ ఐలయ్య


మాట్లాడుతున్న ప్రొఫెసర్ కంచ ఐలయ్య

పంజగుట్ట: జనగణనతోపాటు కులగణన చేయాలని కేంద్రప్రభుత్వం నిర్ణయించడాన్ని స్వాగతిస్తున్నామని, అదే సమయంలో అన్ని మతాల్లో ఉన్న అన్ని కులాలను కూడా పరిగణనలోకి తీసుకుని పారదర్శకంగా కులగణన చేయాలని ప్రొఫెసర్ కంచ ఐలయ్య డిమాండ్ చేశారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో 'గద్దర్ గళం'వ్యవస్థాపకుడు కొల్లూరి సత్తెన్న, కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత డాక్టర్ పసునూరి రవీందర్‌తో కలిసి మాట్లాడారు. జాతీయస్థాయిలో కులగణన జరిగితే దేశంలో విప్లవాత్మక మార్పు రానున్నదని పేర్కొన్నారు. ప్రధాని మోదీ ఆర్‌ఎస్‌ఎస్ ఒత్తిడి మేరకు కులగణన చెయ్యబోమని, అది హిందువుల ఐక్యతను దెబ్బతీస్తుందని ఇప్పటిదాకా చెబుతూ వచ్చారని పేర్కొన్నారు. కానీ, ఇప్పుడు తెలంగాణ, కర్ణాటక, బిహార్‌ల్లో ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు చేపట్టిన కులగణన, బీసీ సంఘాల పోరాటాలు కేంద్ర స్థాయిలో కులగణన నిర్ణయానికి దోహదపడ్డాయని అభిప్రాయపడ్డారు. 2026 లోగా దేశ జనాభాతోపాటు అన్ని కులాల లెక్కలు రావాలని డిమాండ్ చేశారు. కేవలం హిందూ మతంలోనే కులాలు ఉన్నాయని బీజేపీ భావిస్తోందని, ముస్లింల్లోనూ 60 కులాలు ఉన్నాయని, వీటిని కూడా లెక్కలోకి తీసుకోవాలని సూచించారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పలు రాష్ట్రాలు అమలు చేస్తుండగా, కేంద్రం ఎందుకు చెయ్యడం లేదని ప్రశ్నించారు. సమావేశంలో తెల్లాపూర్ కౌన్సిలర్ కొల్లూరి భరత్, రవీందర్ గుల్లి తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త కులగణన బీసీ పోరాటాల విజయం

జీసీ జనసభ అధ్యక్షుడు రాజారామ్ యాదవ్

సాక్షి,సిటీబ్యూరో: దేశవ్యాప్తంగా కులగలన చేయాలని కేంద్ర నిర్ణయించడం బీసీల విజయమని బీసీ జనసభ అధ్యక్షుడు డి. రాజారామ్ యాదవ్ అన్నారు. సోమవారం ఉదయం సోమాజిగూడ లో నేషనల్ పొలిటికల్ జస్టిస్ ఫ్రంట్ చైర్మన్ వీజీఆర్ నారగోని, సాలూరి రామకృష్ణలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. బీసీల రాజీలేని పోరాటంతోనే బీజేపీ కులగణన నిర్వహించేందుకు ముందుకు వచ్చిందన్నారు. కులగణన నిర్వహించడంతోపాటు జనాభా దామాషా ప్రకారం బీసీలకు విద్యా, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేశారు. చట్టసభల్లోనూ బీసీలకు రిజర్వేషన్లు కల్పించి తక్షణమే అమలు చేయాలన్నారు. కామారెడ్డి డిక్లరేషన్‌పైన కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ది ఉన్నా వెంటనే కులగణన ప్రకారం బీసీలకు విద్యా, ఉద్యోగ, రంగాలతోపాటు స్థానిక సంస్థల్లోనూ 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

పుస్తకాల ముద్రణకు తెలుగు వర్సిటీ ఆర్థిక సహాయం

నాంపల్లి: తెలుగు రచయితలకు రచనలను ముద్రించుకోవడానికి తెలుగు వర్సిటీ ఆర్థిక సహాయం అందజేస్తోంది. తెలుగు భాష, సాహిత్యం, కళలు, చరిత్ర, సంస్కృతికి సంబంధించిన సృజనాత్మక, పరిశోధనాత్మక, విమర్శనాత్మక రచనల్ని ఆర్థిక సహాయం కోసం పంపవచ్చు. దరఖాస్తులను విశ్వవిద్యాలయంలోని విస్తరణల సేవా విభాగం నుంచి పొందవచ్చు. దరఖాస్తులను పూర్తిచేసి ఏదేని ముద్రణా సంస్థ నుంచి పొందిన ఒక కొటేషన్‌ను తీసుకుని దరఖాస్తుకు జతపరచాల్సి ఉంటుంది. ఈ దరఖాస్తులను మే 31వ తేదీలోగా ఇన్‌చార్జి, విస్తరణల సేవా విభాగం, సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం, పరిపాలన భవనం, సాయినగర్, బాచుపల్లి ప్రాంగణం, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా-500118 అనే చిరునామాకు పంపాలని రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంత రావు ఒక ప్రకటనలో తెలిపారు.

వర్షాకాలం నాటికి బాక్స్ డ్రెయిన్ పనులు పూర్తి

- అధికారులకు దిశానిర్దేశం చేసిన జీహెచ్‌ఎంసీ కమిషనర్
- ఎల్బీనగర్ జోన్‌లో పర్యటించిన కర్ణన్


నాగోలు సాయినగర్ కాలనీలో బాక్స్ డ్రెయిన్ పనులను పరిశీలిస్తున్న జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్, ఇతర అధికారులు

నాగోలు: జీహెచ్‌ఎంసీ కొత్త కమిషనర్ ఆర్వీ కర్ణన్ హయత్‌నగర్, ఎల్‌బీనగర్ సర్కిళ్లలో గురువారం పర్యటించారు. హయత్‌నగర్ సర్కిల్ పరిధిలోని నాగోలు డివిజన్ సాయినగర్ నుంచి ఆర్టీఏ ఆఫీస్ వరకు రూ.1.9 కోట్లతో జరుగుతున్న 350 మీటర్ల వరద నీటి బాక్స్ డ్రెయిన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వర్షాకాలం లోపు బాక్స్ డ్రైన్ పనులను పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. బాక్స్ డ్రెయిన్ వల్ల లోతట్టు ప్రాంతాల్లోని 5 కాలనీలకు ముంపు ముప్పు తప్పుతుందని ఈఈ రమేశ్‌బాబు కమిషనర్‌కు వివరించారు. అనంతరం బైరామల్ గూడ ఫ్లై ఓవర్ కింద వివిధ క్రీడలను ప్రోత్సహించేందుకు వీలుగా ఏర్పాటు చేసిన స్పోర్ట్స్ బ్లాక్‌లను కమిషనర్ పరిశీలించారు. క్రీడాకారులకు ఉపయోగపడే విధంగా పనులు చేపట్టాలని జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌కు సూచించారు. మిగతా బ్లాక్‌లో గ్రీనరీ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, మెయింటెనెన్స్ ఈఈలు కార్తీక్ రమేశ్‌బాబు, డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

టెక్నాలజీకి అనుగుణంగా పనితీరు మార్చుకోవాలి

ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు


మేడే వేడుకల్లో మాట్లాడుతున్న ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజు తదితరులు

బంజారాహిల్స్: ఇప్పుడు సినిమా ఇండస్ట్రీ ఒకప్పటిలా కాకుండా ఎంతో మారిపోయిందని, భవిష్యత్‌లో మరిన్ని మార్పులు వస్తాయని, వాటికి తగ్గట్టుగా మనం మారాలని నిర్మాత, ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు అన్నారు. మేడే సందర్భంగా గురువారం ఆయన బంజారాహిల్స్ రోడ్ నెం.2లోని ఇందిరానగర్ బస్తీలో తెలుగు సినీ అండ్ టీవీ డిజిటల్ ప్లాట్‌ఫాం ప్రొడక్షన్ సెట్ అసిస్టెంట్స్ యూనియన్ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న టెక్నాలజీని కార్మికులు ఎప్పటికప్పుడు అన్వయించుకుంటూ, దానికి తగ్గట్టుగా పనితీరు మార్చుకోవాలని, లేదంటే కొత్త పనులను నేర్చుకోవాలని సూచించారు. ఒకప్పుడు వెయ్యిమందితో చేసే పని ఇప్పుడు వంద మంది చేస్తున్నారని, ఇంట్లో నుంచి కదలకుండా కూడా టెక్నాలజీ సహాయంతో సినిమా తీసే రోజులు వచ్చాయని పేర్కొన్నారు. ప్రతియేటా ఎండా కాలంలో కొత్త సినిమాలతో హాళ్లన్నీ కళకళలాడేవని, కానీ ఇప్పుడు పూర్తిగా సీన్ మారిపోయిందని, సినిమా థియేటర్లన్నీ మూసివేసే పరిస్థితి కనిపిస్తోందన్నారు. కార్యక్రమంలో ఫిలిం ఫెడరేషన్ అధ్యక్షుడు వల్లభనేని అనిల్ కుమార్, ప్రొడక్షన్ యూనియన్ ప్రెసిడెంట్ బాసాటి వెంకటకృష్ణ, కార్యదర్శి లంకా రాజేంద్రప్రసాద్, కోశాధికారి పుట్టా ప్రసాద్ బాబు, సత్తిబాబు, వెంకటరమణ, చంటి, ఎస్. నాగలంకేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూ ప్రొఫెసర్ వైతీశ్వరన్‌కు ప్రతిష్టాత్మక గుర్తింపు

యునైటెడ్ కింగ్‌డమ్‌లోని రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ ఫెలోగా ఎన్నిక



రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ ఫిజిక్స్ ప్రొఫెసర్ జి.ఎస్.వైతీశ్వరన్‌కు మరో అంతర్జాతీయ గుర్తింపు లభించింది. యునైటెడ్ కింగ్‌డమ్‌లోని ప్రతిష్టాత్మక రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీకి ఫెలోగా ఎన్నికయ్యారు. ఘన పదార్థాల ఎలక్ట్రానిక్ నిర్మాణాన్ని అర్థం చేసుకోవడంలో ఆయన చేసిన కృషికి గుర్తింపుగా ఈ అవకాశం లభించింది. పరిశోధన, బోధనలో ఆయన అంకితభావానికి గుర్తింపుగా ఇదివరకే ఎన్నో అవార్డులు లభించాయి. అందులో డీఏఈ యంగ్ అచీవర్ అవార్డు, భౌతికశాస్త్రంలో బీఎం బిర్లా సైన్స్ ప్రైజ్, బోధన, పరిశోధనలో ఎక్స్‌లెన్స్ కోసం ఛాన్సలర్ అవార్డులను అందుకున్నారు. స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ నిర్వహించిన సర్వేలో ప్రపంచవ్యాప్త టాప్ 2 శాతం శాస్త్రవేత్తలలో ఆయనకు స్థానం లభించింది. ప్రస్తుతం బులెటిన్ ఆఫ్ మెటీరియల్స్ సైన్స్ అసోసియేట్ ఎడిటర్‌గా పనిచేస్తున్నారు. తాజాగా రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ(ఆర్ఎస్‌సీ) ఫెలోగా ఎన్నికయ్యారు.

చట్టసభల్లో బీసీ రిజర్వేషన్లు సాధించేదాకా ఉద్యమం

జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య


బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య, గుజ్జ సత్యం తదితరులు

హిమాయత్‌నగర్: చట్టసభల్లో బీసీ రిజర్వేషన్లు సాధించే వరకు ఉద్యమం జరుగుతుందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. గురువారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ జనగణనలో భాగంగా కులగణన చేపడతామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడంతో బీజేపీ బీసీల పార్టీగా మారిందని, బీసీల యుగం ప్రారంభమైందని అన్నారు. రాజ్యసభ పదవి బీసీలకే అంకితమని, బీసీల విజయానికి దానిని ఉపయోగిస్తానని పేర్కొన్నారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉద్యమ ఫలితంగా ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్ షా, ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భాగవత్‌లతోపాటు కేంద్రమంత్రులు స్పందించి కులగణన చేపట్టాలని నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు. త్వరలోనే ప్రధానమంత్రిని బీసీ సంఘాల ప్రతినిధులతో కలిసి ఘనంగా సత్కరించనున్నట్లు తెలిపారు. కులగణన నిర్ణయం చరిత్రాత్మకమని పేర్కొన్నారు. దేశ జనాభాలో 75 కోట్లకుపైగా ఉన్న బీసీ కులాల చిరకాల డిమాండ్‌ను కేంద్ర ప్రభుత్వం గౌరవించిందని అన్నారు. కులగణన తర్వాత బీసీలకు చట్టసభలలో 50 శాతం రిజర్వేషన్లు, కేంద్రంలో ప్రత్యేక బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు, జనాభాకనుగుణంగా విద్య, ఉద్యోగ రిజర్వేషన్ల పెంపు వంటి నిర్ణయాలను కూడా కేంద్ర ప్రభుత్వం తీసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేష్, బత్తుల సిద్దేశ్వర్, ఆళ్ల రామకృష్ణ, డాక్టర్ కొండా దేవయ్య, వెంకటాచారి, రాందేవ్ మోదీ, వేముల రామకృష్ణ, తంగెళ్లమూడి నందగోపాల్, ఆలంపల్లి రామకోటి, శంకరయ్య, సుదర్శన్, అనురాధ గౌడ్, శంకర్, సుదర్శన్ పాల్గొన్నారు.

పబ్లిక్ స్కూల్ గిరిజన విద్యార్థులకు రెండు హాస్టళ్లు

సాక్షి,సిటీబ్యూరో: రామంతాపూర్, బేగంపేటల్లోని హైదరాబాద్ పబ్లిక్ స్కూళ్లలో చదువుతున్న గిరిజన బాలురు, బాలికల కోసం చేరో వసతి గృహం ఏర్పాటు నిమిత్తం గిరిజన సంక్షేమ శాఖ ఆదేశాలు జారీ చేసిందని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఆర్ కోటాజీ తెలిపారు. తార్నాక, హబ్సిగూడ, లాలాగూడ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కలిగిన భవనాల్లో హాస్టళ్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించిందని పేర్కొన్నారు. హాస్టళ్ల నిర్వహణ కోసం కేటరింగ్, లాండ్రీ, కేర్ టేకర్లు, సెక్యూరిటీ, రవాణా సదుపాయాలను అందించగల ఆసక్తి ఉన్న అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. పూర్తి వివరాల కోసం హైదరాబాద్ జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి, 9440764520 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

కష్టపడ్డ కార్యకర్తలను కాంగ్రెస్ మరువదు


జిల్లా కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొన్న నాయకులు

ఏఐసీసీ కార్యదర్శి వంశీచంద్‌రెడ్డి

శంషాబాద్: సుదీర్ఘకాలంగా కాంగ్రెస్ జెండాలను మోస్తున్న నాయకులు, కార్యకర్తలను పార్టీ మరువదని, సరైన సమయంలో అందరికీ సముచిత స్థానం కల్పిస్తుందని ఏఐసీసీ కార్యదర్శి వంశీ చంద్‌రెడ్డి అన్నారు. శంషాబాద్ పట్టణంలో గురువారం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీ పటిష్టతకు నాయకులు, కార్యకర్తలు మరింత శ్రమించాల్సి ఉందని మాజీ ఎంపీ మధుయాష్కిగౌడ్, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సూచించారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ పార్టీలో తమకు సముచిత స్థానం కల్పించాలని, నామినేటెడ్ పదవుల్లో సీనియారిటీ, క్రమశిక్షణకు ప్రాధాన్యం కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, పార్టీ జిల్లా పరిశీలకులు శివసేనారెడ్డి, ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్, పీసీసీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పి.సంజయ్‌యాదవ్, డీసీసీ అధికార ప్రతినిధి మైలారం సులోచన, ధనుంజయ్, నజీరుద్దీన్, శ్రీధర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

దేశంలో యుద్ధ పరిస్థితులను సమీక్షించాలి


పాశం యాదగిరికి పురస్కారం అందజేస్తున్న మహారాష్ట్ర మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు

సుల్తాన్‌బజార్: భారతదేశం, పాకిస్థాన్ మధ్య యుద్ధ పరిస్థితులు ఏర్పడితే పాకిస్థాన్‌లోకి చొరబడి యుద్ధం చేయాలని మహారాష్ట్ర మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు అన్నారు. దేశంలో యుద్ధం చేసే పరిస్థితులను రాజకీయ నాయకులు, విశ్లేషకులు, మేధావులు సమీక్షించాలని సూచించారు. తెలంగాణ సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో డాక్టర్ దేవులపల్లి రామానుజ రావు కళామందిరంలో తెలంగాణ ఉద్యమ నాయకుడు డాక్టర్ ఎం.శ్రీధర్‌రెడ్డి పేరుతో ఏర్పాటు చేసిన పురస్కారాన్ని గురువారం రాత్రి ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు, పాత్రికేయుడు పాశం యాదగిరికి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విద్యాసాగర్‌రావు విచ్చేసి పాశం యాదగిరిని ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, డాక్టర్ జె.చెన్నయ్యలతో కలిసి ఘనంగా సత్కరించి రూ.25 వేల నగదు, జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో గిరిజనుల పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. వారి భూములు అన్యాక్రాంతమై ఎన్నో కష్టనష్టాలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి హైడ్రా పేరుతో భవనాలు కూలుస్తున్నారని, వాస్తవానికి టెట్రా పేరిట గిరిజన భూములు సంరక్షించాలని అన్నారు. పాశం యాదగిరి మాట్లాడుతూ పారిశ్రామిక రంగం విస్తరించడంతో భూతాపం పెరిగిపోతోందన్నారు. భూమి నుంచి బొగ్గు నిల్వలు, పెట్రోల్, ఇతర ఖనిజాలు వెలికి తీయడం వల్ల మానవాళికి ఎంతో నష్టం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ విజయలక్ష్మి, ప్రొఫెసర్ హరగోపాల్, సాహితీప్రియులు పాల్గొన్నారు.

సింగరేణి కాలనీలో ఈడీ అధికారుల విచారణ


శంకర్‌నాయక్ నుంచి వివరాలు సేకరిస్తున్న ఈడీ అధికారులు

సైదాబాద్: ఐఎస్‌సదన్ డివిజన్ సింగరేణి కాలనీ గుడిసెల ప్రాంతంలో ఈడీ అధికారులు విచారణ నిర్వహించారు. గురువారం కాలనీలో నివసించే సర్వోదయ మండలి రాష్ట్ర అధ్యక్షుడు, సీపీఐ సీనియర్ నాయకుడు శంకర్‌నాయక్ ఇంటికి వెళ్లి భూదాన్ భూముల వ్యవహారంలో ఆయన నుంచి సమాచారం సేకరించారు. భూదాన్ భూముల అవకతవకలపై చాలాకాలంగా శంకర్‌నాయక్ న్యాయపోరాటం చేస్తున్న విషయం తెలిసిందే. ఈ విషయమై ఆయన గతంలో ప్రధాని, రాష్ట్రపతి కార్యాలయాల్లో సైతం ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో సింగరేణి కాలనీలోని ఆయన ఇంటికి చేరుకున్న ఇద్దరు ఈడీ అధికారులు పలు విషయాలపై ఆరా తీశారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల స్థలాల కొనుగోలు, ఆ భూముల విషయంలో రెవెన్యూ విభాగం నిర్ణయాల గురించి అధికారులు ఆయన నుంచి వివరాలు సేకరించారని సమాచారం.



గురువారం రాజ్‌భవన్ దర్బార్ హాల్‌లో మహారాష్ట్ర, గుజరాత్ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు . ఈ కార్యక్రమంలో ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి.

సాక్షి
11
హైదరాబాద్‌ । శుక్రవారం । 2 । మే । 2025

సిటీ ప్లస్



క్రీడోత్సాహం



- వేసవి శిక్షణ శిబిరాల్లో ఫుల్‌ జోష్‌
- 4 వేల మందికిపైగా దరఖాస్తు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్‌ అథారిటీ ఆధ్వర్యంలో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రేటర్‌ హైదరాబాద్‌ పరిధిలోని అన్ని క్రీడా మైదానాలతో పాటు 32 జిల్లా కేంద్రాల్లో గురువారం నుంచి ఈ శిక్షణ శిబిరాలు సందడిగా మొదలయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా జూన్‌ 6వ తేదీ వరకు కొనసాగనున్న ఈ శిబిరాలలో పాల్గొంటున్న యువ క్రీడాకారులకు అవసరమైన అన్ని సదుపాయాలను కల్పించారు. శిబిరాలలో పాల్గొనే క్రీడాకారులు ఆన్‌లైన్‌ ద్వారా రిజిస్ట్రేషన్‌ చేసుకున్నారు. గతంలో నగరవ్యాప్తంగా 2,500 మంది క్రీడాకారులు వేసవి శిక్షణ శిబిరాలలో పాల్గొనగా ఈ ఏడాది 4 వేల మందికి పైగా దరఖాస్తు చేసుకున్నారు.

ఉచిత యోగా, జుంబా డ్యాన్స్‌..

వేసవి శిక్షణ శిబిరాలలో పాల్గొంటున్న విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు కూడా మైదానాలవైపు ఆకర్షితులయ్యే విధంగా జంట నగరాలలోని మైదానాలలో క్రీడాకారుల తల్లిదండ్రులకు ఉచితంగా యోగా, జుంబా డ్యాన్స్‌లలో శిక్షణ ఇవ్వనున్నారు. వారానికి రెండుసార్లు క్రీడాకారుల తల్లిదండ్రులకు శిక్షణ అందించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. పారా క్రీడాకారులకు కూడా ప్రాధాన్యత ఇచ్చే విధంగా మొదటిసారి సరూర్‌నగర్‌ ఇండోర్‌ స్టేడియంలో శిక్షణను అందించనున్నారు.

చేనేతను ప్రోత్సహించేలా..
మగువలు మెచ్చేలా..

ఆకట్టుకుంటున్న నేషనల్‌ సిల్క్‌ ఎక్స్‌పో



శ్రీనగర్‌కాలనీ: భారతీయ పట్టుకు ప్రపంచంలోనే ప్రత్యేక గుర్తింపు ఉందని, చేనేతకారులను ప్రోత్సహించాలని మిసెస్‌ క్లాసిక్‌–2025 విజేత అనితా గెహ్లోట్‌ అన్నారు. సిల్క్‌, కాటన్‌, డిజైనరీ వస్త్రాలతో శ్రీనగర్‌కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో నేషనల్‌ సిల్క్‌ ఎక్స్‌పో పేరిట ఏర్పాటు చేసిన వస్త్ర ప్రదర్శనను గురువారం ఆమె ప్రారంభించారు. సిల్క్‌, కాటన్‌ వస్త్రాలు మగువల మనసు దోచుకుంటున్నాయి. తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి సిల్క్‌, కాటన్‌, డిజైనరీ చీరలతో పాటు పలు ఫ్యాన్సీ వస్తువులను సుమారు 70 స్టాల్స్‌లో ప్రదర్శిస్తున్నారు. చేనేత కళాకారుల ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు అందించేందుకు ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు జయేష్‌గుప్తా తెలిపారు. ప్రదర్శన 6వ తేదీ వరకూ ఉంటుంది.



హాలిడే హాబీ..
సంగీతమే ట్రెండీ..

వేసవి సెలవుల్లో సంగీత శిక్షణపై ఆసక్తి

నగరంలో సంగీత వాయిద్యాలలో ప్రావీణ్యం సంపాదించడం పట్ల ఆసక్తి బాగా పెరుగుతోంది. సెలవుల్లో అందివచ్చిన సమయాన్ని సద్వినియోగం చేసుకునే క్రమంలో మ్యూజిక్‌కి జై కొడుతున్నారు స్టూడెంట్స్‌.. ముఖ్యంగా కోవిడ్‌ సమయంలో లాక్‌డౌన్‌ సమయం సంగీత వాయిద్యాల సాధనను ఎంచుకోవడానికి లేదా తిరిగి తమ అభిరుచులను సానబట్టడానికి దారితీసింది. అదే సమయంలో ఆన్‌లైన్‌ అభ్యాస వేదికలు విరివిగా అందుబాటులోకి రావడం ఈ అభిరుచికి ఆజ్యం పోసింది. దీని వలన విద్యార్థులు ఇంట్లో నుంచి కదలకుండానే వాయిద్యాలను నేర్చుకోవడం సులభమైంది. - సాక్షి, సిటీబ్యూరో

- పాశ్చాత్య పరికరాలదే పైచేయి ఉన్నా.. సంప్రదాయానికీ పెద్దపీట
- వాయిద్యాలను పలికించడం ఆరోగ్యకరం అంటున్న అధ్యయనాలు
- హాలిడేస్‌లో అత్యంత ఆదరణ పొందుతున్న మ్యూజిక్‌ క్లాసెస్‌..




ప్రపంచీకరణ నేపథ్యంలో అంతర్జాతీయ స్థాయిలో సంగీత శైలులపై అవగాహన పెరిగింది. వాయిద్యాల సాధనపై ఆసక్తికి పాశ్చాత్య సంగీతానికి పెరుగుతున్న ఆదరణ కూడా కారణమే. రాక్‌, పాప్‌, జాజ్‌ వంటి పాశ్చాత్య శైలులకు పెరుగుతున్న ప్రజాదరణ గిటార్లు, కీబోర్డులు, డ్రమ్స్‌ వంటి వాయిద్యాలకు డిమాండ్‌ పెంచింది. అదేవిధంగా కొరియన్‌ పాప్‌ కల్చర్‌ పట్ల పెరుగుతున్న మోజు కూడా మరో కారణం. పాశ్చాత్య వాయిద్యాలు ప్రజాదరణ పొందుతున్నప్పటికీ, ముఖ్యంగా ఫ్యూజన్‌ సంగీతాన్ని అన్వేషించే యువతలో భారతీయ శాస్త్రీయ వాయిద్యాలపైనా బలమైన ఆసక్తి ఉంది.



సాధనకు సరైన సమయం..

తల్లిదండ్రులు సంగీత విద్య ప్రయోజనాలను గతంలో కన్నా ఎక్కువగా తెలుసుకున్నారు. వేసవి సెలవుల్లో తమ పిల్లలను అర్థవంతమైన కార్యకలాపాల్లో నిమగ్నం చేయడంలో సంగీతాన్ని మించింది లేదని భావిస్తున్నారు. విద్యార్థులకు అత్యంత ఆసక్తి ఉన్న వాయిద్యం కీబోర్డ్‌ కాగా ఆ తర్వాత స్థానాల్లో గిటార్‌, డ్రమ్స్‌, వయొలిన్‌, పియానోలు ఉన్నాయి. ఇక గాత్ర శిక్షణ పట్ల కూడా ఆసక్తి పెరుగుతోంది.



పరికరం.. ఆరోగ్యకరం..

సంగీత వాయిద్యం పలికించడం ద్వారా మెదడు ఆరోగ్యం బలోపేతమై ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరిగి పనితీరుపై సానుకూల ప్రభావాలను చూపుతుందని, అభ్యాస ఆసక్తిని మరింత ప్రోత్సహిస్తుందని అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఎక్సెటర్‌ విశ్వవిద్యాలయం చేసిన ఒక అధ్యయనంలో సంగీత వాయిద్యం వాయించడం తదుపరి జీవితంలో మెరుగైన మెదడు ఆరోగ్యం ఏర్పడటం మధ్య సంబంధం ఉందని కనుగొంది. సంగీతానికి విశ్రాంతి కలిగించే శక్తి ఉంది. అందుకే చాలా మంది ఒత్తిడికి గురైనప్పుడు లేదా ఆందోళన చెందుతున్నప్పుడు వాయిద్యం వాయించడం వైపు మొగ్గు చూపుతారు. ఫ్లూట్‌ నేర్చుకుంటున్న నగరానికి చెందిన ఎంఎస్సీ కెమిస్ట్రీ విద్యార్థిని లక్ష్మీ 'వేణువు ఒక మధురమైన విశ్రాంతినిచ్చే వాయిద్యం' అంటోంది. వేణువు వాయించడం మానసిక ఉద్రిక్తతను తగ్గిస్తుందని ఆమె చెప్పింది. ప్రతిరోజూ అరగంట సాధన చేస్తానని.. అది తన చదువుపై మరింత దృష్టి పెట్టడానికి సహాయ పడిందని చెప్పింది. వాయిద్యం వాయించడం భావోద్వేగ వ్యక్తీకరణకు సహాయపడుతోంది. భావోద్వేగాలకు ఒక మార్గాన్ని అందించడం ద్వారా ఆందోళనను ఎదుర్కోవడంలో సహాయ పడుతుంది అని మానసిక వైద్యులు డా.పరమేష్‌ వివరించారు.

వేసవిలో సంగీత ప్రయాణం



చదువుకునే ఒత్తిడి లేని వేసవిలో విద్యార్థులు సంగీత ప్రయాణాన్ని ప్రారంభించడం చాలా మంచిది. ఇది సరైన ప్రారంభంగా ఉపకరిస్తుంది. అంతేకాకుండా, ప్రస్తుత సంగీత వేసవి కోర్సులు సాధారణ పాఠ్యాంశాల్లో అనుసంధానించడానికి అనుకూలంగా రూపొందిస్తున్నారు. ఇది స్కూల్స్‌/కాలేజీలు ప్రారంభించిన తర్వాత కూడా విద్యార్థులు ఎటువంటి అంతరాయం లేకుండా సాధన కొనసాగించడానికి వీలు కల్పిస్తుంది.

– లక్ష్మీనారాయణ యేలూరి, వ్యవస్థాపకులు ముజిగల్‌ అకాడమీ





గిటార్‌ సాధన చేస్తున్నా..

పాశ్చాత్య సంగీతం అంటే ఇష్టం. రాక్‌ బ్యాండ్స్‌ ప్రదర్శనలకు హాజరవుతుంటాను. మంచి రాక్‌ బ్యాండ్‌లో చేరాలని ఆలోచన ఉంది. అయితే కాలేజీలో క్లాసెస్‌ ఉన్నప్పుడు కుదరదు కాబట్టి.. ప్రస్తుతం ఆన్‌లైన్‌ క్లాసెస్‌లో గిటార్‌ నేర్చుకుంటున్నా.

– విప్లవ్‌, విద్యార్థి, మణికొండ

వెజ్‌.. ప్లీజ్‌..

శాకాహారంతో లాభాలపై అవగాహన

ఓ మహిళ.. ఎదురుగా ఉన్న ఓ వ్యక్తితో.. జంతుబలి చేసే హక్కు మీకు ఎవరిచ్చారు..? అంటూ ప్రశ్నల వర్షం కురిపిస్తోంది. మా ఇష్టం మాకు నచ్చింది మేం తింటాం.. అంటూ అవతలి వ్యక్తి సమాధానం ఇస్తున్నాడు. మాంసాహారం తింటాం అంటే కుదరదు.. ఎందుకు కుదరదో చెబుతాను వినండి.. అంటూ ఆమె శాకాహారం గొప్పతనం, మన సైక్లింగ్‌ ప్రకృతి నియమాలు ఇతర అంశాలను వివరించారు. మీరు ప్యూర్‌ వెజిటేరియన్‌గా మారతారా? అని హామీ తీసుకుంది. ఇంత చెప్పిన తర్వాత ఆ మనిషిలో ఆలోచన మొదలైంది. ఇంతకీ ఎవరా మహిళ.. ఆమె చేస్తున్న ప్రచారం ఏమిటి..? ఆమె పేరే విజయలక్ష్మి.. మియాపూర్‌లో నివాసం ఉంటున్నారు. ఓ కార్పొరేట్‌ స్కూల్‌లో కంప్యూటర్‌ సైన్స్‌ టీచర్‌. ప్రవృత్తి.. పది మంది గుమిగూడి ఉండే చోట శాకాహారంతో ప్రయోజనాలను వివరిస్తూ శాకాహారమే తినాలంటూ ప్రచారం చేయడం. ఎంతలా వారికి అవగాహన కల్పిస్తున్నారంటే ఆమె మాటలు విన్న తర్వాత చాలా మంది ఇక మాంసాహారం జోలికి వెళ్లకూడదని నిర్ణయం కూడా తీసుకుంటున్నారు. - సికింద్రాబాద్‌



- మాంసాహారం మానేయాలంటూ వినతి
- ఎక్కడ పదిమంది కనిపించినా అవగాహన కార్యక్రమాలు
- ఒక్కరితో మొదలై వందలకు చేరిన సంఖ్య
- యునైటెడ్‌ వెజిటేరియన్స్‌ ఫోరం పేరుతో టీమ్‌
- ముందుండి నడిపిస్తున్న కంప్యూటర్‌ సైన్స్‌ టీచర్‌



శాకాహారంలో అనుభూతిని ఆస్వాదిద్దామా..? అంటూ మొదలవుతుంది ఆమె ప్రచారం. యునైటెడ్‌ వెజిటేరియన్స్‌ ఫోరం పేరుతో సోషల్‌ మీడియా వేదికగా ఓ పేజీ క్రియేట్‌ చేశారు. తనలాంటి భావజాలం ఉన్న వ్యక్తుల్ని ఆ వేదికపైకి రమ్మని పిలుపునిచ్చారు. ఒకరు, ఇద్దరు, ముగ్గురు.. అలా 200లకు చేరింది ఆ సంఖ్య. వీలున్నప్పుడల్లా పదిమంది జనం ఉండే చోట ప్రత్యక్షమవుతారు. శాఖాహారంలోని గొప్పతనాన్ని.. అది తీసుకోవడం వల్ల శరీర అవయవాల మీద పనితీరును.. ఇతర అంశాల్ని చక్కగా వివరించి.. మాంసాహారానికి దూరం చేసే ప్రయత్నం చేస్తారు. ఆ మాటలు విన్న ఎవరైనా కచ్చితంగా ఆకుకూరలు, కూరగాయలు గొప్పతనాన్ని 'వంట' పట్టించుకోవడం నిజం.

పక్కా ప్రణాళికతో ప్రచారం..

యునైటెడ్‌ వెజిటేరియన్స్‌ ఫోరం వ్యవస్థాపకురాలైన ఎస్వీ విజయలక్ష్మి పనితీరు చాలా ఆసక్తికరం. స్వచ్ఛందంగా సేవలందించేందుకు సిద్ధమైన వలంటీర్లు ఎంతమంది అందుబాటులో ఉన్నారో తెలుసుకుంటారు. ఫలానా రోజు ఫలానా అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు సోషల్‌ మీడియా వేదికగా ఓ చిన్న పోస్టులు పెడతారు. ఆ ఏరియాలో ఉండే వలంటీర్లు.. అందుబాటులో ఉండే వారంతా సుముఖత వ్యక్తం చేస్తే వెంటనే ఆ కార్యక్రమానికి శ్రీకారం చుట్టేస్తారు. తక్కువలో తక్కువ కనీసం 50 నుంచి 60 మంది ఆ కార్యక్రమానికి హాజరయ్యేలా చూసుకుంటారు. అక్కడికి వచ్చిన వారంతా బృందాలుగా విడిపోయి నాలుగైదు ప్రదేశాలకు వెళ్లి తమ సంస్థ లక్ష్యాన్ని వివరిస్తారు.



దేశమంతా ఒకే వేదికగా..

యునైటెడ్‌ వెజిటేరియన్‌ ఫోరం అనేది ఒక తెలంగాణకు మాత్రమే కాకుండా.. అన్ని రాష్ట్రాల్లోనూ విస్తరింపజేసి.. వీలైనంత ఎక్కువ మంది జనాభాను శాకాహారం వైపు తిప్పటమే తమ ధ్యేయమని చెబుతున్నారు విజయలక్ష్మి. ఆ దిశగా విస్తృతంగా ప్రయత్నాలు మొదలు పెట్టినట్టు చెప్పారామే. ఇప్పటికే వివిధ రాష్ట్రాల్లో ఉండే తమ వాళ్ళ ద్వారా అవగాహన కార్యక్రమాల ద్వారా అవగాహన కార్యక్రమాలను ఫోకస్‌ చేస్తున్నారు ఈ వెజిటేరియన్‌ విజయలక్ష్మి.

మారేందుకు మీరు సిద్ధమా..?

సోషల్‌ మీడియా వేదికగా యునైటెడ్‌ వెజిటేరియన్స్‌ ఫోరంలో చేరాలని ఉందా? అయితే అదే పేరుతో ఉన్న ఫేస్‌బుక్‌, ఇన్‌స్టాగామ్‌ పేజీల ద్వారా గానీ.. సభ్యులుగా చేరిపోవచ్చు. ఆ మీదట వలంటీర్లుగా సేవలు అందించవచ్చు. ఆ మీదట శాకాహారం గొప్పతనాన్ని తెలుసుకొని మీరు శాకాహార ప్రియులుగా మారిపోవచ్చు.



పాఠశాలలే టార్గెట్‌గా..

శాకాహారం వినియోగించాలనే ప్రచారాలను జనం రద్దీ ఉండే అన్ని ప్రాంతాల్లో నిర్వహిస్తున్నాం. ముఖ్యంగా పాఠశాలలు, కళాశాలలను టార్గెట్‌ చేసుకుని ఎక్కువ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. చదువుకునే వయసు నుంచే జంతువధ చేయకూడదన్న లక్ష్యాన్ని విద్యార్థుల్లో ఇనుమడింపజేయడం ద్వారా ఎక్కువ ఫలితాలు రాబట్టవచ్చన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం. సదస్సులు, సమావేశాలు నిర్వహించడం, పవర్‌పాయింగ్‌ ప్రెజెంటేషన్లు ఇవ్వడం, కరపత్రాలు, స్టిక్కర్ల ద్వారా వీలున్న అన్ని మార్గాల్లో ప్రచారాలు కొనసాగించి శాకాహార భోజన ప్రియులను రూపొందిస్తున్నాం. పాఠశాలల్లో యునైటెడ్‌ వెజిటేరియన్స్‌ ఫోరం కమిటీలు ఏర్పాటు చేయడం, పోటీలు నిర్వహిస్తూ వారికి బహుమతులు, జ్ఞాపికలు అందజేసి ప్రోత్సహిస్తున్నాం.

– ఎస్వీ విజయలక్ష్మి, వ్యవస్థాపకురాలు



ఆరోగ్య సూత్రాలు వివరిస్తూ..

ఆరోగ్యమే మహాభాగ్యం అనే సూత్రాన్ని పాటించడానికి శాకాహారం పాత్ర ఏంటో యునైటెడ్‌ వెజిటేరియన్స్‌ ఫోరం ప్రతినిధులు వివరిస్తారు. ఎదుటివారు మాంసాహార ప్రియులైన వారు అడిగే ప్రశ్నలకి శాకాహార పూరితమైన సమాధానాలు ఇచ్చి వెజిటేరియన్స్‌గా మారాలంటూ రిక్వెస్ట్‌ చేస్తారు. ఒక నెల రోజులు టైం తీసుకోండి.. పప్పు దినుసుల మీద దృష్టి పెట్టండి ఆకుకూరల్లో బలమైన పోషకాల కోసం మీరే తెలుసుకోండి.. మీరు తీసుకునే మాంసాహారాన్ని మేము చెప్పే శాకాహారాన్ని బేరీజు వేసుకోండి అంటూ జనం మెదడుల్లోకి శాఖాహార గొప్పతనాన్ని చూపించే ప్రయత్నం చేస్తున్నారు. చేయడమేంటి చాలామందిని మార్చి చూపించారు కూడా..

నేచర్‌ క్యాంప్‌, ఫారెస్ట్‌ ట్రెక్‌



గచ్చిబౌలి: తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో డెక్కన్‌ వుడ్స్‌, ట్రైల్స్‌ పేరిట వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు టీజీఎఫ్‌డీసీ ఎకో టూరిజం ఎగ్జిక్యూటివ్‌ డైరెక్టర్‌ రంజిత్‌ నాయక్‌ తెలిపారు. 3వ తేదీ నుంచి మంచిరేవులలోని ఫారెస్ట్‌ ట్రెక్‌ పార్క్‌లో సాయంత్రం 4 నుంచి మరుసటి రోజు ఉదయం 10 గంటల వరకు రాక్‌ బే నేచర్‌ క్యాంప్‌ ఉంటుందన్నారు. టీం బిల్డింగ్‌, టెంట్‌ పిచింగ రాత్రి పూట అడవిలో నడక, నైట్‌ క్యాంపింగ్‌, క్యాంప్‌ ఫైర్‌, ఉదయం బర్డ్‌ వాచింగ్‌, ట్రెక్కింగ్‌, నేచర్‌ ట్రయల్‌ వంటి కార్యక్రమాలు ఉంటాయన్నారు. కొత్తగూడలోని బొటానికల్‌ గార్డెన్‌లో ప్రతి శనివారం ఉదయం 9 గంటలకు ఎకో బస్‌ టూర్‌లో ఆడియో, వీడియో హాల్‌లో చెట్ల ప్రాముఖ్యతను వివరిస్తారు. సీతాకోక చిలుకల మీద ప్రజెంటేషన్‌, బ్యాటరీ ఆపరేటెడ్‌ వెహికిల్‌పై 75 థీమ్‌ పార్క్‌లు, వృక్ష పరిచయ క్షేత్రం చూపిస్తారు. అనంతరం జీవవైవిధ్యంలో పాముల ప్రాముఖ్యతపై ఫ్రెండ్స్‌ ఆఫ్‌ స్నేక్‌ సొసైటీ వివరిస్తుంది. వర్చువల్‌ వైల్డ్‌ లైఫ్‌ సఫారీ, గిరిజన జీవన శైలి, సంస్కృతి, వెస్ట్రన్‌గార్డ్స్‌, ఈస్ట్రన్స్‌ గార్డ్స్‌, 9డి సినిమా, స్పేస్‌ అక్వేరియం, థీమ్‌ ఫారెస్ట్‌ను వీక్షించవచ్చు. ఏసీ బస్సులో మృగవని నేషనల్‌ పార్క్‌కు తీసుకెళ్తారు. 4వ తేదీన ఫారెస్ట్‌ ట్రెక్‌ పార్క్‌లో బర్డ్స్‌ వాక్‌ నిర్వహిస్తారు. బొటానికల్‌ గార్డెన్‌లో సమ్మర్‌ డే క్యాంప్‌ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఉంటుంది. బర్డ్స్‌ వాక్‌, స్నేక్‌ షో, థీమ్‌ పార్క్‌లు, వైల్డ్‌ లైఫ్‌ సఫారీలను చూపిస్తారు. వివరాల కోసం ఫోన్‌: 9493549399, 9885298980.

సెమీకండక్టర్.. అవకాశాల సెక్టార్!

తయారీలో భారత్‌కు అవకాశాలు అపారం

- కావాల్సింది ప్రభుత్వ ప్రోత్సాహం
- శిక్షణ, నైపుణ్య అభివృద్ధికి నిధుల కేటాయింపు
- తద్వారా ప్రపంచ డిమాండ్‌లో కీలకస్థానం
- 8-10% వాటా దక్కించుకునే అవకాశం
- ఆరేళ్లలో 40 బిలియన్ డాలర్ల వ్యాపారావకాశాలు
- ఇండియా ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్ అసోసియేషన్ అంచనా

సాక్షి, స్పెషల్ డెస్క్: సెమీకండక్టర్ తయారీ వ్యవస్థలో భారత్‌కు బోలెడన్ని అవకాశాలు ఉన్నాయి.. వాటిని అందుకోవడమే తరువాయి అని ఇండియా ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్ అసోసియేషన్ (ఐఈఎస్ఏ) అంటోంది. 'ప్రపంచ సెమీకండక్టర్ తయారీ పరిశ్రమ విలువ 2022లో 240 బిలియన్ డాలర్లు. 2030 నాటికి ఇది 420 బిలియన్ డాలర్లకు పెరుగుతుందని అంచనా. ఈ నేపథ్యంలో ప్రపంచ డిమాండ్‌లో భారత్ 8–10% వాటా దక్కించుకునే అవకాశం ఉంది. తద్వారా 2030 నాటికి 40 బిలియన్‌డాలర్ల వ్యాపార అవకాశాలను అందుకోవచ్చు' అని (ఐఈఎస్ఏ) నివేదిక తెలిపింది. ప్రపంచ సంస్థలను ఆహ్వానించడం ద్వారా సెమీకండక్టర్ ఫ్యాబ్, ఔట్‌సోర్స్‌డ్ సెమీకండక్టర్ అసెంబ్లీ, టెస్ట్ (ఓఎస్ఏటీ) విభాగాల్లో పెట్టుబడులను పెంచడానికి కొన్ని సంవత్సరాలుగా భారత ప్రభుత్వం తీసుకున్న చర్యలు అంతర్జాతీయ సరఫరా వ్యవస్థ ప్రాముఖ్యత పట్ల అవగాహనను సృష్టించాయి. అలాగే దేశీయ సరఫరాదార్లలో ఆసక్తిని పెంచాయని నివేదిక పేర్కొంది.



మానవ వనరులు: సెమికండక్టర్ రంగంలో 2026–27 నాటికి 15 లక్షల మంది నిపుణులు, 50 లక్షల మంది పాక్షిక–నైపుణ్యం గలవారు అవసరం.

సరఫరా వ్యవస్థను నిర్మించడం ద్వారా

భారత సెమీకండక్టర్ వ్యూహం చిప్ తయారీని దాటి పూర్తి సరఫరా వ్యవస్థను నిర్మించడం వరకు విస్తరించింది. ముడి పదార్థాల నుంచి హై–ఎండ్ ప్యాకేజింగ్, టెస్టింగ్ వరకు కవర్ చేస్తోంది. బలమైన సెమీకండక్టర్ పర్యావరణ వ్యవస్థకు సిలికాన్ వేఫర్స్, స్పెషాలిటీ గ్యాసెస్, రసాయనాల వంటి కీలక పదార్థాల స్థిర సరఫరా అవసరం. వీటిని ప్రస్తుతం ప్రపంచ సరఫరాదార్ల నుంచి సేకరిస్తున్నారు. దేశీయంగా ఈ ముఖ్యమైన ముడిపదార్థాల ఉత్పత్తిని ప్రోత్సహించడానికి, దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడానికి ప్రభుత్వం పాలసీల రూపకల్పనకు కృషి చేస్తోంది.


వెల్లువెత్తుతున్న పెట్టుబడులు

దేశీయ సెమీకండక్టర్ తయారీకి వెన్నుదన్నుగా నిలవ ప్రోత్సాహక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. చిప్, డిస్‌ప్లే పాయాలకు ప్రాజెక్ట్ ఖర్చులలో దాదాపు 50% సమకూ వరకు అదనపు ప్రోత్సాహకాలను అందిస్తున్నాయి. కువస్తున్నాయి. ఈ చర్యలు గణనీయంగా పెట్టుబడులను ఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ సహకారంతో టాటా ఎలక్ట్రానిక్స్ ఐదు ప్రధాన ప్రాజెక్టులలో దాదాపు 18 బిలియన్ డాలర్లకు లైన యూఎస్‌కు చెందిన మైక్రాన్, జర్మనీకి చెందిన ఇన్ఫిని డానికి భారత ప్రభుత్వం రూ.76,000 కోట్లతో ఫ్యాబ్రికేషన్ సౌకర్యాలు, అలాగే టెస్టింగ్ మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయడం లక్ష్యంగా పెట్టుకుంది. కొన్ని రాష్ట్రాలు 20% ప్రాజెక్టు వ్యయంలో మొత్తం ఆర్థిక మద్దతు 70%కి తీసు ఆకర్షించాయి. తైవాన్ పవర్‌చిప్ సెమీకండక్టర్ మాన్యు 11 బిలియన్ డాలర్ల చిప్ ఫ్యాబ్రికేషన్ ప్లాంట్‌తో సహా పైగా పెట్టుబడులు వెల్లువెత్తుతున్నాయి. దిగ్గజ సంస్థ యాన్ సైతం దేశీయ కంపెనీలతో జత కట్టాయి.

ఇప్పటికే బలమైన స్థానాన్ని కలిగి ఉన్న సెమీకండక్టర్ డిజైన్‌పై భారత్ దృష్టి సారిస్తోంది. సరఫరాదార్లు, విడిభాగాల తయారీదార్లు, లాజిస్టిక్స్ ప్రొవైడర్ల నెట్‌వర్క్‌ను సృష్టించడం ద్వారా భారత్ స్వయం–ఆధారిత సెమీకండక్టర్ పర్యావరణ వ్యవస్థను స్థాపించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇంటెల్, క్వాల్‌కామ్, ఎన్‌విడియా వంటి గ్లోబల్ చిప్ దిగ్గజాలు భారత్‌లో ప్రధాన డిజైన్ కేంద్రాలను కలిగి ఉన్నాయి. ఈ నైపుణ్యాన్ని స్థానిక తయారీ పర్యావరణ వ్యవస్థలో ఏకీకృతం చేయాలని

ప్రాసెసింగ్ ఇక్కడే..

ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. తయారైన చిప్‌లను చివరి దశల కోసం విదేశాలకు పంపకుండా దేశంలోనే పూర్తిగా ప్రాసెస్ చేసేందుకు అధునాతన చిప్ అసెంబ్లీ, టెస్టింగ్, ప్యాకేజింగ్ సౌకర్యాలను అభివృద్ధి చేయడం భారత్ ప్రత్యేకత. సిలికాన్ ఇంజనీరింగ్, ప్రొడక్ట్ ఇంజనీరింగ్‌లో హైదరాబాద్‌కు చెందిన మాస్‌చిప్ టెక్నాలజీస్ 25 ఏళ్లకుపైగా సేవలందిస్తోంది. దేశ, విదేశాలకు చెందిన 75కుపైగా దిగ్గజ సంస్థలకు డిజైన్ సర్వీసెస్ అందిస్తోంది. 600లకుపైగా ప్రాజెక్టుల్లో తనదైన ముద్రవేసింది.



ఏసీబీ అదుపులో 'గొర్రెల కొనుగోలు' కాంట్రాక్టర్ మొయినుద్దీన్!

సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన గొర్రెల కొనుగోలు కుంభకోణం దర్యాప్తులో ఏసీబీ అధికారులు మళ్లీ వేగం పెంచారు. ఈ కేసులో ఏడాదిన్నరగా తప్పించుకు తిరుగుతున్న కాంట్రాక్టర్ ఖాజా మొయినుద్దీన్‌ను ఏసీబీ అధికారులు గురువారం రాత్రి అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన గొర్రెల పంపిణీ పథకంలో అవకతవకలపై ఏసీబీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న విషయం తెలిసిందే. గొర్రెల కొనుగోలు నిధుల గోల్‌మాల్‌లో పశుసంవర్ధక శాఖ అధికారులతో పాటు కాంట్రాక్టర్ మొయినుద్దీన్ పాత్ర కీలకమని గుర్తించిన ఏసీబీ కేసు నమోదు చేసింది. దీంతో మొయినుద్దీన్ కొడుకుతో సహా దుబాయ్‌కి పారిపోయాడు. అప్పట్లో వీరిపై ఏసీబీ లుక్‌ఔట్ సర్క్యులర్ జారీ చేసింది. తాజాగా దుబాయ్ నుంచి వచ్చిన మొయినుద్దీన్‌ను కోకాపేట్ మూవీ టవర్‌లో సోదాల అనంతరం అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది.

వీరరాఘవ రెడ్డిపై దాడి

మొయినాబాద్: చిలుకూరు బాలాజీ దేవాలయం అర్చకుడు రంగరాజన్‌పై దాడి కేసులో ప్రధాన నిందితుడైన వీరరాఘవరెడ్డిపై దాడి జరిగింది. కండిషన్ బెయిల్‌పై విడుదలైన ఆయన గురువారం సాయంత్రం మొయినాబాద్ పోలీస్ స్టేషన్‌లో సంతకం చేయడానికి వచ్చి.. తిరిగి బైక్‌పై వెళ్తూ.. అజీజ్ నగర్ చౌరస్తాలో ఓ టీ స్టాల్ వద్ద ఆగాడు. అంతలో సుమారు 20 మంది వచ్చి వీర రాఘవరెడ్డిపై దాడి చేయడంతో అతనికి గాయాలయ్యాయి. దాడిపై వీర రాఘవరెడ్డి మొయినాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

రిజిస్ట్రార్ జనరల్ నుంచే నేరుగా తాజా జాబితా

▶ మొదటి పేజీ తరువాయి

'రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా'నుంచి మరణాల తాజా జాబితాను తెప్పించుకుని ప్రస్తుత ఓటర్ల జాబితాతో సరిపోల్చి మృతుల పేర్లను తొలగించనుంది. దీంతో మృతుల పేరిట మరొకరు ఓటు వేసే ఆస్కారం లేకుండా చేయాలని ఎలక్షన్ కమిషన్ భావిస్తోంది. దీంతో పాటు మరికొన్ని కీలక నిర్ణయాలను ఈసీ తీసుకుంది. అవి..

1. నమోదిత మరణాల తాజా జాబితా రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా నుంచి అందగానే బూత్‌స్థాయి అధికారి(బీఎల్‌ఓ)కి సమాచారం ఇస్తారు. ఫామ్–7 అభ్యర్థన కోసం వేచి చూడకుండా నేరుగా రిజిస్ట్రార్ జనరల్ నుంచి ఈ జాబితా తెప్పించుకోవచ్చు. తర్వాత మరణాన్ని ధృవీకరించుకునేందుకు ఆ బీఎల్‌ఓ సదరు ప్రాంతానికి వెళ్లి మృతి విషయాన్ని ఖరారుచేసుకుంటారు. ఓటర్ల నమోదు నియమావళి–1960లోని 9వ నిబంధన, 2023లో సవరించిన జనన, మరణాల నమోదు చట్టం –1969లోని 3(5)(బీ) సెక్షన్ ప్రకారం ఆయా జనన, మరణాల వివరాలు అడిగి తీసుకునే హక్కు ఈసీకి ఉంది.

2. ఓటర్ ఇన్ఫర్మేషన్ స్లిప్(వీఐఎస్) మరింత స్పష్టంగా ఉండేందుకు ప్రస్తుతమున్న దాని డిజైన్‌ను మార్చనున్నారు. ఇకపై పెద్ద అక్షరాలతో డిజైన్ చేయడం వల్ల వీఐఎస్ సీరియల్ నంబర్, ఓటర్ పార్ట్‌నంబర్ మరింత స్పష్టంగా కనిపిస్తాయి. దీంతో తమ పోలింగ్ స్టేషన్ ఎక్కడుందో ఓటర్ మరింత తేలిగ్గా చూసుకోగలడు. పోలింగ్ అధికారులు సైతం ఆయా ఓటర్ల పేర్లు ఓటర్ల జాబితాలో ఏ పేజీలో ఉన్నాయో సులభంగా గుర్తుపట్టగలరు.

3. ప్రజా ప్రతినిధుల చట్టం,1950లోని 13బీ(2) సెక్షన్ ప్రకారం ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీ సర్ నియమించిన బీఎల్‌ఓలు అందరికీ ప్రామాణికమైన ఫొటో గుర్తింపు కార్డులను జారీచేయనున్నారు. ఓటర్ వెరిఫికేషన్, నమోదు కార్యక్రమాల్లో బీఎల్‌ఓలను ఓటర్లు సులభంగా గుర్తించడానికి, వారి తో ఎలాంటి నిర్మొహమాటం లేకుండా సందేహాలు నివృత్తిచేసుకోవడానికి, అభ్యంతరాలు వ్యక్తంచేయడానికి వీలు చిక్కుతుంది. ముఖ్యంగా బీఎల్‌ఓలు ఇంటింటికీ తిరిగే క్రమంలో వారిని ఓటర్లు తేలిగ్గా గుర్తుపట్టడానికి ఈ నూతన ప్రామాణిక గుర్తింపు కార్డు తప్పనిసరి అని ఈసీ భావిస్తోంది.

మళ్లీ గెలిచేలా మీ పనితనం ఉండాలి

- మనం చేసిన పనులు ప్రజలకు గుర్తుండి పోవాలి
- మహబూబ్‌నగర్ పార్లమెంటు పరిధిలోని కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు సీఎం దిశా నిర్దేశం



సాక్షి, హైదరాబాద్: రాజకీయంగా ఎలాంటి పరిస్థితులున్నా వచ్చే ఎన్నికల్లో కచ్చితంగా గెలిచే విధంగా నియోజకవర్గాల అభివృద్ధి కోసం ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. అభివృద్ధి పనులకు మరో మూడేళ్ల సమయం ఉన్నందున, ఆ కాలానికి తగినట్టు ప్రణాళికలు రూపొందించుకోవాలని ఆదేశించారు. తక్షణ అవసరాలను బట్టి నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఇటీవల నిర్వహించిన కాంగ్రెస్ శాసనసభా పక్ష సమావేశంలో చెప్పినట్టుగా పార్టీ ఎమ్మెల్యేలు కలిసేందుకు సీఎం గురువారం నుంచి సమయం ఇవ్వడం ప్రారంభించారు. తొలుత మహబూబ్‌నగర్ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని కాంగ్రెస్ ఎమ్మెల్యేతో ఆయన భేటీ అయ్యారు. నారాయణపేట, మక్తల్, దేవరకద్ర, షాద్‌నగర్, కల్వకుర్తి, జడ్చర్ల ఎమ్మెల్యేలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. ప్రజలు ఎంతో నమ్మకంతో కాంగ్రెస్ పార్టీని ఆదరించారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా క్షేత్రస్థాయిలో అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా నియోజకవర్గాల్లో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. తాగు, సాగునీరు, గ్రామాల్లో మౌలిక సౌకర్యాలు, విద్యారంగ అభివృద్ధి కోసం పనులు చేపట్టేలా ప్రతిపాదనలు తయారు చేయాలని ఆదేశించారు. ఫలానా ఎమ్మెల్యే ఉన్నప్పుడు ఫలానా పని చేశారని నియోజకవర్గ ప్రజలు ఎప్పుడూ చెప్పుకునేలా పనితనం ఉండాలని, అన్నారు. సమావేశంలో ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల పరిధిలోని అభివృద్ధి పనుల కోసం ప్రతిపాదనలు సీఎంకు అందజేశారు. వాటిని పరిశీలించి తగిన నిధులు కేటాయిస్తానని ఎమ్మెల్యేలకు సీఎం హామీ ఇచ్చినట్టు సమాచారం.

అంటు కడితే 64% అధిక దిగుబడి!

- ఇక్రిశాట్ అధ్యయనంలో వెల్లడి



సాక్షి స్పెషల్ డెస్క్ : ప్రతికూల వాతావరణ ఒత్తిళ్లను తట్టుకొని కూరగాయ పంటల్లో రైతులు అధిక దిగుబడులు సాధించాలంటే అంటుకట్టిన (గ్రాఫ్టెడ్) మొక్కలను నాటి పాలీహౌస్‌లో నియంత్రిత సాగు చేపట్టడం మేలని అంతర్జాతీయ మెట్ట పంటల పరిశోధన సంస్థ (ఇక్రిశాట్) శాస్త్రవేత్తల అధ్యయనం చెబుతోంది. ఆరుబయట పొలంలో సాధారణ హైబ్రిడ్ టమాటా మొక్కలను సాగు చేసిన దానితో పోల్చితే.. టమాటా గ్రాఫ్టెడ్ మొక్కలను పాలీహౌస్ సేద్యంలో సాగు చేస్తే ఖర్చు తగ్గటంతోపాటు 64% దిగుబడి పెరిగిందని ఈ అధ్యయనంలో తేలింది. పటాన్‌చెరులోని ఇక్రిశాట్ ఆవరణలో 2019–2020 రబీ సీజన్‌లో చేసిన ఈ అధ్యయన వివరాలు ఫ్రాంటియర్స్ ఇన్ అగ్రానమీ జర్నల్‌లో ఇటీవల ప్రచురితమయ్యాయి. విజయవాడకు చెందిన హెయిర్‌లూమ్ సీడ్‌లింగ్స్–ప్లాంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ శాస్త్రవేత్తలతో కలసి ఇక్రిశాట్ ఈ అధ్యయనం చేసింది. పీహెచ్‌ఎస్ 448, సాహూ అనే హైబ్రిడ్ టమాటా మొక్కల్ని వాతావరణ ఒత్తిళ్లను తట్టుకోగలిగిన అడవి వంగ మొక్కల వేరుకాండంపై అంటు కట్టిన మొక్కలను సాగు చేశారు. ఎత్తుమడులపై వరుసల మధ్య అడుగు, మొక్కల మధ్య 9 అంగుళాల దూరంలో మొక్కలు నాటారు. ఈ ప్రయోగ కాలంలో అత్యధిక రాత్రి ఉష్ణోగ్రతలు 12.1–21.4 డిగ్రీల సెల్సియస్, అత్యధిక పగటి ఉష్ణోగ్రతలు 29.4–37.8 డిగ్రీల సెల్సియస్ నమోదయ్యాయి. ఆరుబయట పొలంలో సాధారణ హైబ్రిడ్ మొక్కల్ని సాగు చేసిన దానితో పోల్చితే.. పాలీహౌస్‌లో అంటుగట్టిన మొక్కలు సాగు చేయగా 63.79% అధిక టమాటాల దిగుబడి వచ్చింది. పెద్ద ఆకులు, ఎక్కువ పత్రహరితం, పెద్ద కాయల వల్ల దిగుబడి పెరిగింది. పాలీహౌస్‌లో 3 నుంచి 5 కోతలు అదనంగా దిగుబడి వచ్చింది.

- 'గ్రాఫ్టింగ్ మొక్కలతో కూరగాయ పంటలను పాలిహౌస్‌లో సాగు చేస్తే చిన్న, సన్నకారు రైతుల దశ తిరుగుతుంది. దిగుబడి పెంచటంతో పాటు మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సాగు పద్ధతులను మార్చుకోవటానికి రైతులకు మా అధ్యయనం దారిచూపుతోంద'ని ఇక్రిశాట్ ఆవిష్కరణల విభాగం డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డా. స్టాన్‌ఫోర్డ్ బ్లేడ్ వ్యాఖ్యానించారు.
- టమాటాతోపాటు వంగ, మిరప, కీర తదితర తీగజాతి పంటల్లో జన్యుమార్పిడికి బదులు గ్రాఫ్టింగ్ సాంకేతికతతో అద్భుత ఫలితాలు సాధించొచ్చని ఈ అధ్యయనానికి సారథ్యం వహించిన డాక్టర్ రోహన్ ఖోపడే అన్నారు.

మరో 25 చోట్ల స్లాట్ బుకింగ్స్

- ఈ నెల 12 నుంచి 25 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలు
- ఇప్పటికే 22 చోట్ల అమలు.. మే 3వ వారంలో రాష్ట్రమంతటా..
- సమీక్షలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: భూముల రిజిస్ట్రేషన్ కోసం అమల్లోకి తెచ్చిన స్లాట్ బుకింగ్ విధానానికి మంచి స్పందన వచ్చిన నేపథ్యంలో ఈ నెల 12వ తేదీ నుంచి మరో 25 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ విధానాన్ని అమలు చేయబోతున్నట్టు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గత నెల 10వ తేదీ నుంచి ప్రయోగాత్మకంగా రాష్ట్రంలోని 22 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానాన్ని అమలుచేసి.. 30వ తేదీ నాటికి సగటున 866 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ చేసినట్లు చెప్పారు. గురువారం సచివాలయంలో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖ పనితీరుపై మంత్రి సుదీర్ఘంగా సమీక్షించారు. స్లాట్ బుకింగ్ విధానం అమలు జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ విధానం విజయవంతమైందని అధికారులు వెల్లడించారు. దీంతో మరిన్ని కార్యాలయాల్లో దీనిని అమల్లోకి తీసుకురావాలని ఆదేశించారు. ఈ విధానం అమలవుతున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నుంచి పోస్ట్ కార్డు ద్వారా ప్రజల అభిప్రాయాలను సేకరించగా 94 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేసినట్లు అధికారులు మంత్రికి వివరించారు. ఒక పోస్టు కార్డులో ఉన్న ఫోన్ నంబర్ ఆధారంగా చంపాపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకున్న విష్ణుగౌడ్‌కు మంత్రి స్వయంగా ఫోన్ చేసి మాట్లాడి స్పందన తెలుసుకున్నారు.

రెండో దశలో అమలయ్యేది ఇక్కడే..

రెండో దశలో భాగంగా ఫరూక్‌నగర్, షాద్‌నగర్, మహేశ్వరం, వనస్థలిపురం, శేరిలింగంపల్లి, ఉప్పల్, ఘట్‌కేసర్, నారపల్లి, మల్కాజ్‌గిరి, జనగామ, ఘన్‌పూర్, నర్సంపేట, బీబీనగర్, మంచిర్యాల, పెద్దపల్లి, కల్వకుర్తి, వనపర్తి, గద్వాల, గజ్వేల్, సిద్దిపేట అర్బన్, రూరల్‌తోపాటు వరంగల్, హైదరాబాద్, హైదరాబాద్ సౌత్ జిల్లాల రిజిస్ట్రార్ ఆఫీస్‌లలో అమలు చేయాలని మంత్రి పొంగులేటి అధికారులను ఆదేశించారు. స్లాట్ బుకింగ్‌కు అవసరమైన ఇంటర్నెట్ స్పీడ్‌ను పెంచుకోవాలని సూచించారు. వచ్చే నెల 3వ వారం నాటికి రాష్ట్రంలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానాన్ని అమలులోకి తేవాలని ఆదేశించారు.

'యాదాద్రి' చీఫ్ ఇంజనీర్ బదిలీ

- అగ్నిప్రమాదం నేపథ్యంలో జెన్‌కో చర్యలు

సాక్షి, హైదరాబాద్: యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం చీఫ్ ఇంజనీర్ జె.సమ్మయ్యపై బదిలీ వేటు పడింది. ఇటీవల విద్యుత్ కేంద్రంలోని యూనిట్ –1లో అగ్ని ప్రమాదం నేపథ్యంలో.. తెలంగాణ జెన్‌కో దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించింది. చీఫ్ ఇంజనీర్ సమ్మయ్యను విద్యుత్ సౌధలోని జెన్‌కో ప్లానింగ్ విభాగానికి బదిలీ చేసింది. ఆయన స్థానంలో వి.రమేశ్‌బాబును చీఫ్ ఇంజనీర్‌గా బదిలీ చేసింది. కేటీపీఎస్ ఐదో దశ థర్మల్ విద్యుత్ కేంద్రం నుంచి ఎం.శ్రీనివాస్ రావు అనే ఎస్‌ఈని సైతం యాదాద్రి కేంద్రానికి బదిలీ చేసింది. ఇంజనీర్ల కొరతతో పర్యవేక్షణ కొరవడి యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలో అగ్ని ప్రమాదం జరిగిందన్న విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో పదోన్నతులపై యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రానికి పెద్దసంఖ్యలో ఇంజనీర్లను బదిలీ చేసింది. మొత్తం 170 మంది అసిస్టెంట్ ఇంజనీర్లు, 33 మంది అడిషనల్ అసిస్టెంట్ ఇంజనీర్లకు అడిషనల్ డివిజనల్ ఇంజనీర్లుగా పదోన్నతి కల్పించి కొత్తగా పోస్టింగ్స్ ఇచ్చింది. సివిల్ విభాగంలో అయిదుగురు అసిస్టెంట్ ఇంజనీర్లు, ఒక అడిషనల్ అసిస్టెంట్ ఇంజనీర్‌కు.. అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లుగా పదోన్నతి కల్పిస్తూ పోస్టింగ్స్ ఇచ్చింది. వీరిలో 75 మంది అడిషనల్ డివిజనల్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లు, అడిషనల్ అసిస్టెంట్ ఇంజనీర్లు యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రానికే బదిలీ కావడం గమనార్హం. ఈ మేరకు జెన్‌కో సీఎండీ సందీప్ కుమార్ సుల్తానియా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

భూ సమస్యలపై 11,630 దరఖాస్తులు

- భూ భారతి పైలట్ మండలాల్లో రెవెన్యూ సదస్సులు పూర్తి
- 555 మండలాల్లో అవగాహన సదస్సులు నిర్వహణ
- 5వ తేదీ నుంచి జిల్లాకు ఒక మండలంలో అమలు
- 20 జిల్లాల్లో 45 సదస్సుల్లో పాల్గొన్న రెవెన్యూశాఖ మంత్రి
- మార్పునకు నాంది భూభారతి: మంత్రి పొంగులేటి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో భూ సమస్యల శాశ్వత పరిష్కారమే లక్ష్యంగా తీసుకొచ్చిన భూభారతి చట్టానికి రైతుల నుంచి మంచి స్పందన వస్తోంది. గత నెల 14న ప్రారంభించిన భూభారతి చట్టాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఖమ్మం జిల్లా నేలకొండపల్లి, కామారెడ్డి జిల్లా లింగంపేట, నారాయణపేట జిల్లా మద్దూర్, ములుగు జిల్లా వెంకటాపూర్ మండలాల్లో అమలుచేసిన విషయం తెలిసిందే. ఈ చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు అన్ని జిల్లాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నారు. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఏప్రిల్ 17 నుంచి 30 వరకు దాదాపు 20 జిల్లాల్లో సుమారు 45 సదస్సుల్లో పాల్గొని భూభారతి గురించి ప్రజలకు వివరించారు. 555 మండలాల్లో బుధవారానికి సదస్సులు ముగిశాయి.

సాదాబైనామాలపై 2,796 దరఖాస్తులు: నాలుగు పైలట్ మండలాల్లోని 72 రెవెన్యూ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను పూర్తిచేశారు. ఈ సదస్సుల్లో భూ సమస్యలపై దరఖాస్తులను స్వీకరించారు. లింగంపేటలో 3,702, వెంకటాపూర్‌లో 3,969, మద్దూర్‌లో 1,341, నేలకొండపల్లిలో 2,618 కలిపి మొత్తం 11,630 దరఖాస్తులను స్వీకరించారు. ఇందులో ప్రధానంగా పీవీబీకి సంబంధించి 3,446, సాదాబైనామాలపై 2,796 దరఖాస్తులు వచ్చాయి. వీటిని క్షుణ్ణంగా పరిశీలించి జూన్ 2 నాటికి సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. మరోవైపు హైదరాబాద్ మినహా 28 జిల్లాల్లో.. జిల్లాకు ఒక మండలాన్ని పైలట్‌గా తీసుకొని 28 మండలాల్లో పూర్తిస్థాయిలో భూభారతి చట్టాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. ఇది ఈ నెల 5వ తేదీ నుంచి ప్రారంభమవుతుంది.

మార్పునకు నాంది

'తెలంగాణ ప్రభుత్వం దార్శనికతతో తీసుకువచ్చిన భూభారతి చట్టం విప్లవాత్మకమైన మార్పునకు నాంది పలకబోతోంది. నూటికి నూరు శాతం ప్రజలే కేంద్ర బిందువుగా ఈ చట్టం ఉంది. దీనికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. ప్రజల వద్దకే అధికారులు వచ్చి పైసా ఖర్చు లేకుండా సమస్యను పరిష్కరించే విధానం నిరంతరం కొనసాగుతుంది'.

– పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రెవెన్యూశాఖ మంత్రి



నార్లాపూర్ వద్ద పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్ట్ అప్రోచ్ కెనాల్‌ను పరిశీలిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి. చిత్రంలో చిన్నారెడ్డి తదితరులు

యుద్ధప్రాతిపదికన పాలమూరు ప్రాజెక్టులు పూర్తి

- రెండేళ్లలోపు ఉద్దండాపూర్ వరకు నీళ్లు అందిస్తాం
- కృష్ణా బేసిన్ ప్రాజెక్టులే మా ప్రభుత్వప్రాధాన్యం: ఉత్తమ్

సాక్షి, నాగర్‌కర్నూల్: వచ్చే ఏడాది మార్చి 31లోగా ఉమ్మడి పాలమూరు జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను వందశాతం పూర్తి చేస్తామని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ ప్రాజెక్ట్ పనులు ఈ ఏడాదిలోనే పూర్తి చేస్తామని చెప్పారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్ట్ పనులను రెండేళ్లలో పూర్తి చేస్తామని, 2027 మార్చి నెలలోపు ఉద్దండాపూర్ రిజర్వాయర్ వరకు నీటిని అందించే లక్ష్యంతో తమ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. గురువారం మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎంపీ మల్లు రవితో కలసి పాలమూరు–రంగారెడ్డి, కల్వకుర్తి ఎత్తిపోతల పథకాల పనులను క్షేత్రస్థాయిలో ఉత్తమ్ పరిశీలించారు. కృష్ణాతీరంలో పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్ట్‌లో భాగమైన నార్లాపూర్ పంప్‌హౌస్, అప్రోచ్ కెనాల్, నార్లాపూర్, ఏదుల, వట్టెం రిజర్వాయర్లు, పంప్‌హౌస్‌లతోపాటు కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కింద చేపట్టిన ఏదుల పంప్‌హౌస్ మోటార్లను పరిశీలించారు. అనంతరం నాగర్‌కర్నూల్‌లోని కలెక్టర్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృష్ణా జలాలపై నిర్లక్ష్యం వహించిందని, తమ ప్రభుత్వం కృష్ణా బేసిన్‌లోని ప్రాజెక్ట్‌లకే ప్రాధాన్యం ఇస్తుందని చెప్పారు.

పదేళ్లలోనే ఏపీకి అప్పనంగా నీటి తరలింపు

గత బీఆర్‌ఎస్ పాలనలో కృష్ణా జలాలపై నిర్లక్ష్యంతో ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్లగొండ, ఖమ్మం జిల్లాలు తీవ్రంగా నష్టపోయాయని ఉత్తమ్ చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో తరలించిన నీటికంటే గత పదేళ్లలోనే ఏపీకి ఎక్కువ నీటి తరలింపు జరిగిందన్నారు. బీఆర్‌ఎస్ హయాంలోనే పోతిరెడ్డిపాడు, మల్యాల హెడ్‌రెగ్యులేటరీ సామర్థ్యం రెట్టింపు చేసేందుకు సహకరించారని చెప్పారు. కాళేశ్వరం పేరుతో కేసీఆర్ వృథా ఖర్చు చేయకపోయి ఉంటే కృష్ణాతీరంలోని పెండింగ్ ప్రాజెక్ట్‌లన్నీ పూర్తయ్యేవని చెప్పారు. పాలమూరు ప్రాజెక్ట్ కింద చేపట్టిన ఏదుల రిజర్వాయర్ నుంచి అదనపు నీటిని మాత్రమే...అంటే అర టీఎంసీ మేరకు డిండి రిజర్వాయర్ వరకు తరలిస్తామని స్పష్టం చేశారు. ఎట్టిపరిస్థితుల్లోనూ ఎస్‌ఎల్‌బీసీ ప్రాజెక్ట్‌ను తమ ప్రభుత్వం పూర్తిచేస్తుందన్నారు. మంత్రుల వెంట ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, రాజేశ్‌రెడ్డి, కలెక్టర్ సంతోష్ పాల్గొన్నారు.

ఏడాదిలోగా చేయాలి

▶ మొదటి పేజీ తరువాయి

మోదీ గౌరవించడం గొప్పతనం. అయితే ఎప్పటి నుంచి ఈ ప్రక్రియ ప్రారంభిస్తారో తేదీలను ప్రధాని ప్రకటించాలి.

కులగణన సమాజానికి ఎక్స్‌రే లాంటిది

కులగణన సమాజానికి ఎక్స్‌రే లాంటిది. దీనివల్ల సంక్షేమ పథకాలు, నిధులు, ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు ఆయా కులాలకు కచ్చితంగా అందించడానికి వీలవుతుంది. దాదాపు వందేళ్ల తర్వాత దేశంలోనే తొలిసారిగా తెలంగాణలో సమగ్ర కులగణన చేశాం. రాహుల్‌గాంధీ సూచనలు తీసుకుని ఎలాంటి వివాదాలు, తప్పులు లేకుండా ప్రతిపక్షాలు, ప్రజా సంఘాలు, ఇతర స్టేక్ హోల్డర్లందరినీ భాగస్వాములను చేస్తూ.. 57 ప్రశ్నలతో రాజ్యాంగబద్ధంగా, చట్టబద్ధంగా సమగ్రంగా వివరాలు సేకరించి నివేదిక రూపొందించాం. వ్యక్తిగత సమాచారం గోప్యంగా ఉండేలా భద్రత కల్పించాం. దేశానికే ఆదర్శంగా నిలబడ్డాం. సీఎస్ నుంచి ఎన్యూమరేటర్ వరకు, మంత్రివర్గ ఉపసంఘం, నిపుణుల కమిటీ ఇలా... 1.5 లక్షల మందితో ఈ ప్రక్రియ నిర్వహించాం.

రాజకీయాలకు అతీతంగా స్వాగతిస్తున్నాం..

అసెంబ్లీలో రెండు తీర్మానాలు చేశాం. దేశంలో జనగణనతో పాటు కులగణన తక్షణమే చేపట్టాలి అనేది మొదటిది. రెండోది బలహీనవర్గాలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలన్నది. ఈ తీర్మానాలను కేంద్రానికి పంపించాం. ఇదే డిమాండ్‌తో కుల సంఘాల మద్దతుతో ఢిల్లీ జంతర్‌మంతర్‌లో ఒకరోజు ధర్నా చేసి కేంద్రంపై ఒత్తిడి తెచ్చాం. అయినా కులగణన చేయబోమంటూ సుప్రీంకోర్టులో అఫిడవిట్ వేసిన వారు ఇప్పుడు అంగీకరించడానికి మా ఒత్తిడే ప్రధాన కారణం. ఏది ఏమైనా కేంద్రం నిర్ణయాన్ని రాజకీయాలకు అతీతంగా స్వాగతిస్తున్నాం. అభినందిస్తున్నాం.

పారదర్శకంగా ముందుకు వెళ్లాలి

ఈ ప్రక్రియ అమలులో సవాళ్లు, సమస్యలను ఏవిధంగా అధిగమిస్తారో వెల్లడించాలి. కేంద్రం వివరణ ఇవ్వడం ద్వారా పారదర్శకంగా ముందుకు వెళ్లాలి. అన్ని రాష్ట్రాల్లో సమాచార సేకరణ చేయాలి. మేం అందర్నీ ఇందులో భాగస్వాములను చేశాం. కులగణన పూర్తి చేసి ఇప్పుడు దేశానికి తెలంగాణ రోల్ మోడల్‌గా నిలిచింది. మేము కులగణన చేసినప్పుడు ఎదురైన సవాళ్లను కేంద్రంతో పంచుకోవడానికి సిద్ధం. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నది మా సంకల్పం. రాహుల్‌గాంధీ ఆలోచనను అమలు చేసే క్రమంలో ఎవరితోనైనా కలిసి పనిచేయడానికి మాకు ఎలాంటి ఇబ్బంది లేదు. మా నివేదికను ఇప్పటికే ఢిల్లీకి పంపించాం. ఏ సమాచారం కావాలన్నా ఇవ్వడానికి సిద్ధమే. ఇక్కడకు వచ్చినా సరే.. మమ్మల్ని ఢిల్లీ రమ్మనా సరే.. ఒక మెట్టు దిగడానికి మేము రెడీ.

పకడ్బందీగా చేసే ఆలోచన కన్పించడం లేదు

మాది రాజకీయ ఉద్దేశంతో చేసిన కులగణన అంటూ విమర్శలు చేసే నాయకులను ఒకే ప్రశ్న అడుగుతున్నా. 11 సంవత్సరాలుగా కేంద్రంలో, 16 రాష్ట్రాల్లో పాలనలో ఉన్న బీజేపీ రాష్ట్ర ప్రభుత్వాలు ముందుగా కులగణన చేసి ఆదర్శంగా నిలిచి ఉంటే.. మేము తెలంగాణ రోల్ మోడల్ అని చెప్పుకునే అవకాశం వచ్చేది కాదు. రాజకీయంగా లబ్ధి పొందాలన్న ఆత్రుత వారి (బీజేపీ) మాటల్లో కనిపిస్తోంది. పకడ్బందీగా కులగణన, జనగణన చేయాలన్న ఆలోచన వారిలో కనిపించడం లేదు. 2021లో జనగణన చేయకుండా వాయిదా వేశారు. మోదీ.. రేవంత్‌రెడ్డి విధానాలను అనుసరిస్తున్నారని స్థానిక బీజేపీ నాయకులకు కొంత అసూయ, అసంతృప్తి ఉంది. బీజేపీ రాష్ట్ర నాయకులు కక్కలేక మింగలేకపోతున్నారు.

400 సీట్లు వచ్చి ఉంటే రిజర్వేషన్లు ఎత్తేసేవారు

బీజేపీకి గత ఎన్నికల్లో 400 సీట్లు వచ్చి ఉంటే రాజ్యాంగాన్ని మార్చేవారు. రిజర్వేషన్లు ఎత్తేసేవారు. ఇప్పుడు ఈ కులగణన చేపట్టేవారు కూడా కాదు. ఎన్నికల సమయంలో మేముప్రజలను అప్రమత్తం చేయడం వల్ల వారికి సంపూర్ణ మెజారిటీ ఇవ్వకుండా 240 సీట్లకు పరిమితం చేశారు. సంకీర్ణ ప్రభుత్వం కారణంగానే వారి ఎజెండాను పూర్తిగా అమలు చేయలేకపోతున్నారు. రాజకీయంగా తప్పనిసరి పరిస్థితుల్లోనే కులగణనకు నిర్ణయం తీసుకున్నారు.

ఢిల్లీలో ఏం జరుగుతోందో ఈ బచ్చాలకు తెలియదు

ఢిల్లీలో ఏమి జరుగుతోందో గల్లీలో తిరిగే కిషన్‌రెడ్డి, బండి సంజయ్ బచ్చాలకు తెలియదు. నరేంద్రమోదీ ఎవరిని ఫాలో అవుతున్నారు. ఏమి ఆలోచిస్తున్నారు. ఎవరితో మాట్లాడుతున్నారు. ఎవరి సలహా తీసుకుంటున్నారు. ఈ గల్లీల్లో తిరిగే పిల్లలకు తెలియదు. వారి విమర్శలకు సమాధానం చెప్పాల్సిన అవసరం లేదు. డేటా లేకుండా రిజర్వేషన్లు పెంచడాన్ని మాత్రమే సుప్రీంకోర్టు తప్పుపట్టింది తప్ప.. 50 శాతం సీలింగ్‌ను కాదు. ఈడబ్ల్యూఎస్‌తో రిజర్వేషన్లు 60 శాతానికి చేరాయి.

నమోదు చేసుకోనివారు లెక్కల్లో లేనట్లే..

కులగణనలో తమ పేర్లు నమోదు చేసుకోని వారు లెక్కల్లో లేనట్లే. కేసీఆర్ ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే చేసినప్పుడు ఒక మాట అన్నారు. 'ఉన్నోడే ఉన్నట్లు ..లేనోడు పోయినట్లే అని..'. వారికి ఆ స్పష్టత ఉంది. మా పార్టీ, ప్రభుత్వం హింసకు (ఆపరేషన్ కగార్‌పై మాట్లాడుతూ) వ్యతిరేకం. అది రాజ్యహింస అయినా, వ్యక్తులు చేసినా.. సంఘాలు చేసినా..తప్పే. ఎంత పెద్ద సమస్యకైనా చర్చలే పరిష్కారం.

రాష్ట్రం యూనిట్‌గా రిజర్వేషన్లు..

ఒక రాష్ట్రంలో బీసీ ఉండి, మరో రాష్ట్రంలో ఓసీగా ఉన్న కులాలకు సంబంధించి కొందరు లేవనెత్తుతున్న ప్రశ్నలకు కేంద్రం అన్ని రాష్ట్రాలతో సంప్రదింపులు జరిపినప్పుడు సమాధానం లభిస్తుంది. రాష్ట్ర యూనిట్‌గా రిజర్వేషన్లు అమలవుతాయి. ఆయా రాష్ట్రాల్లోని పరిస్థితులకు అనుగుణంగా ఆయా వర్గాలకు లబ్ధి చేకూరుతుంది. స్థానిక సంస్థల ఎన్నికలకు దీనితో సంబంధం లేదు. ఆ ప్రక్రియ సాగుతోంది. మాకంటే మెరుగ్గా వారు కులగణన చేస్తే మంచిదే. ఆస్తులు, అప్పులు, పొలాల విషయంలో అబద్ధం చెప్పొచ్చు. కానీ కులం విషయంలో ఎవరూ అబద్ధం చెప్పరు. కులాల లెక్క పక్కాగా తేలితే సంక్షేమ పథకాల అమలు సులభం. వీటికి కేంద్రం డేటానే ప్రామాణికం. అది లేనప్పుడు మేము చేసిన సర్వే డేటానే ప్రామాణికం. తెలంగాణ సేకరించిన సమాచారం దేశానికి రోల్‌మోడల్.



ఫుడ్ & ఫిట్


రెజెనా కాసాండ్రా

''నా ఉదయం వేడి వేడి మసాలా టీతో మొదలవుతుంది. ఆ ఎనర్జీతో మొదలయ్యాక రోజంతా అదే ఉత్సాహం, శక్తితో ఉండటానికి నాకు సరిపడే ఆరోగ్యవంతమైన డైట్‌ని తీసుకుంటాను'' అని రెజెనా కాసాండ్రా పేర్కొన్నారు. హీరోయిన్‌గా పలు భాషల్లో సినిమాలు చేస్తూ... బిజీ బిజీగా ఉండే రెజెనా కాసాండ్రా డైట్ విషయం లో స్ట్రిక్ట్‌గా ఉంటానంటున్నారు. కానీ వారంలో ఒక్కరోజు మాత్రం 'చీట్ డే' అని నవ్వేశారు. ఇక ఆ రోజు ఆయిల్ అని, ఫ్యాట్ అని నియమాలేం పెట్టుకోకుండా అన్నీ తింటానన్నారు. ఇంకా రెజెనా చెప్పిన విశేషాలు ఈ విధంగా...

- ఉదయం మసాలా టీ తాగిన కాసేపటికి అల్పాహారానికి మొలకలు, బాదంలాంటి డ్రై ఫ్రూట్స్ (పొట్టు తీసినవి), పండ్ల రసం తీసుకుంటాను. బ్రేక్‌ఫాస్ట్ బాగా తినాలి. అందుకే వీటితో పాటు ఇడ్లీ, దోసె తింటాను. సాంబార్ కాంబినేషన్ ఉండాల్సిందే.
- మధ్యాహ్నం భోజనంలో కార్బోహైడ్రేట్స్ ఉన్న ఆహారానికి ప్రాధాన్యం ఇస్తాను. బీన్స్, క్యారెట్, ఇంకా ఉడికించిన కూరగాయలు, పప్పు తప్పకుండా ఉండాల్సిందే. అన్నంతో పాటు ఇవన్నీ తింటే ఇటు కార్బోహైడ్రేట్స్ అటు ప్రొటీన్ రెండూ అందుతాయి. బ్రౌన్‌రైస్‌ని ప్రిఫర్ చేస్తాను.
- మన రోజుని మనం హెవీ బ్రేక్‌ఫాస్ట్‌తో మొదలుపెట్టి, రాత్రి వరకూ క్రమ క్రమంగా తగ్గించుకుంటూ తినాలి. డిన్నర్ ఎంత లైట్ అయితే అంత బెటర్. అందుకే నేను సూప్ లాంటి వాటిని ప్రిఫర్ చేస్తాను.
- ఇప్పటివరకూ చెప్పినది ఒక రోజులో తీసుకునే డైట్ అయితే నా వారం ప్లాన్ ఎలా ఉంటుందంటే... వారంలో ఒక రోజంతా కేవలం పండ్ల రసాలతోనే సరిపెట్టేస్తాను. ఒక రోజంతా పండ్ల రసాలు మాత్రమే తీసుకోవడం వల్ల శరీరంలో ఉన్న మలినాలు పోతాయి. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడంతో పాటు ఇలా మలినాలను పోగొట్టుకోవడం కూడా చాలా ముఖ్యం. అలాగే రెండు వారాలకోసారి కలబంద గుజ్జు తింటాను. దీనికోసం పొట్ట ఖాళీగా ఉంచుకుంటాను. అలా ఎమ్టీ స్టమక్‌తో తింటేనే మంచిది. కలబంద గుజ్జు చర్మానికి నిగారింపుని ఇస్తుంది. ఇక ఒకేసారి కాకుండా రోజు మొత్తంలో కొంచెం కొంచెంగా నీళ్లు తాగుతుంటాను. చక్కెర, ప్రాసెస్డ్ ఫుడ్‌కి నేను దూరం.
- ఫైనల్‌గా నేను చెప్పేదేంటంటే... ఎక్సర్‌సైజ్‌లు చేయడటం, ఆహారం విషయంలో నియమాలు పాటించడం వంటివి స్లిమ్‌గా ఉండటం కోసమే కాదు... ఆరోగ్యంగా ఉండటం కోసం కూడా. సన్నగా ఉండాలని కడుపు మాడ్చుకున్నా ప్రమాదమే. అందుకే చక్కగా తినాలి... వ్యాయామాలు చేయాలి. అప్పుడు ఫిట్ అండ్ ఫైన్‌గా ఉంటాం'' అంటూ ముగించారు రెజెనా.

> నేను, యోగా వేరు కాదని అనుకుంటాను. అంతలా యోగాని ఇష్టపడతాను. నేను ఫిట్ అండ్ ఫైన్‌గా ఉండటానికి యోగా ఓ కారణం. సూర్య నమస్కారాలతో మొదలుపెట్టి, భుజంగాసనం, సర్వాంగాసనం... ఇలా చాలా చేస్తాను. అలాగే ఇతర వ్యాయామాలు కూడా చేస్తుంటాను. నా ఎక్సర్‌సైజ్ ప్లాన్ ఎలా ఉంటుందంటే... ఒకరోజు అప్పర్ బాడీ చేస్తే తర్వాతి రోజు లోయర్ బాడీ వర్కవుట్స్ చేస్తాను.

– డి.జి. భవాని



నిర్వహణ: నిర్మలా రెడ్డి

ఇంటిల్లిపాదికి శక్తిని ఇవ్వడానికి కష్టపడే మహిళలు ఎలాంటి ఆహారం తీసుకుంటారో ఒకసారి గమనిస్తే కొన్ని విషయాలు స్పష్టంగా తెలుస్తాయి. అందరూ తిన్నాక మిగిలినదో, ఫ్రిజ్‌లో ఉంచి తీసినవి తినడమో చాలా మంది చేస్తుంటారు. సమయానుకూలంగా ఆహారాన్ని తీసుకోరు. ఈ నిర్లక్ష్యం వల్లే ప్రపంచవ్యాప్తంగా మహిళలు, గర్భిణులు 30 శాతానికి పైగా రక్త హీనతతో బాధపడుతున్నారని నివేదికలు చూపుతున్నాయి.



డాక్టర్ సమత

పోషకాలపై దృష్టి అవసరం

జీర్ణ వ్యవస్థకు సంబంధించిన సమస్యలు కేవలం ఆహార ప్లానింగ్ వల్లనే కాదు... తిన్నది జీర్ణం కాకపోవడం, మలబద్ధకం వంటి వాటితోనూ వస్తుంటాయి. తమ శరీరానికి ఏ ఆహారాలు సరిపడుతున్నాయో, సమస్య దేని వల్ల వస్తుందో తెలుసుకోవాలి. అప్పుడు ఎలాంటి ఆహారం తీసుకోవాలి, ఎంతవరకు తీసుకోవాలి అనే అవగాహన కలుగుతుంది. సహజంగా మహిళలు రుతుక్రమంలో ఉన్నప్పుడు ప్రతి నెలా కొంత రక్తం పోతుంటుంది. దానిని భర్తీ చేయడానికి ఐరన్ సమృద్ధిగా లభించే బీట్‌రూట్, వేరుశనగ వంటి నట్స్ తీసుకోవాలి. ఆహారం తయారు చేసినప్పుడే ఈ విషయాన్ని ఆలోచించుకోవాలి. ఖరీదైన ఆహారంలోనే పోషకాలు ఉంటాయనుకుంటే పొరబాటు. ఆకుకూరలు, మొలకెత్తిన గింజలు, తృణధాన్యాలనూ ఆహారంలో చేర్చుకోవాలి.

పరీక్షలతో లోపాల గుర్తింపు

ఆహారం ద్వారా శరీరానికి పోషక విలువలు ఎంతమేరకు అందుతున్నాయి, హార్మోన్ల స్థితి ఎలా ఉంది.. అనే విషయాలు అర్థం చేసుకోవడానికి కొన్ని రక్తపరీక్షలు, ఫంక్షనల్ టెస్టులు ఉన్నాయి. వీటి ద్వారా పోషకాహార లోపాలను గుర్తించవచ్చు. హార్మోన్ల అసమతుల్యతను అంచనా వేయడంలోనూ, ఇతర ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించడంలోనూ ఈ టెస్టులు సహాయపడతాయి.

కండరాల పటుత్వానికి

40 నుంచి 50 ఏళ్ల మహిళల్లో కండరాల పటుత్వం తగ్గుతుంది. ఈ వయసులో సమతుల ఆహారంపై దృష్టిపెట్టకపోతే ఆ తర్వాత వయసులో మరిన్ని ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటారు. అందుకని ఐరన్, ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్స్, ప్రొటీన్లు, జింక్, మెగ్నీషియం, బీ కాంప్లెక్స్, విటమిన్ డి ... ఉండే ఆహారాలతో పాటు యాంటీ ఇన్‌ఫ్లమేటరీ ఫుడ్ తీసుకోవాలి.

> **విశ్రాంతికీ ప్రాధాన్యత ఇవ్వాలి**
>
> సమతుల ఆహారం తీసుకోవడానికి ఎంత శ్రద్ధ చూపుతామో పనుల వల్ల అలసిన శరీరానికి తగినంత విశ్రాంతినివ్వాలి అనే విషయంలోనూ అంతే జాగ్రత్త చూపాలి. అందుకు ఎనిమిది గంటల పాటు కంటినిండా నిద్ర ఉండాలి. ఒత్తిడిని బ్యాలెన్స్ చేసుకోగలగాలి. రుతుక్రమ దశలోనూ, మెనోపాజ్ దశలోనూ భావోద్వేగాలలో మార్పు మహిళల్లో ఎక్కువ చూస్తుంటాం. ఆహారం నుంచి తగినన్ని పోషకాలు అందకపోతే నిపుణుల సాయంతో సప్లిమెంట్స్ వాడాలి. ప్రతి పోషకాన్నీ కవర్ చేస్తూ సరైన ఆహారం తీసుకోవడం, ఫిట్‌గా ఉండటం చాలా ముఖ్యం.
>
> – డాక్టర్ సమత తూళ్ల, ఎమ్.డి., మెడికల్ డైరెక్టర్, కో–ఫౌండర్, పిఎమ్‌ఎక్స్ హెల్త్

వేసవి కాలమ్స్



సాన్నిధ్య, నటాలీ, శామ్యూల్ పింటో

ఆడుతూ పాడుతూ మార్కులు

బుధవారం ఐ.ఎస్.సి. ఇంటర్ ఫలితాలు వచ్చాయి. బెంగళూరులో టాపర్స్‌గా నిలిచిన ముగ్గురూ తమ కాలేజీల్లో సాంస్కృతిక కార్యకలాపాలలో చురుగ్గా ఉన్నారు. చదువు మిస్ కాలేదు. అలాగే ఉల్లాసాన్నిచ్చే కళలను కూడా! 'మాకు కళలే చదువులో రిలాక్స్ అయ్యేలా చేశాయి' అని వారు అన్నారు. తల్లిదండ్రులూ, విద్యార్థులూ ఈ విషయాన్ని వింటారా మరి? క్రీడలూ, కళలు చదువును చెడగొట్టవని! ఈ సెలవుల్లో అయినా వాటిని నేర్చుకుందామని!

పూర్వం స్కూళ్లల్లో పాతజోకు ఉండేది. స్టూడెంటు 'హోమ్‌వర్క్ చేయడం మర్చిపోయాను సార్' అని అంటే 'అన్నం తినడం మర్చిపోలేదు కదా. ఇదెలా మర్చిపోయావు' అని బెత్తంతో ఒక్కటి వేసేవాడు సారు.

స్టూడెంట్స్‌కు అన్నం తినడానికి, నిద్ర పోవడానికి, కాలకృత్యాలు తీర్చుకోవడానికి తప్పక సమయం ఉంటుంది. అలాగే ఇష్టమైన ఆసక్తి నెరవేర్చుకోవడానికి కూడా టైమ్ ఉంటుంది. ఇవన్నీ చేసి బ్రహ్మాండంగా చదవగలరు పిల్లలు. గతంలో అలా చదివి, ఇంకా చెప్పాలంటే ఏ సౌకర్యాలు లేకపోయినా కరెంటు స్తంభాల వెలుతురులో చదివి గొప్ప విద్యార్థులు అయిన వారు ఉన్నారు. తల్లిదండ్రులకు అది తెలుసు.

అయితే తల్లిదండ్రులు ఆ సంగతి మర్చిపోయారు.


కొడుకులు, కూతుళ్లు నేడు అన్ని సౌకర్యాలతో ఉన్నా ఫ్యాను, లైటు, స్కూల్ బస్సు, టిఫిన్ బాక్స్, మంచి స్కూలు ఉన్నా కేవలం చదువుకు మాత్రమే అంకితమైతే తప్ప గొప్ప మార్కులు తెచ్చుకోలేరని భావిస్తున్నారు. పుస్తకం ముందేసుకుని ఉంటేనే ర్యాంకులు వస్తాయని అభిప్రాయపడుతున్నారు. అప్పట్లో కాసేపు చదివినా మంచి మార్కులే వచ్చేవి. కాని ఇప్పటి విద్యార్థులు స్కూలు/కాలేజీ మొదలైన రోజు నుంచే చదువుతున్నారు. అంటే వారు ఎంత లేదన్నా పరీక్ష బాగా రాస్తారు. అయినా సరే వారికి ఆట వద్దు, పాట వద్దు, సినిమా వద్దు, బంధువులు వద్దు అనడం వల్ల పిల్లలను ఐసోలేట్ చేయడమా కాదా అని తల్లిదండ్రులు ఆలోచించాలి.

ఇదిగోండి ఉదాహరణ

'ది కౌన్సిల్ ఫర్ ది స్కూల్ సర్టిఫికెట్ ఎగ్జామినేషన్స్' (సి.ఐ.ఎస్.సి.ఇ.) బోర్డ్ వారు ఇంటర్ విద్యార్థులకు నిర్వహించే 'స్కూల్ సర్టిఫికెట్ ఎగ్జామినేషన్' (ఐ.ఎస్.సి) రిజల్ట్స్ బుధవారం వెలువడ్డాయి. దేశవ్యాప్తంగా విడుదలైన ఈ రిజల్ట్స్‌లో టాపర్‌గా నిలిచిన విద్యార్థులు రేయింబవళ్లు చదువుకే అంకితమైన వారు కాదు. ముఖ్యంగా బెంగళూరుకు టాపర్లు ఆటకూ పాటకూ చోటిచ్చి ఈ మార్కులు తెచ్చుకున్నారు. వీరిలో శామ్యూల్ పింటోకు 96 పర్సెంట్ వచ్చింది. బెంగళూరు కోరమండల లోని బెతాని స్కూల్‌లో ఇంటర్ చదివిన పింటో 'నేను స్కూల్ కల్చరల్ యాక్టివిటీస్‌కి సెక్రటరీని. అంతేకాదు వ్యక్తిగతంగా పాము విషానికి విరుగుడు మందు విషయంలో నాదైన పరిశోధన చేస్తున్నాను. ఈ రెంటికీ సమయం ఇచ్చినా స్కూల్ చదువును టైమ్‌టేబుల్ ప్రకారం చదువుకున్నాను. నేను భవిష్యత్తులో యాంటీ వీనమ్ టెక్నాలజీలో పని చేస్తాను' అన్నాడు. హ్యూమానిటీస్‌లో టాపర్‌గా వచ్చిన నటాలీ కూడా అదే స్కూల్‌లో చదివి 98.2 పర్సెంట్ తెచ్చుకుంది. 'నేను నా పదో ఏట నుంచి సింగర్‌గా, డాన్సర్‌గా, యాక్టర్‌గా కృషి చేస్తున్నాను. అవి నా చదువుకు అడ్డు కాలేదు. చదువుకు సమయం తప్పకుండా కేటాయించి చదివాను' అంది. ఐ.సి.ఎస్ ఎగ్జామ్స్‌లో కామర్స్‌లో టాపర్‌గా నిలిచిన సాన్నిధ్య బెంగళూరు గ్రీన్‌వుడ్ స్కూల్ విద్యార్థిని. 98.75 పర్సెంట్ తెచ్చుకుంది. 'కథక్ నా స్ట్రెస్ బస్టర్. బాడ్మింటన్ ఆడతాను. ఈ రెంటికీ 3 గంటల సమయం ఇచ్చి మిగిలింది చదువుకు ఇస్తాను' అని చెప్పింది.

ఇప్పుడు చెప్పండి తల్లిదండ్రులూ... అన్ని సౌకర్యాలు ఇచ్చి పిల్లలను చదివిస్తున్న మీరు వారికి ఆట పాటలు ఆసక్తులు ఇవ్వలేరా? బడి జరుగుతున్నప్పుడు సరే. కనీసం ఈ వేసవి సెలవుల్లో అయినా. సెలవులను ఆనందాలుగా చేసి వారి దోసిళ్లలో పోయండి.

– కె.

> **ఈ పుస్తకం చదవండి**
>
> 
>
> కొందరు తమకు రెక్కలున్నాయనే గుర్తించరు. మరికొందరు రెక్కలున్నది ఇంతవరకు ఎగిరేందుకే అనుకుంటారు. కాని ప్రయత్నం చేయాలి... ఉన్నదానిని పెంచి సాధించుకోవాలి అని పట్టుపట్టి సముద్ర పక్షి కథే 'జోనాథన్ లివింగ్‌స్టన్ సీగల్'. జోనాథన్ అనే పేరున్న సీగల్ మన కాకి స్థాయి పక్షి. ఎక్కువ ఎత్తు ఎగరలేదు. 500 అడుగుల ఎత్తులోపే ఎగరగలదు. ఎగిరినా ఆహార అన్వేషణ కోసమే. కాని జోనాథన్‌కు 'నాకు రెక్కలున్నాయి. గద్ద లాగా మరింత ఎత్తుకు ఎందుకు ఎగరకూడదు' అనిపిస్తుంది. అలాంటి ఆలోచనకే భయపడే సీగల్స్ మధ్య 5000 అడుగుల ఎత్తుకు ఎగిరి చరిత్ర సృష్టిస్తాడు జోనాథన్ రిచర్డ్ బాక్ రాసిన ఈ చిన్న నవలకు ప్రపంచ ప్రఖ్యాతి ఉంది. పిల్లలు తప్పక చదవాలి. తాము కేవలం ర్యాంకులు తెచ్చుకోవడానికే పుట్టలేదు... వాటితో పాటు అనేక పనులు చేయగలం... సాధించగలం... అనే ఆత్మ విశ్వాసం పొందుతారు.

ఫ్యాషన్

అప్ సైక్లింగ్



వార్డ్‌రోబ్‌లను చెక్ చేసుకుంటే కుప్పలుగా ఉన్న చీరలు, దుపట్టాలు కొన్నిచీరలు తమ పెళ్లినాటివి అయి ఉంటాయి. అమ్మ, అమ్మమ్మలు ఇచ్చిన జ్ఞాపకాల చీరలు సరేసరి మరికొన్నింటికి బ్లౌజ్‌లు పాతవయ్యావని పక్కన పడేసినవి కొన్ని... ఓల్డ్‌మోడల్ అయ్యాయని కొన్ని పక్కన పెట్టేసినవి ఉంటాయి. ఇలాంటి వాటన్నింటినీ ఈ సమ్మర్ రోజుల్లో కొత్తగా రూపు కట్టేలా ప్లాన్‌చేయవచ్చు. మారుతున్న ఫ్యాషన్ ట్రెండ్‌లను గమనిస్తూ కాలానుగుణంగా పాతచీరలను అప్‌సైక్లింగ్ చేసి, మీదైన కొత్తశైలిని వ్యక్తీకరించవచ్చు.

అప్‌సైక్లింగ్ విధానం వల్ల ఖర్చు తగ్గడమే కాకుండా, పర్యావరణ అనుకూలతకు ప్రాధాన్యం ఇచ్చినవారం అవుతాం. వృధానూ అరికట్టవచ్చు.

అంచులను మార్చి...

అంచు ఉన్న కాటన్, పట్టుచీరలతో చేసిన ఇండోవెస్ట్రన్ మోడల్ డ్రెస్సులు ఇప్పుడు ట్రెండ్‌లో ఉన్నాయి. షిఫాన్, సిల్క్, కాటన్, ఆర్గంజా, నెటెడ్ చీరల నుండి అనార్కలీలు, లాంగ్ గౌన్లు, కుర్తీలు డిజైన్ చేయించవచ్చు. పట్టు, బ్రొకేడ్, బెనారస్ వంటి వాటితో ఓవర్ కోట్స్, లాంగ్ జాకెట్స్, పలాజోలు, స్కర్ట్‌లు డిజైన్ చేయవచ్చు.

ప్యాచ్ వర్క్

పల్లూ, లేదా అంచులు కొద్దిగా చిరిగిన చీరలకు చిరిగిన అంచును తీసివేసి, జరీ, సీక్వెన్స్, కుందన్ వర్క్ చేసిన ప్యాచ్‌వర్క్ అంచును జత చేసి, తిరిగి వాడచ్చు. పాతకాలం నాటి చీరలను సల్వార్ సూట్‌లుగా మార్చవచ్చు. చీర పల్లూని పైభాగానికి ఉపయోగించవచ్చు. అంచులను నెక్‌కి, చేతులకు వాడచ్చు. కాంట్రాస్ట్ ప్యాచ్‌వర్క్ బోర్డర్‌లనూ జత చేయవచ్చు. బాటమ్, దుపట్టా కోసం మరొక పాత చీరను ఉపయోగించవచ్చు.

లాంగ్ గౌన్లు

వన్‌పీస్ లాంగ్‌గౌన్లు ఎప్పుడూ ట్రెండ్‌లోనే ఉంటున్నాయి. అందుకని, పాతచీరను ఉపయోగించి లాంగ్ గౌన్‌ను తయారు చేయించుకోవచ్చు. అదనపు మెటీరియల్‌కి కాంట్రాస్ట్ కలర్ లేదా మ్యాచింగ్ ఫ్యాబ్రిక్‌ను వాడచ్చు.





చీరలను ఉపయోగించిన డ్రెస్సులనే కాదు, కటింగ్‌లో వృథాగా పడేసే ఫ్యాబ్రిక్‌తో ఫ్యాషన్ జ్యువెలరీనీ రూపొందించవచ్చు. ఇది ఇండోవెస్ట్రన్ వేర్‌కి ముఖ్యంగా వేసవిలో మరింత ఆధునిక అట్రాక్షన్‌ను అద్దుతుంది.

జెన్ జెడ్ పేరెంటింగ్!

పిల్లలతో బాల్యాన్ని ఆస్వాదిస్తున్నారు



కుమారుడితో స్టోన్ పేపర్ సిజర్స్ గేమ్ ఆడుతున్న పేరెంట్స్ (ప్రతీకాత్మక చిత్రం)

పేరెంటింగ్ నియమాలు తరానికీ తరానికీ మారుతున్నాయి. కొత్త తరం పేరెంటింగ్‌లో చాలా ఫ్లెక్సిబుల్‌గా, ఎంపతీతో ఉంటోంది. పిల్లలతో చాలా దృఢమైన బంధాన్ని కోరుకుంటోంది. పిల్లల ఎమోషనల్ వెల్ బీయింగ్ కోసం ఎటువంటి భయాలూ, బిడియాలూ లేకుండా తాము అనుకున్నది ధైర్యంగా కమ్యూనికేట్ చేయడాన్ని ప్రోత్సహిస్తున్నారు. పిల్లల స్వేచ్ఛను ప్రోత్సహిస్తున్నారు. మొత్తంగా చెప్పాలంటే రోల్‌మోడల్ పేరెంటింగ్ రూల్ పాటించాలనుకుంటున్నారు. యాభైఏళ్ల కిందట పేరెంటింగ్‌లో క్రమశిక్షణ అనే పదం వీర విహారం చేసేది. నాన్న ఇంట్లో ఉంటే పిల్లల అల్లరి వినిపించకూడదు, పుస్తకం పట్టుకుని కనిపించాలి. నాన్న ప్రశ్నిస్తే వినయంగా సమాధానం చెప్పాలి. నాన్న ఎదుట పడాలంటే భయం. ఈ చట్రంలో పెరిగిన తరం, ఆ తర్వాతి తరం ఇప్పుడు పేరెంట్స్ అయ్యారు. ఈ జెన్ జెడ్ పేరెంట్స్ తమ పిల్లల విషయంలో భౌతికపరమైన క్రమశిక్షణ పాటించడం కంటే తల్లిదండ్రుల మాట మీద విశ్వాసం, అర్థం చేసుకోవడం దిశగా ప్రోత్సహిస్తున్నారు. ఎమోషనల్ ఇంటలిజెన్స్‌కి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు.

ఇంటి నిండా బొమ్మలే!

జెన్ జెడ్ పేరెంట్స్ తమ బాల్యంలో ఎదురైన సంఘటనలను బేరీజు వేసుకుంటూ ఎలా ఉండాలో, ఎలా ఉండకూడదోననే నియమావళిని రూపొందించుకుంటున్నారు. బాల్యంలో తాము నొచ్చుకున్న సందర్భాలన్నింటినీ గుర్తు చేసుకుంటూ పిల్లల మనసు గాయపరచకూడదనే నియమాన్ని పాటిస్తున్నారు. ఇందులో విపరీతమైన షాపింగ్ ఒకటి. గత తరం పేరెంట్స్ చేతిలో డబ్బు పరిమితంగా ఉండేది. ఇప్పుడు డబ్బు పుష్కలంగా అందుతోంది. రోజువారీ శ్రామికుల కుటుంబాలు కూడా తమ రాబడిలో ఎక్కువ భాగాన్ని సరదాలకు ఖర్చుపెడుతున్నాయి. అప్పట్లో ఏడాదికో రెండేళ్లకో ఒక బొమ్మ కొనిస్తే... ఇప్పుడు ప్రతి ఇంట్లో పాతిక–ముప్పై బొమ్మలకు తక్కువ కాకుండా షెల్ఫ్‌లు నిండిపోతున్నాయి. పిల్లలు తమ భావోద్వేగాలను వ్యక్తం చేసే క్రమంలో 'నో' చెప్పడాన్ని ప్రోత్సహిస్తున్న జెన్ జెడ్ పేరెంటింగ్ పిల్లలకు తాము కూడా 'నో' చెప్పవచ్చనే సంగతి మర్చిపోతున్నారు. ఇక మగపిల్లలు ఏడవకూడదనే సామాజిక షరతును ప్రశ్నిస్తున్న మనస్తత్వ నిపుణులు 'మగపిల్లలను కూడా ఏడవనివ్వండి' అంటున్నారు. కాలం మారుతున్న క్రమంలో వస్తున్న మార్పులివన్నీ. 'మగపిల్లలను కూడా ఏడవనివ్వాలి, వారిలోని సున్నితత్వాన్ని పరిరక్షించాలి' అని చెబుతున్న న్యూజెనరేషన్ పేరెంటింగ్ దానిని అమలు చేయడంలో మాత్రం తార్కికతను కోల్పోతోందన్నారు ట్రాన్స్‌పర్సనల్ హోలిస్టిక్ కోచ్ అర్పితాగుప్త.

> **ఓ ఆశ్చర్యకరమైన సంఘటన**
>
> అది మహారాష్ట్రలో ఓ పర్యాటక ప్రదేశం. నడిరోడ్డు మీద ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఏం జరిగిందో చూద్దామని కొందరు తమ వాహనాలు దిగి ముందుకెళ్లారు. అక్కడ ఓ యువకుడు, 30 ఏళ్లుంటాయి, తన కారును చూసుకుంటూ బిగ్గరగా ఏడుస్తున్నాడు. 'ఏమైంది' అని అడిగారెవరో. కారు మీద పడిన గీతలు చూపిస్తూ మళ్లీ భోరుమన్నాడతడు. అది అతడికిష్టమైన కారు, ముచ్చటపడి కొనుక్కున్న కారని చెప్పి వెక్కిళ్లు పెడుతున్నాడు. అతడి తల్లిదండ్రులు కారు లోపల ఉన్నారు. 'మా అబ్బాయి చాలా సున్నితమనస్కుడండీ. తనకిష్టమైన కారుకి గీతలు పడితే భరించలేకపోతున్నాడు' అన్నారు వాళ్లు సమర్థింపుగా. మగవాళ్లు ఏడవకూడదని బాల్యంలోనే మైండ్‌ని కండిషన్ చేసే పెంపకం ఒకప్పటిది. ఎమోషన్స్‌కి లింగభేదం ఉంటుందా అని ఏడుపు వచ్చినప్పుడు అన్‌కండిషనల్‌గా ఆ ఎమోషన్‌ని వ్యక్తం చేయవచ్చనే వాదన నేటిది. అయితే పైన చెప్పుకున్న కండిషన్‌లో ఆ కుర్రాడి కారణంగా ఇతరులు ఇబ్బంది పడకుండా ఉండాలంటే ఏం చేయాలి? ట్రాఫిక్‌లో ఇబ్బంది పడుతున్న వాళ్లు కూడా ఎమోషన్‌ని ఆపుకోలేక కోపాన్ని ప్రదర్శిస్తే పరిస్థితి విషమిస్తుంది. పరిణతి చెందిన వాళ్లెం కొంతమందిమి కలగచేసుకుని 'కారు పక్కకు తీసుకుని, ఎమోషన్ కంట్రోల్ అయిన తర్వాత ప్రయాణాన్ని కొనసాగించండి' అని సర్దిచెప్పి పరిస్థితిని చక్కదిద్దాల్సి వచ్చింది.
>
> 
>
> – అర్పితాగుప్తా, హోలిస్టిక్ కోచ్

సంతోష క్షణాలు!

ఈ తరంలో దాదాపుగా అన్నీ న్యూక్లియర్ ఫ్యామిలీలే. పేరెంట్స్ కూడా తమ బిడ్డ ఆడుకోవడానికి అక్క,చెల్లి, అన్న, తమ్ముడు లేని బాల్యాన్ని మిగిల్చామని అర్థం చేసుకుంటున్నారు. తోబుట్టువులు లేని లోటు తీర్చడం కోసం పిల్లలతో తల్లులే కాదు తండ్రులు కూడా చక్కగా ఆడుకుంటున్నారు. వారిని ఆటల్లో ఎంగేజ్ చేయడానికి తగినంత సమయం కేటాయిస్తున్నారు. వాళ్లు పెద్దయిన తర్వాత బాల్యాన్ని గుర్తు చేసుకుంటే తల్లిదండ్రులతో ఆడుకున్న తీపి జ్ఞాపకాలు గుర్తు వచ్చే విధంగా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అలాగే పిల్లల మెదళ్లలో విరిసిన ఆలోచనను చక్కగా వ్యక్తం చేయగలిగేటట్లు ప్రోత్సహిస్తున్నారు. పిల్లల ఆలోచనలను, ఆకాంక్షలను కొట్టిపారేయకుండా తగిన ప్రాధాన్యతనిస్తున్నారు. పిల్లల కెరీర్ విషయంలోనూ వారి అభిరుచులను సమాజం గిరిగీతలను పట్టించుకోకుండా స్వాగతిస్తున్నారు. మొత్తంగా చూస్తే తమ బాల్యంలో తమకు కలలుగానే ఉండిపోయిన అన్నింటినీ తమ పిల్లలకు అందిస్తున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే పిల్లల బాల్యంలో తామను తాము ప్రతిక్షేపించుకుంటున్నారు. తమకు దక్కని సంతోషాలను చాలా ఎక్కువగా అందించాలని తపన పడుతున్నారు. ఆదర్శవంతమైన పేరెంటింగ్‌కి ప్రతిరూపాలుగా ఉండాలని అభిలషిస్తున్నారు. ఆచరణలో ఒకింత సమతుల్యత, సమన్వయం అలవరుచుకుంటే జెన్ జెడ్ పేరెంటింగ్ రోల్ మోడల్ పేరెంటింగ్ అవుతుంది.

– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

● టెక్.. టాక్

అడోబ్ న్యూ ఫైర్‌ఫ్లై



డిజైన్ సాఫ్ట్‌వేర్ దిగ్గజం అడోబ్ తమ క్రియేటివ్ సాఫ్ట్‌వేర్ టూల్స్ అప్‌గ్రేడ్ గురించి ప్రకటించింది.

విజువల్స్, గ్రాఫిక్స్‌ను తక్షణమే జనరేట్ చేయడానికి, స్టిల్ ఇమేజ్‌లను యానిమేట్ చేయడానికి, పొడవైన వీడియోను చిన్న క్లిప్‌గా మార్చడానికి ఏఐ ఫీచర్‌లు ఉన్నాయి.

కొత్త ఫైర్‌ఫ్లై యాప్‌ను కూడా అడోబ్ ఇంట్రడ్యూస్ చేసింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అసిస్టెడ్ కంటెంట్ ఐడియేషన్, క్రియేషన్, ప్రొడక్షన్ కోసం ఆల్-ఇన్-వన్ ప్లాట్‌ఫామ్‌గా ఈ యాప్‌ను రూపొందించినట్లు కంపెనీ తెలిపింది. ఈ యాప్ ద్వారా యూజర్‌లు అడోబ్ ఇన్-హౌజ్ ఏఐ మోడల్స్(ఫైర్‌ఫ్లై ఇమేజ్ మోడల్ 4 ఫైర్‌ఫ్లై వీడియో మోడల్) మాత్రమే కాకుండా గూగుల్, ఓపెన్ ఏఐలాంటి థర్డ్ పార్టీ ఏఐ మోడల్స్‌ను కూడా యాక్సెస్ చేయవచ్చు.



సోనార్ పెన్ 2

గత ఏడాది లాంచ్ అయిన 'సోనార్ పెన్2' ప్రెజర్ సెన్సిటివిటీకి సపోర్ట్ చేసే చౌకైన ఐప్యాడ్ స్టైలస్‌గా పేరు తెచ్చుకుంది. ఇప్పుడు సరికొత్త ట్విస్ట్ ఏమిటంటే.... మాక్‌బుక్ ట్రాక్ ప్యాడ్‌ను సోనార్‌పెన్ డ్రైవ్ డ్రాయింగ్ టాబ్లెట్‌గా మారుస్తుంది. అడోబ్ ఫోటోషాప్, క్రిత, జీఐఎంపీ, క్లిప్ స్టూడియో పెయింట్, ఆర్ట్రెజ్, మెడిబాంగ్ పెయింట్ ప్రోతో పాటు ఇతర యాప్‌లతో పరీక్షించారు. ఈ సోనార్‌పెన్ షార్ట్‌కట్ బటన్, కస్టమైజబుల్ ప్రెజర్ సెన్సిటివిటీ కలిగి ఉంటుంది.

నథింగ్ సీఎంఎఫ్ ఫోన్ 2 ప్రో



సైజ్: 6.77 అంగుళాలు రిఫ్రెష్‌రేట్: 120 హెచ్‌జడ్ బ్యాటరీ: 5,000 ఎంఏహెచ్ బరువు: 185 గ్రా. రిజల్యూషన్: 1080×2392 పిక్సెల్స్
ఇంటర్నల్: 128 జీబీ/8జీబీ ర్యామ్ 256జీబీ/8జీబీ ర్యామ్




● ఇన్‌స్పిరేషన్

వైకల్యానికి చెక్ పెట్టాడు!

'ఇలా అయితే ఎలా?' అని ఎప్పుడూ బాధ పడలేదు వైభవ్. ఆ యువకుడు నడవ లేడు. మాట్లాడలేడు. 90 శాతం వైకల్యం ఉన్న దివ్యాంగుడు. తనను నిస్సహాయ స్థితిలో నుంచి బయటికి తీసుకువచ్చి కొత్త ప్రపంచం చూపించింది చదరంగం....

సెరిబ్రల్ పాల్సీతో చక్రాల కుర్చీకే పరిమితమైన వైభవ్‌కు చెస్ పరిచయం చేశాడు తండ్రి గౌతమ్. ఆనాటి నుంచి ఒంటరి ప్రపంచం నుంచి చదరంగ ప్రపంచంలోకి వచ్చాడు వైభవ్. తండ్రితో కలిసి తరచుగా చెస్ ఆడేవాడు. క్రమంగా ఆటలో నైపుణ్యం సాధించాడు. ఆ నైపుణ్యం అతడిని జాతీయ స్థాయికి తీసుకువెళ్లింది.

ఢిల్లీ ఇంటర్నేషనల్ టోర్నమెంట్ వైభవ్ తొలి టోర్నమెంట్. తొలి ప్రయత్నంలోనే రేటింగ్‌ను సాధించడం విశేషం. చెస్‌లో మరిన్ని శిఖరాలను అధిరోహించడానికి అవసరమైన స్ఫూర్తిని ఆ రేటింగ్ ఇచ్చింది.

గ్రాండ్ మాస్టర్ కావాలనే లక్ష్యం పెట్టుకున్నాడు. దేశవిదేశాల్లో జరిగే టోర్నమెంట్స్‌కు వైభవ్‌తో పాటు అతడి తండ్రి గౌతమ్ కూడా వెళుతుంటాడు. మ్యాచ్ సమయంలో అతడి పక్కనే కూర్చొని నొటేషన్‌లు రాస్తుంటాడు. కొడుకు కెరీర్ పట్ల తండ్రి చూపిస్తున్న అంకిత భావం మాటలకు అందనిది.

ఆటలంటే ఇష్టపడే గౌతమ్ తన కుమారుడు కూడా ఆటలు ఆడాలనుకునేవాడు. చిన్నప్పటి నుంచి వీల్‌చైర్‌కే పరిమితమైన వైభవ్ క్రికెట్, వాలీబాల్, కబడ్డీ...లాంటి ఆటలు ఆడలేదు. 'ఇంతేనా' అని కుమారుడి గురించి ఆలోచిస్తున్న సమయంలో 'చెస్' అనే ఆలోచన మెరిసింది.

ఇక అప్పటి నుంచి కుమారుడికి చెస్‌పై ఆసక్తి కలిగేలా ప్రయత్నాలు మొదలు పెట్టాడు. తానే గురువుగా మారాడు. మొదట్లో తండ్రి ఒక గేమ్, కొడుకు ఒక గేమ్ గెలిచేవారు. ఆ తరువాత మాత్రం పరిస్థితి పూర్తిగా మారిపోయింది. తండ్రిపై ఎప్పుడూ వైభవే విజయం సాధించేవాడు. దీంతో కుమారుడిపై ఆ తండ్రికి మరింత నమ్మకం కలిగింది.

'యస్. మా వాడు సాధించగలడు' ఒకటికి పదిసార్లు అనుకునేవాడు. ఆటలో మరింత నైపుణ్యం కోసం రామ్‌కుమార్ అనే కోచ్‌తో వైభవ్‌కు ఆన్‌లైన్‌లో కొన్ని నెలలు శిక్షణ ఇప్పించాడు. ఆ తరువాత జీబీ జోషిని కోచింగ్ ఇవ్వాల్సిందిగా అభ్యర్థించాడు. 'మీరు ఎంత ఫీజు అడిగినా ఇస్తాను' అన్నాడు.

'ఒక్క పైసా కూడా అక్కర్లేదు' అంటూ వైభవ్‌కు ఉచిత కోచింగ్ ఇవ్వడానికి ముందుకు వచ్చాడు జోషి. ఆటలో ఎప్పటికప్పుడు రేటింగ్ పెంచుకుంటూ అద్భుతం అనిపించుకుంటున్నాడు వైభవ్.

'వైభవ్ శారీరక స్థితికి వీల్‌చైర్‌లో కూర్చుని చెస్ ఆడడం అనేది అంత సులువైన విషయమేమీ కాదు. దీని కోసం ఎంతో కఠోర సాధన చేశాడు' అంటున్నాడు గౌతమ్. జీవనోపాధి కోసం గౌతమ్ ఢిల్లీలో చిన్న షాప్ నడుపుతున్నాడు. 'మీరు ఎక్కువ సమయం వైభవ్‌తోనే గడపాల్సి వస్తుంది కదా' అని అడిగితే ఆ తండ్రి చెప్పిన జవాబు...

'మా అబ్బాయికి కచ్చితంగా మంచి టైమ్ వస్తుంది. అప్పటి వరకు నా టైమ్ గురించి ఆలోచించడం లేదు'

అతడి కళ్లు చెబుతున్నాయి...

వైభవ్ విజయాన్ని తమ విజయంగా ఎంతోమంది సంతోషిస్తుంటారు. 'మీ అబ్బాయి ఫైటింగ్ స్పిరిట్ ఎంతోమందికి స్ఫూర్తిని ఇస్తుంది' అంటుంటారు. ఇలాంటి మాటలు విన్నప్పుడు సంతోషంగా, గర్వంగా ఉంటుంది. వైభవ్ మాట్లాడలేక పోవచ్చు. కాని అతడి కళ్లు చెబుతున్నాయి.... నేను ఎంతో సాధిస్తాను అని!

– గౌతమ్, వైభవ్ తండ్రి





వాట్సాప్ స్టిక్కర్లు

మెసేజ్‌లకు స్టిక్కర్‌ల ద్వారా స్పందించే ఫీచర్‌ని వాట్సాప్ పరీక్షిస్తోంది. వాట్సాప్‌లో ఇప్పటికే స్టిక్కర్లు బాగా ప్రాచుర్యం పొందాయి. ఇవి యూజర్‌ల మనోభావాలను, స్పందనను ప్రత్యేక రీతిలో వ్యక్తీకరిస్తాయి. మోస్ట్-యూజ్‌డ్ ఇమోజీ బార్‌ను ఓపెన్ చేయడానికి యూజర్‌లు మెసేజ్‌ను లాంగ్-ప్రెస్ చేయాలి. దీని ద్వారా స్టిక్కర్లను జోడించవచ్చు. మెసేజ్‌కు స్పందనగా ఉపయోగించవచ్చు. ప్రస్తుతం మెసేజ్ రియాక్షన్స్ ఇమోజీలకు పరిమితం కాగా, రాబోయే అప్‌డేట్‌లో స్టిక్కర్లు కూడా ఉంటాయి.

అడ్జస్టబుల్ డెస్క్‌టాప్ టాబ్లెట్ స్టాండ్




బ్రాండ్: కొకు కలర్: బ్లాక్ కంపాటబుల్ డివైజ్: స్మార్ట్‌ఫోన్, ట్యాబ్ ● 2 ఇన్ వన్ స్టాండ్ (ట్యాబ్, మొబైల్) ● నాన్ స్లిప్ సిలికాన్ ప్యాడ్స్ మెటీరియల్: అల్యూమినియం

అవును... ఇది నిజమే!




● 1904లో అమెరికన్ టీ వ్యాపారి ఒకరు చిన్న సిల్క్ సంచులలో టీ పొడిని ఐరోపాకు రవాణా చేశాడు. అయితే....కొందరు తెలియక వాటిని మరుగుతున్న నీటిలో ముంచారు. అలా టీ బ్యాగ్ ఐడియా పుట్టింది! ● 'ఏ ఇద్దరు వ్యక్తుల వేలి ముద్రలు ఒకేరకంగా ఉండవు' అనేది నాలుకకు కూడా వర్తిస్తుంది. ప్రతి వ్యక్తి 'టంగ్ ప్రింట్'కు దాని స్వంత, విలక్షణమైన ఆకారం, పరిమాణం, రంగు ఉంటుంది అంటున్నారు పరిశోధకులు. ఫోరెన్సిక్ పరిశోధనలలో 'టంగ్ ప్రింట్'లు కూడా ఉపయోగపడతాయని అధ్యయనాలు చెబుతున్నాయి.

● గేమింగ్



ఆ 'మాయ'కుడు ఎవరు?

డార్క్ ఫాంటసీ అడ్వెంచర్ గేమ్.... ది మిడ్‌నైట్ వాక్. ప్లేయర్స్‌ను ఈ గేమ్ భయానక ప్రపంచంలోకి ఆహ్వానిస్తుంది. ఆ ప్రపంచంలోకి వెళ్లే ధైర్యసాహసాలు ఉంటే క్రూరమైన రాక్షసులతో పోరాడాలి. ఎన్నో రహస్యాలను వెలికితీయాలి. కోర్ గేమ్‌ప్లే ఫీచర్స్ ఆకట్టుకుంటాయి. ఈ గేమ్ కోసం ఎన్నో సర్రియల్ క్రియేచర్‌లను సృష్టించారు. ప్రతి ఫ్రేమ్ స్టాప్ మోషన్ మ్యాజిక్‌తో ప్రాణం పోశారు.

'సూర్యుడిని ఎవరు మాయం చేశారు? ఎందుకు?' అనేది గేమ్‌లో సెంట్రల్ మిస్టరీ.

'ఈ గేమ్ ఇండి గేమింగ్ ప్రపంచంలో ప్రత్యేకతను చాటుకుంటుంది. మిడ్‌నైట్ వాక్ అనేది డార్క్ ఫాంటసీ, స్టాప్-మోషన్ మ్యాజిక్ సమ్మేళనం' అంటున్నారు గేమ్ మేకర్స్.

విడుదల తేదీ: 8 మే ప్లాట్‌ఫామ్స్: ప్లేస్టేషన్ 5, మైక్రోసాఫ్ట్ విండోస్
జానర్స్: అడ్వెంచర్ గేమ్, ఇండి గేమ్

● ఇంగ్లీష్ ఇడియమ్స్

కిల్ స్విచ్



హాని జరగకుండా, నష్టం వాటిల్లకుండా మెషినరీ లేదా ఎక్విప్‌మెంట్‌ను తక్షణం షట్ డౌన్ చేయడాన్ని కిల్ స్విచ్ అంటారు.

ఉదా: హీ హ్యాడ్ నో టైమ్ టు హిట్ ది ఇంజిన్ కిల్ స్విచ్

ఇన్ ఫర్ ఏ పెన్నీ ఇన్ ఫర్ ఏ పౌండ్...

చేయాలనుకున్న పని, చేస్తున్న పని ఎంత కష్టంగా ఉన్నా, ఎంత ఖర్చవుతున్నా 'ఎలాగైనా చేయాల్సిందే' అని గట్టిగా నిర్ణయించుకునే సందర్భంలో వాడే మాట....

ఉదా: ఆఫ్టర్ ది టీమ్స్ డిఫీట్ లాస్ట్ సీజన్, దే హ్యావ్ డిసైడెడ్ దట్ ఇన్ ఫర్ ఏ పెన్నీ, ఇన్ ఫర్ ఏ పౌండ్ దే హ్యావ్ టు విన్ ది టైటిల్ దిస్ సీజన్.

హిట్ 3తో ప్రేక్షకులు మళ్లీ ఎనర్జీ ఇచ్చారు

– నిర్మాత 'దిల్' రాజు



● 'దిల్' రాజు, నాని, ప్రశాంతి తిపిర్నేని, శైలేష్ కొలను

''ఏప్రిల్ నెలలో సరైన సినిమాలు లేక ఏపీ, తెలంగాణలో చాలా సింగిల్ స్క్రీన్స్ క్లోజ్ చేయడం జరిగింది. ఇలాంటి సమయంలో మా ఆశలన్నీ 'హిట్ 3' సినిమాపైనే ఉన్నాయి. ఇలాంటి సమయంలో మూడు రోజులు ముందుగానే ఆన్‌లైన్ బుకింగ్స్ చూసి, జనాలు థియేటర్స్‌కు వస్తున్నారని హ్యాపీ ఫీలయ్యాను. 'హిట్ 3' సినిమా విజయంతో తెలుగు సినిమా ఇండస్ట్రీ ఊపిరి పీల్చుకున్నట్లయింది'' అని నిర్మాత 'దిల్' రాజు అన్నారు. నాని హీరోగా నటించిన తాజా చిత్రం 'హిట్3: ది థర్డ్ కేస్'. ఈ చిత్రంలో శ్రీనిధీ శెట్టి హీరోయిన్‌గా నటించారు. శైలేష్ కొలను దర్శకత్వంలో వాల్ పోస్టర్ సినిమా, నాని యూనానిమస్ ప్రొడక్షన్స్ బ్యానర్స్ పై ప్రశాంతి తిపిర్నేని నిర్మించిన ఈ చిత్రం మే 1న విడుదలైంది. ఈ సినిమాకు మంచి స్పందన లభిస్తోందని చిత్రబృందం పేర్కొంది. గురువారం సాయంత్రం విలేకరుల సమావేశంలో 'దిల్' రాజు మాట్లాడుతూ– ''నానికి ఓవర్‌సీస్‌లో హయ్యెస్ట్ గ్రాసర్ ఫిల్మ్‌గా 'దసరా' ఉంది. ఈ సినిమాను 'హిట్ 3' క్రాస్ చేసింది. అలాగే తెలంగాణలో కూడా మేం ఇదే ఎక్స్‌పెక్ట్ చేస్తున్నాం'' అని అన్నారు. ''చాలా రిలీజ్‌లు చూశాను. కానీ ఈ రిలీజ్ వైబ్, సినిమా బుకింగ్స్ అదిరిపోయాయి. 'హిట్ 3' సక్సెస్ తెలుగు సినిమా సక్సెస్'' అని నాని అన్నారు. ''నానీగారి నమ్మకాన్ని నిలబెట్టాననే అనుకుంటున్నాను'' అని తెలిపారు శైలేష్ కొలను. కెమెరామేన్ షాన్ వర్గీస్ మాట్లాడారు.

ఆశిష్ దేత్తడి




'రౌడీ బాయ్స్, లవ్ మీ' వంటి సినిమాలతో తెలుగు ప్రేక్షకులను అలరించిన హీరో ఆశిష్ తాజా చిత్రానికి 'దేత్తడి' అనే టైటిల్ ఖరారైంది. ఆదిత్య రావు గంగసాని ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం కానున్నారు. శ్రీమతి అనిత సమర్పణలో శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్, రుతమ్ స్టోరీ ల్యాబ్ పతాకాలపై 'దిల్' రాజు, శిరీష్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. గురువారం (మే 1) ఆశిష్ బర్త్ డే సందర్భంగా 'దేత్తడి' సినిమాను ప్రకటించి, ఫస్ట్ లుక్ రిలీజ్ చేశారు. ''ఈ చిత్రంలో మాస్ మేకోవర్‌లో కనిపిస్తారు ఆశిష్. హైదరాబాదీ స్లాంగ్‌లో డైలాగ్స్ చెబుతారు. హైదరాబాద్ కల్చర్, భావోద్వేగాల మేళవింపుతో 'దేత్తడి' ప్రేక్షకులను అలరించనుంది'' అని యూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు క్రియేటివ్ ప్రొడ్యూసర్: రుతమ్ సమర్.

భారత్ ఎంటర్‌టైన్‌మెంట్ హబ్‌గా మారుతోంది

● ఆస్కార్ అంటే రాజమౌళి గుర్తొస్తారు – ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

''కంటెంట్ క్రియేటర్స్ బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. మనుషులను మనం రోబోలుగా మార్చకూడదు. వారిని మరింత సున్నితంగా తీర్చిదిద్దాలి. సంగీతం, నృత్యం, కళల ద్వారా మానవ సున్నితత్వాన్ని పెంపొందించవచ్చు. కంటెంట్ క్రియేటర్లను ప్రోత్సహిస్తాం. భారత్ ఎంటర్‌టైన్‌మెంట్ హబ్‌గా మారుతోంది. అలాగే ఆరెంజ్ ఎకానమీకి (సృజనాత్మకత, సాంస్కృతిక అంశాల ఆధారంగా అభివృద్ధి చెందే ఆర్థిక వ్యవస్థ) దేశంలో నాంది పడింది. ఇది దేశ ఆర్థిక వృద్ధికి కీలకం. కంటెంట్, క్రియేటివిటీ, కల్చర్ అనేవి ఆరెంజ్ ఎకానమీకి మూడు స్తంభాలు'' అని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. ముంబైలోని జియో వరల్డ్ కన్వెన్షన్ సెంటర్‌లో 'వరల్డ్ ఆడియో విజువల్ అండ్ ఎంటర్‌టైన్మెంట్ సమ్మిట్ (వేవ్స్)– 2025'ని గురువారం ప్రారంభించారు నరేంద్ర మోదీ. క్రియేటివ్ ఎకానమీ, ఎంటర్‌టైన్‌మెంట్, డిజిటల్ మీడియా ఇండస్ట్రీలను ప్రోత్సహించేందుకు 'ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్రియేటివ్ టెక్నాలజీ' (ఐఐసీటీ)ని దాదాపు రూ. 400 కోట్లతో ముంబైలో స్థాపించనున్నట్లు ఈ సందర్భంగా కేంద్ర సమాచార–ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. 'వేవ్స్'లో ఆమిర్ ఖాన్, నాగార్జున, ఫర్హాన్ అక్తర్, నాగ చైతన్య–శోభిత ధూళిపాళ, రాజ్ కుమార్ రావు, కబీర్ బేడీ, అనుపమ్ ఖేర్, అనిల్ కపూర్, శ్రీలీల, పలువురు దక్షిణాది ఫిలిం చాంబర్ ప్రముఖులు పాల్గొన్నారు. 'కనెక్టింగ్ క్రియేటర్స్, కనెక్టింగ్ కంట్రీస్' అనే థీమ్‌తో నాలుగు రోజుల పాటు జరగనున్న ఈ సదస్సులో 100కి పైగా దేశాల నుంచి 10,000 మంది డెలిగేట్స్, 1,000 మంది క్రియేటర్స్, 300 కంపెనీలు, 350 స్టార్టప్ కంపెనీలు పాల్గొంటున్నాయి. 'వేవ్స్' సదస్సు ప్రారంభ సూచికగా ప్రముఖ సంగీతదర్శకుడు కీరవాణి సారథ్యంలో ప్రముఖ గాయనీమణులు చిత్ర, శ్రేయా ఘోషల్, మంగ్లీ, లిప్సిక బృందం పలు భారతీయ భాషల సమాహారమైన ప్రారంభ గీతాన్ని ఆలపించడం ఆహూతులను అలరించింది.

ఈ వేదికపై ప్రధాని మోదీ ఇంకా మాట్లాడుతూ– ''సృజనాత్మకతను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో త్వరలోనే 'వేవ్స్' అవార్డులను కూడా ప్రతిష్ఠాత్మకంగా అందించనున్నాం. ఇప్పుడు క్రియేట్ ఇన్ ఇండియా, క్రియేట్ ఫర్ ది వరల్డ్ సమయం. ప్రపంచం కొత్త కథల కోసం ఎదురుచూస్తున్న నేపథ్యంలో భారత కథలు గ్లోబల్ రీచ్‌ని సాధిస్తున్నాయి. భారత సినిమాలు 100కిపైగా దేశాల్లో నేరుగా విడుదలవుతున్నాయి. భారతీయ సంస్కృతిని ప్రపంచవ్యాప్తంగా తీసుకెళ్లడంలో మన దేశ సినిమా రంగం విజయం సాధించింది. 'ఆర్ఆర్ఆర్' సినిమాకి ఆస్కార్ దక్కడమే అందుకు నిదర్శనం. రష్యాలో రాజ్ కపూర్ చిత్రాలు పాపులర్. కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ అంటే సత్యజిత్ రే పేరు, ప్రతిష్ఠలు గుర్తొస్తాయి. ఆస్కార్ అనగానే ఏఆర్ రెహమాన్, రాజమౌళి ('ఆర్ఆర్ఆర్' చిత్రాన్ని ప్రస్తావించి) గుర్తొస్తారు. ఇటీవల 50 దేశాల గాయకులు కలిసి 'వైష్ణవ జనతో' అనే గీతాన్ని ఆలపించారు. సృజనాత్మకత ఉన్న యువతే దేశానికి అసలైన ఆస్తి'' అని పేర్కొన్నారు.



● నరేంద్ర మోదీ



● మోహన్ లాల్, రజనీకాంత్, హేమ మాలిని, చిరంజీవి, అక్షయ్ కుమార్, మిథున్ చక్రవర్తి



● షారుక్, దీపిక

''బాల్యంలో నేనెక్కువగా డ్యాన్సులు చేసేవాడిని. అలా నటనపై ఆసక్తి మొదలైంది. చెన్నై వెళ్లి ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో చేరాను. అప్పటికే ఎన్టీఆర్, ఏఎన్నార్, కృష్ణ, శోభన్‌బాబుగార్లు... ఇలా అరడజనుకు పైగా స్టార్ హీరోలున్నారు. వారికంటే భిన్నంగా ఏం చేయగలనో ఆలోచించి, నాదైన శైలిలో ఫైట్స్, డ్యాన్స్ చేశా. మేకప్ లేకుండా సహజంగా నటించడంలో 'మృగయా'లోని మిథున్ చక్రవర్తిగారు, స్టంట్స్ విషయంలో 'షోలే'లో అమితాబ్‌గారు, డ్యాన్స్‌లో కమల్‌హాసన్ గారు స్ఫూర్తిగా నిలిచారు. నన్ను నేను మల్చుకుంటూ ఈ స్థాయికి చేరుకున్నాను''. – హీరో చిరంజీవి



● నరేంద్ర మోదీ, సునీత్గా బల్లా, పి. మీనాక్షి, అశ్వినీ వైష్ణవ్

'వేవ్స్' తొలి రోజున ఐదుగురు భారతీయ సినిమా దిగ్గజాల స్మారక తపాలా బిళ్లలను మోదీ విడుదల చేశారు. వీరిలో దక్షిణాది ప్రముఖ నటి–దర్శక–నిర్మాత–గాయని భానుమతి ఉండటం విశేషం. ఇంకా దర్శక–నిర్మాత–నటుడు గురుదత్, దర్శకుడు రుత్విక్ ఘటక్, దర్శక–నిర్మాత రాజ్ ఖోస్లా, మ్యూజిక్ డైరెక్టర్ సలీల్ చౌదరిల పోస్టల్ స్టాంపులు కూడా ఉన్నాయి. భానుమతి కుటుంబం పక్షాన ఆమె మనవరాలు పి. మీనాక్షి స్టాంప్‌ను అందుకున్నారు.



ప్రమాదం జరిగితే కష్టం, నష్టమే. కానీ, అనుకోకుండా కొన్ని ప్రమాదాలు మంచి కూడా చేస్తాయి. ప్రముఖ హీరో అల్లు అర్జున్ స్వయంగా ఈ మాట అంటున్నారు. 'వేవ్స్'లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ– "కెరీర్ తొలి రోజుల్లో నా దృష్టి అంతా ఫిజికల్ ఫిట్‌నెస్, ఎజిలిటీ మీదే ఉండేది. కానీ, జీవితంలో ఒక ఘటన నా ఆలోచననే మార్చేసింది. నా పదో సినిమా తర్వాత నా భుజానికి దెబ్బ తగిలి, ఆస్ట్రేలియాలో సర్జరీ చేయించుకున్నా. అంతా బాగైపోయి, నాలుగో వారం నుంచి సెట్స్ మీదకు వెళ్లిపోవచ్చనుకున్నా. డాక్టర్లు 6 నెలలు రెస్ట్ తప్పనిసరి అన్నారు. నాకు కొత్తగా పెళ్ళయింది. ఓ సినిమా సగంలో ఉంది. అప్పటి దాకా ఫిజికల్ ఫిట్‌నెస్‌కే ప్రాధాన్యం ఇస్తూ వచ్చిన నాకు ఒక్కసారిగా జ్ఞానోదయం అయింది. వయసు పెరిగే కొద్దీ ఫిట్‌నెస్, ఎజిలిటీ తగ్గుతాయి. కానీ, నటనపై దృష్టి పెడితే అది చిరకాలం మిగిలిపోతుందని గ్రహించా. అక్కడి నుంచి నా ఆలోచనే మారిపోయింది" అని వివరించారు. ఇంకా మాట్లాడుతూ – "పదో సినిమా దగ్గర మొదలైన ఆ ఆలోచన ఇరవయ్యో సినిమా 'పుష్ప–1' దగ్గరకు వచ్చేసరి కల్లా నన్ను జాతీయ ఉత్తమ నటుడిగా, అందులోనూ తెలుగు సినీరంగం నుంచి ఆ ఘనత అందుకున్న తొట్ట తొలి నటుడిగా నిలిపింది. పదో సినిమా సమయంలో ఆ యాక్సిడెంట్ జరగకపోతే... నా దృక్పథం ఇలా మారేది కాదు. అందుకే, కొన్ని యాక్సిడెంట్లు అనుకోకుండా మన మంచికే జరుగుతాయి. మొత్తం నా ఆలోచనలు, కెరీర్‌నే మార్చేసిన ఆ యాక్సిడెంట్ నా జీవితంలో పెద్ద గిఫ్ట్" అని అల్లు అర్జున్ వివరించారు. 'సాక్షి' ఆయనను పలకరించినప్పుడు "మెడిసిన్, టెక్నాలజీ లాంటి అనేక రంగాలలో చాలా కాలంగా జరుగుతున్న సమ్మిట్‌లు చూసి, అలాంటివి మన సినీ, వినోద రంగంలో కూడా జరగాలనుకున్నాను. ప్రధాని మోదీ చొరవతో తొలిసారిగా వేవ్స్ సదస్సు జరగడం శుభారంభం" అన్నారు.

"కథ, కథనం అనేవి వేలాది సంవత్సరాలుగా భారతీయ సంస్కృతిలో భాగం. మనకు కొన్ని వందల భాషలు ఉన్నాయి. ప్రతి భాషలో, ప్రతి ప్రాంతంలో తమవైన లక్షల కథలు ఉన్నాయి. అసలు కథాకథనాలు మన నరనరాల్లో భాగం. ఆ విషయంలో మరి ఏ ఇతర దేశమూ మన దగ్గరకు కూడా రాదు. అయినప్పటికీ, అమెరికా, చైనా, జపాన్, సౌత్ కొరియా తదితర దేశాల వినోద రంగానికి మనం దీటుగా లేము. సినిమా, టీవీ, డిజిటల్ మీడియా లాంటి వాటిని అనుసంధానిస్తూ మనకు ఒక లాంచ్ ప్యాడ్ ఇన్నాళ్లు కరువైంది. ఇప్పుడు సరిగ్గా ఆ లోటును తీర్చే ఆ లాంచ్ ప్యాడ్ వేవ్స్". – దర్శకుడు రాజమౌళి



'ది జర్నీ: ఫ్రమ్ అవుట్‌సైడర్ టు రూలర్' అనే అంశంపై జరిగిన చర్చకు బాలీవుడ్ దర్శక–నిర్మాత కరణ్ జోహార్ మోడరేటర్‌గా వ్యవహరించగా, నటుడు షారుక్ ఖాన్, నటి దీపికా పదుకోన్ మాట్లాడారు. ''యువకుడిగా ఉన్నప్పుడు నేను ధైర్యంగా, ఎక్కువ ఆత్మవిశ్వాసంతో ఉండేవాణ్ణి. అయితే కాస్త కూల్‌గా ఉండేవాడిని. యంగ్ షారుక్ అప్పుడు కూల్‌గా ఉన్నాడు కనుకనే ఇంత దూరం రాగలిగాడు'' అన్నారు షారుక్. ఇంకా మాట్లాడుతూ – ''సినిమా వినోదం ప్రజలకు చౌకగా లభించాలి. చిన్న చిన్న పట్టణాల్లో చిన్న థియేటర్స్ ఉండాలి. అప్పుడు భారతీయ సినిమా దేశ నలు మూలలకు చేరువ అవుతుంది'' అని చెప్పుకొస్తూ, దర్శక–నిర్మాత కరణ్ జోహార్ స్క్రిప్ట్‌ను తాను రిజెక్ట్ చేసిన సందర్భాన్ని గుర్తు చేసుకున్నారు షారుక్. ఇంకా ఇండస్ట్రీలోకి వచ్చే కొత్త తరం తమ ఒరిజినాలిటీని కోల్పోకుండా ఉండాలని, ఇమేజ్‌ని నమ్మవద్దని సలహా ఇచ్చారు షారుక్. దీపికా పదుకోన్ మాట్లాడుతూ– ''18 ఏళ్ల అమ్మాయి (తనని ఉద్దేశించి) ధైర్యంగా ఓ పెద్ద సిటీకి వచ్చింది. నా జర్నీని ఇప్పుడు నేను తిరిగి చూసుకుంటుంటే... ఫర్లేదు. నేను బాగానే చేశాననిపిస్తోంది'' అన్నారు.

– ముంబై నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి

సాక్షి బిజినెస్

శుక్రవారం
2-5-2025

స్టాక్ మార్కెట్లు

(తొలి రెండు రాత్రి 11:30 ముగింపు)

దేశీ సూచీలు (బుధవారం ముగింపు)

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
46	2
80,242	24,334

విదేశీ సూచీలు

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	17,824	▲	378
డోజోన్స్	40,941	▲	271
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,497	▲	2
డాక్స్ (బుధవారం ముగింపు)	22,497	▲	71
షాంఘై (బుధవారం ముగింపు)	3,279	▽	8
నికాయ్	36,045	▲	406

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	84.90	85.92
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	112.10	115.02
€	యూరో	ఎస్‌బీఐ	95.67	98.37
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	58.85	60.39
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.46	55.65
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	62.52	67.92
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.79	23.32
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.27	24.03
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.78	12.60

కాగ్నిజెంట్‌లో ఫ్రెషర్లకు 20 వేల కొలువులు



న్యూఢిల్లీ: అమెరికన్ ఐటీ దిగ్గజం కాగ్నిజెంట్ ఈ ఏడాది సుమారు 20,000 మంది ఫ్రెషర్లను రిక్రూట్ చేసుకునే యోచనలో ఉంది. ఏఐ ఆధారిత సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, మేనేజ్డ్ సర్వీసెస్ విభాగాల్లో ఈ కొలువులు ఉండనున్నాయి. ప్రస్తుతం కంపెనీలో మొత్తం ఉద్యోగుల సంఖ్య 3,36,300గా ఉంది. 'ఇన్వెస్టర్ డే సందర్భంగా చెప్పినట్లు మా వ్యూహంలో భాగంగా 20,000 మంది ఫ్రెషర్లను తీసుకోబోతున్నాం. గతేడాదితో పోలిస్తే ఇది రెట్టింపు' అని కంపెనీ సీఈవో ఎస్ రవి కుమార్ తెలిపారు. ఫ్రెషర్లను తీసుకోవడం, ఏఐ ద్వారా ఉత్పాదకతను పెంచుకోవడం, మానవ వనరుల వ్యయాలను తగ్గించుకునేలా సామర్థ్యాల వినియోగాన్ని మెరుగుపర్చుకోవడం వంటి మూడు అంశాలపై కంపెనీ ప్రధానంగా దృష్టి పెడుతున్నట్లు వివరించారు. ఈ ఏడాది జనవరి–మార్చ్ త్రైమాసికంలో కాగ్నిజెంట్ ఆదాయం సుమారు 7 శాతం పెరిగి 5.1 బిలియన్ డాలర్లకు చేరింది.

ఆటో.. అటూ ఇటూ!

ఏప్రిల్‌లో పెరిగిన మారుతీ, ఎంఅండ్‌ఎం సేల్స్

• హ్యుందాయ్, టాటా మోటార్స్ అమ్మకాలు డీలా



ముంబై: మార్కెట్లో నెలకొన్న పలు ప్రతికూల సవాళ్ల మధ్య మారుతీ సుజుకీ, మహీంద్రా అండ్ మహీంద్రా(ఎంఅండ్‌ఎం) కంపెనీల వాహన అమ్మకాలు ఏప్రిల్‌లో పెరిగాయి. అయితే టాటా మోటార్స్, హ్యుందాయ్ మోటార్ విక్రయాలు తగ్గాయి. ఆసక్తికరంగా, గత నెలలో దేశీయ ప్యాసింజర్ వాహన విభాగంలో ఎంఅండ్‌ఎం, టాటా మోటార్స్ రెండు, మూడు స్థానాలు దక్కించుకోగా, దీర్ఘకాలం పాటు ద్వితీయ స్థానంలో కొనసాగిన హ్యుందాయ్ మోటార్స్ నాలుగో స్థానానికి దిగివచ్చింది.

● మారుతీ సుజుకీ దేశీయంగా ఏప్రిల్ నెలలో 1,38,074 ప్యాసింజర్ వాహనాలు విక్రయించింది. గత ఏడాది ఏప్రిల్‌లో అమ్ముడైన 1,37,952 వాహనాలతో పోలిస్తే 1% ఎక్కువ. చిన్న కార్ల విభాగంలో ఆల్టో, ఎస్–ప్రెస్సో విక్రయాలు 11,519 నుంచి 6,332 యూనిట్లకు తగ్గాయి. కాంపాక్ట్ కార్ల విభాగంలో బాలెనో, సెలెరియో, డిజైర్, ఇగ్నిస్, స్విఫ్ట్, వేగన్–ఆర్ అమ్మకాలు 56,953 నుంచి 61,591 యూనిట్లకు పెరిగాయి. ఎగుమతులు కలుపుకొని ఈ ఏప్రిల్‌లో కంపెనీ 1,79,791 యూనిట్ల వాహనాలు విక్రయించింది.

● మహీంద్రా అండ్ మహీంద్రా యుటిలిటీ వాహన విక్రయాలు 28% వృద్ధి చెంది 41,000 యూనిట్ల నుంచి 52,330 యూనిట్లకు వచ్చి చేరాయి. మా పోర్ట్‌ఫోలియో బలాన్ని, **కస్టమర్ల ప్రతిపాదనలను అమ్మకాల సంఖ్య తెలియజే**స్తుందని కంపెనీ ఆటోమోటివ్ డివిజన్ ప్రెసిడెంట్ విజయ్ నక్రా తెలిపారు.

● టాటా మోటార్స్ దేశీయ ప్యాసింజర్ వాహన అమ్మకాలు(ఈవీలను కలుపుకొని) క్రితం ఏడాది ఇదే ఏప్రిల్‌తో పోలిస్తే 47,883 యూనిట్ల నుంచి 45,199 యూనిట్లకు దిగివచ్చాయి.

● హ్యుందాయ్ మోటార్ ఇండియా దేశీయంగా మొత్తం వాహన విక్రయాలు 12% క్షీణించి 44,374 యూనిట్లకు వచ్చి చేరాయి. గతేడాది ఇదే నెలలో అమ్మ**కాలు 50,021 గా ఉన్నాయి.**

ఏప్రిల్‌లో ఎగుమతులతో కలుపుకుని కంపెనీల వాహన విక్రయాలు

కంపెనీ	2025	2024	వృద్ధి/క్షీణత (%)
మారుతీ	1,79,791	1,68,089	7
ఎంఅండ్‌ఎం	84,170	---	19
టాటా మోటార్స్	72,753	77,521	(-6)
హ్యుందాయ్	60,774	63,701	(-5)
టయోటా కిర్లోస్కర్	27,324	20,494	33
కియా ఇండియా	23,623	19,968	18
ఎంజీ మోటార్	5,829	4,725	23
హోండా కార్స్	3,360	4,351	(-22)
ద్విచక్ర వాహనాలు			
టీవీఎస్ మోటార్స్	4,43,896	3,83,615	16
రాయల్ ఎన్‌ఫీల్డ్	86,559	82,043	6
సుజుకీ మోటార్‌సైకిల్	1,12,948	99,377	14
వాణిజ్య వాహనాలు			
వీఈ కమర్షియల్	6,846	5,377	27
మహీంద్రా ట్రాక్టర్స్	38,516	35,805	8

జీఎస్‌టీ వసూళ్లు.. కొత్త రికార్డు

• ఏప్రిల్‌లో రూ.2.37 లక్షల కోట్లు
• 12.6 శాతం పెరుగుదల
• నెలవారీగా ఆల్‌టైమ్ గరిష్టం



న్యూఢిల్లీ: వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) వసూళ్ల పరంగా ఈ ఏడాది ఏప్రిల్ నెలలో సరికొత్త రికార్డు నమోదైంది. గతేడాది ఏప్రిల్ నెల గణాంకాలతో పోల్చి చూస్తే 12.6 శాతం అధికంగా రూ.2.37 లక్షల కోట్లు వసూలైంది. 2017 జూలై 1 నుంచి జీఎస్‌టీ అమల్లోకి వచ్చిన తర్వాత ఒక నెలవారీ గరిష్ట ఆదాయం ఇదే కావడం గమనార్హం. 2024 ఏప్రిల్ నెలకు జీఎస్‌టీ ఆదాయం రూ.2.10 లక్షల కోట్లుగా ఉంది. ఇక ఈ ఏడాది మార్చి నెలలో ఇది రూ.1.96 లక్షల కోట్లుగా ఉంది. దేశీ లావాదేవీలపై జీఎస్‌టీ 10.7 శాతం పెరిగి రూ.1.9 లక్షల కోట్లుగా నమోదైంది. దిగుమతి చేసుకున్న వస్తువులపై జీఎస్‌టీ 20.8 శాతం వృద్ధితో రూ.46,913 కోట్లకు చేరింది. రిఫండ్‌లు 48% అధికంగా రూ.27,341 కోట్లుగా ఉన్నాయి. రిఫండ్‌లను సర్దుబాటు చేసి చూస్తే నికర జీఎస్‌టీ ఆదాయం క్రితం ఏడాది ఇదే నెలతో పోల్చి చూసినప్పుడు 9 శాతం వృద్ధితో రూ.2.09 లక్షల కోట్లకు చేరుకుంది. దేశీ లావాదేవీలపై సెంట్రల్ జీఎస్‌టీ రూ.48,634 కోట్లు కాగా, స్టేట్ జీఎస్‌టీ రూ.59,372 కోట్లు సమకూరింది. ఇంటిగ్రేటెడ్ జీఎస్‌టీ రూ.69,504 కోట్లు, సెస్స్ **వసూళ్లు రూ.12,2**93 కోట్ల చొప్పున ఉన్నాయి.

బలమైన ఆర్థిక పనితీరు: డెలాయిట్

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి నెల జీఎస్‌టీ వసూళ్లు రూ.2 లక్షల కోట్లు మించడం బలమైన ఆర్థిక పనితీరుకు నిదర్శనమని డెలాయిట్ ఇండియా పార్ట్‌నర్ ఎంఎస్ మణి పేర్కొన్నారు. అన్ని ప్రధాన తయారీ, వినియోగ రాష్ట్రాల్లో జీఎస్‌టీ వసూళ్లు ఏప్రిల్ నెలలో 11–16 శాతం మధ్య ఉన్నాయని.. అంతకుముందు నెలల్లో పెద్ద రాష్ట్రాల్లో తక్కువ వృద్ధి నమోదైన దానికి ఇది భిన్నమని తెలిపారు. అంతర్జాతీయ అనిశ్చితుల్లోనూ భారత ఆర్థిక వ్యవస్థలోని బలాన్ని జీఎస్‌టీ వసూళ్లు చాటుతున్నట్టు ఈవై ట్యాక్స్ పార్ట్‌నర్ సౌరభ్ అగర్వాల్ అన్నారు.

సహకారాత్మక సమాఖ్య స్ఫూర్తికి నిదర్శనం

''జీఎస్‌టీ వసూళ్ల గణాంకాలు భారత ఆర్థిక వ్యవస్థ బలాన్ని, సహకారాత్మక సమాఖ్యవాదాన్ని చాటుతున్నాయి''అని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. పన్ను చెల్లింపుదారులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. అన్ని రాష్ట్రాల ఆర్థిక మంత్రులు, కేంద్ర, రాష్ట్రాల జీఎస్‌టీ అధికారుల కృషిని అభినందించారు

అదానీ పోర్ట్స్ లాభం జూమ్



క్యూ4లో రూ. 3,025 కోట్లు

న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ దిగ్గజం **అదానీ పోర్ట్స్** అండ్ సెజ్(ఏపీసెజ్) గతేడాది(2024–**25) చివరి** త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితా**లు సాధిం**చింది. జనవరి–మార్చి(క్యూ4)లో **కన్సాలిడే**టెడ్ నికర లాభం 50 శాతం జంప్‌చే**సి రూ.** 3,025 కోట్లను తాకింది. అంతక్రితం **ఏడా**ది(2023–24) ఇదే కాలంలో **రూ.** 2,015 కోట్లు మాత్రమే ఆర్జించింది. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి ని**కర** లాభం 37 శాతం ఎగసి రూ. 11,061 కోట్లకు చేరింది. ఇది కంపెనీ చరిత్రలో**నే** అత్యధికంకాగా.. మొత్తం ఆదాయం 16 శాతం బలపడి రూ. 31,079 కోట్లయ్యింది. క్యూ4లో కార్గో నిర్వహణ 8 శాతం పెరిగి 118 మిలియన్ టన్నులను తాకింది. పూర్తి ఏడాదిలో 7 శాతం అధికమై 450 మిలియన్ టన్నులకు చేరింది. కాగా.. పోర్టులు, లాజిస్టిక్స్ బిజినెస్‌లలో వృద్ధి నేపథ్యంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26)లోనూ పటిష్ట పనితీరు చూపనున్నట్లు కంపెనీ పేర్కొంది. ఆదాయంలో 16–22 శాతం వృద్ధిని అంచనా వేసింది. ఈ ఏడాది రూ. 11,000–12,000 కోట్ల పెట్టుబడులను వెచ్చించనున్నట్లు తెలియజేసింది.

వినోద రంగం @ 100 బిలియన్ డాలర్లు

• లక్షల కొద్దీ ఉద్యోగావకాశాలు
• వచ్చే పదేళ్లలో అంచనా
• వేవ్స్ సదస్సులో రిలయన్స్ చీఫ్ ముకేశ్ అంబానీ

న్యూఢిల్లీ: వచ్చే పదేళ్లలో దేశీ మీడియా, వినోద పరిశ్రమ మూడు రెట్లు పెరిగి, 100 బిలియన్ డాలర్లకు చేరనుందని పారిశ్రామిక దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్ ముకేశ్ అంబానీ తెలిపారు. దీనితో లక్షల కొద్దీ ఉద్యోగావకాశాలు వస్తాయని, ఇతర రంగాలూ ప్రయోజనాలను పొందుతాయని వేవ్స్ 2025 సదస్సు ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా పేర్కొన్నారు. డిజిటల్ సాంకేతికతతో కథలను ఆసక్తికరంగా చెప్పే విశిష్ట సామర్థ్యాలు భారత్‌కి సొంతమని అంబానీ వివరించారు.



మనకు సాటిలేదు..

ప్రపంచంలో సంక్షోభం, అనిశ్చితి పెరిగిపోతున్న నేపథ్యంలో స్ఫూర్తివంతమైన మన కథలు భవిష్యత్తుపై ఆశాభావం కల్పిస్తాయని ఆయన పేర్కొన్నారు. వేల కొద్దీ సంవత్సరాలుగా మన పురాణేతిహాసాలు సౌభ్రాతృత్వం, సాహసం, ప్రకృతిపై ప్రేమను చాటి చెప్తూ ప్రపంచవ్యాప్తంగా ప్రజల మనస్సులను గెలుచుకున్నాయని అంబానీ వివరించారు. ఈ విషయంలో మరే దేశమూ మనకు సాటిరాదన్నారు. ముక్కలు చెక్కలవుతున్న ప్రపంచాన్ని తిరిగి బాగుచేయడానికి మన కథలను ఆత్మవిశ్వాసంతో మరోసారి పరిచయం చేయాల్సిన అవసరం ఉందన్నారు. మరోవైపు పహల్గాం ఉగ్రదాడికి సంతాపం తెలిపారు. 90 దేశాల నుంచి 10,000 మంది పైగా ప్రతినిధులు వేవ్స్ సదస్సులో పాల్గొంటున్నారు.

ఎటర్నల్ లాభం క్షీణత

క్యూ4లో రూ. 39 కోట్లకు పరిమితం



న్యూఢిల్లీ: జొమాటో, బ్లింకిట్ బ్రాండ్ల దిగ్గజం **ఎటర్నల్ గతేడాది** (2024–25) చివరి **త్రైమాసికంలో ఆ**సక్తికర ఫలితాలు ప్రక**టించింది. జన**వరి–మార్చి (క్యూ4)లో **కన్సాలిడేటెడ్** నికర లాభం 80 శాతం **నీరసించి** రూ. 39 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం ఏడాది (2023–24) ఇదే కాలంలో రూ. 175 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం రూ. 3,562 కోట్ల నుంచి రూ. 5,833 కోట్లకు ఎగసింది. అయితే మొత్తం వ్యయాలు రూ. 3,636 కోట్ల నుంచి రూ. 6,104 కోట్లకు పెరిగాయి. రెస్టారెంట్ల సంఖ్య, కిచెన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వంటి అంశాలు 10 నిమిషాలలో డెలివరీ సర్వీసులకు తగినట్లు లేకపోవడంతో జొమాటో క్విక్, ఎవిరిడే బిజినెస్‌లను మూసివేస్తున్నట్లు వెల్లడించింది.

ఏడాదిన్నరలో ఏఐతోనే కోడింగ్: జుకర్‌బర్గ్



న్యూఢిల్లీ: రాబోయే ఏడాది–ఏడాదిన్నర కాలంలో తమ లామా **ప్రాజె**క్టుకు సంబంధించి చాలా మటుకు కోడింగ్ కృత్రిమ మేధే (ఏఐ) **చేస్తుం**దని మెటా సీఈవో మార్క్ జుకర్‌బర్గ్ వెల్లడించారు. ఇప్పటికే **సగటు** నిపుణులతో పోలిస్తే ఏఐ మెరుగ్గా కోడింగ్ చేస్తోందని, రాబోయే **రోజు**ల్లో టాప్ కోడర్లను మించిపోగలదని ఆయన ఓ ఇంటర్వ్యూలో **చెప్పా**రు. ప్రస్తుతం ఏదైనా కోడ్‌లోని సెక్షన్‌ని ఇస్తే ఏఐ తక్కున ఆటో–కంప్లీట్ చేస్తోందన్నారు. **ఇది** త్వరలోనే టెస్టింగ్, బగ్స్‌ను వెతికి పట్టుకోవడం, అత్యంత నాణ్యమైన కోడ్‌ను స్వతంత్రం**గా** రాయడంలాంటివి కూడా చేయగలదన్నారు. ఏఐ ఇప్పటికే ఒక మధ్య స్థాయి సాఫ్ట్‌వేర్ డెవ**లపర్** స్థానాన్ని భర్తీ చేయగలిగే స్థాయికి చేరిందంటూ ఇటీవలే ఆయన తెలిపారు.

సాక్షి స్పోర్ట్స్

మళ్లీ ఓడిన భారత మహిళల హాకీ జట్టు

పెర్త్: ఆస్ట్రేలియా పర్యటనలో భారత మహిళల హాకీ జట్టు వరుసగా మూడో పరాజయం చవిచూసింది. ఆస్ట్రేలియా సీనియర్ జట్టుతో గురువారం జరిగిన మ్యాచ్‌లో టీమిండియా 0–2 గోల్స్ తేడాతో ఓడిపోయింది. ఆస్ట్రేలియా తరఫున కొర్ట్నీ షోనెల్ (9వ నిమిషంలో), గ్రేస్ స్టీవర్ట్ (52వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు. ఇంతకుముందు ఆస్ట్రేలియా 'ఎ' జట్టుతో జరిగిన తొలి రెండు మ్యాచ్‌ల్లో భారత జట్టు వరుసగా 3–5తో, 2–3తో ఓటమి పాలైంది. ఐదు మ్యాచ్‌ల ఈ సిరీస్‌లో ప్రస్తుతం భారత్ 0–3తో వెనుకబడి ఉంది. రెండు జట్ల మధ్య నాలుగో మ్యాచ్ శనివారం జరుగుతుంది.

ముంబై 'సిక్సర్' రాజస్తాన్ 'అవుట్'

వరుసగా ఆరో మ్యాచ్‌లో గెలుపు

● రోహిత్, రికెల్టన్ అర్ధసెంచరీలు
● 'ప్లే ఆఫ్స్' రేసు నుంచి రాజస్తాన్ రాయల్స్ నిష్క్రమణ

ఐపీఎల్–2025లో 'ప్లే ఆఫ్స్' రేసుకు దూరమైన రెండో జట్టుగా రాజస్తాన్ రాయల్స్ నిలిచింది. సీజన్‌లో ఎనిమిదో పరాజయంతో ఆ జట్టు కథ ముగియగా, టాప్–4 బ్యాటర్లంతా చెలరేగడంతో ముంబై పట్టికలో 'టాప్'కు దూసుకెళ్లిపోయింది. ముందుగా పేలవ బౌలింగ్‌తో ముంబై ఇండియన్స్‌కు భారీ స్కోరు చేసే అవకాశం కల్పించిన రాయల్స్... ఆ తర్వాత చెత్త బ్యాటింగ్‌తో పూర్తిగా చేతులెత్తేసింది. తిరుగులేని ఆటతో చెలరేగుతున్న హార్దిక్ పాండ్యా బృందం ఖాతాలో ఇది వరుసగా ఆరో విజయం కావడం విశేషం.

జైపూర్: ఐపీఎల్ సీజన్‌లో చెన్నై తర్వాత ఇప్పుడు రాజస్తాన్ రాయల్స్ అధికారికంగా 'ప్లే ఆఫ్స్' అవకాశాలు చేజార్చుకుంది. గురువారం జరిగిన మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ 100 పరుగుల తేడాతో రాజస్తాన్‌పై ఘన విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ముంబై 20 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 217 పరుగులు చేసింది. రికెల్టన్ (38 బంతుల్లో 61; 7 ఫోర్లు, 3 సిక్స్‌లు), రోహిత్ శర్మ (36 బంతుల్లో 53; 9 ఫోర్లు) అర్ధ సెంచరీలతో శుభారంభం అందించగా... సూర్యకుమార్ యాదవ్ (23 బంతుల్లో 48 నాటౌట్; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు), హార్దిక్ పాండ్యా (23 బంతుల్లో 48 నాటౌట్; 6 ఫోర్లు, 1 సిక్స్) అదే జోరును కొనసాగించారు. రికెల్టన్, రోహిత్ తొలి వికెట్‌కు 71 బంతుల్లోనే 116 పరుగులు జోడించగా... సూర్య, పాండ్యా మూడో వికెట్‌కు 44 బంతుల్లో అభేద్యంగా 94 పరుగులు జత చేశారు. అనంతరం రాజస్తాన్ 16.1 ఓవర్లలో 117 పరుగులకే ఆలౌటైంది. జోఫ్రా ఆర్చర్ (27 బంతుల్లో 30; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) టాప్ స్కోరర్‌గా నిలిచాడు.

సొంత మైదానంలో జరిగిన ఈ మ్యాచ్‌లో రాజస్తాన్ మేనేజ్‌మెంట్ 'పింక్ ప్రామిస్' పేరుతో సౌరశక్తికి సంబంధించి ప్రత్యేక ప్రచారాన్ని నిర్వహించింది. దీని ప్రకారం ఆటగాళ్లంతా పూర్తిగా 'పింక్' కిట్ ధరించగా... బ్యాటర్ కొట్టే ఒక్కో సిక్స్‌కు ఆరు ఇళ్లకు సౌరశక్తి సదుపాయాన్ని కల్పిస్తారు.

టాప్–4 విధ్వంసం...

ముంబై బ్యాటింగ్ మొదటి నుంచీ దూకుడుగా సాగింది. ఫారుఖీ ఓవర్లో వరుసగా 6, 4 కొట్టిన రికెల్టన్... ఆర్చర్ ఓవర్లో వరుసగా 4, 6 బాదాడు. తీక్షణ ఓవర్లో రోహిత్ 3 ఫోర్లు కొట్టడంతో పవర్‌ప్లే ముగిసేసరికి స్కోరు 58 పరుగులకు చేరింది. కార్తికేయ ఓవర్లో భారీ సిక్స్‌తో 29 బంతుల్లో రికెల్టన్ అర్ధ సెంచరీ పూర్తి చేసుకోగా, కొద్ది సేపటికే 31 బంతుల్లో రోహిత్ హాఫ్ సెంచరీ మార్క్‌ను అందుకున్నాడు. వీరిద్దరు 7 పరుగుల తేడాతో వెనుదిరిగిన తర్వాత సూర్య, పాండ్యా ధాటి మొదలైంది. ఫారుఖీ ఓవర్లో పాండ్యా 3 ఫోర్లు, సిక్స్‌తో చెలరేగిపోవడంతో 21 పరుగులు వచ్చాయి. ఆర్చర్ ఓవర్లో సిక్స్‌తో స్కోరును 200 దాటించిన సూర్య... ఆఖరి బంతికి సిక్స్‌తో ఇన్నింగ్స్ ముగించాడు.





జైస్వాల్‌ను అవుట్ చేసిన బౌల్ట్‌కు రోహిత్ అభినందన

టపటపా...

ఇన్నింగ్స్‌లో 5 ఓవర్లలోపే 5 వికెట్లు కోల్పోవడంతో రాజస్తాన్ గెలుపు అవకాశాలు అక్కడే ముగిసిపోగా, ఆ తర్వాత లాంఛనమే మిగిలింది. గత మ్యాచ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ (0) ఈసారి డకౌట్ కావడంతో రాయల్స్ పతనం మొదలైంది. బౌల్ట్ ఓవర్లో రెండు సిక్స్‌లు కొట్టిన యశస్వి జైస్వాల్ (13) అదే ఓవర్లో వెనుదిరిగాడు. బౌల్ట్ తర్వాతి ఓవర్లో నితీశ్ రాణా (9) అవుట్ కాగా... బుమ్రా తన తొలి ఓవర్లోనే వరుస బంతుల్లో పరాగ్ (16), హెట్‌మైర్ (0)లను వెనక్కి పంపించాడు. ధ్రువ్ జురేల్ (11) ప్రభావం చూపలేకపోవడంతో రాజస్తాన్ కుప్పకూలింది.



స్కోరు వివరాలు

ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్: రికెల్టన్ (బి) తీక్షణ 61; రోహిత్ (సి) జైస్వాల్ (బి) పరాగ్ 53; సూర్యకుమార్ (నాటౌట్) 48; హార్దిక్ పాండ్యా (నాటౌట్) 48; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (20 ఓవర్లలో 2 వికెట్లకు) 217. వికెట్ల పతనం:** 1–116, 2–123. **బౌలింగ్:** ఆర్చర్ 4–0–42–0, ఫారుఖీ 4–0–54–0, తీక్షణ 4–0–47–1, కార్తికేయ 2–0–22–0, మధ్వాల్ 4–0–39–0, పరాగ్ 2–0–12–1.

రాజస్తాన్ రాయల్స్ ఇన్నింగ్స్: జైస్వాల్ (బి) బౌల్ట్ 13; వైభవ్ (సి) జాక్స్ (బి) చహర్ 0; నితీశ్ రాణా (సి) తిలక్ (బి) బౌల్ట్ 9; పరాగ్ (సి) రోహిత్ (బి) బుమ్రా 16; జురేల్ (సి అండ్ బి) కరణ్ శర్మ 11; హెట్‌మైర్ (సి) సూర్యకుమార్ (బి) బుమ్రా 0; శుభమ్ దూబే (సి) బౌల్ట్ (బి) పాండ్యా 15; ఆర్చర్ (సి) బుమ్రా (బి) బౌల్ట్ 30; తీక్షణ (సి) సూర్య (బి) కరణ్ శర్మ 2; కార్తికేయ (సి) చహర్ (బి) కరణ్ శర్మ 2; మధ్వాల్ (నాటౌట్) 4; ఎక్స్‌ట్రాలు 15; **మొత్తం (16.1 ఓవర్లలో ఆలౌట్) 117. వికెట్ల పతనం:** 1–1, 2–18, 3–41, 4–47, 5–47, 6–64, 7–76, 8–87, 9–91, 10–117. **బౌలింగ్:** దీపక్ చహర్ 2–0–13–1, బౌల్ట్ 2.1–0–28–3, బుమ్రా 4–0–15–2, బాష్ 3–0–29–0, హార్దిక్ పాండ్యా 1–0–2–1, కరణ్ శర్మ 4–0–23–3.

ఐపీఎల్–2025 పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	ర.రే
ముంబై	11	7	4	0	14	1.274
బెంగళూరు	10	7	3	0	14	0.521
పంజాబ్	10	6	3	1	13	0.199
గుజరాత్	9	6	3	0	12	0.748
ఢిల్లీ	10	6	4	0	12	0.362
లక్నో	10	5	5	0	10	-0.325
కోల్‌కతా	10	4	5	1	9	0.271
రాజస్తాన్	11	3	8	0	6	-0.780
హైదరాబాద్	9	3	6	0	6	-1.103
చెన్నై	10	2	8	0	4	-1.211

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ఫ.తే- ఫలితం తేలనివి, పా-పాయింట్లు, ర.రే- రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

గుజరాత్ × హైదరాబాద్
వేదిక: అహ్మదాబాద్
రాత్రి 7: 30 గంటల నుంచి
స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

'ఖేల్‌రత్న' అందుకున్న సాత్విక్–చిరాగ్

భారత పురుషుల బ్యాడ్మింటన్ జోడీకి దక్కిన గౌరవం



చిరాగ్ శెట్టి, కేంద్ర క్రీడల మంత్రి మన్‌సుఖ్ మాండవీయ, సాత్విక్ సాయిరాజ్

న్యూఢిల్లీ: భారత బ్యాడ్మింటన్ డబుల్స్ ద్వయం సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి ఎట్టకేలకు జాతీయ అత్యున్నత క్రీడా పురస్కారం 'మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న'ను స్వీకరించారు. కేంద్ర క్రీడాశాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ గురువారం ఈ అవార్డును వీరిద్దరికి అందజేశారు. 2023 ఏడాదికిగాను ప్రకటించిన ఈ అవార్డును సాత్విక్–చిరాగ్ తీసుకోవడంలో చాలా ఆలస్యమైంది. రాష్ట్రపతి భవన్‌లో అధికారికంగా నిర్వహించిన కార్యక్రమ సమయంలో మరో చోట టోర్నీలు ఆడుతున్న ఈ డబుల్స్ జోడీ గైర్హాజరైంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో అందుకోవడానికి సిద్ధమైన తరుణంలో సాత్విక్ తండ్రి కాశీవిశ్వనాథ్ అనూహ్య మృతితో అవార్డు కార్యక్రమం వాయిదా పడింది. 'ఈ ఇద్దరు షట్లర్ల అత్యుత్తమ ప్రదర్శన, అంకితభావానికి దక్కిన గౌరవమిది. భవిష్యత్తులో వీరు మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తున్నా' అంటూ మాండవీయ ట్వీట్ చేశారు. 'ఎట్టకేలకు అవార్డును అందుకున్నాం. మేమిద్దరం జోడీగా మారిన సమయం నుంచి ప్రభుత్వం ఎంతో ప్రోత్సహిస్తూ అండగా నిలిచింది. మా విజయాల్లో వారి సహకారం ఎంతో ఉంది. గత కొద్ది రోజులుగా మేం ఆశించిన ప్రదర్శన ఇవ్వలేదు. అయితే ఇప్పుడు మళ్లీ చెలరేగి కొత్త విజయాలు సాధించేందుకు ఈ అవార్డు మాకు ప్రేరణనిస్తుంది' అని సాత్విక్–చిరాగ్ చెప్పారు. గత కొన్నేళ్లుగా ప్రపంచ బ్యాడ్మింటన్‌లో సాత్విక్–చిరాగ్ అగ్రశ్రేణి జోడీగా ఎదిగారు. ఆసియా క్రీడలు, కామన్వెల్త్ క్రీడల్లో 3 స్వర్ణాలు, 3 రజతాలు గెలుచుకున్న ఈ జంట 2022 వరల్డ్ చాంపియన్‌షిప్‌లో కాంస్యం సాధించింది. ర్యాంకింగ్స్‌లో వరల్డ్ నంబర్‌వన్ స్థానానికి చేరిన తొలి భారత జోడీగా నిలవడంతో పాటు టీమ్ ఈవెంట్ థామస్ కప్‌ను భారత్ గెలవడంలో కీలక పాత్ర పోషించింది. అనారోగ్య కారణాలతో ప్రస్తుతం జరుగుతున్న సుదిర్మన్ కప్ నుంచి వీరిద్దరు తప్పుకున్నారు.

భారత బాక్సర్లకు నాలుగు స్వర్ణాలు

పసిడి పతకాలు నెగ్గిన ఖుషీ, అహానా, జన్నత్, అన్షిక

అమ్మాన్ (జోర్డాన్): ఆసియా జూనియర్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో చివరి రోజు భారత బాక్సర్లు ఆకట్టుకున్నారు. అండర్–17 విభాగంలో నలుగురు భారత బాక్సర్లు స్వర్ణ పతకాలు సాధించగా... మరో ముగ్గురు రజత పతకాలు దక్కించుకున్నారు. బాలికల విభాగంలో ఖుషీ చంద్ (46 కేజీలు), అహానా శర్మ (50 కేజీలు), జన్నత్ (54 కేజీలు), అన్షిక (ప్లస్ 80 కేజీలు) ఆసియా చాంపియన్స్‌గా అవతరించగా... సిమ్రన్‌జీత్ కౌర్ (60 కేజీలు), హర్షిక (63 కేజీలు) రన్నరప్‌గా నిలిచి రజత పతకాలు గెలిచారు. బాలుర విభాగంలో దేవాన్ష్ (80 కేజీలు) రజత పతకాన్ని సొంతం చేసుకున్నాడు. ఓవరాల్‌గా అండర్–17 బాలికల విభాగంలో భారత్‌కు నాలుగు స్వర్ణాలు, రెండు రజతాలు, ఐదు కాంస్యాలు... బాలుర విభాగంలో ఒక రజతం, ఆరు కాంస్యాలు లభించాయి. బాలికల ఫైనల్స్‌లో ఖుషీ చంద్ 3:2తో అల్తాన్‌జుల్ (మంగోలియా)పై, అహానా శర్మ 5:0తో షోదియోనా (ఉజ్బెకిస్తాన్)పై, జన్నత్ 5:0తో సబ్రీనా చకోమనోవా (ఉజ్బెకిస్తాన్)పై, అన్షిక 5:0తో అయాలుమ్ ఒస్పనోవా (కజకిస్తాన్)పై విజయం సాధించారు.



ఖుషీ



అహానా



జన్నత్



అన్షిక

క్లుప్తంగా...

జూన్ 3 నుంచి టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ

సాక్షి, హైదరాబాద్: పదవ తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 3 నుంచి 13వ తేదీ వరకూ జరుగుతాయి. ఇందుకు సంబంధించిన టైం టేబుల్‌ను టెన్త్ పరీక్షల విభాగం గురువారం విడుదల చేసింది. ఏప్రిల్ 30న విడుదల చేసిన ఫలితాల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు ఈ పరీక్షలు రాసుకోవచ్చని సూచించింది. సంబంధిత స్కూల్ హెచ్‌ఎంల ద్వారా దరఖాస్తులను పంపుకోవాలని పేర్కొంది.

టైం టేబుల్

తేదీ	పరీక్ష
3.6.25	మొదటి భాష
4.6.25	ద్వితీయ భాష
5.6.25	మూడవ భాష (ఇంగ్లిష్)
6.6.25	మేథమెటిక్స్
9.6.25	ఫిజికల్ సైన్స్
10.6.25	బయలాజికల్ సైన్స్
11.6.25	సోషల్ స్టడీస్
12.6.25	ఓఎస్‌ఎస్‌సీ మెయిన్ లాంగ్వేజ్ పేపర్–1
13.6.25	ఓఎస్‌ఎస్‌సీ మెయిన్ లాంగ్వేజ్ పేపర్–2

రాష్ట్రంలో ఏప్రిల్‌లో రూ.6,983 కోట్ల జీఎస్టీ వసూళ్లు

- దేశవ్యాప్తంగా రూ.2.37 లక్షల కోట్లకు చేరిన జీఎస్టీ రాబడి



సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రంలో ఏప్రిల్ నెలలో వస్తు సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లు రూ.6,983 కోట్లుగా నమోదయ్యాయి. గత ఏడాది ఏప్రిల్‌తో పోల్చితే జీఎస్టీ వసూళ్లలో 12% వృద్ధి నమోదైంది. ఏప్రిల్ నెలకు సంబంధించిన జీఎస్టీ వసూళ్ల గణాంకాలను కేంద్ర ఆర్థికశాఖ గురువారం విడుదల చేసింది. ఏప్రిల్ నెల వరకు తెలంగాణకు ప్రీసెటిల్మెంట్ ఎస్‌జీఎస్టీ రూ.2,230 కోట్లు, పోస్ట్ సెటిల్మెంట్ ఎస్‌జీఎస్టీ రూ.3,596 కోట్లుగా ఉంది. దేశవ్యాప్తంగా ఏప్రిల్‌లో జీఎస్టీ వసూళ్లు రికార్డు స్థాయిలో రూ.2.377 లక్షల కోట్లకు చేరాయి. అంతకు ముందుతో పోల్చితే 12.6% పెరిగి రూ.2,36,716 కోట్లకు చేరాయి. ఇందులో సెంట్రల్ జీఎస్టీ రూ.48,634 కోట్లు, రాష్ట్ర జీఎస్టీ రూ.59,372 కోట్లు, ఇంటిగ్రేటెడ్ ఐజీఎస్టీ రూ.1,15,259 కోట్లు, సెస్ రూ.13,451 కోట్లు ఉన్నాయి. గతేడాది ఏప్రిల్ నెలలో రూ.2.10 లక్షల కోట్ల జీఎస్టీ వసూళ్లు నమోదయ్యాయి. కాగా, ఆంధ్రప్రదేశ్‌లో ఏప్రిల్‌లో 3% తగ్గి రూ.4,686 జీఎస్టీ వసూళ్లు నమోదయ్యాయి. ఏపీకి ప్రీసెటిల్మెంట్ ఎస్‌జీఎస్టీ రూ.1,611 కోట్లు, పోస్ట్ సెటిల్మెంట్ ఎస్‌జీఎస్టీ రూ.2,758 కోట్లుగా ఉంది

ఏప్రిల్‌లో 21 అవినీతి కేసులు నమోదు: ఏసీబీ



సాక్షి, హైదరాబాద్: అవినీతి అధికారులపై ఏసీబీ కొరడా ఝుళిపిస్తోంది. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి 30 వరకు రాష్ట్రవ్యాప్తంగా 21 కేసులు నమోదు చేసినట్టు ఏసీబీ డీజీ కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. ఇందులో 13 ట్రాప్ కేసులు, రెండు ఆదాయానికి మించిన ఆస్తుల కేసులు, రెండు క్రిమినల్ మిస్‌కండక్ట్ కేసులు, రెండు రెగ్యులర్ ఎంక్వైరీలు, రెండు ఆకస్మిక తనిఖీలకు సంబంధించిన కేసులు ఉన్నట్టు పేర్కొన్నారు. అన్ని కేసులలో కలిపి ఏప్రిల్ నెలలో 20 మంది అవినీతి అధికారులను అరెస్టు చేసి జ్యుడీషియల్ కస్టడీకి పంపినట్టు తెలిపారు. మొత్తం ట్రాప్ కేసులలో రూ.5,02,000 స్వాధీనం చేసుకున్నారు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులు ఈ నెలలో రెండు నమోదుకాగా.. ఒక కేసులో రూ.3,51,06,759, మరో కేసులో రూ.13,50,00,000 విలువైన అక్రమాస్తులను గుర్తించారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064లో ఫిర్యాదు చేయాలని ఏసీబీ అధికారులు సూచించారు. వాట్సాప్ నంబర్ (94404 46106)లో లేదా ఫేస్‌బుక్‌లో (Telangana ACB), ఎక్స్ (@TelanganaACB)లోనూ ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. ఫిర్యాదుదారుల వివరాలు, బాధితుల పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

హీరో విజయ్ దేవరకొండపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

అమీర్‌పేట (హైదరాబాద్): గిరిజనులను అవమానించేలా హీరో విజయ్ దేవరకొండ వ్యాఖ్యలు చేశారంటూ ట్రైబల్ లాయర్స్ అసోసియేషన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు అసోసియేషన్ చైర్మన్ కిషన్ రాజ్ చౌహాన్ గురువారం ఎస్‌ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఏప్రిల్ 26వ తేదీన మాటీవీ ఫిలింస్ ప్రీ రిలీజ్ రెట్రో మూవీ ఈవెంట్‌లో.. హీరో విజయ్ దేవరకొండ పాకిస్తాన్ తీవ్రవాదుల గురించి మాట్లాడుతూ.. 500 ఏళ్ల క్రితం ట్రైబల్స్ కొట్టుకున్నట్లు బుద్ధి లేకుండా, కనీస కామన్‌సెన్స్ లేకుండా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. గిరిజనులను కించపరిచేలా మాట్లాడిన హీరో దేవరకొండపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు.

సవాళ్ల మధ్య హైదరాబాద్ ఐటీ

మాంద్యం పరిస్థితులు, స్థానిక ప్రతికూలతలతో ఒత్తిడిలో కంపెనీలు

- కొత్త టెక్నాలజీలకు అనుగుణంగా నైపుణ్యం కోసం వెతుకులాట
- ఉద్యోగులు, కంపెనీల ఉత్పాదకతపై మౌలిక వసతుల లేమి ప్రభావం
- ప్రభుత్వ ప్రోత్సాహకాలు, పెట్టుబడుల ఆకర్షణ, విధానాలపై అస్పష్టత



2023-24లో భారీగా తగ్గిన ఐటీ ఎగుమతుల వృద్ధిరేటు

2024-25లో తిరిగి కోలుకుంటుందని అంటున్న పరిశ్రమ వర్గాలు

సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయంగా నెలకొన్న ఆర్థిక మాంద్యం పరిస్థితులు, స్థానిక విధానాలు కలిసి తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) పరిశ్రమకు సవాళ్లు విసురుతున్నాయి. అమెరికా, యూరప్ మార్కెట్లలో ఐటీ సేవలకు డిమాండ్ తగ్గడం హైదరాబాద్‌లోని ఐటీ కంపెనీలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఆర్థిక మందగమనం వల్ల ఐటీ సేవల వినియోగదారులు (క్లయింట్లు) ఖర్చును తగ్గించుకుంటూ, కొత్త ప్రాజెక్టులను వాయిదా వేసుకుంటున్నారు. దీంతో చిన్న, మధ్యస్థాయి ఐటీ కంపెనీలు ప్రాజెక్టులు లేక ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి.

టాలెంట్ పూల్‌కు గండి

ఐటీ ఉద్యోగులు అధిక వేతనాలు, మెరుగైన పని వాతావరణం, కెరీర్‌లో వృద్ధిని కోరుకుంటున్నారు. కానీ, ఖర్చులను తగ్గించుకునే క్రమంలో కొన్ని కంపెనీలు వేతనాలు పెంచకుండా ఉద్యోగాల్లో కోతలు విధిస్తున్నాయి. దీంతో మంచి నిపుణులు ఇతర నగరాల వైపు మొగ్గు చూపుతున్నారు. ఐటీ హబ్‌లు ఉన్న హైటెక్ సిటీ, గచ్చిబౌలి, మాదాపూర్ ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ, విద్యుత్ సరఫరాలో సమస్యలు కూడా ఉద్యోగులు, కంపెనీల ఉత్పాదకతను ప్రభావితం చేస్తున్నాయి. ఐటీ రంగంలో చిన్న, మధ్య తరహా కంపెనీలను ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించిన పాలసీలు అమలు కావడంలేదనే అసంతృప్తి కూడా పరిశ్రమ వర్గాల్లో కనిపిస్తోంది. పన్ను రాయితీలు, సబ్సిడీలపై ప్రభుత్వం నుంచి స్పష్టత కావాలని కోరుతున్నారు.

నైపుణ్యం, మౌలిక వసతుల లేమి

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), క్లౌడ్ కంప్యూటింగ్, బ్లాక్ చెయిన్ వంటి కొత్త టెక్నాలజీల మూలంగా ఈ రంగంలో నైపుణ్యం కలిగిన మానవ వనరులకు డిమాండ్ పెరుగుతోంది. అయితే, స్థానికంగా నిపుణుల కొరత కంపెనీలకు సవాలుగా మారింది. బెంగళూరు, పుణె, చెన్నై వంటి ఇతర ఐటీ హబ్‌లు నైపుణ్యంగల మానవ వనరులు, మెరుగైన మౌలిక వసతులు, ఆకర్షణీయ ప్రభుత్వ విధానాలతో పెట్టుబడులను ఆకర్షిస్తున్నాయి. దీంతో హైదరాబాద్ నగరం తీవ్ర పోటీని ఎదుర్కొంటోంది.



ఐటీ ఎగుమతుల్లో మందగమనం

ఐటీ ఎగుమతుల్లో 2023–24లో జాతీయ వృద్ధిరేటు 3.3 శాతం ఉండగా, తెలంగాణలో 11.28 శాతం ఉంది. 2024 జూన్ నాటికి రాష్ట్రం నుంచి ఐటీ ఎగుమతులు రూ.2.69 లక్షల కోట్లకు చేరినట్లు సమాచారం. అయితే, 2022-23లో ఐటీ ఎగుమతుల్లో రూ.57,706 కోట్ల వృద్ధి (31.44 శాతం) నమోదు కాగా, 2023-24లో రూ.26,948 కోట్ల మేర మాత్రమే వృద్ధి (11.28 శాతం) నమోదైంది.

2022-23తో పోలిస్తే కొత్త ఉద్యోగాల సృష్టిలోనూ 2023-24లో తగ్గదల నమోదైనట్లు నివేదికలు వెల్లడించాయి. దీంతో రేవంత్ సర్కారు ఐటీ హబ్‌లలో మౌలిక వసతుల కల్పన, నైపుణ్య శిక్షణ, విదేశీ సంస్థలతో నైపుణ్య శిక్షణ భాగస్వామ్య ఒప్పందాలపై దృష్టి పెట్టింది. ఏఐ, సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్ టెక్నాలజీలను ప్రోత్సహించడంతో పాటు గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల ఏర్పాటును రెట్టింపు చేయాలని భావిస్తోంది. వచ్చే మూడేళ్లలో ఐటీ ఎగుమతుల్లో వృద్ధిని 25 శాతానికి పెంచేలా రోడ్ మ్యాప్ సిద్ధం చేస్తున్నట్లు ప్రభుత్వం చెప్తోంది.

స్థిరత్వం దిశగా..



2023–24లో చిన్న సంస్థల ప్రాజెక్టుల్లో ఆలస్యం, ఖర్చు తగ్గింపుతో మందగమనం కనిపించినా, ఇప్పుడు అన్నిరకాల కంపెనీలు ఏఐ, క్లౌడ్, సైబర్ సెక్యూరిటీ, డేటా ఎనలిటిక్స్‌పై వ్యూహాత్మక పెట్టుబడుల వైపు మళ్లాయి. నిపుణులకు డిమాండ్ పెరుగుతోంది. హైదరాబాద్ ఐటీ రంగం ప్రస్తుతం కోలుకునే దశ నుంచి దీర్ఘకాలిక స్థిరత్వం వైపు సాగుతోంది.

– రాజశేఖర్ పాపోలు, మేనేజింగ్ డైరెక్టర్, బృహస్పతి టెక్నాలజీస్ లిమిటెడ్

చిన్న కంపెనీల్లో సంక్షోభం తీవ్రం



రెండేళ్లుగా మాంద్యం పరిస్థితులు కొనసాగుతుండటంతో కంపెనీలు నిర్ణయాల్లో వేగం తగ్గించాయి. మరోవైపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిన్న కంపెనీలను ప్రోత్సహించడం లేదు. పెద్ద కంపెనీలతో పోటీపడి ప్రాజెక్టులను సాధించినా 18 శాతం జీఎస్టీ వల్ల చిన్న కంపెనీలపై పెనుభారం పడుతోంది. ఉద్యోగులను నిలుపుకోవడమే పెను సవాలుగా మారుతోంది.

– శాతంరాజు శ్రీవర్ధన్, సీఈఓ, ఐపాస్ సొల్యూషన్స్

వడదెబ్బ నివారణకు చర్యలు తీసుకోండి

- తెలంగాణ, ఏపీ సహా 11 రాష్ట్రాలకు ఎన్‌హెచ్‌ఆర్‌సీ సూచన
- ఆయా రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులకు లేఖలు

సాక్షి, న్యూఢిల్లీ: వేసవిలో రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు.. వేడిగాలుల నేపథ్యంలో వడదెబ్బ నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని 11 రాష్ట్రాలకు జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) సూచించింది. ఈ మేరకు గురువారం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, పంజాబ్, హరియాణా, ఉత్తరప్రదేశ్, బిహార్, జార్ఖండ్, పశ్చిమబెంగాల్, ఒడిశా, మహారాష్ట్ర, రాజస్తాన్ రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులకు లేఖలు రాసినట్టు ఎన్‌హెచ్‌ఆర్‌సీ తెలిపింది. 2018 నుంచి 2022 మధ్య వేడిగాలులు, వడదెబ్బ కారణంగా 3,798 మంది మృతి చెందారని ఎన్‌సీఆర్‌బీ నివేదిక వెల్లడించిన విషయాన్ని ప్రస్తావించింది. బలహీన వర్గాలు, కార్మికులు, వృద్ధులు, పిల్లలు, నిరాశ్రయుల సంరక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, పనివేళల్లో మార్పులు, వేసవిలో కలిగే వ్యాధుల నివారణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, కమ్యూనిటీ హాళ్లలో తగినంత వెంటిలేషన్ ఉండేలా చూడాలని, ఫ్యాన్లు, తాగునీరు, ప్రాథమిక వైద్య సామగ్రిని అందుబాటులో ఉంచాలని కోరింది. కార్మికుల పని ప్రాంతాలు, కాలనీల్లో అవసరాన్ని బట్టి ఫ్యాన్లు, కూల్‌రూఫ్ సదుపాయాలు కల్పించాలని, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు సరఫరా చేయాలని ఆదేశించింది. జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ ప్రమాణాల ప్రకారం వేడిగాలుల నుంచి ప్రజలను రక్షించడానికి తీసుకున్న మార్గదర్శకాలు, వడదెబ్బ బాధితులను రక్షించేందుకు తీసుకున్న ముందస్తు చర్యలపై నివేదికలు అందించాలని ఆయా రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులను ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఆదేశించింది.

వడదెబ్బతో ముగ్గురు మృతి

మంథని/హాలియా/రామగుండం



యాదగిరి

రాష్ట్రంలో వేర్వేరు ప్రాంతాల్లో వడదెబ్బతో ముగ్గురు మృతి చెందారు. పెద్దపల్లి జిల్లా మంథని మున్సిపల్ పరిధిలోని గంగాపురికి చెందిన పులి మణి (55) గంగాపురి ధాన్యం కొనుగోలు కేంద్రంలో కూలి పనికి వెళ్లి ఇంటికి వచ్చాక అస్వస్థతకు గురయ్యాడు. గోదావరిఖని ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. నల్లగొండ జిల్లా అనుముల మండలం మధారిగూడెం గ్రామానికి చెందిన కుందారపు యాదగిరి (48) ఉపాధి హామీ పనికి వెళ్లి వచ్చాక.. హాలియాలో కార్మిక దినోత్సవంలో పాల్గొన్నాడు. ఎండలకు తీవ్ర అస్వస్థతకు గురవడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలిస్తుండగా.. గుండెపోటు రావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అంతర్గాం మండలం మొగల్‌పహాడ్ గ్రామానికి చెందిన సెంట్రింగ్ కార్మికుడు చిలుక రాజయ్య (52) బుధవారం ఉదయం భవన నిర్మాణం సెంట్రింగ్ పనికి వెళ్లాడు. రాత్రివేళ ఇంటికి చేరుకుని కుప్పకూలిపోయాడు. కుటుంబసభ్యులు 108 వాహనం సిబ్బందికి సమాచారం అందించారు. వారు వచ్చి మృతి చెందినట్లు నిర్ధారించారు.

సొంత జిల్లాలకు తహసీల్దార్లు

బదిలీకి సీఎస్‌కు ట్రెసా విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: ఎన్నికల సమయంలో బదిలీ అయిన తహసీల్దార్లను.. తిరిగి సొంత జిల్లాలకు బదిలీ చేయాలని తెలంగాణ రెవెన్యూ ఉద్యోగుల సంఘం (ట్రెసా) విజ్ఞప్తి చేసింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన కె.రామకృష్ణారావును గురువారం ట్రెసా బృందం కలిసి శుభాకాంక్షలు తెలిపింది. ఈ సందర్భంగా రెవెన్యూ ఉద్యోగుల సమస్యలను ప్రస్తావించగా, పరిష్కరిస్తానని సీఎస్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ట్రెసా అధ్యక్షుడు వంగ రవీందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.గౌతమ్ కుమార్, ఉపాధ్యక్షుడు కె.నిరంజన్ రావు, కార్యదర్శి వాణి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూ.3.45 కోట్ల విలువైన బంగారం పట్టివేత

- దుబాయ్ నుంచి తెస్తుండగా స్వాధీనం చేసుకున్న డీఆర్‌ఐ
- ఇద్దరు ఎయిర్‌పోర్టు సిబ్బంది సహా ముగ్గురి అరెస్టు



అధికారులు పట్టుకున్న బంగారం

సాక్షి, హైదరాబాద్ /శంషాబాద్: దుబాయ్ నుంచి అక్రమంగా తరలిస్తున్న బంగారాన్ని డీఆర్‌ఐ (డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్) అధికారులు ఎయిర్‌పోర్ట్‌లో స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో ముగ్గురిని అరెస్టు చేశారు. పట్టుబడిన విదేశీ బంగారం 3.5 కిలోలు కాగా, దీని విలువ రూ. 3,45,79,300 ఉంటుందని డీఆర్‌ఐ అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు డీఆర్‌ఐ, హైదరాబాద్ జనరల్ యూనిట్ అధికారులు శంషాబాద్ విమానాశ్రయంలో మాటు వేశారు. దుబాయ్ టు హైదరాబాద్‌కు వయా మస్కట్ నుంచి వచ్చిన ఒక ప్రయాణికుడు భారీ మొత్తంలో బంగారం తెస్తున్నట్టు ముందుగానే సమాచారం ఉండడంతో ఆ ప్రయాణికుడిని, అతడికి సహకరిస్తున్న ఎయిర్‌పోర్టు ఉద్యోగి ఒకరిని అడ్డుకొని తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో 3.5 కిలోల బంగారం పట్టుబడింది. నిందితుల ముందస్తు ప్లాన్ ప్రకారం దుబాయ్ నుంచి వచ్చిన ప్రయాణికుడు తన వద్ద ఉన్న బంగారాన్ని ఎయిరో బ్రిడ్జ్ వద్ద ఎయిర్‌పోర్టులోని ఒక గ్రౌండ్ స్టాఫ్‌కు ఇస్తాడు. అతడు కస్టమ్స్ చెకింగ్ పాయింట్ నుంచి తప్పించి దానిని ఎయిర్‌పోర్టు పార్కింగ్ ప్రాంతంలో ఎదురుచూస్తున్న మరో ఎయిర్‌పోర్టు గ్రౌండ్ సిబ్బందికి ఇవ్వాలి. అతడు ఎయిర్‌పోర్టు అవతల ప్రాంతంలో ఆ బంగారాన్ని తిరిగి ఆ ప్యాసింజర్‌కు అందిస్తాడు. అయితే, డీఆర్‌ఐకి ముందే సమాచారం అందడంతో వారి ప్లాన్ బెడిసి కొట్టింది. బంగారాన్ని దుబాయ్ నుంచి తెచ్చిన ప్రయాణికుడితోపాటు అతడికి సహకరించిన ఎయిర్‌పోర్ట్ గ్రౌండ్ హ్యాండ్లింగ్ స్టాఫ్ ఇద్దరిని డీఆర్‌ఐ అధికారులు అరెస్టు చేశారు.

నేడు దోస్త్ నోటిఫికేషన్

డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు రంగం సిద్ధం

- సున్నా ప్రవేశాలున్న కాలేజీలకు గుర్తింపు రద్దు
- అందుబాటులో 3.93 లక్షల సీట్లు
- బకెట్ విధానం యథాతథం.. సిలబస్‌పై రాని స్పష్టత



సాక్షి, హైదరాబాద్: డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి సంబంధించిన ప్రక్రియ మొదలైంది. డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్, తెలంగాణ (దోస్త్) నోటిఫికేషన్ శుక్రవారం విడుదల చేస్తున్నట్టు ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిష్టారెడ్డి తెలిపారు. ఇలా ఆలస్యంగా నోటిఫికేషన్ ఇవ్వడం కొన్నేళ్లలో ఇదే తొలిసారి. దోస్త్ నిర్వహణకు కొన్ని మార్పులు, చేర్పులు సూచిస్తూ మండలి పలు సిఫార్సులు చేసింది. వీటికి విద్యాశాఖ ఉన్నతాధికారులు అడ్డు చెప్పారు. దీంతో నోటిఫికేషన్ విడుదలకు ఇంతకాలం బ్రేక్ పడింది. ఎట్టకేలకు విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో నోటిఫికేషన్ విడుదలకు అధికారులు సిద్ధమయ్యారు. అయితే దోస్త్‌లో కోర్సులు, సిలబస్ మార్పుపై ఇప్పటికీ స్పష్టత రాలేదు. విద్యార్థి ఇష్టమైన సబ్జెక్టును ఎంచుకునేందుకు వీలు కల్పించే బకెట్ విధానాన్ని ఎత్తివేయాలని మండలి, విశ్వవిద్యాలయాల వీసీలు భావించారు. కానీ దీనికి ఉన్నత విద్యాశాఖలో ఓ అధికారి అడ్డు చెప్పారు. ఫలితంగా ఈ విధానాన్ని గత ఏడాది మాదిరిగానే అమలు చేయాలని నిర్ణయించారు.

అందుబాటులో సీట్లు 3.93 లక్షలు

దోస్త్ పరిధిలో 1,055 కాలేజీలున్నాయి. వీటిల్లో 4.6 లక్షల సీట్లు అందుబాటులో ఉన్నాయి. ప్రతీ సంవత్సరం దాదాపు 2.25 లక్షల సీట్లు మాత్రమే భర్తీ అవుతున్నాయి. పెద్ద ఎత్తున సీట్లు మిగిలిపోవడంతో రెండేళ్లుగా లక్ష సీట్లను దోస్త్ అడ్మిషన్‌లో చేర్చలేదు. గతేడాది సున్నా అడ్మిషన్లు జరిగిన 82 కాలేజీలకు ఈసారి అనుబంధ గుర్తింపు ఇవ్వకూడదని అధికారులు నిర్ణయించారు. కొత్త కోర్సులు ప్రారంభించాలనుకొనే కాలేజీల సీట్లకు అనుమతి ఇచ్చే వీలుంది. మొత్తంగా ఈ ఏడాది దోస్త్ పరిధిలో 3.93 లక్షల సీట్లు అందుబాటులో ఉండొచ్చని అధికారులు తెలిపారు. డిగ్రీలో విద్యా ప్రమాణాల పెంపు కోసం సిలబస్ మార్పుపై నాలుగు నెలలుగా మండలి తీవ్రంగా కృషి చేస్తోంది. పారిశ్రామిక సంస్థల భాగస్వామ్యంతో ఉండే కొన్ని నైపుణ్యాలను చేర్చాలని నిర్ణయించారు. వర్సిటీల వీసీలు, నిపుణులతో సిలబస్ మార్పుపై మండలి చైర్మన్ చర్చలు జరిపారు. ఈ ఏడాది నుంచే కొత్త సిలబస్ అమలులోకి తెస్తామని తెలిపారు. కానీ దీనికి విద్యాశాఖ ఇంత వరకూ ఆమోదం తెలపలేదు. దీంతో సిలబస్ మార్పుపై సందేహాలు నెలకొన్నాయి.

రెండు విడతల్లోనే దోస్త్ కౌన్సెలింగ్?

ఏటా దోస్త్ కౌన్సెలింగ్‌ను ఐదు విడతలుగా నిర్వహిస్తున్నారు. డిమాండ్‌ను బట్టి ఒక్కోసారి ప్రత్యేక కౌన్సెలింగ్ కూడా పెడుతున్నారు. దీనివల్ల డిగ్రీ తరగతులు ప్రారంభం ఆలస్యమవుతోంది. దీంతో ఈసారి రెండు విడతల్లోనే కౌన్సెలింగ్ ముగించేలా చర్యలు చేపడుతున్నారు. డిమాండ్ ఉంటే మరో విడతకు అవకాశం ఉండొచ్చని ఒక ఉన్నతాధికారి తెలిపారు. జూన్ నెలాఖరు నాటికి సీట్ల భర్తీ పూర్తవ్వాలని, జూలై నుంచి క్లాసులు ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

కన్వీనర్ ఎవరు?


ఉన్నత విద్యా మండలిలో వైస్ చైర్మన్–1ను దోస్త్ కన్వీనర్‌గా ఏటా నియమిస్తున్నారు. గతేడాది వీసీ–1 పోస్టుపై ఇద్దరు వైస్ చైర్మన్ల మధ్య రగడ జరిగింది. ఈ ఏడాది ఒక వైస్ చైర్మన్ బదిలీ అయ్యి.. కొత్త వ్యక్తి వచ్చారు. ఆయనే వీసీ–1గా ఉన్నారు. అయితే, దోస్త్ కన్వీనర్‌గా ఆయనను నియమిస్తారా? లేక మండలి చైర్మన్ కన్వీనర్‌గా ఉంటారా? అనేదానిపై ఇప్పటికీ స్పష్టత రాలేదు. రాష్ట్రంలోని అన్ని ఉమ్మడి ప్రవేశ పరీక్షలకు కన్వీనర్ల నియామకం జరిగింది. దోస్త్ విషయంలో ఇంకా రగడ కొనసాగుతోందని అధికారులు అంటున్నారు. నోటిఫికేషన్ విడుదల సందర్భంగానైనా స్పష్టత ఇస్తారా అనేది తేలాల్సి ఉంది.

కొత్త లా చాంబర్స్ ప్రారంభం



హైకోర్టు ఆవరణలో అడ్వొకేట్స్ లా చాంబర్స్ బ్లాక్‌-2 ప్రారంభిస్తున్న తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్. చిత్రంలో న్యాయమూర్తులు జస్టిస్ టి.వినోద్‌కుమార్, జస్టిస్ సూరేపల్లి నందా, జస్టిస్ పుల్ల కార్తీక్, జస్టిస్ నగేశ్ భీమపాక, జస్టిస్ కె.సుజన, హెచ్‌సీఏఏ అధ్యక్షుడు జగన్, కార్యదర్శి విజారత్ అలీ తదితరులు

గ్రూప్‌-1 కేసు విచారణ నేటికి వాయిదా



సాక్షి, హైదరాబాద్: గ్రూప్–1 మెయిన్స్ మూల్యాంకనంలో అవకతవకలు జరిగాయంటూ దాఖలైన పిటిషన్లపై విచారణను హైకోర్టు శుక్రవారానికి వాయిదా వేసింది. 2024, అక్టోబర్ 21 నుంచి 27 వరకు నిర్వహించిన గ్రూప్–1 మెయిన్స్ పరీక్ష పత్రాల మూల్యాంకనంలో అవకతవకలు, అసమానతలు చోటుచేసుకున్నాయని, దీనిపై న్యాయ విచారణ జరిపించాలని కోరుతూ సిద్దిపేట్ శివనగర్‌కు చెందిన కె.పర్శరాములుతో పాటు మరికొందరు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు గురువారం మరోసారి విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది రచనారెడ్డి వాదనలు వినిపించారు. ప్రిలిమ్స్ హాల్‌టికెట్, మెయిన్స్ హాల్ టికెట్లు వేరుగా ఉంటాయన్నది నోటిఫికేషన్‌లో పేర్కొనలేదని.. దీనిపై అభ్యర్థులకు అవగాహన లేదని చెప్పారు. మెయిన్స్‌కు కొత్తగా మళ్లీ హాల్‌టికెట్లు ఇవ్వడం అభ్యర్థులను గందరగోళానికి గురి చేసిందన్నారు. మెయిన్స్ పరీక్ష రాసిన వారి సంఖ్యలోనూ ఒక్కోసారి ఒక్కోరకంగా తెలిపారన్నారు. టీజీపీఎస్సీ తరఫున పీఎస్ రాజశేఖర్ వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్ల తరఫు న్యాయవాదులు చెప్పిన విషయాన్నే పదే పదే చెప్పి కోర్టు సమయాన్ని వృథా చేస్తున్నారని అభ్యంతరం వ్యక్తం చేశారు. కాగా, సమయం ముగియడంతో న్యాయమూర్తి తదుపరి విచారణను శుక్రవారానికి వాయిదా వేశారు.



ఈ స్థలం అమ్మబడును!

నేలకొండపల్లి: విద్యుత్ సబ్‌స్టేషన్‌కు దానంగా ఇచ్చిన స్థలాన్ని వెనక్కి తీసుకోవడంతో పాటు పరికరాలు తొలగించి విక్రయిస్తానని.. అవసరమైతే ధర కూడా తగ్గిస్తానంటూ.. ఒక వ్యక్తి సెల్ నంబర్లతో సహా గురువారం ఫ్లెక్సీ ఏర్పాటు చేశాడు. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం చెరువుమాదారంలో 33/11 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణానికి.. 2014లో గ్రామానికి చెందిన ఆకుల నరసింహారావు తనకున్న 20 గుంటల భూమిని ఇచ్చాడు. ఈ సందర్భంగా అప్పటి అధికారులు, ప్రజా ప్రతినిధులు సబ్‌స్టేషన్‌లో ఉద్యోగం ఇప్పిస్తామని అతనికి హామీ ఇచ్చారు. కొన్నాళ్లపాటు తాత్కాలికంగా విధులు నిర్వర్తించిన నరసింహారావును.. ఆ తర్వాత తొలగించారు. దీంతో బాధితుడు వివిధ రూపాల్లో ఆందోళన చేపట్టడంతో పాటు ఆత్మహత్యాయత్నానికి సైతం పాల్పడ్డాడు. అయినా ఫలితం లేక.. గురువారం స్థలం అమ్ముతానంటూ సబ్‌స్టేషన్ గేట్‌కు ఫ్లెక్సీ ఏర్పాటు చేశాడు. కాగా, సాయంత్రం వరకు కూడా అధికారులెవరూ ఈ విషయమై స్పందించలేదు.

త్వరలో ఉద్యోగ నోటిఫికేషన్లు

- ఎస్సీ వర్గీకరణ ఫలితాలను యువత అందిపుచ్చుకోవాలి
- యూనివర్సిటీ విద్యార్థులతో భేటీలో మంత్రి రాజనర్సింహ



సాక్షి, హైదరాబాద్: సుదీర్ఘ పోరాటం తరువాత అమల్లోకి వచ్చిన ఎస్సీ వర్గీకరణ ఫలితాలను యువత అందిపుచ్చుకోవాలని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ కోరారు. ఎస్సీ వర్గీకరణపై విద్యార్థి నాయకులు సామాన్యులకు అర్థమయ్యేలా అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీల నుంచి వచ్చిన విద్యార్థి నాయకులతో గురువారం మినిస్టర్స్ క్వార్టర్స్‌లోని తన నివాసంలో ఆయన సమావేశమయ్యారు. ఎస్సీ వర్గీకరణ, భూభారతి, కుల సర్వేతో పాటు వర్సిటీ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. విద్యార్థుల సమస్యలను సంఘాల నాయకులు మంత్రి దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలో వివిధ శాఖలలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల చేస్తామని తెలిపారు. విద్యార్థుల సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఉస్మానియా యూనివర్సిటీ ఆచార్యులు జి. మల్లేశం, పీసీసీ ప్రధాన కార్యదర్శి కొండేటి మల్లయ్య, వివిధ యూనివర్సిటీలకు చెందిన విద్యార్థి నాయకులు వేల్పుల సంజయ్, చంద్రశేఖర్, తాళ్లూరి అజయ్, శరత్ నాయక్, కే రాజు, ప్రణతి, నిఖిత నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అవ్వను అడవిలో వదిలేశారు



జగిత్యాల: సమాజంలో మానవత్వం, కుటుంబ సంబంధాలు మృగ్యమైపోతున్నాయనేందుకు ఉదాహరణగా మరో ఘటన చోటుచేసుకుంది. జగిత్యాల జిల్లాలో 80 ఏళ్ల వృద్ధురాలిని కాళ్లు, చేతులు కట్టేసి అడవిలో పడేశారు. జిల్లా కేంద్రంలోని ఇస్లాంపురకు చెందిన భూదవ్వ భర్త చాలాకాలం క్రితమే చనిపోయాడు. కూతురు ఈశ్వరిని జిల్లా కేంద్రం శివారు నర్సింగాపూర్‌కు చెందిన రాజయ్యకు ఇచ్చి వివాహం చేశారు. భూదవ్వ పేరిట జగిత్యాలలో ఉన్న ఎకరం భూమి, ఇంటిని కూతురు ఇటీవలే తన పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకుంది. తర్వాత ఏం జరిగిందో ఏమోగానీ.. బుధవారం రాత్రి భూదవ్వను గుర్తుతెలియని వ్యక్తులు కాళ్లు, చేతులు కట్టేసి గొల్లపల్లి మండలం శ్రీరాములపల్లి వద్ద అడవిలో వదిలేశారు. ఆమెను కాపాడిన స్థానిక యువకులు.. జిల్లా కేంద్రంలోని సఖి కేంద్రానికి తరలించారు. అధికారులు ఈశ్వరికి ఫోన్ చేయగా తమకేం తెలియదని చెప్పటం గమనార్హం. ఈ ఘటనపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

నిజామాబాద్ మార్కెట్‌కు భారీగా పసుపు

- గతేడాదితో పోలిస్తే మరింతగా సాగు విస్తీర్ణం.. అధిక దిగుబడులు
- నిజామాబాద్ మార్కెట్‌కు ఈ సీజన్‌లో ఇప్పటివరకు 6,63,840 క్వింటాళ్లు
- 2023-24లో మార్కెట్‌కు వచ్చిన పసుపు 7,23,470 క్వింటాళ్లు
- 2024-25 ఆర్థిక సంవత్సరంలో 7,59,915 క్వింటాళ్లు
- 2025-26 ఆర్థిక సంవత్సరంలో 1,37,947 క్వింటాళ్లు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: పసుపు విషయంలో రాష్ట్రంలో పెద్దదైన నిజామాబాద్ మార్కెట్‌కు ప్రస్తుత సీజన్‌లో భారీగా పసుపు వస్తోంది. నిజామాబాద్ చుట్టుపక్కల జిల్లాలైన జగిత్యాల, నిర్మల్ తదితర జిల్లాల్లో పసుపు సాగు విస్తీర్ణంతో పాటు దిగబడులు సైతం పెరిగాయి. రాష్ట్రంలో పండుతున్న పసుపులో దాదాపు 70 నుంచి 80 శాతం పసుపు నిజామాబాద్ మార్కెట్‌కు వస్తుంది. ఇక 2023-24 సీజన్ (జనవరి, ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్) నెలల్లో ఇందూరు మార్కెట్‌కు 4,55,398 క్వింటాళ్ల పసుపు వచ్చింది. 2020-21 ఆర్థిక సంవత్సరంలో 8,55,516 క్వింటాళ్లు, 2021-22 ఆర్థిక సంవత్సరంలో 8,38,932 క్వింటాళ్లు, 2022-23 ఆర్థిక సంవత్సరంలో 7,49,072 క్వింటాళ్లు, 2023-24 ఆర్థిక సంవత్సరంలో 7,23,470 క్వింటాళ్ల పసుపు మార్కెట్‌కు వచ్చింది. ఇక 2024-25 ఆర్థిక సంవత్సరంలో 7,59,915 క్వింటాళ్ల పసుపు ఇందూరు మార్కెట్‌కు వచ్చింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో 1,37,947 క్వింటాళ్ల పసుపు వచ్చింది.

- గత సీజన్‌లో రాష్ట్రంలో సగటున ఎకరానికి 25 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఈ ఏడాది తెగుళ్లు సోకక పోవడంతో ఎకరానికి 30 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. గత ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా 35 వేల ఎకరాల్లో పసుపు సాగు చేయగా.. ఇందులో 19 వేల ఎకరాలు నిజామాబాద్ జిల్లా రైతులు సాగు చేశారు. ఈ ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా 45 వేల ఎకరాలు సాగు చేయగా, ఇందులో నిజామాబాద్ జిల్లా రైతులు 22 వేల ఎకరాల పసుపు సాగు చేశారు.
- ఈ సీజన్‌లో ఇప్పటివరకు పసుపు ధర అత్యధికంగా క్వింటాకు రూ.15,800 పలికింది. ప్రస్తుతం క్వింటాకు రూ.13,949 ధర పలుకుతోంది. నిజామాబాద్ మార్కెట్‌లో తేమ శాతం, కర్కుమిన్ శాతం సైతం తీస్తున్నారు. ఇక కర్కుమిన్ 3 శాతం ఉంటుందని మార్కెట్ కమిటీ అధికారులు తెలిపారు. పసుపు బోర్డు ప్రకటన నేపథ్యంలో.. ఈసారి రైతులు పసుపు సాగుకు మొగ్గు చూపడంతో విస్తీర్ణం పెరిగింది. పైగా గత ఏడాది సగటున పసుపు ధర రూ.18 వేల వరకు పలికింది. సాగు విస్తీర్ణం పెరిగేందుకు ఇది కూడా ఒక కారణమని అధికారులు తెలిపారు.



బదిలీ అయినా కదలరు

- ఉత్తర్వులు వెలువడి 20 రోజులైనా రిలీవ్‌కాని సిబ్బంది
- 15 మంది బదిలీ రద్దు చేస్తున్నట్లు కొత్తగా ఉత్తర్వులు

బదిలీలపై జెన్‌కో ఉద్యోగుల మధ్య సంఘర్షణ



మూతపడిన రామగుండం బీ-థర్మల్ విద్యుత్ కేంద్రం

రామగుండం: పుట్టింది.. పెరిగింది.. పెళ్లి చేసుకుని, పిల్లలను చదివించింది ఇక్కడే. స్థిర నివాసాలను ఏర్పాటు చేసుకున్నారు. కొందరు వారసత్వ ఉద్యోగాలు కూడా చేశారు. మరికొందరు కాంట్రాక్టు కార్మికులుగా, ఆర్టిజన్లుగా పనిచేశాక పర్మనెంట్ అయ్యారు. ఒక్కొక్కరు సుమారు ఇరవై ఏళ్లపాటు రామగుండం బీ-థర్మల్ విద్యుత్ కేంద్రంలోనే ఉద్యోగాలు చేశారు. ఈ ప్రాంతంతో బంధాలు పెనవేసుకున్నారు. అయితే, గతేడాది జూన్ 4న బీ-థర్మల్ విద్యుత్ కేంద్రం మూతపడింది. జూలైలో 48 మంది ఇంజనీర్లను వివిధ ప్రాంతాలకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇంతలో ఏమైందో, ఏమో.. కొద్దిగంటల్లోనే ఆ ఉత్తర్వులు రద్దయ్యాయి. అప్పటి నుంచి సుమారు 10 నెలల పాటు వారికి రూ.లక్షల్లో వేతనాలు చెల్లిస్తూ వస్తున్నారు. కాగా, గత ఏప్రిల్ 12న 85 మంది ఉద్యోగులను యాదాద్రికి బదిలీ చేస్తున్నట్లు విద్యుత్ సౌధ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. దీంతో ఉద్యోగుల్లో కలవరం మొదలైంది. బదిలీ ఉత్తర్వుల జాబితాలో సూపరింటెండింగ్ ఇంజనీర్ విజేందర్‌తోపాటు ఓఅండ్ఎం నుంచి 72 మంది, ఇంజనీర్లు 11 మంది, ఏడీఈ నుంచి ఒకరి పేర్లు వచ్చాయి. వీరు వారంలోగా రిలీవ్ కావాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

భిన్న వాదనలు..

యాదాద్రికి 85 మందిని బదిలీ చేయడంపై ఉద్యోగుల్లో విమర్శలు వినిపించాయి. ముందస్తు సమాచారం లేకుండా, సాంకేతిక అంశాలను పరిగణనలోకి తీసుకోకుండా హఠాత్తుగా బదిలీ చేయడం, వారం లోగా రిలీవ్ కావాలని ఆదేశించడం సరికాదని, అన్ని విభాగాలకు బదిలీలు వర్తింపజేయాల్సి ఉందంటూ.. ఉత్తర్వులను పెండింగ్‌లో ఉంచారు. అయితే, కొంతజాప్యమైనా బదిలీ తప్పదని భావించిన నలుగురు ఇంజనీర్లు, 11 మంది ఓఅండ్ఎం ఉద్యోగులు.. తమ పలుకుబడి ఉపయోగించి బదిలీలను నిలుపుదల చేస్తూ గురువారం ఉత్తర్వులు తెప్పించుకున్నారు. ఫలితంగా బదిలీ అయిన ఉద్యోగులు, బదిలీ నిలిచిపోయిన ఉద్యోగుల మధ్య అంతర్గత విభేదాలు కొనసాగుతున్నాయి.

అక్కడ కొరత.. ఇక్కడ మిగులు

యాదాద్రి విద్యుత్ కేంద్రంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంపై జరిపిన విచారణలో ఉద్యోగుల కొరత అంశం బహిర్గతమైంది. సిబ్బంది కొరతతోనే పర్యవేక్షణ లోపించిందని, ఫలితంగా ప్రమాదం జరిగిందని తేలింది. రామగుండంలో మూతపడిన బీ-థర్మల్ విద్యుత్ కేంద్రంలోని 200 మంది ఇంజనీర్లను కూర్చోబెట్టి ప్రతినెలా రూ.లక్షల్లో వేతనాలు చెల్లిస్తున్నారనే అంశంపై యాదాద్రిలోని ఉన్నతాధికారులు విద్యుత్ సౌధలో చర్చించారు. ఈ క్రమంలో గత నెల యాదాద్రికి బదిలీ చేస్తున్నట్లు ఉత్తర్వులు వెలువడినా.. రిలీవ్ కాకపోవడంతోపాటు బదిలీలను రద్దు చేసుకునేందుకు ఎవరికి వారే పైరవీలు చేసుకోవడం చర్చనీయాంశమైంది.

ఆదేశాలు అమలు చేస్తున్నాం

గత ఏప్రిల్‌లో నాతోపాటు 85 మందిని యాదాద్రికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆ ఉత్తర్వుల్లోని ఇంజనీర్లలో నలుగురు, 11 మంది ఓఅండ్ఎం ఉద్యోగుల బదిలీలను నిలిపివేస్తున్నట్లు గురువారం ఉత్తర్వులు వెలువడ్డాయి. వారిని మినహాయించి మిగతా వారు త్వరగా రిలీవ్ కావాలంటూ ఉత్తర్వులు అందజేశాం.

– పి.విజేందర్, సూపరింటెండింగ్ ఇంజనీర్, రామగుండం బీ-థర్మల్ విద్యుత్ కేంద్రం

ఈటల.. విచారణ ఎదుర్కోవాల్సిందే

కేసు కొట్టివేతకు హైకోర్టు నో



సాక్షి, హైదరాబాద్: మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా పోచారం పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ స్థిరాస్తి వ్యాపారిపై చేయిచేసుకున్నారంటూ దాఖలైన కేసులో బీజేపీ నేత, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌పై నమోదైన కేసును కొట్టివేసేందుకు హైకోర్టు నిరాకరించింది. దర్యాప్తు ప్రారంభ దశలోనే జోక్యం చేసుకుని మినీ ట్రయల్ నిర్వహించలేమని చెబుతూ.. ఈటల దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. కేసును కొనసాగించడానికి కారణాలు ఉన్నాయని.. విచారణ ఎదుర్కోవాల్సిందేనని తేల్చిచెప్పింది. చట్టప్రకారం విచారణను కచ్చితంగా నిర్వహించాలని దర్యాప్తు అధికారిని ఆదేశించింది. ఏకశిలానగర్‌లో సామాన్యుల భూమిని కబ్జా చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని, పైగా రియల్ ఎస్టేట్ ఏకశిలానగర్ వాసులను బెదిరిస్తున్నారని, ఈ క్రమంలో వారి వద్దకు వెళ్లిన సమయంలో వారి తీరు పట్ల ఆగ్రహంతో చేయిచేసుకున్నట్లు ఈటల ఈ జనవరిలో పేర్కొన్న విషయం తెలిసిందే. ఈటల దాడిపై వాచ్‌మన్ జి.ఉపేందర్ ఫిర్యాదు చేయడంతో పోచారం పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో తనపై నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ ఈటల రాజేందర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ఇది రాజకీయ కక్ష సాధింపులో భాగంగా పెట్టిన కేసని తెలిపారు. ప్రాథమిక ఆధారాలున్నందునే పోలీసులు కేసు నమోదు చేశారని పీపీ పల్లె నాగేశ్వర్‌రావు చెప్పారు. పీపీ వాదనలతో ఏకీభవించిన న్యాయమూర్తి.. కేసు కొట్టివేసేందుకు నిరాకరించారు.

జీవో 111 అమల్లో ఉన్నా అక్రమ నిర్మాణాలా?

కౌంటర్ దాఖలుచేయాలని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: జీవో 111 అమల్లో ఉన్నా ఉస్మాన్‌సాగర్, హిమాయత్ సాగర్ జలాశయాల పరీవాహక ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలు, కన్వెన్షన్ సెంటర్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయా అని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. ఈ అంశంపై నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. హైదరాబాద్ నగరానికి తాగునీటిని అందించే జంట జలాశయాలకు 10 కిలోమీటర్ల పరిధిలో నిషేధ ఉత్తర్వులున్నా నిర్మాణాలు యథేచ్ఛగా సాగుతున్నాయని మొయినాబాద్ మండలం పెద్దమంగళారం గ్రామానికి చెందిన రైతు ఎం.మాధవరెడ్డి హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. ఆనంద, నియో, ఆర్యా, కేఎల్ఎస్ ఉత్సవ్.. ఇలా పలు పేర్లతో కన్వెన్షన్ సెంటర్లు నిర్మిస్తున్నారని తెలిపారు. ఈ పిటిషన్‌పై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ రేణుక యారా ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. జంట జలాశయాల పరిధిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని సుప్రీంకోర్టు, ఎన్జీటీ, హైకోర్టు ఎన్ని తీర్పులిచ్చినా ఆక్రమణలు జరుగుతూనే ఉన్నాయని తెలిపారు. అక్రమ నిర్మాణాలపై విచారణకు నిపుణుల కమిటీ లేదా అడ్వొకేట్ కమిషనర్‌ను నియమించాలని కోరారు. వాదనలు విన్న ధర్మాసనం.. ప్రభుత్వానికి, ప్రైవేట్ ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. పిల్‌కు రెగ్యులర్ నంబర్ కేటాయించాలని రిజిస్ట్రీని ఆదేశిస్తూ.. తదుపరి విచారణ వేసవి సెలవుల తర్వాతకు వాయిదా వేసింది.



ఉగ్రవాదుల చర్య అత్యంత హేయం

ఎన్‌ఎంవోపీఎస్ ప్రధాన కార్యదర్శి స్థితప్రజ్ఞ

సాక్షి, హైదరాబాద్: పహల్గాంలో ఉగ్రవాదుల చర్య అత్యంత హేయమైనదని, దేశం మొత్తం ఒక్కటిగా నిలబడి ఖండించాలని నేషనల్ మూవ్‌మెంట్ ఫర్ ఓల్డ్ పెన్షన్ స్కీం (ఎన్‌ఎంవోపీఎస్) ప్రధాన కార్యదర్శి స్థిత ప్రజ్ఞ అన్నారు. ఎన్‌ఎంవోపీఎస్ పిలుపు మేరకు తెలంగాణ రాష్ట్ర సీపీఎస్ ఎంప్లాయీస్ యూనియన్ (టీఎస్‌సీపీఎస్‌ఈయూ) దేశ్‌కే సాథ్ అంటూ గురువారం అమరవీరుల స్థూపం వద్ద కొవ్వొత్తులతో మార్చ్ నిర్వహించారు. కార్యక్రమంలో టీఎస్‌సీపీఎస్ ఈయూ రాష్ట్ర కోశాధికారి నరేశ్‌గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్స్‌ఫర్డ్ ఇండియా ఫోరమ్ సదస్సుకు కేటీఆర్

ముఖ్యవక్తగా రావాలంటూ ఆహ్వానం

సాక్షి, హైదరాబాద్: ఇంగ్లండ్‌లో పేరొందిన ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో జరిగే అంతర్జాతీయ సమావేశానికి హాజరు కావాల్సిందిగా బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావుకు ఆహ్వానం అందింది. ఆక్స్‌ఫర్డ్ ఇండియా ఫోరమ్ ఆధ్వర్యంలో జరిగే ఈ సదస్సుకు ముఖ్యవక్తగా పాల్గొనాల్సిందిగా కోరుతూ నిర్వాహకులు ఆహ్వానం పంపారు. ఈ ఏడాది జూన్ 20, 21 తేదీల్లో నిర్వహించే ఈ సమావేశాల్లో 'భారత అభివృద్ధికి అత్యాధునిక సాంకేతికతలు' అనే థీమ్‌తో సదస్సు నిర్వహిస్తున్నట్లు ఫోరమ్ వ్యవస్థాపకులు సిద్ధార్థ్ సేఠీ తెలిపారు. అంతర్జాతీయంగా విద్యార్థులు, వివిధ దేశాల నిపుణులు పాల్గొనే ఈ సమావేశాల్లో అనుభవాలు, ఆలోచనలు పంచుకోవాల్సిందిగా ఆయన కేటీఆర్‌ను కోరారు. ప్రపంచ సమస్యలను పరిష్కరించడంతో పాటు భారత్‌లోని స్థిరమైన అభివృద్ధికి అత్యాధునిక సాంకేతికత ఎలా ఉపయోగపడుతుందన్న అంశంపై ఈ సదస్సులో ప్రధానంగా వక్తలు చర్చించనున్నారు.

మండు వేసవిలో మేత నిండుగా..



మండు వేసవిలోనూ పచ్చిక బయళ్లు వన్యప్రాణులకు మేత కొరత లేకుండా చేస్తున్నాయి. మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట రేంజ్ తిమ్మాపూర్ బీట్ పరిధి సఫారీ రూట్‌లో అటవీ శాఖ అధికారులు గడ్డి క్షేత్రాలను పెంచారు. సమీప నీటి కుంట నుంచి నీటి సరఫరా చేసి పచ్చదనం పెరిగేలా చర్యలు తీసుకున్నారు. వన్యప్రాణులు పెద్ద సంఖ్యలో వస్తూ.. ఆకలి తీర్చుకుంటూ సందర్శకులకు కనిపిస్తున్నాయి. ఏటా వేసవిలో తిండి దొరక్క ఇబ్బందులు పడేవి. గడ్డి క్షేత్రాలతో శాకాహార జంతువులు, పులులు, చిరుతలు ఇతర జంతువులు పెరిగి జీవ వైవిధ్యం సమతుల్యం అవుతుందని అధికారులు చెబుతున్నారు.

– సాక్షి ప్రతినిధి, మంచిర్యాల

ఫీజు బకాయిలు చెల్లించాలి

సాక్షి, హైదరాబాద్: ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని ప్రోగ్రెసివ్ స్టూడెంట్స్ యూనియన్ (పీఎస్‌యూ) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆవుల నాగరాజు, కోట ఆనందరావు డిమాండ్ చేశారు. ఫీజు బకాయిలు చెల్లించకుండా ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతోందని గురువారం ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫీజులు చెల్లించకపోవడంతో.. విద్యార్థులు పైచదువులకు వెళ్లడం లేదని తెలిపారు.

కవిత నివాసంలో మేడే వేడుకలు

సాక్షి, హైదరాబాద్: బంజారాహిల్స్‌లోని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నివాసంలో గురువారం మేడే వేడుకలు జరిగాయి. వివిధ సంస్థలు, సంఘాల కార్మికులతో కలిసి ఆమె మేడే ఉత్సవాల్లో పాల్గొన్నారు. కవి, గాయకుడు మిట్టపల్లి సురేందర్ ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా రూపొందించిన పాటను కవిత విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె కార్మికులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు.

కొత్త సీఎస్‌తో భేటీలు

సాక్షి, హైదరాబాద్: నూతనంగా తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన కె.రామకృష్ణారావును గురువారం సచివాలయంలో పలువురు మర్యాదపూర్వకంగా కలిశారు. సీఎస్‌ను కలిసిన వారిలో తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్ల జేఏసీ నేతలు లక్ష్మయ్య, శుభాకర్‌రావు, రైతు కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్, భవానీ రెడ్డి, మెంబర్ సెక్రటరీ గోవిందు, సెక్రటేరియట్ బీసీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు తిరందాస్ యాదగిరి తదితరులు ఉన్నారు.

రహదారి ఏర్పాటైన 'నది'

ములుగు జిల్లా మంగపేట మండల పరిధిలోని కమలాపురం పరిధి గంపోనిగూడెం, వాడగూడెంలో కొందరు.. రైతుల పట్టా భూముల పేరుతో ఇసుక క్వారీలకు అనుమతులు పొంది గోదావరి నుంచి ఇసుకను తరలిస్తున్నారు. వాడగూడెం, గంపోనిగూడెం పరిధి గోదావరిలో సుమారు 3 కిలోమీటర్ల మేర రోడ్లు వేసి వేలాది లారీల ఇసుక తరలిస్తున్నారు.

- మంగపేట





మే డే సందర్భంగా గురువారం హైదరాబాద్‌లోని సీపీఎం కార్యాలయంలో అరుణపతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ



ఏలికా.. ఏంటీ దైన్యం

బడుగులకు రోగమొస్తే ధర్మాసుపత్రులే దిక్కు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వాసుపత్రుల పీక నొక్కే కార్యక్రమాన్ని విజయవంతంగా అమలుచేస్తోంది. దీంతో పేద రోగులు నానా ఇక్కట్లు పడుతున్నారు. గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో బెడ్లు లేక ఓ మహిళ ఇలా ఆస్పత్రి బయట ఆక్సిజన్ సిలెండర్‌తో కనిపించింది. – సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు



బాబుకు చప్పట్లు.. ప్రజలకు ఇక్కట్లు

ప్రధాని సభ కోసం రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ బస్సులన్నీ అమరావతి బాట పట్టించారు. దీంతో అన్ని జిల్లాల్లోనూ ప్రయాణికులు గురువారం తీవ్ర అవస్థలు పడ్డారు. తిరుపతి బస్టాండ్‌లో బస్సుకోసం గంటల తరబడి వేచిచూస్తున్న దృశ్యం
– సాక్షి ఫొటోగ్రాఫర్ తిరుపతి



హమ్మయ్య.. నీళ్లు దొరికాయి

గుంతలో గుక్కెడు నీళ్లు కనిపిస్తే ఉల్లాసపడతాయి.. ఉక్కగ కాసింతుంటే ఉక్కిరిబిక్కిరవుతాయి ఈ చిరుజీవులు..విజయవాడ శివారు గుణదల పొలాల్లోకి ఓ వ్యక్తి తన బాతులను మేతకు తీసుకువచ్చాడు. పక్కనే ఉన్న చిన్న కాలువలో నీళ్లు కనిపించడంతో వేడికి తాళలేని ఈ చిరుజీవులు ఒక్క సారిగా ఆ కాలువ వైపు పరుగుతీశాయి. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

మూగ వేదన.. అరణ్య రోదన!

ఎండిపోయిన అడవి



నల్లమలలో వన్యప్రాణులు విలవిల | అడవిలో నీటి చుక్క కరువు.. ఎండిన కుంటలు, వాగులు | నీటి తొట్టెలు నిర్మించినా అరకొర నీరే! | జనావాస ప్రాంతాలకు వస్తున్న వన్యప్రాణులు | చోద్యం చూస్తున్న అటవీ అధికారులు

ఆళ్లగడ్డ: మండే ఎండలతో ప్రజలే దాహంతో అల్లాడుతున్నారు. నల్లమల అడవిలో వన్యప్రాణులదీ ఇదే పరిస్థితి. అటవీ ప్రాంతంలో నీటి నిల్వలు తగ్గడంతో జనావాస ప్రాంతాలకు వస్తూ ప్రాణాలను కోల్పోతున్నాయి. వేసవిలో సాసర్ పిట్లు(నీటి తొట్టెలను) నింపాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేస్తున్నా.. క్షేత్రస్థాయిలో అమలు కావటం లేదు.

నల్లమలలో జంతువులు ఇవీ..

దేశంలోనే అతి పెద్ద అభయారణ్యం నల్లమల. ఇక్కడ ఎన్నో రకాల వన్యప్రాణులు ఉన్నాయి. నంద్యాల జిల్లాలో అటవీ భూభాగం 1.60 లక్షల హెక్టార్లలో ఉంది. గుండ్లబ్రహ్మేశ్వరం, బండిఆత్మకూరు, నంద్యాల, చెలమ, రుద్రవరం, ఆత్మకూరు, బైర్లూటి, నాగలూటి, శ్రీశైలం, వెలుగోడు అటవీ రేంజ్‌లు ఉన్నాయి. వీటి పరిధిలో 65 బీట్లు, 44 సెక్షన్లు ఉన్నాయి. అడవిలో చిరుతలు, పెద్దపులులు, ఎలుగుబంట్లు ఎక్కువగా ఉన్నాయి. అలాగే రేసు కుక్కలు, అడవి పిల్లులు, చుక్కల దుప్పులు, అడవి పందులు, కృష్ణ జింకలు, కుందేళ్లు, అడవి గొర్రెలు, నక్కలు కనిపిస్తాయి. బట్టమేక, అడవికోళ్లు, నెమళ్లతో పాటు వందలాది పక్షి జాతులకు నల్లమల ఆవాసం. వర్షాభావం వెంటాడటం, ఎండ తీవ్రత పెరగడంతో కుంటలు, వాగులు ఎండిపోయాయి. జలవనరుల్లో నీటి జాడ కనుమరుగైంది. అడవిలో చాలా చోట్ల తేమ సైతం ఆవిరైంది. ఇదే వన్యప్రాణుల పాలిట శాపమవుతోంది.

సాసర్లు నింపరు!

నాగార్జునసాగర్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో వన్యప్రాణుల దాహం తీర్చేందుకు 450కి పైగా సాసర్ పిట్లు ఏర్పాటు చేశారు. ఏటా ఫిబ్రవరి నుంచి జూన్ వరకు 5 నెలలు నిరంతరం పర్యవేక్షిస్తూ సాసర్ పిట్లలో నీరు నింపాల్సి ఉంది. అయితే ఈ ఏడాది నిధుల కొరతతో చాలాకాలంగా నీరు నింపడంలేదన్నట్లు తెలుస్తోంది. కొందరు క్షేత్ర స్థాయి అధికారులు అడపాదడపా అక్కడక్కడా దాతల సాయంతో, సొంతంగా ఖర్చు చేసుకొని వన్యప్రాణుల దాహార్తిని తీర్చేందుకు ప్రయత్నిస్తున్నప్పటికీ పూర్తి స్థాయిలో దప్పిక తీరడంలేదు. అనేక చోట్ల సాసర్ పిట్‌లు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. చెత్తాచెదారంతో నిండిపోయి ఉన్నాయి.

ఇలా చేస్తే ఎంతో మేలు..

బండిఆత్మకూరు, చెలమ, రుద్రవరం రేంజ్ పరిధిలో సాసర్ పిట్లకు ప్రతి రోజూ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలి. కొన్ని ప్రాంతాల్లో చెలమలను తవ్వి మూగజీవాలకు నీటి సౌకర్యాన్ని అందించాలి. అదేవిధంగా చెక్ డ్యామ్స్ ఏర్పాటు చేసి వాటి వద్ద నీటి నిల్వలను ఉంచాలి. సాసర్ పిట్ల వద్దకు నీటి కోసం వచ్చిన జంతువుల కోసం ఉప్పు ముద్దలను ఏర్పాటు చేయాలి. మూగ జంతువులు ఉప్పు ముద్దను నాకడంతో వడదెబ్బ బారి నుంచి కాపాడుకునే అవకాశం ఉంది.

నీటి కోసం వచ్చి.. ప్రాణాలు విడిచి

అడవిలో నీటి వనరులు ఎండిపోవడం, ప్రభుత్వం ఏర్పాటు చేసిన సాసర్ పిట్లలో నీరు నింపకపోవడంతో మూగ జీవాలు జనావాసాల్లోకి వస్తున్నాయి. ఈ సమయంలో వాహనాలు ఢీకొని ప్రాణాలు వదులుతున్నాయి. అలాగే విద్యుదాఘాతానికి గురై, వేటగాళ్ల ఉచ్చులో చిక్కి మృత్యువాత పడుతున్నాయి.

- ఈ మధ్య కాలంలో నీటికోసం వస్తున్న మూగజీవాలను వేటగాళ్లు నీటిలో విషపు గుళికలు వేసి చంపేస్తున్నారు.
- రుద్రవరం, చెలమ అటవీ రేంజ్‌ల పరిధిలో వేటగాళ్లు పెట్రేగి పోతున్నారు. ఉచ్చులు వేసి వన్యప్రాణులను వేటాడి వాటి మాంసాన్ని, శరీర భాగాలను విక్రయిస్తున్నారు.
- ఇటీవల పెద్దకంబలూరు సమీపంలో వేటగాళ్లు వేసిన ఉచ్చులో చిక్కుకుని పెద్దపులి మృతి చెందిన ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపింది.
- మూడు నెలల క్రితం అహోబిలం సమీపంలో కారుపై పెద్దపులి దాడి చేసింది. ఆ సమయంలో గాయాలై అడవిలోకి వెళ్లి పోయింది.
- ఈ నెల 6వ తేదీ రుద్రవరంలో ఇద్దరు వ్యక్తులు వన్యప్రాణుల మాంసం విక్రయిస్తుండగా అట వీ అధికారులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.
- 2019లో బాచిపల్లె తండా సమీపంలో పెద్దపులి కళేబరం కనిపించింది. అదే సంవత్స రం ఓ పెద్ద పులి మిట్టపల్లె సమీపంలోని ఎర్రచెరువు కాల్వలో మృతి చెంది కనిపించింది.
- గండ్లేరు రిజర్వాయరులో వేర్వేరు సంఘటనల్లో రెండు చిరుత కళేబరాలు కనిపించాయి.
- 2018లో బాచిపల్లె తండా, అహోబిలం మధ్యన రెండు ఎలుగుబంట్ల కళేబరాలు కనిపించాయి.
- ఆళ్లగడ్డ సమీపంలో కృష్ణజింక వేటకు బలైంది.
- రుద్రవరం సమీపంలో ఐదు నెమళ్లు వేటగాళ్ల ఉచ్చుకు బలయ్యాయి.
- గాజులపల్లి – బొగద మధ్య రైలు పట్టాలపై రెండు చిరుత పులులు మృతి చెందాయి.



మిట్టపల్లె బీట్‌లో శిథిలావస్థలో సాసర్ పిట్



అహోబిలం అడవిలో రోడ్డు వెంబడి తొట్లు పెట్టి నీరు పోస్తున్న సమాజ సేవకుడు



దప్పిక తీర్చుకొనేందుకు వచ్చి ఉచ్చులో చిక్కుకుని మృతి చెందిన చిరుత (ఫైల్)

కుంటలు ఎండిపోయాయి



అహోబిలం అటవీ పరిధిలో చెరువులు, కుంటలు పూర్తిగా ఎండిపోయాయి. వన్యప్రాణులు నీటి కోసం పొలాల్లోకి, గ్రామాల్లోకి వస్తున్నాయి. అవి దాడి చేస్తాయోనని ప్రజలు భయపడుతున్నారు.
– నాసారి వెంకటేశ్వర్లు, ఏకలవ్య ఎరుకలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు

చర్యలు తీసుకుంటాం




సాసర్ పిట్లలో నీరు నింపుతున్నాం. ఎక్కడైనా నీరు లేదంటే సిబ్బంది చూడక పోవడమో, మరచిపోవడమో ఉంటుంది. వెంటనే నీటిని నింపేలా చర్యలు తీసుకుంటాం.
– శ్రీపతి నాయుడు, రుద్రవరం అటవీ రేంజ్ అధికారి

అందరి బాధ్యత



నల్లమల అభయారణ్యం రాయలసీమకు మాణిక్యం లాంటింది. అందులోని వన్యప్రాణులను కాపాడుకోవల్సిన బాధ్యత అందరిపై ఉంది. సంబంధిత శాఖ అధికారులు వెంటనే స్పందించి మూగజీవాల దాహార్తి తీర్చేందుకు ఏర్పాట్లు చేయాలి.
– గజ్జల రాఘవేంద్రారెడ్డి, ఎంపీపీ

సాగర గర్భంలో భయో వ్యర్థాలు!



- ప్లాస్టిక్ వేస్ట్‌తో సమానంగా మెడికల్ వ్యర్థాలు లభ్యం
- బయో వేస్ట్ వెలికితీస్తున్న స్కూబా డైవర్లు
- జాలరిపేట, రుషికొండ తీరాల్లో ఎక్కువగా లభ్యం
- జలచరాలకు హానికరమంటున్న పర్యావరణవేత్తలు

సాక్షి, విశాఖపట్నం: సాగర తీరాన్ని బయో వ్యర్థాలు భయపెడుతున్నాయి. ప్రాణాంతకమైన మెడికల్ వేస్ట్‌ను అత్యంత భద్రంగా నిర్వహించాల్సి ఉండగా.. కొన్ని ఆస్పత్రులు సముద్రాన్నే డస్ట్‌బిన్‌గా మార్చేసుకున్నాయి. దీంతో ప్రమాదకరమైన వైద్య వ్యర్థాలు సముద్రాన్ని ముంచెత్తుతున్నాయి. పర్యావరణ నిపుణుల అంచనా ప్రకారం ఏటా విశాఖ సాగర తీరంలో 350 టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు, సుమారు 10 టన్నుల వరకు మెడికల్ వ్యర్థాలు సముద్రగర్భంలో కలుస్తున్నాయి. సాగర గర్భంలోకి చొచ్చుకుపోతున్న ఈ వ్యర్థాలు.. జీవ వైవిధ్యానికి చేటు తెస్తున్నాయి.. ఫలితంగా జలచరాలు నిర్జీవంగా మారిపోతున్నాయి. ఇటీవల ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగించేందుకు స్వచ్ఛందంగా నడుంబిగించిన కొంత మంది స్కూబా డైవర్లు.. సముద్రం నుంచి బయో వ్యర్థాలు బయటపడుతుండటంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మెడీవేస్ట్ 'సీ'గా మార్చేస్తున్నారు

అందాల సముద్ర తీరాన్ని ఆస్వాదించేందుకు వస్తున్న పర్యాటకులకు మెడీ వేస్ట్ దర్శనమిస్తోంది. బీచ్‌కు సమీపంలోని కొన్ని ప్రైవేట్ ఆస్పత్రులు ఇంజిక్షన్లు, సిరంజీలు, కాలం చెల్లిన మందులు, ఇంజక్షన్ సీసాలు, సెలైన్ బాటిల్స్ సాగరంలో కలిపేస్తున్నాయి. కేవలం రూ.1000 నుంచి రూ.2 వేలకు కక్కుర్తి పడుతున్న చిన్న చిన్న ఆస్పత్రుల నిర్వాహకులు.. సముద్రాన్ని మెడీవేస్ట్ సీగా మార్చేస్తున్నారు.

మూడు రోజుల వ్యవధిలో టన్ను వరకు..

ప్లాస్టిక్ వ్యర్థాలతో సముద్రం కలుషితమవుతున్న నేపథ్యంలో సామాజిక బాధ్యతలో భాగంగా స్కూబా డైవర్లు.. సముద్ర పరిరక్షణకు పాటుపడుతున్నారు. వీరికి బయో వ్యర్థాలు కనిపిస్తుండటంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సముద్ర లోతుల్లో పోగుపడ్డ ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించే బాధ్యతను ఇటీవల కాలంలో ప్లాటిపస్ వంటి స్కూబా డైవింగ్ సంస్థలు స్వచ్ఛందంగా చేపడుతున్నాయి. సముద్ర గర్భంలో వ్యర్థాల ఏరివేత కోసం ఈ బృందాలు 3 కిలో మీటర్ల దూరం వరకూ వెళ్తున్నాయి. ఒడ్డు నుంచి ప్రారంభించి.. మూడు కిలోమీటర్ల పరిధిలో ఉన్న వ్యర్థాల్ని తొలగిస్తున్నారు. ప్రతి రోజూ కనీసం 100 నుంచి 200 కిలోల ప్లాస్టిక్ వ్యర్థాలను సముద్రం నుంచి వెలికితీస్తున్నారు. ఇందులో కనీసం 10 నుంచి 20 కిలోల వరకూ బయో వ్యర్థాలు ఉంటున్నాయని వారు చెబుతున్నారు. మూడు రోజుల వ్యవధిలో టన్ను వరకూ స్కూబా డైవర్లు మెడీవేస్ట్ ఉన్నట్లు గుర్తించారు. ఈ వ్యర్థాలు సముద్ర జీవరాశులతో పాటు.. పర్యాటకులకు ప్రాణహానిని కలిగిస్తుండటంతో, అధికారులు తక్షణమే బయో వ్యర్థాలు సముద్రంలో కలవకుండా ఉండేలా గట్టి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



కళ తప్పిన పసిడి పురి



- ఒడిదుడుకుల మధ్య బంగారు వ్యాపారం
- ఆర్థిక ఇబ్బందుల్లో వ్యాపారులు, కార్మికులు
- నగదు చెల్లిస్తేనే బంగారం





ప్రొద్దుటూరులోని బంగారంగళ్ల వీధి (ఇన్‌సెట్) ఆభరణం తయారు చేస్తున్న స్వర్ణకార్మికుడు దస్తగిరి

ప్రొద్దుటూరు : వ్యాపారంలో ఒడిదుడుకులు కారణంగా పసిడిపురి కళ తప్పింది. అమాంతంగా బంగారం ధరలు పెరగడంతోపాటు ఆర్థిక ఇబ్బందుల కారణంగా బంగారం కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపడం లేదు. శుభకార్యాల కోసం అవసరాలకు మాత్రమే ఆభరణాలను కొనుగోలు చేస్తున్నారు. పైగా కొనుగోలుదారులు పూర్తిగా నగదు చెల్లిస్తే కానీ వ్యాపారులు ఆభరణాలను తయారు చేయించి ఇచ్చే పరిస్థితి లేదు. రాష్ట్రంలో పసిడి వ్యాపారానికి వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు ప్రసిద్ధి గాంచింది. బంగారు ఆభరణాల దుకాణాలతోపాటు వేల మంది స్వర్ణకార్మికులు ఈ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి బులియన్ మార్కెట్ ఉపాధి కల్పిస్తోంది. ఈ ఏడాది జనవరి 1న 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.78,500 నమోదైంది. మార్చి 11న రూ.86వేలు ఉండగా.. ఈనెల 22న ఇదే ధర రూ.లక్షకు దాటింది. దేశంలోని మిగతా ప్రాంతాల్లో రూ.లక్షా 5వేల ధర పలకగా, ప్రొద్దుటూరులో రూ.ల చేరుకుంది. ధరల హెచ్చు తగ్గులతో వ్యాపారులు, ఇటు స్వర్ణ కార్మికులు, లుదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అవసరాలకు సంబంధించి బంగారు ఆభరణాల కోసం వచ్చే వారు కేవలం అడ్వాన్స్ రూపంలో కొంత మొత్తాన్ని చెల్లించి మిగతా సొమ్మును ఆభరణాలు తయారు చేశాక డబ్బు చెల్లించి తీసుకెళ్లే పరిస్థితి ఉండేది. ప్రస్తుతం ధరల ప్రభావం కారణంగా పూర్తి డబ్బు కొనుగోలుదారులు చెల్లిస్తే కానీ ఆభరణాలు తయారు చేయించే పరిస్థితి లేదు. స్వయంగా వ్యాపారులే ఈ విషయాన్ని చెబుతున్నారు.

రియల్ ఎస్టేట్ ప్రభావమే పెద్ద కారణం

గత ఏడాది ఎన్నికల ముందు నుంచి రియల్ ఎస్టేట్ వ్యాపారం కుదేలైంది. భూముల కొనుగోలు, అమ్మకాలు ధమాల్ అన్నాయి. తద్వారా మార్కెట్‌లో మనీ రొటేషన్ లేదు. మరో వైపు రష్యా–ఉక్రెయిన్ యుద్ధం, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆంక్షల ప్రభావం బంగారం మార్కెట్‌పై పడింది. అన్ని వ్యాపారాలపైన ఇదే పరిస్థితి ఉందని వ్యాపార నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నడూ ఇంతటి ఇబ్బందులు చూడలేదని వాపోతున్నారు.

రోడ్లపైనే కాలం చెల్లిన మందులు



నగరంలో పలు చోట్ల రోడ్ల పక్కన చెత్తకుప్పల్లో కాలం చెల్లిన మందులు ఇబ్బడిముబ్బడిగా కనిపిస్తున్నాయి. వాస్తవంగా వీటిని ఇన్సినరేటర్‌లో వేసి బూడిద చేయాల్సి ఉంది. కానీ సుమారు టన్నుల కొద్ది వచ్చే ఈ వ్యర్థాలను సకాలంలో కాల్చకుండా .. ఇలా ఖాళీ ప్రదేశాల్లో ఇష్టానుసారంగా పారబోస్తున్నారు. ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ప్రైవేటు ఆస్పత్రులపై కఠిన చర్యలు తీసుకోకపోవడంతో ఈ తరహా నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నాయి. నిబంధనలను ఏమాత్రం లెక్కచేయక ఈ ఆస్పత్రులు, మెడికల్ షాపులు ఈ విధంగా వ్యవహరిస్తున్నాయి. బయో వ్యర్థాలను తరలించేందుకు సంబంధిత యాజమాన్యాలు కొంత మొత్తం ఏపీ పీసీబీ సూచించే వ్యర్థాల నియంత్రణ సంస్థకు చెల్లించాల్సి ఉంది. ఆస్పత్రి స్థాయికి తగ్గట్టు డబ్బులు చెల్లించాలి. పలుచోట్ల ఆయా సంస్థలు సక్రమంగా వచ్చి వ్యర్థాలను తీసుకెళ్లడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఒక్క నగరంలోనే దాదాపు 600కు పైగా ఆస్పత్రులు ఉన్నాయి. పూర్తిస్థాయిలో ప్రైవేటు ఆస్పత్రుల నుంచి వెలువడే వ్యర్థాలు దాదాపు బయట ప్రాంతాల్లో పోస్తున్నారు. నగరంలోని ఆస్పత్రుల్లో పది శాతానికి మించి నిబంధనలు పాటించడం లేదు. కాలం చెల్లిన మందులు, ఇతర వ్యర్థాల్ని ఇవ్వకుండా ఎక్కడ పడితే అక్కడ పడేస్తున్నారు. నెలకు రూ.1,100 చెల్లిస్తే చాలు ప్రతీ ఆస్పత్రి వద్దకు వచ్చి నిర్వహణ సంస్థలు స్వయంగా తీసుకువెళ్తాయి. కానీ ఎవరూ దీనిని పట్టించుకోవడం లేదు. కాలపరిమితి ముగియడానికి 90 రోజులే గడువున్న మందులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఆస్పత్రుల్లో పంపిణీ చేయకూడదని నిబంధనలున్నాయి.

అలాంటి మందులను సరఫరా చేసిన కంపెనీలకే తిప్పి పంపాల్సిందే. ఎందుకంటే ఒక ఔషధం దాని కాలపరిమితి తేదీకి 3 నెలల ముందు నుంచి అందులోని మందు శక్తిని కోల్పోతూ ఉంటుందని, అలాంటి మందులు వాడినా ప్రభావశీలంగా పనిచేసే అవకాశాలు తక్కువని వైద్యులు చెబుతున్నారు. ఇన్ని నిబంధనలున్నా వాటిని పక్కనపెట్టేసి ఆస్పత్రులు ఇలా పడేస్తుండటంపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు కళ్లు తెరవకపోతే.. నగరం బయోవ్యర్థాలమయంగా మారిపోయే ప్రమాదముందని పర్యావరణ వేత్తలు హెచ్చరిస్తున్నారు.

టాటా, గున్నీ పిటిషన్లపై విచారణ 8కి వాయిదా

కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులకు హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: సినీనటి కాదంబరి జత్వానీ ఫిర్యాదు మేరకు ఇబ్రహీంపట్నం పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టేయాలంటూ ఐపీఎస్ అధికారులు కాంతిరాణా టాటా, విశాల్ గున్నీ, పోలీసు అధికారులు హనుమంతరావు, సత్యనారాయణ తదితరులు దాఖలు చేసిన వ్యాజ్యాల్లో హైకోర్టు తదుపరి విచారణను ఈ నెల 8కి వాయిదా వేసింది. జత్వానీ కేసులో వీరిని విచారణకు పిలవబోమని, అలాగే చార్జిషీట్ కూడా దాఖలు చేయబోమంటూ అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఇచ్చిన హామీ కూడా అదే రోజు వరకూ వర్తించేలా ఆదేశాలు ఇచ్చింది. కేసులో కౌంటర్లు దాఖలు చేయాలని పోలీసులను ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ నూనెపల్లి హరినాథ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. అంతకు ముందు పిటిషనర్ల తరపు సీనియర్ న్యాయవాదులు వినోద్ కుమార్ దేశ్‌పాండే, శ్రీరామ్, వేములపాటి పట్టాభి వాదనలు వినిపించారు. పోలీసుల తరపున అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ తన వాదనలు వినిపిస్తూ, విచారణను వేసవి సెలవుల తరువాతకు వాయిదా వేయాలని కోరారు. దీనికి న్యాయమూర్తి స్పందిస్తూ, విచారణను వేసవి సెలవుల తరువాతకు వాయిదా వేస్తానని, అయితే అప్పటి వరకు తదుపరి చర్యలన్నింటినీ నిలిపేస్తూ ఉత్తర్వులిస్తానని ప్రతిపాదించారు. దీనితో 8వ తేదీకి వాయిదా వేయాలని, ఆ రోజునే వాదనలు వినిపిస్తామని దమ్మాలపాటి తెలిపారు.



జోరుగా హుషారుగా...

సమ్మర్ హాలిడేస్ లేవా గురూ అని ఏ సినిమా సెలబ్రిటీని అడిగినా... వేసవి సెలవుల్లో ప్రేక్షకులకు థియేటర్లలో వినోదం ఇవ్వాలంటే మేం హాలిడేస్ తీసుకోకూడదు గురూ అంటారు. ఎండలు మండిపోతున్నాయి కదా అంటే... నో ప్రాబ్లమ్ అంటారు. ప్రస్తుతం భాగ్యనగరంలో ఎండలు ఏ రేంజ్‌లో ఉన్నాయో తెలిసిందే. ఎంచక్కా హాలిడే తీసుకుని కూల్ కూల్‌గా ఉండే విదేశాలు చుట్టి రావొచ్చు. కానీ... మండే ఎండలను లెక్క చేయకుండా హైదరాబాద్‌లో షూటింగ్ చేస్తూ బిజీ బిజీగా ఉన్నారు కొందరు హీరోలు. ఆ స్టార్స్ చేస్తున్న సినిమాల విశేషాలు తెలుసుకుందాం.


• మహేశ్‌బాబు

జన్వాడలో ఆటా పాటా

హీరో మహేశ్‌బాబు ఆడిపాడుతున్నారట. అది కూడా ఓ భారీ సెట్‌లో. ఎందుకంటే ఆయన హీరోగా నటిస్తున్న తాజా సినిమా కోసమే. మహేశ్‌బాబు, డైరెక్టర్ రాజమౌళి కాంబినేషన్‌లో ఓ సినిమా తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. 'ఎస్ఎస్ఎమ్‌బీ 29' అనే వర్కింగ్ టైటిల్‌తో ఈ చిత్రాన్ని దుర్గా ఆర్ట్స్‌పై కేఎల్ నారాయణ నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో ప్రియాంకా చోప్రా, మలయాళ నటుడు, దర్శకుడు పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమా కోసం మహేశ్‌బాబు పొడవాటి హెయిర్ స్టైల్, గెడ్డంతో ప్రత్యేకంగా మేకోవర్ అయ్యారు. ఆయన లుక్స్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన సంగతి తెలిసిందే. అమేజాన్ అడవుల నేపథ్యంలో అడ్వెంచరస్ మూవీగా తెరకెక్కుతోన్న ఈ సినిమా కోసం హైదరాబాద్ సమీపంలోని జన్వాడలో దాదాపు 550 మందితో ప్రత్యేకంగా సెట్ వేశారు మేకర్స్. ఈ సెట్‌లో మహేశ్‌బాబుతో పాటు ప్రధాన తారాగణంపై ఓ భారీ పాటని చిత్రీకరిస్తున్నారట రాజమౌళి. ఇప్పటికే తొలి షెడ్యూల్‌ని హైదరాబాద్ అల్యూమినియం ఫ్యాక్టరీలో, రెండో షెడ్యూల్‌ని ఒడిశాలోని కోరాపుట్‌లో పూర్తి చేశారు. తాజాగా జన్వాడలో వేసిన ప్రత్యేకమైన సెట్‌లో మూడవ షెడ్యూల్‌లో భాగంగా పాట చిత్రీకరణని గ్రాండ్‌గా జరుపుతున్నారట. ఈ సెట్స్, ఈ సాంగ్ సినిమాలో ఓ ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయని టాక్. ఈ పాట షూటింగ్ దాదాపు పూర్తి కావొచ్చిందని సమాచారం. మహేశ్ బాబు–రాజమౌళి వంటి క్రేజీ కాంబినేషన్లో రూపొందుతోన్న 'ఎస్ఎస్ఎమ్‌బీ 29' చిత్రంపై ప్రపంచవ్యాప్తంగా భారీ అంచనాలున్నాయి.

ముచ్చింతల్‌లో లెనిన్

అక్కినేని అఖిల్ హీరోగా నటిస్తున్న చిత్రం 'లెనిన్'. 'వినరో భాగ్యము విష్ణుకథ' చిత్ర దర్శకుడు మురళీ కిశోర్ అబ్బూరు దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్, సితార ఎంటర్‌టైన్మెంట్స్ పతాకాలపై అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రాయలసీమ నేపథ్యంలో రొమాంటిక్ యాక్షన్ డ్రామాగా ఈ సినిమా రూపొందుతోంది. ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్ సమీపంలోని శంషాబాద్ వద్ద ఉన్న ముచ్చింతల్‌లో జరుగుతోంది. శరవేగంగా సాగుతోన్న ఈ చిత్రీకరణలో హీరో, హీరోయిన్లతో పాటు చిత్రంలోని ప్రధాన తారాగణంపై కీలకమైన సన్నివేశాలను తెరకెక్కిస్తున్నారని తెలిసింది. ఈ సినిమా కోసం పొడవాటి జుట్టు, గెడ్డంతో ఫుల్ మాస్ లుక్‌లోకి మారిపోయారు అఖిల్. ఏప్రిల్ 8న అఖిల్ బర్త్ డే సందర్భంగా విడుదల చేసిన 'లెనిన్' టైటిల్ గ్లింప్స్‌కి మంచి స్పందన వచ్చింది. ''గతాన్ని తరమడానికి పోతా... మా నాయన నాకో మాట సెప్పినాడు.. పుట్టేటప్పుడు ఊపిరి ఉంటాది రా.. పేరు ఉండదు, అట్నే పోయేటప్పుడు ఊపిరుండదు.. పేరు మాత్రమే ఉంటాది. ఆ పేరు ఎట్టా నిలబడాలంటే...'' అంటూ రాయలసీమ యాసలో అఖిల్ చెప్పిన డైలాగ్స్‌కి అద్భుతమైన స్పందన వచ్చింది. 'ఏజెంట్' సినిమా తర్వాత రెండేళ్ల గ్యాప్ అనంతరం అఖిల్ నటిస్తున్న చిత్రం 'లెనిన్'.


• అఖిల్

తుక్కుగూడలో సంబరాలు

హీరో సాయిదుర్గా తేజ్ తుక్కుగూడలో సంబరాలు చేసుకుంటున్నారు. ఆయన సంబరాలు ఎందుకు చేసుకుంటున్నారు? ఎంత గ్రాండ్‌గా చేశారు? అనే విషయాలు తెలియాలంటే సెప్టెంబర్ 25 వరకూ వేచి చూడాల్సిందే. 2023లో విడుదలైన 'విరూపాక్ష', 'బ్రో' వంటి హిట్ సినిమాల తర్వాత సాయిదుర్గా తేజ్ నటిస్తున్న తాజా చిత్రం 'ఎస్‌వైజీ' (సంబరాల ఏటిగట్టు). ఈ సినిమా ద్వారా రోహిత్ కేపీ దర్శకునిగా పరిచయమవుతున్నారు. ఈ చిత్రంలో ఐశ్వర్యా లక్ష్మీ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్‌పై 'హను–మాన్' (2024) వంటి పాన్ ఇండియన్ హిట్ అందుకున్న కె. నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి ఈ సినిమా నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్ సమీపంలోని తుక్కుగూడలో జరుగుతోంది. ఇక్కడ ప్రత్యేకంగా వేసిన సెట్‌లో లాంగ్ షెడ్యూల్ జరుపుతున్నారు మేకర్స్. ఈ షెడ్యూల్‌లో హీరో, హీరోయిన్లతో పాటు ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారట. పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతోన్న 'ఎస్‌వైజీ' (సంబరాల ఏటిగట్టు) సెప్టెంబర్ 25న తెలుగుతో పాటు తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో విడుదల కానుంది.


• సాయిదుర్గా తేజ్


• రవితేజ


• సిద్ధు జొన్నలగడ్డ

ముచ్చింతల్‌లో జాతర

హీరో రవితేజ జాతరలో సందడి చేస్తున్నారు. సందడంటే మామూలు సందడి కాదు... ఓ రేంజ్‌లో భారీగా అన్నమాట. మరి... ఆయన సందడి ఏ స్థాయిలో ఉంటుందో తెలియాలంటే 'మాస్ జాతర' సినిమా విడుదల వరకూ వేచి చూడాలి. రవితేజ హీరోగా నటిస్తున్న 75వ చిత్రం 'మాస్ జాతర'. 'సామజవరగమన' మూవీ ఫేమ్ భాను భోగవరపు దర్శకత్వం వహిస్తున్నారు. 'ధమాకా' వంటి బ్లాక్‌బస్టర్ మూవీ తర్వాత రవితేజ–శ్రీలీల 'మాస్ జాతర'లో రెండోసారి జోడీగా నటిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. భారీ పీరియాడికల్ స్టోరీతో అరకు అటవీ బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా సాగనుందని టాక్. ఇటీవల అరకులో ఓ షెడ్యూల్ పూర్తి చేసిన యూనిట్ తాజాగా హైదరాబాద్ సమీపంలోని శంషాబాద్ వద్ద ఉన్న ముచ్చింతల్‌లో చిత్రీకరణ జరుపుకుంటోంది. శరవేగంగా సాగుతోన్న ఈ చిత్రీకరణలో రవితేజతో పాటు చిత్రంలోని ప్రధాన తారాగణం పాల్గొంటుండగా ముఖ్యమైన సన్నివేశాలను తెరకెక్కిస్తున్నారట భాను భోగవరపు. రవితేజ నుంచి అభిమానులు, ప్రేక్షకులు కోరుకునే విందు భోజనంలాంటి మాస్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా రూపొందుతున్నట్లు ఇప్పటికే మేకర్స్ ప్రకటించారు. 'సామజవరగమన' లాంటి హిట్ సినిమా తర్వాత భాను భోగవరపు దర్శకత్వం వహిస్తుండటం, 'ధమాకా' సినిమాతో హిట్ పెయిర్‌గా నిలిచిన రవితేజ, శ్రీలీల రెండోసారి కలిసి నటిస్తుండటం, 'ధమాకా' సినిమాకి సూపర్ హిట్ సంగీతం అందించిన భీమ్స్ సిసిరోలియో–రవితేజ కాంబో రిపీట్ అవుతుండటంతో 'మాస్ ధమాకా'పై భారీ అంచనాలున్నాయి.

బాచుపల్లిలో తెలుసు కదా!

'డీజే టిల్లు, టిల్లు స్క్వేర్' వంటి హిట్ సినిమాలతో ప్రేక్షకుల్లో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు సొంతం చేసుకున్నారు హీరో సిద్ధు జొన్నలగడ్డ. ఆయన హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'తెలుసు కదా'. ప్రముఖ స్టైలిస్ట్ నీరజ కోన ఈ సినిమా ద్వారా డైరెక్టర్‌గా పరిచయం అవుతున్నారు. రాశీ ఖన్నా, శ్రీనిధీ శెట్టి హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రంలో వైవా హర్ష కీలక పాత్ర పోషిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వ ప్రసాద్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్ సమీపంలోని బాచుపల్లిలో జరుగుతోంది. ఈ సినిమా కోసం వేసిన ప్రత్యేకమైన సెట్‌లో కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారట. సిద్ధు జొన్నలగడ్డ కామెడీ టైమింగ్‌కి ఏ మాత్రం తగ్గకుండా వినోదాత్మకంగా, అందమైన ప్రేమకథగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారట నీరజ కోన. స్టైలిస్ట్‌గా తానేంటో నిరూపించుకున్న నీరజ దర్శకురాలిగా ఏ స్థాయి హిట్ అందుకుంటారో వేచి చూడాలి.

శంషాబాద్‌లో సూపర్ యోధ

బాలనటుడిగా అద్భుతమైన నటనతో ఆకట్టుకున్న తేజ సజ్జా 'జాంబి రెడ్డి' (2021) సినిమాతో హీరోగా పరిచయమై, హిట్ అందుకున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రానికి దర్శకత్వం వహించిన ప్రశాంత్ వర్మ దర్శకత్వంలోనే తేజ సజ్జా హీరోగా నటించిన రెండో చిత్రం 'హను–మాన్'. గత ఏడాది సంక్రాంతికి విడుదలైన ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో సూపర్ హిట్ అందుకుంది. 'హను–మాన్' వంటి హిట్ చిత్రం తర్వాత తేజ నటిస్తున్న మరో పాన్ ఇండియా చిత్రం 'మిరాయ్'. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో ఈ సినిమాని పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. రితికా నాయక్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో నటుడు మంచు మనోజ్ విలన్ పాత్ర పోషిస్తున్నారు. ఆధ్యాత్మిక అంశాలతో ముడిపడిన ఫ్యాంటసీ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందుతోన్న ఈ సినిమాలో తేజ సూపర్ యోధగా కనిపించనున్నారు. ఇటీవల నేపాల్‌లో జరిగిన ఓ షెడ్యూల్‌లో తేజపై భారీ యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరించారు. ఈ సినిమా తాజా షెడ్యూల్ హైదరాబాద్ సమీపంలోని శంషాబాద్‌లో జరుగుతోందట. తేజ సజ్జాతో పాటు సినిమాలోని ప్రధాన తారాగణంపై ముఖ్యమైన సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారట కార్తీక్ ఘట్టమనేని.


• నాగచైతన్య

గుహల్లో పరిశోధన

హీరో నాగచైతన్య గుహలు, అడవులు, గుట్టలు, కొండలు వంటి ప్రాంతాల్లో తవ్వకాలు జరిపి పరిశోధన చేస్తున్నారు. జనరల్‌గా పురావస్తు శాఖ అధికారులు పరిశోధన జరుపుతుంటారు. మరి... నాగచైతన్య ఎందుకు పరిశోధన చేస్తున్నారు? అంటే ఆయన నటిస్తున్న తాజా సినిమా కోసం అన్నమాట. 'తండేల్' మూవీ సక్సెస్‌తో ఫుల్ జోష్‌లో ఉన్నారు నాగ చైతన్య. సాయిదుర్గా తేజ్‌తో 'విరూపాక్ష' (2023) మూవీ తీసి, బ్లాక్‌బస్టర్ అందుకున్నారు డైరెక్టర్ కార్తీక్ దండు. ప్రస్తుతం ఆయన దర్శకత్వంలో నాగచైతన్య హీరోగా ఓ మిథికల్ థ్రిల్లర్ మూవీ రూపొందుతోంది. 'ఎన్‌సీ 24' అనే వర్కింగ్ టైటిల్‌లో సినిమాని బాపినీడు సమర్పణలో సుకుమార్ రైటింగ్స్, శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర బ్యానర్‌లో బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోలో (ఏడెకరాలు) జరుగుతోంది. మిస్టిక్ థ్రిల్లర్‌గా భారీ బడ్జెట్‌తో రూపొందుతోన్న ఈ చిత్రం షూటింగ్ కోసం గుహలు, అడవులు, గుట్టలు, కొండలు వంటి ప్రత్యేకమైన సెట్స్ వేశారని టాక్. ఈ చిత్రంలో నాగచైతన్య సరికొత్త లుక్‌తో కనిపిస్తారని ఇటీవల విడుదలైన స్పెషల్ వీడియో గ్లింప్స్ చూస్తే అర్థం అవుతోంది. ఈ సినిమా కోసం శారీరకంగా, మానసికంగా ఆయన కొత్తగా ట్రాన్స్‌ఫార్మ్ అయ్యారు కూడా. ఈ సినిమా నాగచైతన్య కెరీర్‌లో ఓ మైలురాయిలా ఉంటుందని చిత్రయూనిట్ ప్రకటించింది.

సెట్‌లో స్పెషల్ సాంగ్


• వరుణ్ తేజ్

అల్యూమినియం ఫ్యాక్టరీలో ఆడి పాడుతున్నారు హీరో వరుణ్ తేజ్. అది కూడా ప్రత్యేకమైన పాట కోసం. ఈ ఆటా పాటా ఆయన నటిస్తున్న తాజా చిత్రం 'వీటీ 15' (వర్కింగ్ టైటిల్) కోసమే. 'వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్, ఎక్స్‌ప్రెస్ రాజా, ఏక్ మినీ కథ' వంటి హిట్ చిత్రాలకు దర్శకత్వం వహించిన మేర్లపాక గాంధీ దర్శకత్వంలో వరుణ్ తేజ్ హీరోగా ఈ సినిమా తెరకెక్కుతోంది. రితికా నాయర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్స్‌పై 'వీటీ 15' రూపొందుతోంది. ఇండో కొరియన్ హారర్ కామెడీ నేపథ్యంలో రూపొందుతోన్న ఈ చిత్రం ప్రస్తుతం హైదరాబాద్‌లోని గచ్చిబౌలి సమీపంలో ఉన్న అల్యూమినియం ఫ్యాక్టరీలో షూటింగ్ జరుపుకుంటోంది. ఇక్కడ వేసిన ఓ సెట్‌లో ప్రత్యేక పాటని చిత్రీకరిస్తున్నారట మేకర్స్. ఈ పాటలో వరుణ్ తేజ్‌తో కలిసి 'జాంబి రెడ్డి, బంగార్రాజు' చిత్రాల ఫేమ్ దక్షా నగార్కర్ నటిస్తున్నారని సమాచారం. అంతేకాదు.. ఈ పాటలోని కొన్ని సన్నివేశాలను హైదరాబాద్‌లోని కోకాపేట సమీపంలో చిరంజీవి–రామ్‌చరణ్ నటించిన 'ఆచార్య' (2022) సినిమా షూటింగ్ కోసం వేసిన ఓ ప్రత్యేకమైన సెట్‌లోనూ చిత్రీకరించనున్నారని సమాచారం. ఈ సినిమాకు 'కొరియన్ కనకరాజు' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నారట మేకర్స్.

పై చిత్రాలే కాదు.. మరికొన్ని సినిమాల షూటింగ్స్ కూడా హైదరాబాద్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో షూటింగ్‌లు జరుపుకుంటున్నాయి.

- దేరంగుల జగన్ మోహన్


• తేజ సజ్జా

కిల్లర్ కామెడీ



• 'హౌస్‌ఫుల్' పోస్టర్

బాలీవుడ్‌లో సక్సెస్‌ఫుల్ కామెడీ ఫ్రాంచైజీ 'హౌస్‌ఫుల్' నుంచి రానున్న తాజా చిత్రం 'హౌస్‌ఫుల్ 5'. అక్షయ్ కుమార్, అభిషేక్ బచ్చన్, రితేష్ దేశ్‌ముఖ్, జాక్వెలిన్ ఫెర్నాండెజ్, సోనమ్ బజ్వా, నర్గీస్ ఫక్రీ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఇంకా సంజయ్ దత్, నానా పటేకర్, జాకీ ష్రాఫ్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం టీజర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. ఈ టీజర్ వీడియోలో ప్రధాన నటీనటులను పరిచయం చేసి, చివర్లో ఓ కిల్లర్ ఉన్నాడంటూ చూపించారు. టీజర్‌లో 'హౌస్‌ఫుల్ 5 ఏ కిల్లర్ కామెడీ' అని కనిపిస్తోంది. ఈ అంశాలను బట్టి..మర్డర్స్ మిస్టరీ నేపథ్యానికి కామెడీ జోడించి, క్రైమ్ కామెడీగా 'హౌస్‌ఫుల్ 5' సినిమాను తెరకెక్కిస్తున్నట్లుగా తెలుస్తోంది. తరుణ్ మన్సుఖాని దర్శకత్వంలో సాజిద్ నడియాడ్‌వాలా నిర్మిస్తున్న ఈ చిత్రం జూన్ 6న విడుదల కానుంది.

నా హృదయం ముక్కలైంది!

'సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయన్సర్ మిషా అగర్వాల్ ఆత్మహత్య విషయం, అందుకు గల కారణాలతో నా హృదయం ముక్కలైంది' అంటున్నారు హీరోయిన్ తాప్సీ. సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయన్సర్ మిషా అగర్వాల్ ఏప్రిల్ 24న ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే. ఇన్‌స్టాగ్రామ్‌లో రీల్స్, పోస్టులతో ఎంతో మంది ఫాలోవర్స్‌ను పెంచుకున్నారు మిష. అయితే ఓ దశలో ఫాలోవర్స్ క్రమంగా తగ్గుతూ రావడంతో జీర్ణించుకోలేకపోవడం, కెరీర్ పరంగా దృష్టి సారించలేకపోవడం వల్లే ఆత్మహత్య చేసుకున్నట్లు మిషా అగర్వాల్ కుటుంబ సభ్యులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఘటనపై తాప్సీ స్పందించారు. ''ప్రస్తుతం సోషల్ మీడియాపై అందరూ ఎంతో వ్యామోహం చూపిస్తున్నారు. చుట్టూ ఉన్న కుటుంబ సభ్యులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు చూపించే నిజమైన ప్రేమ కంటే ఆన్‌లైన్ ప్రేమకే మొగ్గు చూపుతున్నారు. ఇలాంటి ఒక రోజు వస్తుందని ఎప్పుడో ఊహించి, భయపడ్డాను. మన లైఫ్‌ని మనం ప్రేమించడం కంటే ఫాలోవర్స్ సంఖ్యకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తామని, అదే విధంగా మనం కష్టపడి చదువుకున్న డిగ్రీలను లైకులు, కామెంట్స్ అధిగమిస్తాయని ఊహించాను. ఈరోజు మిషా అగర్వాల్ లాంటి ఆత్మహత్య ఘటన బాధాకరం.. నా హృదయం ముక్కలైంది'' అని పేర్కొన్నారు.


• తాప్సీ

భూతల స్వర్గం పహల్గామ్

'కశ్మీర్‌లోని పహల్గామ్ భూతల స్వర్గం.. ఆ ప్రదేశంలో పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడి తన మనసుకు ఎంతో బాధ కలిగించింది' అంటున్నారు హీరోయిన్ నభా నటేష్. ఇటీవల పహల్గామ్‌లో ఉగ్రవాదుల కాల్పుల్లో 26 మంది పర్యాటకులు మృతి చెందిన ఘటన తెలిసిందే. ఈ ఘటనపై నభా నటేష్ స్పందిస్తూ–''పహల్గామ్ చాలా అందమైన ప్రదేశం. నేను నటించిన 'డార్లింగ్' సినిమా షూటింగ్ అక్కడే చేశాం. చుట్టూ 5 కిలో మీటర్ల మేర అందమైన లొకేషన్స్‌లో చిత్రీకరణ జరిపాం. అక్కడి ప్రజలు చాలా మంచివారు. మా టీమ్‌కు స్నేహితులుగా మారిపోయారు. భూతల స్వర్గమైన పహల్గామ్‌లో ఉగ్రవాదులు దాడి జరపడం హేయమైన చర్య. బాధితుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి. ఇలాంటి దాడులు జరిగాక ఫిల్మ్ మేకర్స్ పహల్గామ్ వెళ్లాలంటే ఆలోచిస్తారు. దాడి ఘటన గురించి తెలియగానే నా మనసుకు ఎంతో బాధ కలిగింది. నాకు అక్కడ షూటింగ్ చేసిన రోజులన్నీ కళ్లముందు తిరిగాయి'' అని చెప్పారు.


• నభా నటేష్

లార్డ్స్‌లో మరో ఫైనల్

- 2026 మహిళల టి20 ప్రపంచకప్ టైటిల్ పోరు వేదిక ఖరారు
- ఇంగ్లండ్‌లో జూన్ 12 నుంచి జూలై 5 వరకు మెగా ఈవెంట్



దుబాయ్: సుప్రసిద్ధ క్రికెట్ మైదానం 'లార్డ్స్' మరో విశ్వవిజేతను తేల్చనుంది. వచ్చే ఏడాది జరిగే మహిళల టి20 ప్రపంచ కప్ ఫైనల్ లార్డ్స్‌లో జరుగుతుందని అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) గురువారం ప్రకటించింది. 12 జట్లు పాల్గొనే మహిళల మెగా ఈవెంట్ వచ్చే ఏడాది జూన్ 12న మొదలై జూలై 5వ తేదీన జరిగే ఫైనల్‌తో ముగుస్తుంది. టోర్నీలో మొత్తం 33 మ్యాచ్‌లు జరుగుతాయి. ఓల్డ్ ట్రాఫోర్డ్, హెడింగ్లీ, ఎడ్జ్‌బాస్టన్, ద ఓవల్, హ్యాంప్‌షైర్ బౌల్, బ్రిస్టల్ కౌంటీ ఇలా ఆరు వేదికల్లో లీగ్, సహా సెమీఫైనల్స్ మ్యాచ్‌లు జరుగుతాయి. కానీ గ్రాండ్ ఫైనల్ మాత్రం విఖ్యాత లార్డ్స్ మైదానంలో జరుగుతుందని ఐసీసీ వెల్లడించింది. 12 జట్లను రెండు గ్రూపులుగా విభజించి మ్యాచ్‌లను నిర్వహిస్తారు. పూర్తి షెడ్యూల్‌ను తర్వాత ప్రకటిస్తామని ఐసీసీ తెలిపింది. క్రికెట్‌ను అమితంగా ఇష్టపడే ఇంగ్లండ్‌లో ప్రేక్షకులు ప్రపంచకప్‌కు బ్రహ్మరథం పడతారని ఐసీసీ చైర్మన్ జై షా తెలిపారు. 'ఉత్కంఠ భరితంగా సాగిన 2017 మహిళల వన్డే ప్రపంచకప్ ఫైనల్ నాకు ఇంకా గుర్తుంది. మెరుపుల టి20 మెగా ఈవెంట్ మరింత ఆసక్తిగా సాగుతుందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. మేం ఇక టోర్నీ ఏర్పాట్లపై నిమగ్నమవుతాం. రోమాంచకరమైన క్రికెట్ ఆట లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్ (2028)లో మరో దశకు చేరుతుంది' అని అన్నారు. ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) చీఫ్ ఎగ్జిక్యూటివ్ రిచర్డ్ గౌల్ మాట్లాడుతూ మొత్తం ఏడు వేదికల్లో మహిళల టి20 ప్రపంచకప్ మ్యాచ్‌లు నిర్వహిస్తామని చెప్పారు. ఈ టోర్నీలో భారత్, మాజీ చాంపియన్ ఆస్ట్రేలియా, డిఫెండింగ్ చాంపియన్ న్యూజిలాండ్, ఆతిథ్య ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా, వెస్టిండీస్, పాకిస్తాన్, శ్రీలంక ఈ ఎనిమిది జట్లు ఇదివరకే అర్హత సంపాదించాయి. మిగతా నాలుగు జట్లు మాత్రం ఈ ఏడాది జరిగే ప్రపంచకప్ క్వాలిఫయర్స్ ద్వారా అర్హత సాధిస్తాయి. లార్డ్స్‌లో 2017లో జరిగిన మహిళల వన్డే ప్రపంచకప్ ఫైనల్లో భారత్ రన్నరప్‌గా నిలిచింది. ఆతిథ్య ఇంగ్లండ్‌పై గెలిచే స్థితిలో కనిపించిన మిథాలీ రాజ్ బృందం అనూహ్యంగా 9 పరుగుల తేడాతో ప్రపంచకప్‌ను చేజార్చుకుంది. పురుషుల క్రికెట్ స్థాయి ఉత్కంఠకు ఏమాత్రం తీసిపోని ఈ ఫైనల్‌కు రికార్డు స్థాయిలో టీవీ ప్రేక్షకులు తిలకించారు. అప్పటి నుంచి అమ్మాయిల క్రికెట్‌పై ఆసక్తి క్రమంగా పెరుగుతూ వచ్చింది. మెల్‌బోర్న్‌లో భారత్, ఆస్ట్రేలియాల మధ్య 2020లో జరిగిన టి20 ప్రపంచకప్ ఫైనల్‌ను 86,174 మంది ప్రేక్షకులు ప్రత్యక్షంగా తిలకించారు. తదనంతరం కేప్‌టౌన్ (2023), దుబాయ్ (2024)లలో జరిగిన మెగా ఈవెంట్లకు టికెట్లన్నీ ముందస్తుగానే 'సోల్డ్ అవుట్' అయ్యాయి.



2024 డిఫెండింగ్ చాంపియన్ న్యూజిలాండ్ జట్టు

శ్రేయస్ అయ్యర్‌కు రూ. 12 లక్షలు జరిమానా



చెన్నై: పంజాబ్ కింగ్స్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌కు జరిమానా విధించారు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో బుధవారం చెన్నైతో జరిగిన మ్యాచ్‌లో మందకొడి బౌలింగ్ కారణంగా అతనిపై రూ. 12 లక్షల జరిమానా విధించారు. 'ఈ సీజన్‌లో పంజాబ్ కింగ్స్ మొదటి తప్పుగా భావించి ఈ జరిమానా విధించాం. నిర్ణీత సమయంలో కోటా ఓవర్లను పూర్తి చేయడంలో పంజాబ్ కింగ్స్ విఫలమైంది. అందుకే ఐపీఎల్ నియమావళిని అనుసరించి కెప్టెన్ మ్యాచ్ ఫీజులో నుంచి రూ. 12 లక్షలు కోత విధించాం' అని ఐపీఎల్ మీడియా అడ్వైజరీ తెలిపింది. అయ్యర్ నేతృత్వంలోని పంజాబ్ కింగ్స్ 4 వికెట్ల తేడాతో ఐదుసార్లు చాంపియన్ అయిన చెన్నై సూపర్‌కింగ్స్ (సీఎస్‌కే)పై గెలిచింది. ఈ ఓటమితోనే సీఎస్‌కే అధికారికంగా ప్లేఆఫ్స్‌కు దూరమైంది.

ముంబై ఇండియన్స్ జట్టులోకి రఘు శర్మ

గాయంతో ఐపీఎల్‌కు దూరమైన విఘ్నేశ్



విఘ్నేశ్ / రఘు

న్యూఢిల్లీ: ఐపీఎల్ మాజీ చాంపియన్ ముంబై ఇండియన్స్ తమ జట్టులో గాయపడిన విఘ్నేశ్ పుతూర్ స్థానాన్ని రఘు శర్మతో భర్తీ చేసుకుంది. కేరళకు చెందిన స్పిన్నర్ విఘ్నేశ్ పిక్క ఎముకల గాయంతో మిగతా సీజన్‌కు దూరమయ్యాడు. దీంతో అతని స్థానాన్ని 32 ఏళ్ల లెగ్ స్పిన్నర్ రఘుతో భర్తీ చేశామని ముంబై ఇండియన్స్ యాజమాన్యం తెలిపింది. రఘు ప్రస్తుతం ముంబై జట్టుకు నెట్ బౌలర్‌గా సేవలందిస్తున్నాడు. దీంతో ఫ్రాంచైజీ అతన్ని ప్రధాన జట్టులోకి తీసుకుంది. దేశవాళీ క్రికెట్‌లో పంజాబ్, పుదుచ్చేరి జట్లకు రఘు ఆడాడు. మొత్తం 11 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లాడిన అతను 57 వికెట్లు పడగొట్టాడు. 7/56 అతని అత్యుత్తమ ప్రదర్శన కాగా, లిస్ట్ 'ఎ' క్రికెట్‌లో 9 మ్యాచ్‌ల్లో 14 వికెట్లు తీశాడు. మూడు టి20లు ఆడిన అతను 3 వికెట్లు పడగొట్టాడు.

విజయంతో ముగింపు...



సతీశ్ కుమార్

జియామెన్ (చైనా): సుదిర్మన్ కప్ ప్రపంచ మిక్స్‌డ్ టీమ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను భారత జట్టు విజయంతో ముగించింది. గ్రూప్ 'డి'లో వరుసగా రెండు మ్యాచ్‌ల్లో ఓడి నాకౌట్ దశకు అర్హత పొందలేకపోయిన భారత్, ఇంగ్లండ్ జట్లు గురువారం నామమాత్రమైన చివరి లీగ్ మ్యాచ్‌లో తలపడ్డాయి. భారత్ 3-2తో ఇంగ్లండ్‌ను ఓడించింది. తొలి మ్యాచ్‌లో అనుపమ 21-12, 21-16తో మియు లిన్ నగాన్‌పై గెలిచింది. రెండో మ్యాచ్‌లో సతీశ్ కుమార్ కరుణాకరన్ 18-21, 22-20, 21-13తో హ్యారీ హువాంగ్‌ను ఓడించి భారత్‌కు 2-0తో ఆధిక్యాన్ని అందించాడు. మూడో మ్యాచ్‌లో తనీషా క్రాస్టో-శ్రుతి మిశ్రా 21-17, 21-17తో లిజీ టాల్మన్-ఎస్టెలీ వాన్ లీవెన్‌లపై నెగ్గడంతో భారత్ 3-0తో విజయాన్ని ఖరారు చేసుకుంది. నామమాత్రమైన చివరి రెండు మ్యాచ్‌ల్లో హరిహరన్-రూబన్ కుమార్ 14-21, 21-11, 13-21తో రోరీ ఈస్టన్-అలెక్స్ గ్రీన్ చేతిలో, సతీశ్ కుమార్-తనీషా క్రాస్టో 21-11, 13-21, 22-24తో కాలమ్ హెమింగ్-ఎస్టెలీ వాన్ లీవెన్ చేతిలో ఓడిపోయారు. ఈ మ్యాచ్‌కు ముందే నాకౌట్ దశకు చేరే అవకాశాలకు తెరపడటంతో భారత స్టార్స్ పీవీ సింధు, ప్రణయ్ బరిలోకి దిగలేదు.

పోరాడి ఓడిన బోపన్న జోడీ



బోపన్న

మాడ్రిడ్: ఈ ఏడాది భారత టెన్నిస్ డబుల్స్ స్టార్ రోహన్ బోపన్న నిరాశాజనక ప్రదర్శన కొనసాగుతోంది. మాడ్రిడ్ ఓపెన్ మాస్టర్స్ సిరీస్-1000 టెన్నిస్ టోర్నీలో బోపన్న పోరాటం ప్రిక్వార్టర్ ఫైనల్లోనే ముగిసింది. గురువారం జరిగిన పురుషుల డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో బోపన్న (భారత్)-బెన్ షెల్టన్ (అమెరికా) ద్వయం 4-6, 7-6 (7/5), 9-11తో 'సూపర్ టైబ్రేక్'లో మాక్సిమో గొంజాలెజ్-ఆంద్రెస్ మొల్తెని (అర్జెంటీనా) జంట చేతిలో ఓటమి పాలైంది. 1 గంట 56 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో బోపన్న-షెల్టన్ ఎనిమిది ఏస్‌లు సంధించి, మూడు డబుల్ ఫాల్ట్‌లు చేశారు. తమ సర్వీస్‌ను రెండుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేశారు. 51 సర్వీస్ పాయింట్లు సాధించగా... అందులో 41 తొలి సర్వ్‌లో, 10 రెండో సర్వ్‌లో వచ్చాయి. ప్రిక్వార్టర్ ఫైనల్లో ఓడిన బోపన్న, షెల్టన్‌లకు 30,540 యూరోల (రూ. 29 లక్షల 17 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 90 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. ఈ సీజన్‌లో బోపన్న తొమ్మిది టోర్నీల్లో పోటీ పడగా... ఏ టోర్నీలోనూ క్వార్టర్ ఫైనల్ దాటి ముందుకెళ్లలేకపోయాడు.

శ్రీనిధి డెక్కన్ ఎఫ్‌సీ కెప్టెన్ మునోజ్‌కు రెండు అవార్డులు

ఐ-లీగ్ వార్షిక పురస్కారాలు



మునోజ్

న్యూఢిల్లీ: జాతీయ ఫుట్‌బాల్ ఐ-లీగ్ 2024-2025 సీజన్ వార్షిక పురస్కారాల్లో హైదరాబాద్‌కు చెందిన శ్రీనిధి డెక్కన్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) జట్టుకు రెండు అవార్డులు లభించాయి. శ్రీనిధి డెక్కన్ జట్టు కెప్టెన్ డేవిడ్ కాస్టనెడా మునోజ్ 'బెస్ట్ ప్లేయర్'తో పాటు 'టాప్ స్కోరర్' పురస్కారాలు గెల్చుకున్నాడు. కొలంబియాకు చెందిన 30 ఏళ్ల మునోజ్ ఐ-లీగ్‌లో మొత్తం 17 గోల్స్ సాధించాడు. 2021 సీజన్ నుంచి శ్రీనిధి జట్టుతో కొనసాగుతున్న మునోజ్ ఇప్పటి వరకు ఐ-లీగ్‌లో 79 మ్యాచ్‌లు ఆడి 53 గోల్స్ సాధించాడు. ఐ-లీగ్ 2021-2022 సీజన్‌లో శ్రీనిధి జట్టు మూడో స్థానం, 2022-2023 సీజన్‌లో రెండో స్థానం, 2023-2024 సీజన్‌లో రెండో స్థానం, 2024-2025 సీజన్‌లో తొమ్మిదో స్థానం సంపాదించింది.

క్వార్టర్ ఫైనల్లో రిత్విక్ ద్వయం



రిత్విక్

కస్కయిస్ (పోర్చుగల్): మిలీనియం ఎస్టోరిల్ ఓపెన్ ఏటీపీ చాలెంజర్-175 టెన్నిస్ టోర్నీలో భారత డేవిస్‌కప్ జట్టు సభ్యుడు బొల్లిపల్లి రిత్విక్ చౌదరీ శుభారంభం చేశాడు. హైదరాబాద్‌కు చెందిన రిత్విక్ చౌదరీ కొలంబియా ప్లేయర్ నికొలస్ బరియెంతోస్‌తో కలిసి పురుషుల డబుల్స్ విభాగంలో పోటీపడుతున్నాడు. గురువారం జరిగిన తొలి రౌండ్‌లో రిత్విక్-బరియెంతోస్ ద్వయం 3-6, 7-6 (7/4), 10-3తో 'సూపర్ టైబ్రేక్'లో మార్సెలో డెమోలైనర్ (బ్రెజిల్)-గ్రెగోరి జాక్ (ఫ్రాన్స్) జంటను ఓడించింది. 1 గంట 41 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రిత్విక్-బరియెంతోస్ తమ సర్వీస్‌ను నాలుగుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేశారు. 49 సర్వీస్ పాయింట్లు సాధించగా... తొలి సర్వ్‌లో 34 పాయింట్లు, రెండో సర్వ్‌లో 15 పాయింట్లు వచ్చాయి.

సెమీస్‌లో అనిరుధ్ జంట

మరోవైపు ఆస్ట్రియా ఓపెన్ ఏటీపీ చాలెంజర్-100 టెన్నిస్ టోర్నీలో హైదరాబాద్ ప్లేయర్ అనిరుధ్ చంద్రశేఖర్ (భారత్)-మిడిల్‌కూప్ (నెదర్లాండ్స్) జోడీ సెమీఫైనల్లోకి ప్రవేశించింది. క్వార్టర్ ఫైనల్లో అనిరుధ్-మిడిల్‌కూప్ ద్వయం 6-0, 3-6, 10-7తో 'సూపర్ టైబ్రేక్'లో బెంజమిన్ హసన్ (లెబనాన్)-లుకాస్ న్యూమేయర్ (ఆస్ట్రియా) జోడీపై గెలిచింది. తొలి రౌండ్‌లో అనిరుధ్-మిడిల్‌కూప్ 6-4, 6-7 (1/7), 10-6తో 'సూపర్ టైబ్రేక్'లో వెర్బీర్ (నెదర్లాండ్స్)-లియుతారెవిచ్ (బెలారస్)లపై విజయం సాధించారు.

సన్‌రైజర్స్‌కు కౌంట్‌డౌన్...

వరుస విజయాలు సాధిస్తేనే 'ప్లే ఆఫ్స్' అవకాశాలు

- నేడు గుజరాత్ టైటాన్స్‌తో పోరు
- రాత్రి గం. 7:30 నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం



హైదరాబాద్ జట్టు

అహ్మదాబాద్: సీజన్‌లో ఐదు మ్యాచ్‌లు మిగిలి ఉన్నాయి...అన్నీ గెలిస్తే ఎలాంటి ఇబ్బందీ లేకుండా ప్లే ఆఫ్స్‌కు చేరవచ్చు. నాలుగు గెలిస్తే వేర్వేరు సమీకరణాలు, ఇతర జట్ల ఫలితాలపై ఆధారపడి ఆశలు పెట్టుకోవచ్చు... ఐపీఎల్-2025లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తాజా పరిస్థితి ఇది. పూర్తిగా దారులు మూసుకుపోకుండా రేసులో నిలవాలంటే తప్పనిసరిగా గెలవాల్సిన మ్యాచ్‌లో నేడు హైదరాబాద్ బరిలోకి దిగుతోంది. గుజరాత్ టైటాన్స్‌ను వారి సొంతగడ్డపై సన్‌రైజర్స్ ఎదుర్కొంటుంది. ఇరు జట్ల మధ్య ఉప్పల్‌లో జరిగిన గత మ్యాచ్‌లో టైటాన్స్ 7 వికెట్ల తేడాతో సునాయాస విజయం సాధించింది. నరేంద్ర మోదీ స్టేడియంలో ఈ సీజన్‌లో జరిగిన ఎనిమిది ఇన్నింగ్స్‌లలో ఐదు సార్లు 200 పరుగులకంటే ఎక్కువ స్కోర్లు నమోదయ్యాయి. ఈ మ్యాచ్‌లో కూడా భారీ స్కోరుకు అవకాశం ఉంది. శుక్రవారం దాదాపు 42 డిగ్రీల ఉష్ణోగ్రత మధ్య ఆటగాళ్లు పోరాడాల్సి రావచ్చు.

సమష్టిగా రాణిస్తేనే...

గత ఏడాదితో పోలిస్తే ఈసారి సన్‌రైజర్స్ బ్యాటింగ్ చాలా వరకు విఫలమైంది. అక్కడక్కడ కొన్ని మెరుపులు కనిపించినా ఓవరాల్‌గా ఆశించిన ప్రదర్శన రాలేదు. అయితే ఇప్పటికీ జట్టు విజయావకాశాలు ముగ్గురు బ్యాటర్లు హెడ్, అభిషేక్, క్లాసెన్‌లపైనే ఆధారపడి ఉన్నాయి. వీరు బాగా ఆడినప్పుడు మాత్రమే టీమ్‌కు సానుకూల ఫలితం వచ్చింది. ఓపెనర్లుగా హెడ్, అభిషేక్ ఈ సీజన్‌లో ఓవర్‌కు 10.89 రన్‌రేట్‌తో 316 పరుగులు జోడించారు. మరోసారి వీరిద్దరు సత్తా చాటాల్సి ఉంది. మిడిలార్డర్‌లో 156.52 స్ట్రయిక్ రేట్‌తో క్లాసెన్ ధాటిని చూపిస్తున్నాడు. తొలి మ్యాచ్‌లో సెంచరీ తర్వాత వరుసగా విఫలమై గత మ్యాచ్‌లో రాణించిన ఇషాన్ కిషన్ అదే జోరును కొనసాగించాల్సి ఉంది. మరీ పేలవంగా ఆడుతున్న నితీశ్ కుమార్ రెడ్డి ఈ సారైనా దూకుడును ప్రదర్శిస్తాడా చూడాలి. బౌలింగ్‌లో హైదరాబాద్ పరిస్థితి ఏమాత్రం గొప్పగా లేదు. హర్షల్ పటేల్ 13 వికెట్లు తీసినా అందులో లోయర్ ఆర్డర్‌వే ఎక్కువగా ఉన్నాయి. కమిన్స్, షమీ, మలింగ పూర్తిగా విఫలమయ్యారు. స్పిన్నర్లు అన్సారీ, కమిందు మాత్రమే కాస్త ఫర్వాలేదనిపిస్తున్నారు. ఇలాంటి స్థితిలో ప్రత్యర్థి వేదికపై విజయం దక్కాలంటే సన్‌రైజర్స్ రెట్టింపు శ్రమించాల్సి ఉంటుంది. చెన్నైపై విజయం సాధించిన తర్వాత విహారయాత్రకు వెళ్లి కొత్త ఉత్సాహంతో తిరిగొచ్చిన ఆటగాళ్లు మైదానంలో ఎలా చెలరేగుతారనేది ఆసక్తికరం.

సొంతగడ్డపై ఉత్సాహంగా...

రాజస్తాన్‌తో ఆడిన గత మ్యాచ్‌లో 209 పరుగులు చేసిన కూడా వైభవ్ సూర్యవంశీ దెబ్బకు గుజరాత్ అనూహ్యంగా ఓటమి పాలైంది. అయితే సీజన్‌లో ఇప్పటి వరకు టీమ్ నిలకడైన ప్రదర్శనను కనబరుస్తోంది. చక్కటి ఓపెనింగ్ భాగస్వామ్యంతో సాయిసుదర్శన్ (456 పరుగులు), శుబ్‌మన్ గిల్ (389) శుభారంభాలు అందిస్తుండగా, మూడో స్థానంలో బట్లర్ (406) చెలరేగిపోతున్నాడు. ఈ ముగ్గురితో పాటు చివర్లో రూథర్‌ఫర్డ్ కూడా 150కి పైగా స్ట్రయిక్‌రేట్‌తో పరుగులు సాధించడం విశేషం. టాప్-3 కలిసి ఈ సీజన్‌లో 13 అర్ధ సెంచరీలు నమోదు చేయడం విశేషం. వీరు తమ ఫామ్‌ను కొనసాగిస్తే సన్‌రైజర్స్‌కు ఇబ్బందులు తప్పకపోవచ్చు. బౌలింగ్ విభాగంలోనూ టైటాన్స్ పటిష్టంగా ఉంది. ప్రసిధ్ కృష్ణ (17 వికెట్లు), సాయికిశోర్ (12), సిరాజ్ (12) ప్రత్యర్థి బ్యాటర్లను నిలువరించడంలో సఫలమయ్యారు. లెగ్‌స్పిన్నర్ రషీద్ ఖాన్ పెద్ద సంఖ్యలో వికెట్లు తీయలేకపోయినా... భారీ స్కోర్లు నమోదవుతున్న ఈ సీజన్‌లో 9కంటే తక్కువ ఎకానమీతో పరుగులు ఇచ్చాడు. ఈ మైదానంలో ఆడిన నాలుగు మ్యాచ్‌లలో గుజరాత్ మూడు విజయాలు సాధించింది.



గిల్

మ్యాచ్ రిఫరీ అంటే ఆషామాషీ కాదు!

- మాకూ క్లిష్టపరిస్థితులు ఎదురవుతాయి
- బాల్ టాంపరింగ్, భద్రతా సవాళ్లను ఎదుర్కొన్నా
- రిటైర్డ్ రిఫరీ డేవిడ్ బూన్ వ్యాఖ్య



డేవిడ్ బూన్


దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌లకు రిఫరీగా వ్యవహరించడం కుర్చీలో కూర్చున్నంత సులువు కాదని, సవాళ్లు ఎదుర్కొన్న సందర్భాలెన్నో ఉన్నాయని ఇటీవలే రిటైరైన మ్యాచ్ రిఫరీ డేవిడ్ బూన్ అన్నారు. అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ)లో తన 14 ఏళ్ల కెరీర్‌లో బాల్ టాంపరింగ్, భద్రతా సవాళ్లు క్లిష్టమైనవని చెప్పుకొచ్చారు. ఆస్ట్రేలియాకు చెందిన మాజీ ఓపెనర్, 64 ఏళ్ల బూన్ పురుషుల క్రికెట్‌లో 87 టెస్టులు, 183 వన్డేలు, 112 టి20లకు... మహిళల క్రికెట్‌లో ఏడు టి20లకు మ్యాచ్ రిఫరీగా వ్యవహరించారు. అచ్చం క్రికెటర్లలాగానే కెరీర్‌కు టాటా చెప్పినా... కోచ్, మెంటార్‌లుగా ఆటతో అనుబంధాన్ని కొనసాగించినట్లే, ఈ వెటరన్ ఆస్ట్రేలియన్ కూడా రిఫరీగా రిటైర్మెంట్ ప్రకటించినా క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) డైరెక్టర్‌గా బంధాన్ని కొనసాగించనున్నారు. 'రిఫరీ పనంటే అంతా సులువు కాదు. క్లిష్ట పరిస్థితులు, సవాళ్లు మాకు ఎదురవుతాయి. చాలా సార్లు బాల్ టాంపరింగ్‌పై వచ్చిన ఫిర్యాదులు, పరిష్కరించడంలో పడిన ఇబ్బందులు ఎన్నో ఉంటాయి. ఢాకా (బంగ్లాదేశ్), క్రైస్ట్‌చర్చ్ (న్యూజిలాండ్) వేదికల్లో జరిగిన మ్యాచ్‌కు సరిగ్గా ఇలాంటి కఠిన పరిస్థితుల్నే ఎదుర్కొన్నాను. కొన్ని చోట్ల భద్రతా సవాళ్లు తప్పలేదు. ఏదేమైనా... బిజీ క్రికెట్ పెరిగినా... జెంటిల్‌మెన్ క్రికెట్ స్థాయి పెంచేందుకే రిఫరీ నిర్ణయాలుంటాయి. 14 ఏళ్ల రిఫరీ కెరీర్‌లో సాఫల్యాలు చూసుకుంటే సంతోషంగా ఉంటుంది' అని 396 మ్యాచ్‌లకు రిఫరీగా వ్యవహరించిన బూన్ వివరించారు. జింబాబ్వే, బంగ్లాదేశ్‌ల మధ్య జరిగిన టెస్టు మ్యాచ్‌తో ఆయన కెరీర్‌కు వీడ్కోలు పలికారు. ఆట ప్రతిష్టను పెంచుతూనే సుదీర్ఘ సేవలందించిన బూన్‌ను ఐసీసీ చైర్మన్ జై షా ప్రశంసిస్తూ ఆయన సేవల్ని కొనియాడారు. రిఫరీ కాకముందు క్రికెటర్‌గా బూన్ ఆస్ట్రేలియా తరఫున 107 టెస్టులు ఆడి 7422 పరుగులు, 181 వన్డేలు ఆడి 5964 పరుగులు సాధించారు.

పొట్టి... పొడుగు భేటీ!

ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన, అత్యంత పొట్టి శునకాల భేటీకి అమెరికా వేదికైంది. ఏకంగా మూడు అడుగుల నాలుగు అంగుళాల ఎత్తుండి గిన్నిస్ ప్రపంచ రికార్డ్ సృష్టించిన ఏడేళ్ల వయస్సున్న గ్రేట్ డేన్ రెజినాల్డ్, కేవలం 3.59 అంగుళాల ఎత్తు ఉన్న పొట్టి శునకం ఛిహూవాహువా పెర్ల్ ఇటీవల ఇదాహో నగరంలో కలిశాయి. గిన్నిస్ పుస్తకంలోకి ఎక్కిన ఇవి రెండూ అమెరికాకు చెందినవే కావడం విశేషం. అంత ఎత్తున్న గ్రేట్ డేన్‌ను చూడగానే నాలుగేళ్ల వయస్సున్న పెర్ల్ వెంటనే తన యజమాని అయిన వనీసా సెమ్లర్ చేతుల్లో ముడుచుకుపోయింది. అయితే కాసేపటి తర్వాత రెండూ సరదాగా ఆరుబయట ఆడుకున్నాయి. మీడియా ప్రతినిధుల ఫొటోలకు పోజులిచ్చాయి. ఈ రెండూ ఒకదాని పక్కన మరోటి నిలబడితే రెంటి మధ్య ఎత్తు తేడా ఏకంగా 91.56 సెంటీమీటర్లు ఉంది. దీంతో కెమెరాను నేల మీదనో లేదంటే వీటిని సోఫాలో కూర్చోబెట్టో ఫొటోలు తీయాల్సి వచ్చింది. పెర్ల్ ఆలనాపాలనా ఫ్లోరిడాకు చెందిన వనీసా చూసుకుంటున్నారు. గిన్నిస్ బుక్ యాజమాన్యం ప్రత్యేకంగా ఈ రెండు శునకాలను ఒక్కచోటకు చేర్చి ఒక కార్యక్రమాన్ని గత నెలలో నిర్వహించింది.

- సాక్షి, నేషనల్ డెస్క్





సూర్యుడి అత్యంత స్పష్ట చిత్రం

సూర్యుడి ఉపరితలానికి సంబంధించిన అత్యంత స్పష్టమైన ఫొటో ఇది. పొడవు, వెడల్పు, లోతు ఇలా త్రిమితీయ(3డీ) చిత్రమిది. ప్రపంచంలోనే అతిపెద్దదైన 'డేనియల్ కె. ఐనోయీ సోలార్ టెలిస్కోప్'లోని కొత్తతరం విజిబుల్ ట్యూనబుల్ ఫిల్టర్ ఈ ఫొటో తీసి పంపింది. ఇంత దగ్గరగా, ఇంత స్పష్టంగా సూరీడు ఫొటోను తీయడం ఇదే తొలిసారి. సూర్యుని అంతర్గత వాతావరణంలో ఒక్కోటి మన భూమ్మీద ఖండం అంత సైజులో సౌరమచ్చలు ఉన్నాయి. మన కెమెరా భాషలో చెప్పాలంటే ఒక పిక్సెల్ పరిమాణం ఏకంగా 10 కిలోమీటర్లు అన్నమాట. అత్యంత శక్తివంతమైన అయస్కాంత బలాల కారణంగా ఇక్కడి నుంచే సౌరగాలులు ఉద్భవిస్తాయి. ఇవి అంతర్గత పొర నుంచి చొచ్చుకొచ్చి బాహ్య వాతావరణం ద్వారా సౌరమండలం అన్ని దిశల్లో దూసుకొస్తాయి. ఈ సౌరగాలులు ప్రపంచంలోని శాటిలైట్ కమ్యూనికేషన్ వ్యవస్థలు, ఎలక్ట్రికల్ పవర్ గ్రిడ్‌లకు పెనువిఘాతంగా పరిణమిస్తున్నాయి. ఈ టెలిస్కోప్‌ను అమెరికా నేషనల్ సైన్స్ ఫౌండేషన్ రూపొందించింది. సూర్యుడి అంతర్భాగంలో జరిగే అద్భుతాలను తెల్సుకోవడానికి ఈ టెలిస్కోప్ ఎంతగానో ఉపయోగపడుతుందని ఈ టెలిస్కోప్ ఇన్‌స్ట్రుమెంట్ ప్రోగ్రామ్ సైంటిస్ట్ ఫెడ్రిక్ వీగర్ చెప్పారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

ఇజ్రాయెల్‌లో భారీ కార్చిచ్చు

జెరూసలేం సమీపంలో మంటలు, వేలాది మంది తరలింపు

జెరూసలేం: ఇజ్రాయెల్‌లోని జెరూసలేం సమీపంలో భారీ కార్చిచ్చు చెలరేగింది. పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడుతుండటంతో వేలాది మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. 13 మంది గాయపడ్డారు. మంటలను ఆర్పేందుకు అగ్నిమాపక బృందాలు తీవ్రంగా శ్రమిస్తున్నాయి. కార్చిచ్చు ఆందోళనతో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను రద్దు చేసిన ఇజ్రాయెల్.. మంటలు ఆర్పేందుకు అంతర్జాతీయ సాయం కోరుతోంది.

జెరూసలేం నగర శివార్లలో చెలరేగుతున్న భారీ మంటల కారణంగా అధికారులు కేవలం 24 గంటల్లో వేలాది మంది నివాసితులను ఖాళీ చేయించారు. ఇజ్రాయెల్ అత్యవసర వైద్య సేవ ఇప్పటివరకు 23 మందికి చికిత్స అందించింది. వారిలో 13 మంది కాలిన గాయాలు, పొగ పీల్చడంతో ఆసుపత్రి పాలయ్యారు. జెరూసలేం నుంచి టెల్ అవీవ్ వెళ్లే ప్రధాన మార్గంలో మంటలు ఎగిసిపడుతున్నాయి. చుట్టుపక్కల కొండటలపై దట్టమైన పొగలు వ్యాపించిన వీడియోలు, ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి. మంటల ధాటికి చాలా మంది తమ కార్లను వదిలేసి పరుగులు తీయడంతో గందరగోళం నెలకొంది. వందలాది మంది పౌరులు ఇప్పటికీ ప్రమాదంలో ఉన్నారని ఏజెన్సీ హెచ్చరించింది. కార్చిచ్చు కొనసాగుతున్న రూట్ 1 సహా పలు రహదారులను మూసివేశారు.

160 రెస్క్యూ, అగ్నిమాపక బృందాలు సహాయక చర్యల్లో నిమగ్నమయ్యాయని ఇజ్రాయెల్ మీడియా తెలిపింది. అలాగే డజన్ల కొద్దీ విమానాలు, హెలికాప్టర్లు మంటలను అదుపు చేయడానికి ప్రయత్నిస్తున్నాయి. ఆ దేశ సైన్యం కూడా గాలింపు, సహాయక చర్యలకు సహకరిస్తోంది. అయితే పొడి వాతావరణం, అధిక గాలుల కారణంగా మంటలు మరింత తీవ్రమవ్వడంతో సహాయక చర్యలకు ఇబ్బంది కలుగుతోంది. ఈ కార్చిచ్చు ఈ దశాబ్దంలోనే అతి పెద్దదని ఇజ్రాయెల్ అగ్నిమాపక శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. మంటలు చెలరేగుతున్న ప్రాంతాల్లోని జాతీయ ఉద్యానవనాలు, అడవుల వైపు ప్రజలు వెళ్లకుండా నిషేధించారు. ''జెరూసలేం హిల్స్‌లో జరిగిన అగ్నిప్రమాదం ఈ దేశంలోనే అతిపెద్దది కావచ్చు. మా యాక్టివిటీకి సంబంధించి. ఇది చాలా కాలం కొనసాగుతుంది. మేము నియంత్రించడానికి చాలా కష్టపడుతున్నాం.''అని ఫైర్ అండ్ రెస్క్యూ సర్వీస్ జెరూసలేం జిల్లా కమాండర్ ష్మలిక్ ఫ్రీడ్మన్ చెప్పారు. గంటకు 90-100 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తుండటంతో మంటలు మరింత తీవ్రమవుతున్నాయని తెలిపారు. ఇజ్రాయెల్ వైమానిక దళం 18,000 లీటర్ల అగ్నిమాపక సామగ్రిని క్యారీ చేయగల సి -130 జె సూపర్ హెర్క్యులస్ భారీ రవాణా విమానాలను ఈ ఆపరేషన్లలో మోహరించింది. ఈ తరహా విమానాలు రెండు మంటలను ఆర్పేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఇప్పటికే 3వేల ఎకరాల అడవి కాలిపోయింది. 2010 ఉత్తర ఇజ్రాయెల్‌లోని మౌంట్ కార్మెల్‌లో కార్చిచ్చు.. 12వేల ఎకరాలను దహనంచేసింది. 44 మంది ప్రాణాలను బలి తీసుకుంది. ప్రస్తుత కార్చిచ్చు ఆ విపత్తు స్థాయి, ప్రభావంలో అంతకు మించి ఉండవచ్చని అధికారులు ఆందోళన చెందుతున్నారు.



జెరూసలెం-టెల్‌అవీవ్ జాతీయ రహదారిపై జెరూసలెం సమీపంలో కమ్ముకున్న కార్చిచ్చు

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు రద్దు...

కార్చిచ్చు చెలరేగడంతో ఇజ్రాయెల్‌లో జరగాల్సిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ప్రభుత్వం రద్దు చేసింది. జెరూసలేంలో జరగాల్సిన ప్రధాన ప్రభుత్వ కార్యక్రమం సహా అన్ని ప్రాంతాల్లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు బుధవారం రద్దయ్యాయి. అనంతరం ఈ వేడుకను రికార్డు చేసి ఇజ్రాయెల్ ప్రజలకు ప్రదర్శించారు. కార్చిచ్చు జెరూసలేంను చేరే అవకాశం ఉందని ప్రధాని బెంజమిన్ నెతన్యాహు హెచ్చరించారు. పశ్చిమంగా వీస్తున్న గాలి మంటలను జెరూసలేం శివార్ల వైపు, నగరంలోకి కూడా సులభంగా నెట్టేయగలదని, జెరూసలేంను రక్షించడమే ప్రస్తుత ప్రాధాన్యతని తెలిపారు. అందరూ అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. కార్చిచ్చును ఎదుర్కొనేందుకు ఇజ్రాయెల్ అంతర్జాతీయ సహాయం కోరింది. ఇజ్రాయెల్ విజ్ఞప్తి చేసిన కొద్దిసేపటికే ఉక్రెయిన్ స్పందించింది. మంటలను ఆర్పేందుకు విమానాన్ని పంపనున్నట్టు ప్రకటించింది. స్పెయిన్, ఫ్రాన్స్, రొమేనియా, క్రొయేషియా, ఇటలీ, ఉత్తర మాసిడోనియా కూడా విమానాలాను పంపుతామని తెలిపాయి.

తోడైన ఇసుక తుఫాను...

కార్చిచ్చుకు భారీ ఇసుక తుఫాను తోడయ్యింది. ఆకాశమంతా ఇసుక మేఘాలు నిండిపోవడంతో అసలేమీ కనిపించడం లేదు. నెగెవ్‌లోని ఇజ్రాయెల్ సైనిక స్థావరానికి ఇసుక తుఫాను చేరింది. గాలుల తీవ్రత కారణంగా సైనిక స్థావరం గేట్లను మూసివేయడానికి సైనికులు కష్టపడుతున్న దృశ్యాలు సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఇజ్రాయెల్ దక్షిణ ప్రాంతంలో బలమైన గాలులు వీస్తాయని వాతావరణ శాస్త్రవేత్తలు హెచ్చరికలు జారీ చేశారు. పగటి పూట భారీ గాలులు వీస్తాయని, భారీ పొగమంచు ఏర్పడుతుందని, దక్షిణాదిన ఇసుక తుఫానులు కూడా వస్తాయని చెప్పారు. తీరం వెంబడి 98 నుంచి 100 డిగ్రీల ఫారెన్‌హీట్ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణ శాఖ తెలిపింది.

సరిహద్దు దాకా వెళ్లాక..

కోర్టు స్టేతో మహిళకు ఉపశమనం..

పాకిస్తానీయుల వీసాలు రద్దు చేస్తూ భారత్ తీసుకున్న నిర్ణయం ఎన్నో ఆసక్తికర కథలను బయటకు తెస్తోంది. పాక్ యువతి, భారత్‌కు చెందిన ఎయిర్‌ఫోర్స్ అధికారి ప్రేమకథ 'వీర్ జారా'గుర్తుందా? హీరోయిన్ కోసం వెళ్లిన హీరో పాక్ జైలులో ఉంటే.. ప్రేమకోసం భారత్ వచ్చిన హీరోయిన్ అతని గ్రామంలో సేవ చేస్తూ ఉంటుంది. అలాంటిదే ఓ ప్రేమ కథ ఇప్పుడు చర్చనీయాంశమైంది. కాకపోతే ఇది సీఆర్‌పీఎఫ్ జవానును వివాహం చేసుకుని జమ్మూలో నివసిస్తున్న ఓ పాకిస్తానీ మహిళ ఉదంతం. అయితే.. సీఆర్‌పీఎఫ్ జవాన్ ఆన్‌లైన్‌లో పాక్ మహిళను వివాహం చేసుకోవడం, వీసా గడువు ముగిసినా ఆమె ఇక్కడ ఉండటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

వివరాల్లోకి వెళ్తే.. పాకిస్తాన్‌లోని పంజాబ్‌కు చెందిన మినాల్‌ఖాన్‌కు జమ్మూకశ్మీర్‌కు చెందిన మునీర్ ఖాన్‌తో చాలా ఏళ్ల కిందట పరిచయం ఏర్పడింది. అది కాస్తా ప్రేమగా మారింది. ఎంతోకాలంగా వీసా కోసం ఎదురుచూసి చూసి... 2024 మేలో ఆన్‌లైన్‌లోనే నిఖా చేసుకున్నారు. తొమ్మిదేళ్ల ఎదురుచూపు ఫలించి.. తాత్కాలిక వీసా లభించింది. 2025 మార్చిలోనే ఆమె భారత్‌కు వచ్చారు. మునీర్‌ఖాన్‌తో కలిసి జమ్మూలోని ఘరోటాలో నివసిస్తున్నారు. మినాల్ స్వల్పకాలిక వీసా గడువు మార్చి 22తో ముగిసింది. వీసా గడువు పొడిగించాలంటూ ఆమె జమ్మూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కానీ ఏప్రిల్ 22 పహల్గాం ఉగ్రవాద దాడుల తరువాత భారత్ విడిచి వెళ్లాలని ఆమెకు నోటీసులు వచ్చాయి. ఆ మేరకు 29న దేశం విడిచి వెళ్లడానికి ఆమె జమ్మూ నుంచి అట్టారీ–వాఘా సరిహద్దుకు వెళ్లింది. బస్సు కూడా ఎక్కింది.

బహిష్కరణ ఉత్తర్వులపై కోర్టు స్టే

బస్సు బయల్దేరే సమయంలో న్యాయవాది ఆమెకు ఫోన్ చేసి కోర్టు స్టే ఇచ్చిందని చెప్పడంతో ఆమెకు ఉపశమనం లభించింది. ఆమె మీడియాతో మాట్లాడుతూ 'ఈ దాడిలో అమాయకులను అనాగరికంగా చంపడాన్ని ఖండిస్తున్నా. దోషులను కఠినంగా శిక్షించాల్సిందే. కానీ నేను అన్ని నిబంధనలు పాటించా. నా స్వల్పకాలిక వీసా గడువు మార్చిలో ముగియడంతో దీర్ఘకాలిక వీసా కోసం దరఖాస్తు చేసుకున్నా. క్లియర్ చేస్తామని చెప్పారు. కానీ దాడి తర్వాత నేను నా భర్త నుంచి విడిపోతున్నాను. నాలాగే చాలా మంది పిల్లలు తల్లి లేదా తండ్రికి దూరమవుతున్నారు. ఇది అమానుషం. మాకు న్యాయం చేయాలని ప్రధాని నరేంద్ర మోదీని ప్రార్థిస్తున్నా'అని ఆమె పేర్కొన్నారు. అయితే మినాల్ ఖాన్ బహిష్కరణపై కోర్టు స్టే ఇవ్వడం, పాక్ పౌరులు తమ దేశానికి వెళ్లేందుకు కేంద్రం మరికొంత గడువు ఇవ్వడం ఒకేసారి జరిగాయి. అలా ఆమె బహిష్కరణ ఆగిపోయింది.

- సాక్షి, నేషనల్ డెస్క్

మొత్తం 4 చోట్ల రెక్కీ

అత్యంత అనువైన బైసారన్‌ను ఎంచుకున్నారు

- వెలుగులోకి మరిన్ని విషయాలు

శ్రీనగర్: మిగతా ప్రాంతాలతో పోలిస్తే పహల్గాంలోని బైసారన్ గడ్డి మైదాన ప్రాంతం దాడికి అత్యంత అనువుగా ఉందని నిర్ధారించుకున్నాక ఉగ్రవాదులు దాడికి తెగించారన్న కొత్త విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది. జాతీయ దర్యాప్తు సంస్థ అధికారుల విచారణ, విస్తృత స్థాయి దర్యాప్తులో ఇలాంటి పలు విషయాలు తాజాగా బహిర్గతమయ్యాయి. గంటల తరబడి ట్రెక్కింగ్ చేసి అదే రోజు దాడి చేశారనే వార్తలో నిజం లేదని, రెండు రోజుల ముందే దక్షిణ కశ్మీర్‌కు ఉగ్రవాదుల చేరుకున్నారని దర్యాప్తు అధికారులు తెలిపారు. బైసారన్‌తోపాటు మరో మూడు ప్రాంతాలను దాడి కోసం ఎంపికచేశారని అత్యధిక మంది ప్రాణాలు తీసే అవకాశం, దాడి చేసి పారిపోవడానికి అత్యంత అనువైన ప్రదేశాన్ని ఎన్నుకుని బైసారన్‌కు వచ్చారని తెలుస్తోంది. తొలుత దక్షిణ కశ్మీర్‌లోని అరూ వ్యాలీ, అమ్యూజ్‌మెంట్ పార్క్, బేతాబ్ వ్యాలీల్లోనూ ఉగ్రవాదులు రెక్కీ నిర్వహించారని వెల్లడైంది. బైసారన్‌కాకుండా మిగతా ఈ మూడు చోట్ల భారత భద్రతా బలగాల మొహరింపు, నిఘా మరీ ఎక్కువగా ఉండటంతో అక్కడ దాడి ఆలోచనను ఉగ్రవాదులు మానుకున్నారని దర్యాప్తు అధికారులు తెలిపారు.

క్షేత్రస్థాయి సహాయకుల అరెస్ట్

ఉగ్రవాదులకు బస, భోజనం, ప్రయాణ ఏర్పాట్లు వంటి కీలక సదుపాయాలు కల్పించిన క్షేత్రస్థాయి కొందరు సహాయకులను దర్యాప్తు అధికారులు గుర్తించి అరెస్ట్‌చేశారు. దాదాపు 20 మంది ఓవర్ ది గ్రౌండ్ వర్కర్ల(ఓజీడబ్ల్యూ)ను గుర్తించారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా ఎన్ఐఏ అధికారులు ఇప్పటికే 2,500 మందికిపైగా స్థానికులు, స్థానికేతరులను ప్రశ్నించారు. వీరిలో దాడితో ప్రమేయం ఉందని భావిస్తున్న దాదాపు 186 మందిని ఎన్ఐఏ అధికారులు ఇప్పటికే అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారని జాతీయ మీడియాలో వార్తలొచ్చాయి.

ఇంకా దక్షిణకశ్మీర్‌లోనే ఉగ్రవాదులు

అత్యంత కర్కశంగా దాడిచేసి పారిపోయిన ఉగ్రవాదులు ఇంకా దక్షిణ కశ్మీర్ అడవుల్లోనే సంచరిస్తున్నట్లు భారత ఆర్మీకి సమాచారం అందింది. ఈ ఉగ్రవాదుల వద్ద సరిపడా ఆహారం, ఔషధాలు ఉన్నాయని తెలుస్తోంది. ఆహారం నిండుకుంటే ఏదైనా సమీప గ్రామంలో కమ్యూనికేషన్ జరపాల్సి ఉంటుంది. ఇప్పటికే మారుమూల, కుగ్రామాలపై నిఘా పెట్టిన భారత ఆర్మీకి తమ కదలికలు తెలియకూడదనే ఉద్దేశ్యంతోనే ఉగ్రవాదులు ముందు జాగ్రత్తగా ఇలా ఔషధాలు, ఆహారం వెంట బెట్టుకుని తిరుగుతున్నారని తెలుస్తోంది. ఉగ్రవాదుల వద్ద అత్యాధునిక కమ్యూనికేషన్ సాధనాలు కూడా ఉండి ఉంటాయని గతంలో కశ్మీర్‌లో చాన్నాళ్లు పనిచేసిన రక్షణరంగ నిపుణుడు మేజర్ జనరల్ యష్ మోర్ వ్యాఖ్యానించారు. ఇలాంటి అత్యాధునిక కమ్యూనికేషన్ సాధనాల్లో ఎలాంటి సిమ్‌కార్డ్ ఉండదు. అత్యల్ప తరంగదైర్ఘ్యంతో సమాచారం వెళ్తుంది. దీంతో వీటిని పసిగట్టడం, ట్రాక్ చేయడం చాలా కష్టం. దాడికి ముందు వరకు ఉగ్రవాదులు మూడు శాటిలైట్ ఫోన్లను వినియోగించినట్లు భారత ఆర్మీ గుర్తించింది. దాడి చేసిన ఉగ్రవాదులకు రక్షణగా మరి కొందరు ఉగ్రవాదులు అడవుల్లో వాళ్లవెంట సంచరించే ఆస్కారం ఉందని ఆర్మీ అంచనావేస్తోంది.

ఘటనాస్థలిని పర్యవేక్షించిన ఎన్ఐఏ చీఫ్

ఎన్ఐఏ చీఫ్ సదానంద్ దాతే గురువారం బైసారన్‌లో ఉగ్రదాడి ప్రాంతానికి వచ్చి చుట్టూతా పరిసరాలనూ పర్యవేక్షించారు. దర్యాప్తు పురోగతి వివరాలను అక్కడి సీనియర్ ఉన్నతాధికారులను అడిగి తెల్సుకున్నారు. కొన్ని ఎన్ఐఏ బృందాలు అక్కడే ఇతర ఆధారాలను సేకరిస్తుండగా మరికొన్ని బృందాలు ప్రత్యక్ష సాక్షుల నుంచి వాంగ్మూలాలు, వాటి ద్వారా ఇతర సాక్ష్యాధారాలను సేకరిస్తున్నాయి. ఇప్పటికే పలువురిని ప్రశ్నించి అదుపులోకి తీసుకోవడం తెల్సిందే. మరో బృందం ఘటనాస్థలిలోనే శిబిరం ఏర్పాటుచేసుకుని దర్యాప్తుచేస్తోంది.

తాజ్ పరిసరాల్లోని చెట్లను నరకొద్దు: సుప్రీం

న్యూఢిల్లీ: చారిత్రక కట్టడం తాజ్ మహల్‌కు 5కిలోమీటర్ల పరిధిలో ఉన్న చెట్లను, తమ అనుమతి లేనిదే నరకరాదంటూ సుప్రీంకోర్టు మరోసారి అధికారులకు గట్టిగా హెచ్చరికలు చేసింది. ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రా, ఫిరోజాబాద్, మథుర, హత్రాస్, ఈటాహ్ జిల్లాలతోపాటు రాజస్తాన్‌లోని భరత్‌పూర్ జిల్లాల పరిధిలోని తాజ్ ట్రపీజియం జోన్(టీటీజెడ్)గా పరిగణించే 10,400 చదరపు కిలోమీటర్ల ప్రాంతంలో జీవవైవిధ్యాన్ని పరిరక్షించేందుకు సంబంధించిన కేసుపై జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌ల ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. డివిజనల్ అటవీ అధికారి(డీఎఫ్‌వో) సారథ్యంలోని కేంద్రం నియమించిన ఉన్నతస్థాయి అనుమతి లేకుండా టీటీజెడ్‌లోని చెట్లను నరకరాదు, ఈ కమిటీ కూడా యూపీ వృక్ష పరిరక్షణ చట్టానికి లోబడే నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ విషయంలో 2015 మే 8వ తేదీన జారీ చేసిన ఆదేశాలను తుచ తప్పక పాటించాలని తెలిపింది. చెట్లను నరికాల్సిన అవసరముంటే ఆ మేరకు సంబంధిత యంత్రాంగం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని వివరించింది. ప్రత్యామ్నాయ ఏర్పాట్లను సైతం డీఎఫ్‌వో పరిగణనలోకి తీసుకోవాలని ఆదేశించింది. అంతేకాదు, ఫతేపూర్ సిక్రి, ఎర్రకోట వంటి ప్రపంచ వారసత్వ కట్టడాల పరిరక్షణకు అదనంగా నిబంధనలను అమలు చేయాల్సిన అవసరముంటే ఆ మేరకు నివేదికివ్వాలని కోరింది.

16 ఇన్‌స్టా,106 టెలీగ్రాం చానెళ్లపై చర్యలు

నీట్-యూజీ పేపర్ లీకు వదంతులపై ఎన్‌టీఏ వెల్లడి

న్యూఢిల్లీ: నీట్-యూజీ పేపర్ లీకైందంటూ 16 ఇన్‌స్టాగ్రాం, 106 టెలీగ్రాం చానెళ్ల ద్వారా వదంతులు వ్యాపించినట్లు గుర్తించామని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) తెలిపింది. వచ్చే నీట్ పరీక్ష పేపర్ లీకైందంటూ 1,500 వరకు తప్పుడు వార్తలు ప్రచారంలోకి వచ్చినట్లు వెల్లడించింది. నీట్ యూజీ-2025 పరీక్ష పత్రం లీకైందంటూ విద్యార్థులను తప్పుదోవ పట్టించేలా వదంతులను వ్యాప్తి చేసి, పరీక్ష ప్రక్రియ సమగ్రతకు భంగం కలిగించేందుకు ప్రయత్నించిన టెలీగ్రాం, ఇన్‌స్టా చానెళ్లను గుర్తించామని ఎన్‌టీఏ వివరించింది. గత వారం ప్రారంభించిన 'సస్పిసియస్ క్లెయిమ్స్ రిపోర్టింగ్ పోర్టల్' ద్వారా వీటిని కనిపెట్టామంది. హోం శాఖ ఆధ్వర్యంలోని ఇండియన్ సైబర్ క్రైం కోఆర్డినేషన్ సెంటర్(ఐ4సీ) దర్యాప్తు జరిపి వీటిపై చర్యలు తీసుకోనుందని తెలిపింది. తప్పుడు సమాచారాన్ని మరింత వ్యాపింప జేయకుండా, విద్యార్థుల్లో అనవసర భయాందోళలను సృష్టించకుండా ఆయా చానెళ్లను నిషేధించాలని ఇన్‌స్టా, టెలీగ్రాం నిర్వాహకులను కోరామంది. కాగా, ఈ నెల 4న నీట్ యూజీ జరగనున్న నేపథ్యంలో హోం శాఖ అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో వరుస సమావేశాలు నిర్వహిస్తోంది. ఎటువంటి పొరపాట్లు దొర్లకుండా అప్రమత్తం చేస్తోంది. ఈసారి దేశవ్యాప్తంగా 23 లక్షల మంది ఈ పరీక్ష రాయనున్నారు.

నేడు సీడబ్ల్యూసీ సమావేశం

సాక్షి, న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ అత్యున్నత నిర్ణాయక మండలి కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) శుక్రవారం సమావేశం కానుంది.ఢిల్లీలోని అక్బర్ రోడ్డులో ఉన్న పార్టీ ప్రధాన కార్యాలయంలో సాయంత్రం 4 గంటలకు జరిగే భేటీ సమాచారాన్ని సభ్యులకు, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు గురువారం పంపింది. 'దేశం ముందున్న ప్రధాన అంశం పహల్గాం ఉగ్రదాడిపై చర్చించనున్నాం. ఘటనపై కేంద్రం స్పందనపై యావత్తు దేశం ఆసక్తిగా ఎదురు చూస్తోంది. సన్నిహితులను కోల్పోయిన వారు న్యాయం కోరుతున్నారు'అని పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ తెలిపారు. అదేవిధంగా, దేశంలో చేపట్టబోయే జాతీయ జనగణనలో కులగణన కూడా ఉంటుందంటూ కేంద్రం చేసిన ప్రకటన నేపథ్యంలో తదుపరి కార్యాచరణను సీడబ్ల్యూసీ ఖరారు చేయనుందని తెలుస్తోంది. కులగణనకు నిర్ణీత గడువు విధించేలా కేంద్రంపై ఒత్తిడి చేయాలని కాంగ్రెస్ భావిస్తోంది. ఈ అంశంపై ఇండియా కూటమిలోని పార్టీలను కలుపుకుంటూ ఆందోళన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనుంది. తెలంగాణలో జరిగిన కులగణన సర్వే అంశాలపైనా కమిటీ చర్చించనుందని సమాచారం.

సరిహద్దు వద్ద ఉగ్రకుట్ర భగ్నం

పంజాబ్‌లో గ్రనేడ్లు, పిస్టళ్లు, మందుగుండు స్వాధీనం

అమృత్‌సర్: పహల్గాం ఉగ్రదాడి తర్వాత సరిహద్దు వెంట ఉద్రిక్తత నెలకొన్న వేళ పంజాబ్‌లో బీఎస్ఎఫ్ సైనికులు, పంజాబ్ పోలీసులు సంయుక్తంగా ఒక ఉగ్రకుట్రను భగ్నంచేశారు. అమృత్‌సర్ జిల్లాలోని భారోపాల్ గ్రామంలో ఆయుధాలు ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం అందటంతో ఏప్రిల్ 30వ తేదీ సాయంత్రం వెంటనే బీఎస్ఎఫ్ బలగాలు రంగంలోకి దిగాయి. వారికి పంజాబ్ రాష్ట్ర పోలీసులు సహకారం అందించారు. విస్తృతస్థాయిలో తనిఖీలు, సోదాల తర్వాత రెండు గ్రనేడ్లు, మూడు పిస్టళ్లు, ఆరు మేగజైన్‌లు, ఇంకా 60కిపైగా తుపాకీ గుళ్లు లభించాయి. వీటిని స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పంపేయాలనుకున్న వాళ్లను ఎలాగైనా పంపేసే కుట్ర

'సెవిస్'రికార్డు పునరుద్ధరణలో అమెరికా చేతివాటం

వాషింగ్టన్: హమాస్ అనుకూల, అమెరికా వ్యతిరేక భావజాలం ఉన్న విదేశీ విద్యార్థులను ఎలాగైనా వీసా రద్దుచేసి దేశం నుంచి బహిష్కరించాలని నిర్ణయించుకున్న అమెరికా ఇమిగ్రేషన్ విభాగం కొత్త ఎత్తుగడ వేసింది. దీంతో చిన్నపాటి ట్రాఫిక్ ఉల్లంఘనలు, వాగ్వాదాలు వంటి కారణాలతోనూ ఇప్పటికే స్టూడెంట్ ఎక్స్చేంజ్ విజిటర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్(సెవిస్) రికార్డును కోల్పోయిన విదేశీ విద్యార్థులకు వీసా రద్దు కష్టాలు మరింత పెరిగాయి. ఇప్పటికే ఇతరత్రా కారణాలతో వీసా రద్దు ముప్పును ఎదుర్కొన్న కొందరు విదేశీ విద్యార్థులు కోర్టులను ఆశ్రయించారు. ఆయా కోర్టుల ఆదేశాలతో వీళ్ల సెవిస్ రికార్డును ప్రభుత్వం పునరుద్ధరించింది. అయితే తొలగించిన తేదీ నుంచి కాకుండా కొన్ని తారీఖులు వదిలేసి తర్వాత తేదీన కనిపించేట్లు పునరుద్ధరించింది. ఇలా రికార్డుల మధ్య గ్యాప్ ఉన్న విద్యార్థుల వీసాను తొలగిస్తానని ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఇన్‌ఫోర్స్‌మెంట్(ఐసీఈ) కొత్తగా ఒక నిబంధన తెచ్చి ఆ మేరకు మెమోను జారీచేసింది.

ఐఎస్ఐ చీఫ్‌కు ఎన్ఎస్ఏ బాధ్యతలు

ఇస్లామాబాద్: పాకిస్తాన్ నిఘా విభాగం ఇంటర్ సర్వీసెస్ ఇంటెలిజెన్స్ (ఐఎస్ఐ) అధిపతిగా ఉన్న లెఫ్టినెంట్ జనరల్ ముహమ్మద్ ఆసిమ్ మాలిక్ ఆ దేశ జాతీయ భద్రతా సలహాదారు(ఎన్ఎస్ఏ) బాధ్యతలు చేపట్టారు. పహల్గాం ఉగ్ర దాడి నేపథ్యంలో భారత్‌తో ఉద్రిక్తతలు తీవ్ర రూపం దాల్చిన సమయంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. ఎన్ఎస్ఏగా మాలిక్ అదనపు బాధ్యతలను నిర్వహిస్తారని, తక్షణమే ఈ నియమాకం అమల్లోకి వచ్చిందని ప్రభుత్వం తెలిపింది. ఇప్పటి వరకు 9 మంది ఎన్ఎస్ఏలుగా పనిచేసినప్పటికీ, ఐఎస్ఐ చీఫ్‌ను ఈ పదవికి ఎంపిక చేయడం ఇదే మొదటిసారి. 2022లో ఇమ్రాన్ ఖాన్ ప్రభుత్వం పడిపోయినప్పటి నుంచి ఎన్ఎస్ఏ పోస్ట్ ఖాళీగా ఉంది.

68% రిజర్వేషన్లను అమలు చేయాలి: ఖర్గే

శివాజీనగర: రిజర్వేషన్ల పరిమితిని ప్రస్తుతమున్న 50 శాతం నుంచి 68 శాతానికి పెంచాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమిళనాడు ప్రభుత్వం ఇప్పటికే ఈ మేరకు రిజర్వేషన్లను అమలు చేస్తోందని ఆయన తెలిపారు. సమాజంలోని అన్ని వర్గాలకు సరైన న్యాయం జరిగేందుకు 68 శాతం మేర రిజర్వేషన్లను అమలు చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం స్పందించకుంటే ప్రజలు తమ హక్కుల సాధనకు వీధుల్లోకి వస్తారని హెచ్చరించారు. బెంగళూరు, హుబ్బళిలలో గురువారం జరిగిన బహిరంగ సభలో ఖర్గే ప్రసంగించారు. వెనుకబడిన వర్గాలకు న్యాయం చేసేందుకు కుల గణన చేపట్టాలని తమ పార్టీ ఎప్పటినుంచో డిమాండ్ చేస్తోందని గుర్తు చేశారు. అకస్మాత్తుగా కుల గణన అంటూ ప్రకటించి కేంద్ర ప్రభుత్వం ఆ క్రెడిట్ దక్కించుకునేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. ప్రైవేట్ రంగంలో కూడా రిజర్వేషన్ల అమలుకు చట్టం చేయాలని ఖర్గే కోరారు. 'గతంలో యూపీఏ ప్రభుత్వం ఉన్నప్పుడు 2010లో సామాజిక, ఆర్థిక, విద్యా సమీక్షను ప్రారంభించాం. ఆ సమయంలో నేను కేంద్ర కార్మిక, సాంఘిక సంక్షేమ మంత్రిగా ఉన్నా. 2016లో ఈ సమీక్ష ముగిసింది. బీజేపీ ప్రభుత్వం మాత్రం ఇప్పటికీ ఆ నివేదికను వెల్లడించలేదు. కాంగ్రెస్‌కు పేరు రాకూడదనే నివేదికను బయటకు రాకుండా చేసింది'అని ఖర్గే ఆరోపించారు. 'గతంలో అంబేడ్కర్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్ ఉందని దుష్ప్రచారం చేశారు. కుల గణనకు నెహ్రూ వ్యతిరేకమని ఆరోపించారు. డాక్టర్ అంబేడ్కర్ రూపొందించిన హిందూ కోడ్ బిల్లును నెహ్రూ జారీ చేశారన్నారు. మంచి పనులను కాంగ్రెస్ మాదిరిగా బీజేపీ చేయలేదు. బీజేపీ ఏనాడూ కార్మికుల అనుకూల చట్టం చేయలేదన్నారు.

మా చిత్తశుద్ధిని చాటే నిర్ణయమిది: ధర్మేంద్ర ప్రధాన్

న్యూఢిల్లీ: జనగణనతోపాటు కులగణననూ చేపట్టాలని తీసుకున్న నిర్ణయం చిత్తశుద్ధి కలిగిన మోదీ ప్రభుత్వానికి, శుష్క వాగ్దానాలు చేసే కాంగ్రెస్‌కు మధ్య అంతరాన్ని మరోసారి తేటతెల్లం చేసిందని బీజేపీ తెలిపింది. గురువారం ఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మీడియాతో మాట్లాడారు. కులగణన ప్రకటనను విప్లవాత్మక నిర్ణయంగా ఆయన అభివర్ణించారు. పలువురు ప్రతిపక్ష నేతలు సైతం ఈ నిర్ణయాన్ని స్వాగతించాయన్నారు. తమ ఒత్తిడి వల్లే బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కులగణనకు ఒప్పుకుందంటూ కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు చేస్తున్న ప్రకటనలను ప్రధాన్ కొట్టిపారేశారు. దేశ ప్రప్రథమ ప్రధాని నెహ్రూ హయాం నుంచి దీర్ఘకాలం అధికారంలో ఉన్న కాంగ్రెస్ సామాజిక న్యాయం లక్ష్యానికి అడ్డుగా నిలిచిందన్నారు.

హెడ్‌లైన్ సరే.. డెడ్‌లైన్ ఏదీ..: జైరాం రమేశ్

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం జాతీయ జనగణన, కులగణనకు స్పష్టమైన రోడ్ మ్యాప్ ప్రకటించాలని గురువారం కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఎలాంటి కాల పరిమితి లేకుండా కేవలం కులగణన చేస్తామన్న కేంద్ర ప్రకటనను ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, ఎంపీ జైరాం రమేశ్ తప్పుపట్టారు. 'నిర్దిష్ట గడువు లేకుండా ముఖ్యమైన ప్రకటనలు ఇవ్వడంలో ప్రధాని మోదీ సిద్ధహస్తుడు. కులగణనపై ఆయన హెడ్‌లైన్ ఇచ్చారు. డెడ్‌లైన్ మాత్రం చెప్పలేదు. కులగణనపై రోడ్‌మ్యాప్ చెప్పాలని కాంగ్రెస్ పార్టీ ఆరేళ్లుగా అడుగుతోంది'అని అన్నారు. పహల్గాం ఉగ్రవాద దాడి తర్వాత పాక్‌పై తీవ్ర చర్యలు తీసుకోవాలనే డిమాండ్ల నేపథ్యంలోనే ప్రభుత్వం ప్రజల దృష్టిని మళ్లించేందుకు కుల గణన నిర్ణయాన్ని ప్రకటించిందని ఆరోపించారు. కులగణనను మొదట్నుంచీ వ్యతిరేకిస్తున్న బీజేపీ, ఆకస్మికంగా నిర్ణయాన్ని మార్చుకోవడం నైతిక, రాజకీయ ఓటమిని చెప్పకనే చెబుతోందన్నారు. 'జీఎస్‌టీ, ఆధార్, ఉపాధి హామీ, ఆహార భద్రతా చట్టాలపై యూటర్న్ తీసుకున్న మోదీ ఇప్పుడు కుల గణనపై అతిపెద్ద యూటర్న్ తీసుకున్నారు. ఈ విషయంలో ప్రధానిని మించిన వారు లేరు'అని రమేశ్ వ్యాఖ్యానించారు. గురువారం ఇక్కడ పార్టీ ప్రధాన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జన గణనకు తగినంత బడ్జెట్ కేటాయింపులు లేకపోవడంపైనా ఆయన అనుమానం సంధించారు. కులగణనకు కాంగ్రెస్ మద్దతిస్తుందంటూ ఆయన.. తగు బడ్జెట్ లేకుండా, నిర్దిష్ట గడువు లేకుండా, సమగ్ర ప్రణాళిక రూపొందించకుండా కేవలం హెడ్‌లైన్‌తో సరిపెట్టడం వెనుక కేంద్ర ప్రభుత్వం ఉద్దేశమేంటన్నారు. రాజ్యాంగ సవరణ చేయాలని, రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని తొలగించాలని డిమాండ్ చేస్తోందన్నారు.

దక్షిణ కొరియా తాత్కాలిక అధ్యక్షుడి రాజీనామా

సియోల్: దక్షిణ కొరియా తాత్కాలిక అధ్యక్షుడు హన్ డుక్-సూ(75)రాజీనామా చేశారు. వచ్చే నెలలో జరిగే అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేయడానికే పదవి నుంచి వైదొలిగినట్లు సమాచారం. శుక్రవారం అధ్యక్ష ఎన్నికల ప్రచారాన్ని ఆయన అధికారికంగా ప్రారంభిస్తారని మీడియా తెలిపింది. మరింత గురుతర బాధ్యతను తీసుకుని, దేశాన్ని సంక్షోభం నుంచి బయటపడేయాలనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు హన్ ప్రకటించారు. దీంతో, ఉపప్రధానమంత్రిగా ఉన్న చోయి సంగ్-మొక్ తాత్కాలిక అధ్యక్ష బాధ్యతలను చేపట్టారు. జూన్ 3న నూతన అధ్యక్షుడిని ఎన్నుకునే వరకు కొనసాగుతారు.

ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ స్టాఫ్ చీఫ్‌గా అశుతోష్

న్యూఢిల్లీ: చీఫ్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ స్టాఫ్(సీఐఎస్‌సీ)గా ఎయిర్ మార్షల్ అశుతోష్ దీక్షిత్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఏప్రిల్ 30న పదవీ విరమణ చేసిన లెఫ్టినెంట్ జనరల్ జేపీ మాథ్యూ స్థానంలో ఆయన బాధ్యతలు చేపట్టారు. 1986 డిసెంబర్ 6న భారత వైమానిక దళంలో ఫైటర్‌గా చేరిన ఎయిర్ మార్షల్ దీక్షిత్‌కు కమాండ్, స్టాఫ్, ఇన్‌స్ట్రక్షన్ రోల్స్‌లో దాదాపు 40 ఏళ్ల అనుభవం ఉంది. ఆయన వివిధ రకాల కమాండ్, స్టాఫ్, బోధనా బాధ్యతలను నిర్వహించారు. సెంట్రల్ ఎయిర్ కమాండ్, ఎయిర్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్ చీఫ్‌గా పనిచేశారు. ఆయన సేవలకు గుర్తింపుగా 2006లో వాయుసేన మెడల్, 2011లో విశిష్ట సేవా పతకం, రాష్ట్రపతి చేతుల మీదుగా అతి విశిష్ట సేవా పతకం అందుకున్నారు.

వ్యక్తి వికాసానికి కనీస అవసరాలైన శాసనాలు

ప్రభుత్వ గొప్పదనం అనేది అది ప్రజలకు కల్పించే హక్కులపై ఆధారపడి ఉంటుందని ప్రఖ్యాత రాజనీతి శాస్త్రజ్ఞుడు హెచ్.జె. లాస్కీ వ్యాఖ్యానించారు. హక్కు అనేది రాజనీతిశాస్త్ర అధ్యయనంలో ఒక ప్రాథమిక రాజకీయ భావన. ప్రజలు కోరుకునే, ప్రభుత్వం గుర్తించిన అధికారాన్నే హక్కుగా పేర్కొనవచ్చు. హక్కు అంటే అవకాశం, అధికారం కలిగి ఉండటం అని కూడా చెప్పవచ్చు. హక్కులు.. ప్రభుత్వ నిరపేక్ష అధికారాలపై పరిమితులు. ఒక వ్యక్తి తన శక్తి, తెలివితేటల ఆధారంగా ఔన్నత్యం, సంపూర్ణ వికాసం పొందడానికి దోహదపడే పరిస్థితులనే హక్కులుగా అభివర్ణించవచ్చు.

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పాలిటీ

ప్రాథమిక హక్కులు

భారత రాజ్యాంగంలోని మూడో భాగంలో ప్రకరణలు 12 నుంచి 35 వరకు ప్రాథమిక హక్కుల గురించి తెలుపుతాయి. ప్రాథమిక హక్కులను భారత రాజ్యాంగంలోని అత్యంత ముఖ్యమైన లక్షణంగా పేర్కొంటారు. వీటిని అమెరికా సంయుక్త రాష్ట్రాల రాజ్యాంగం నుంచి గ్రహించారు. అమెరికా రాజ్యాంగంలో ప్రాథమిక హక్కులను 'బిల్ ఆఫ్ రైట్స్' రూపంలో పొందుపరిచారు. చట్టబద్ధమైన హక్కులకు రాజ్యాంగంలో స్థానం కల్పించి, ప్రత్యేక ప్రతిపత్తితో గుర్తిస్తే వాటిని 'ప్రాథమిక హక్కులు'గా పేర్కొంటారు. వ్యక్తి వికాసానికి ఇవి కనీస అవసరాలు. దేశ ప్రాథమిక శాసనమైన రాజ్యాంగంలో గుర్తించడం వల్ల వీటిని 'ప్రాథమిక హక్కులు' అని అంటారు.

ప్రాథమిక హక్కుల నేపథ్యం

రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులకు సుదీర్ఘ చారిత్రక నేపథ్యం ఉంది. లోకమాన్య బాలగంగాధర తిలక్ 1895లో 'స్వరాజ్య బిల్లు'లో మొదటిసారిగా ఈ హక్కులను ప్రతిపాదించారు. ఆ తర్వాత..

- 1911లో కలకత్తాలో నిర్వహించిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశంలో హక్కులపై తీర్మానాన్ని ఆమోదించారు.
- 1922లో మహాత్మా గాంధీ సాధారణ ప్రజల హక్కుల గురించి 'యంగ్ ఇండియా'లో ప్రస్తావించారు.
- 1925లో అనిబీసెంట్.. కామన్‌వెల్త్ ఆఫ్ ఇండియా బిల్లులో, ఐర్లాండ్ రాజ్యాంగంలో ప్రస్తావించిన విధంగానే భారతీయులకూ ప్రాథమిక హక్కులు ఉండాలని ప్రతిపాదించారు.
- 1927లో మద్రాసులో ఎం.ఎ. అన్సారీ అధ్యక్షతన జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశంలో భావి రాజ్యాంగానికి ప్రాథమిక హక్కులు ప్రాతిపదిక కావాలనే తీర్మానాన్ని ఆమోదించారు.
- 1928లో మోతీలాల్ నెహ్రూ కమిటీ వెల్లడించిన నివేదికలో 'ప్రాథమిక హక్కులకు ఆమోదం పొందడం పౌరుల అవసరం'గా పేర్కొన్నారు.
- 1931లో కరాచీలో వల్లభాయ్ పటేల్ అధ్యక్షతన కొంతమంది ప్రముఖులు ప్రాథమిక హక్కుల గురించి డిమాండ్ చేశారు. మన రాజ్యాంగంలో ప్రాథమిక హక్కులను చేర్చడానికి వీరి నివేదికే ప్రాతిపదిక అయింది.
- 1931లో నిర్వహించిన రెండో రౌండ్ టేబుల్ సమావేశంలో మహాత్మా గాంధీ భావి భారత రాజ్యాంగంలో ప్రాథమిక హక్కులను చేర్చాలని కోరారు.
- 1945లో తేజ్ బహదూర్ సప్రూ నాయకత్వంలో ఏర్పడిన పార్టీ రహిత మేధావుల సంఘం కూడా ప్రాథమిక హక్కులు కావాలని డిమాండ్ చేసింది.

రాజ్యాంగ పరిషత్తు - ప్రాథమిక హక్కులు

హక్కులను రాజ్యాంగంలో చేర్చి, వాటికి ఒక నిర్దిష్ట స్వరూపాన్ని కల్పించడానికి రాజ్యాంగ పరిషత్తు 1947 జనవరి 24న సర్దార్ వల్లభాయ్ పటేల్ అధ్యక్షతన 54 మంది సభ్యులతో ఒక సలహా సంఘాన్ని నియమించింది. ఈ సలహా సంఘం ప్రాథమిక హక్కుల పరిశీలన కోసం 1947 ఫిబ్రవరి 12న ఆచార్య జె.బి. కృపలాని అధ్యక్షతన ఒక ఉప సంఘాన్ని నియమించింది. ఉప సంఘం సూచన మేరకు రాజ్యాంగ పరిషత్ సలహాదారు బి.ఎన్. రావు హక్కులపై ఒక ముసాయిదా తయారు చేశారు. ఈ ముసాయిదాలో హక్కులను.. న్యాయ సంరక్షణ ఉన్న హక్కులు, న్యాయ సంరక్షణ లేని హక్కులుగా వర్గీకరించారు.

ప్రాథమిక హక్కులు - లక్షణాలు

- ప్రవేశికలో పేర్కొన్న న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం అనే ఆదర్శాలకు వాస్తవికతను చేకూర్చేలా ప్రాథమిక హక్కులను పొందుపరిచారు.
- ప్రాథమిక హక్కులకు న్యాయ సంరక్షణ (Justiciable) ఉంది. ఇది అత్యంత ముఖ్యమైన లక్షణం. వీటి రక్షణ, అమలుకు రాజ్యాంగంలో న్యాయపరమైన ఏర్పాట్లు ఉన్నాయి.
- ప్రాథమిక హక్కులు ప్రభుత్వ నిరపేక్ష అధికారాల (Absolute Authority)పై పరిమితులు. ప్రభుత్వాలు తమ అధికారాలను రాజ్యాంగానికి లోబడి, ప్రజల హక్కులకు భంగం కలిగించకుండా వినియోగించాలి.
- కొన్ని ప్రాథమిక హక్కులు నకారాత్మకమైనవి (Negative). అంటే ఇవి ప్రభుత్వ అధికారితపై పరిమితులు.

ఉదా: నిబంధనలు 14, 15, 16, 20, 21 మొదలైనవి. ఇవి ప్రభుత్వం ఏయే అంశాలను చేయకూడదో సూచిస్తాయి.

- మరికొన్ని హక్కులు సకారాత్మకమైనవి (Positive). ఇవి ప్రభుత్వ బాధ్యతలను సూచిస్తాయి.

ఉదా: నిబంధన 17లోని అస్పృశ్యత నిషేధం, నిబంధన 24లోని బాల కార్మిక వ్యవస్థ నిషేధం.

- ప్రాథమిక హక్కులన్నింటినీ జాతీయ అత్యవసర పరిస్థితుల్లో రద్దు చేయవచ్చు. నిబంధనలు 20, 21 మాత్రం రద్దుకావు.
- ప్రాథమిక హక్కులన్నీ స్వతహాగా అమల్లోకి వస్తాయి. కానీ, నిబంధనలు 17, 23, 24లో ప్రస్తావించిన అంశాలు స్వతహాగా అమల్లోకి రావు (Non self-executory). వీటి అమలు కోసం పార్లమెంటు ప్రత్యేక చట్టాలు చేయాల్సి ఉంటుంది.
- ప్రాథమిక హక్కులను సవరించే అధికారం పార్లమెంటుకు ఉంది. దీని కోసం రాజ్యాంగ సవరణ అవసరం. కానీ, సవరణ పేరుతో వీటి స్ఫూర్తికి భంగం కలిగించకూడదు.
- కొన్ని ప్రాథమిక హక్కులు కొన్ని వర్గాలు, సాయుధ బలగాలు, పోలీసులు, ఖైదీలు, అత్యవసర సర్వీసుల్లో పనిచేస్తున్నవారికి పరిమితంగా వర్తిస్తాయి.
- కొన్ని ప్రాథమిక హక్కులు పౌరుల చర్యలకు వ్యతిరేకంగా కూడా లభిస్తాయి.

ఉదా: ప్రకరణ 17 - అస్పృశ్యత నివారణ, ప్రకరణ 23 - వెట్టిచాకిరి రద్దు, ప్రకరణ 24 - బాలకార్మిక వ్యవస్థ రద్దు.

- కొన్ని హక్కులను అల్పసంఖ్యాక వర్గాల ప్రయోజనాలు కాపాడి, జాతీయ సమగ్రత నిలపడానికి ఉద్దేశించారు.

ఉదా: మతస్వేచ్ఛ హక్కు, విద్యా సాంస్కృతిక హక్కు.

- ప్రాథమిక హక్కుల్లో పేర్కొన్న నిషేధాలు/విపక్షలు.. ప్రభుత్వాలు, పౌరులకు సమానంగా వర్తిస్తాయి.

ఉదా: జాతి, మత, కుల, లింగ, జన్మ సంబంధ వివక్షలను ఎవరూ పాటించకూడదు.



ప్రాథమిక హక్కుల వర్గీకరణ

భారత రాజ్యాంగంలో 7 రకాల ప్రాథమిక హక్కుల గురించి తెలిపారు.

1. సమానత్వ హక్కు (Right to Equality): ప్రకరణలు 14-18.
2. వ్యక్తి స్వేచ్ఛ, స్వాతంత్ర్య హక్కు (Personal Freedoms): ప్రకరణలు 19-22.
3. పీడనాన్ని నిరోధించే హక్కు (Right against Exploitation): ప్రకరణలు 23, 24.
4. మత స్వాతంత్ర్య హక్కు (Right to Religion): ప్రకరణలు 25-28.
5. సాంస్కృతిక, విద్యా హక్కులు (Cultural & Educational rights): ప్రకరణలు 29, 30.
6. ఆస్తి హక్కు (Right to Property): ప్రకరణ 31.
7. రాజ్యాంగ పరిహార హక్కు (Right to Constitutional Remedies): ప్రకరణ 32.

ప్రత్యేక వివరణ

పైన పేర్కొన్న ప్రాథమిక హక్కుల్లో అత్యంత వివాదాస్పదమైన ఆస్తి హక్కు (ప్రకరణ 31)ను, ఆస్తి సంపాదన విషయంలో వ్యక్తి స్వేచ్ఛకు సంబంధించిన 19(1)(f)ను 1978లో 44వ రాజ్యాంగ సవరణ ద్వారా ప్రాథమిక హక్కుల జాబితా నుంచి తొలగించారు. వీటిని 12వ భాగంలోని 300(ఎ)లో చేర్చారు. ప్రస్తుతం ఆస్తి హక్కు రాజ్యాంగబద్ధ హక్కు (Constitutional Right) మాత్రమే. దీన్ని ఒక చట్టబద్ధమైన హక్కుగానూ పరిగణిస్తున్నారు.

ప్రకరణ 12 - రాజ్యం నిర్వచనం

ప్రాథమిక హక్కులను మౌలికంగా రాజ్యం నిరపేక్ష అధికారాలకు వ్యతిరేకంగా పొందుపరిచారు. రాజ్యాంగంలో రాజ్యం అనే పదాన్ని చాలా చోట్ల ప్రయోగించారు. అయితే రాజ్యం నిర్వచనాన్ని మాత్రం ప్రకరణ 12లో పేర్కొన్నారు. రాజ్యం అనే పదానికి విస్తృతమైన నిర్వచనాన్ని ఇచ్చారు. ప్రాథమిక హక్కులను రాజ్యం లేదా ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా గుర్తించారు. కాబట్టి ఏయే సంస్థలు రాజ్య పరిధిలోకి వస్తాయి? అనే అంశాన్ని స్పష్టంగా నిర్వచించకపోతే కొన్ని సంస్థలు ప్రాథమిక హక్కులను ఉల్లంఘించినా వాటిపై న్యాయస్థానంలో ప్రశ్నించే అవకాశం ఉండదు. అందువల్ల దీనికి విస్తృతమైన నిర్వచనం అవసరం. దీని ప్రకారం రాజ్యం అంటే..

ఎ. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు; కేంద్ర, రాష్ట్ర శాసనసభలు

బి. స్థానిక ప్రభుత్వాలు (మున్సిపాలిటీలు, పంచాయతీలు, జిల్లా బోర్డులు, ట్రస్టులు)

సి. ప్రభుత్వ ఆదేశాల ద్వారా ఏర్పాటైన చట్టబద్ధ, చట్టేతర సంస్థలు (ఎల్.ఐ.సి., ఓ.ఎన్.జి.సి., ఎన్.టి.పి.సి. మొదలైనవి)

డి. న్యాయవ్యవస్థ కూడా రాజ్య నిర్వచన పరిధిలోకి వస్తుందని సుప్రీంకోర్టు తన తీర్పుల్లో తెలిపింది. అదేవిధంగా ప్రభుత్వ భాగస్వామ్యం ఉన్న ప్రైవేట్ సంస్థలు కూడా రాజ్య నిర్వచన పరిధిలోకి వస్తాయని పేర్కొంది.

పైన పేర్కొన్న సంస్థలతో పాటు ఎలాంటి ఇతర సంస్థలు రాజ్య పరిధిలోకి వస్తాయనే అంశాన్ని సుప్రీంకోర్టు వివిధ కేసుల తీర్పుల సందర్భంగా స్పష్టపరిచింది. అవి:

అజయ్ సహాయ్ వర్సెస్ ఖలీద్ ముజీద్ (1981): సుప్రీంకోర్టు ఈ కేసు తీర్పులో ఒక సంస్థను రాజ్యం అనే నిర్వచనంలోకి చేర్చడానికి కింది ప్రాతిపదికలను పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొంది.

- మూలధనంలో ప్రభుత్వ వాటా ఉండాలి.
- ఆ సంస్థ మొత్తం ఖర్చును ప్రభుత్వం భరించాలి.
- ఆ సంస్థపై సంపూర్ణ పరిపాలనా నియంత్రణ ఉండాలి.
- ఆ సంస్థ ఆర్థిక లావాదేవీలు ప్రభుత్వ నియంత్రణలో ఉండాలి.

న్యాయస్థానాలు రాజ్య నిర్వచన పరిధిలోకి వస్తాయి - సుప్రీంకోర్టు తీర్పులు

ఎ.ఆర్. అంతులే వర్సెస్ ఆర్.ఎస్. నాయక్ కేసు (1988): న్యాయస్థానాల కొన్ని చర్యలు రాజ్య నిర్వచనంలోకి వస్తాయని ఈ కేసులో సుప్రీంకోర్టు పేర్కొంది. దీనికి రాజ్యాంగంలో స్పష్టమైన ఆధారాలున్నాయి. ప్రకరణ 145, 146 ప్రకారం సుప్రీంకోర్టు సొంత నియమ, నిబంధనలను రూపొందించుకోవచ్చు. అదేవిధంగా తన సిబ్బందిని నియమించుకునే అధికారం కూడా సుప్రీంకోర్టుకు ఉంది. ఈ చర్యలు కార్యనిర్వాహకపరమైనవి. వీటివల్ల పౌరుల ప్రాథమిక హక్కులకు భంగం కలిగినప్పుడు వాటిని న్యాయస్థానంలో ప్రశ్నించవచ్చు.

కాబట్టి న్యాయశాఖ కార్యనిర్వాహక విధులను నిర్వర్తిస్తున్నప్పుడు మాత్రమే రాజ్యమనే పరిధిలోకి వస్తుందని సుప్రీంకోర్టు ప్రకటించింది.

రాజ్యం నిర్వచనం- మినహాయింపులు

సహకార సంఘాలు; బోర్డ్ ఆఫ్ కంట్రోల్ ఫర్ క్రికెట్ ఇన్ ఇండియా; ప్రభుత్వ ధన సహాయం పొందని ప్రైవేట్ విద్యాసంస్థలు; ప్రభుత్వ పరిపాలన, ఆర్థిక నియంత్రణ లేని ఇతర సంస్థలు రాజ్యం నిర్వచనం పరిధిలోకి రావు.

ప్రకరణ 13-చట్టం నిర్వచనం, ప్రాథమిక హక్కులకు వ్యతిరేకమైన చట్టాలు-న్యాయ సమీక్షాధికారం

ప్రకరణ 13(1) ప్రకారం రాజ్యాంగం అమల్లోకి వచ్చిన వెంటనే అంతవరకు అమల్లో ఉన్న చట్టాలు ప్రాథమిక హక్కులకు వ్యతిరేకమైతే.. అవి చెల్లకుండా పోతాయి. ప్రకరణ 13(2) ప్రకారం ప్రాథమిక హక్కులను హరించే లేదా పరిమితం చేసే చట్టాలు, ఆదేశాలు చెల్లవు.

ప్రకరణ 13(3)లో పేర్కొన్న చట్టం నిర్వచనం కిందకి వచ్చే అంశాలు:

- కేంద్ర, రాష్ట్ర శాసనసభలు రూపొందించిన శాసనాలు.
- రాష్ట్రపతి, గవర్నర్ జారీ చేసిన ఆదేశాలు, ఆర్డినెన్స్‌లు.
- ప్రభుత్వ రూల్స్, రెగ్యులేషన్స్, నోటిఫికేషన్స్, ప్రకటనలు.
- ప్రభుత్వం గుర్తించిన, చట్టబద్ధత ఉన్న ఆచార వ్యవహారాలు.

ప్రత్యేక వివరణ

1971లో 24వ రాజ్యాంగ సవరణ ద్వారా.. నిబంధన 368 ప్రకారం రాజ్యాంగానికి చేసిన సవరణలను నిబంధన 13లో పేర్కొన్న 'చట్టం' నిర్వచన పరిధి నుంచి మినహాయించారు. ఈ అంశాన్ని గోలక్‌నాథ్ కేసు(1967)లో సుప్రీంకోర్టు తీర్పును అధిగమించడానికి చేర్చారు. కానీ, సుప్రీంకోర్టు 1973లో కేశవానందభారతి కేసులో ఈ సవరణ చెల్లదని తీర్పు చెప్పింది. కాబట్టి రాజ్యాంగ సవరణ కూడా చట్టం నిర్వచన పరిధిలోకి వస్తుంది.

ఉన్ని, పట్టు వంటి వాటిలో ఉన్న ప్రొటీన్ ఏది?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

ఫిజికల్ సైన్స్ - ప్రాక్టీస్ టెస్ట్

1. ప్రయోగశాలలో నీటి శాంపిల్ COD (Chemical Oxygen Demand)ను నిర్ణయించడానికి ఉపయోగించే ఆక్సీకరణి ఏది?
   1) KNO_3 2) $KMnO_4$
   3) ఆగ్జాలికామ్లం
   4) $K_2Cr_2O_7$ + 50% H_2SO_4 (ఆమ్లీకృత పొటాషియం డైక్రోమేట్)
2. నీటిని క్లోరిన్‌తో శుద్ధి చేయడానికి గల కారణం?
   1) ఆక్సిజన్ పరిమాణం పెరుగుతుంది.
   2) సూక్ష్మజీవులను చంపుతుంది.
   3) తేలియాడుతున్న కణాలను తొలగిస్తుంది.
   4) నీటి కాఠిన్యాన్ని తొలగిస్తుంది.
3. ఓజోన్ అనేది?
   1) ఆక్సిజన్ రూపాంతరం
   2) ఆక్సిజన్ ఐసోటోప్
   3) ఆక్సిజన్ సమ్మేళనం
   4) ద్విపరమాణుక అణువు
4. గది ఉష్ణోగ్రత వద్ద p- రకపు అర్ధవాహకంలో?
   1) అధిక స్వేచ్ఛా ఎలక్ట్రాన్‌లు, అల్ప రంధ్రాలు ఉంటాయి.
   2) అధిక రంధ్రాలు, అల్ప ఎలక్ట్రాన్‌లు ఉంటాయి.
   3) అధిక రంధ్రాలు, ఎలక్ట్రాన్‌లు ఉంటాయి.
   4) ఎలక్ట్రాన్‌లు, రంధ్రాలు ఉండవు.
5. పురోశక్మం (Forward Bias) పద్ధతిలో ఆదర్శ డయోడ్ నిరోధం?
   1) అనంతం 2) పరిమితం
   3) రుణాత్మకం 4) సున్నా
6. p-n-p ట్రాన్సిస్టర్(Transistor) కంటే n-p-n ట్రాన్సిస్టర్ ఎక్కువగా ఎందుకు ఉపయోగిస్తారు?
   1) ఎక్కువ సామర్థ్యం ఉంటుంది కాబట్టి
   2) n-p-n లో శక్తి దుర్వినియోగం తక్కువ
   3) రంధ్రాల కంటే ఎలక్ట్రాన్‌ల చలనశీలత ఎక్కువ. అందువల్ల ఎక్కువ శక్తి చలనశీలత ఉంటుంది.
   4) రంధ్రాలకు ఎక్కువ చలనశీలత కాబట్టి శక్తి ఎక్కువగా ప్రసరిస్తుంది.
7. పౌనఃపున్యానికి(Frequency)మితి ఫార్ములా?
   1) $M^1L^2T^{-1}$ 2) $M^0L^2T^{-1}$
   3) $M^1L^0T^{-1}$. 4) $M^0L^0T^{-1}$
8. కిందివాటిని జతపరచండి
   గ్రూప్-A
   a) నిరోధం (Resistance)
   b) వాహకత్వం (Conductance)
   c) కెపాసిటెన్స్ (Capacitance)
   d) ప్రేరణా గుణకం (Inductance)
   గ్రూప్-B
   e) హెన్రీ (Henry)
   f) ఫారడ్ (Farad)
   g) ఓమ్ (Ohm)
   h) సీమెన్స్ (Siemens)
   1) a-g, b-f, c-h, d-e
   2) a-g, b-h, c-f, d-e
   3) a-f, b-g, c-f, d-e
   4) a-c, b-f, c-h, d-g
9. 10^{12} పూర్వ లగ్నం (Prefix) ఏది?
   1) పీటా 2) ఎక్సా
   3) టెరా 4) మెగా
10. 50kg ద్రవ్యరాశి ఉన్న స్త్రీ ఒంటికాలిపై 1 సెం.మీ.^{2} వైశాల్యమున్న మేజోళ్లు (Sharp-heeled shoe) పై నిలుచున్నది. భూమిపై ఆమె చేసే ఒత్తిడి? (g = 10 మీ/సె^{2})
    1) 5×10^6 Pa 2) 5×10^5 Pa
    3) 500 Pa 4) 0·05 Pa
11. 50 గ్రాముల ద్రవ్యరాశి, 20 సెం.మీ^{3} ఘన పరిమాణం గల ఒక వస్తువును నీటిలో వేస్తే అది?
    1) పూర్తిగా మునిగిపోతుంది.
    2) తేలుతుంది. 3) వేలాడుతుంది.
    4) మొదట మునిగి తర్వాత తేలుతుంది.
12. లాక్టోమీటర్ (Lactometer)ను పాల స్వచ్ఛతను కనుక్కోవడానికి ఉపయోగిస్తారు. ఇది ఏ సూత్రం ఆధారంగా పనిచేస్తుంది?
    1) ఆర్కిమెడిస్ సూత్రం
    2) ప్లవన సూత్రం 3) బెర్నౌలీ సూత్రం
    4) కులూంబ్ సూత్రం
13. షర్మిష్ట (Sharmista) అనేది?
    1) ఒక తోకచుక్క 2) ఒక ఉల్క
    3) ఒక నక్షత్ర మండలం
    4) సౌర కుటుంబం ఆవల ఉన్న గ్రహాల సముదాయం
14. వేడి నీటి ఊటలు, అగ్ని పర్వతాలు వేటికి ఉదాహరణలు?
    1) భూగర్భ లవణాలకు
    2) భూగర్భ ద్రవ రూపాలకు
    3) భూగర్భ ఉష్ణానికి
    4) భూగర్భ ఖనిజాలకు
15. నీటి వక్రీభవన గుణకం 4/3. కాంతి నీటిలో 3 మీటర్లు ప్రయాణించడానికి పట్టే సమయం ఎంత? (శూన్యంలో కాంతి వేగం C= 3×10^8 మీ/సె)
    1) 1.33×10^{-8} సెకన్లు
    2) 1.33 సెకన్లు 3) 3/4 సెకన్లు
    4) 1.33×10^8 సెకన్లు
16. ఖగోళ దూరదర్శినిలో వస్తు కటక నాభ్యంతరం F_0, అక్షి కటక నాభ్యంతరం F_e అయితే 'సహజ సర్దుబాటు' తర్వాత కటకాల మధ్య దూరం ఎంత?
    1) $L = F_0 + F_e$ 2) $L = F_0 / F_e$
    3) $L = F_0 \times F_e$ 4) $L = F_0 - F_e$
17. సంయుక్త సూక్ష్మదర్శిని వస్తు కటకం, అక్షి కటకాల నాభ్యంతర దూరాలు 0.5 సెం.మీ., 4 సెం.మీ.,ఆవర్తనం 250 అయితే రెండు కటకాల మధ్య దూరం ఎంత?
    1) 24 సెం.మీ 2) 22 సెం.మీ
    3) 20 సెం.మీ. 4) 26 సెం.మీ
18. అనునాద ప్రయోగంలో మొదటి, రెండో అనునాదం వద్ద గాలి స్తంభం పొడవులు వరుసగా 20 సెం.మీ., 70 సెం.మీ. వాడుక చేసిన శ్రుతి దండం (Tuning Fork) పౌనఃపున్యం 330Hz అయితే గాలిలో ధ్వని వేగాన్ని కనుక్కోండి?
    1) 320 సెం.మీ/గంటలు
    2) 320 సెం.మీ/సెకన్లు
    3) 320 మీ/సెకన్లు
    4) 320 మీ/గంటలు
19. వస్తువులున్న గదిలో ప్రతిధ్వనులు వినపడ వు. కానీ ఖాళీగా ఉన్న పెద్ద హాలులో ప్రతిధ్వనులు వినిపిస్తాయి. ఎందుకు?
    1) గదిలో ధ్వనిని శోషించుకుంటాయి. హాలులో ధ్వని అనేక పరావర్తనాలు చెందడం వల్ల ప్రతిధ్వనులు వినిపిస్తాయి.
    2) గది శోషణ గుణకం తక్కువ కాబట్టి
    3) గదిలో అనేక పరావర్తనాలు చెందుతాయి కాబట్టి
    4) హాలులో శోషణం ఎక్కువ కాబట్టి
20. వాయు సమీకరణం కిందివాటిలో దేనికి వర్తిస్తుంది?
    1) సమోష్ణగ్రతా ప్రక్రియలకు మాత్రమే
    2) స్థిరోష్ణక ప్రక్రియలకు మాత్రమే
    3) సమోష్ణోగ్రతా, స్థిరోష్ణక ప్రక్రియలకు వర్తిస్తుంది.
    4) పై రెండు ప్రక్రియలకు వర్తించదు.
21. ఒక ఘనపదార్థం దైర్ఘ్య వ్యాకోచ గుణకం (α=0.00009/°C) అయితే ఘనపరిమాణ వ్యాకోచ గుణకం γ ఎంత?
    1) 0.000027/°C 2) 0.00027/°C
    3) 0.00081/°C 4) 0.00003/°C
22. నీటిని 0°C నుంచి 10°C కు వేడి చేసినప్పుడు ఘనపరిమాణం?
    1) పెరుగుతుంది. 2) తగ్గుతుంది.
    3) దాదాపుగా మారదు.
    4) మొదట తగ్గి తర్వాత పెరుగుతుంది.
23. కార్బోహైడ్రేట్ కానిది?
    1) గ్లూకోజ్ 2) చక్కెర
    3) ఆసిటిక్ ఆమ్లం
    4) రమనోజ్ (Rhamnose)
24. జంతువుల శరీరంలో నిక్షిప్తమైన కార్బో హైడ్రేట్ ఏది?
    1) సెల్యులోజ్ 2) గ్లైకోజన్
    3) అమైలోజ్ 4) లాక్టోజ్
25. ఆవశ్యక ఎమైనో ఆమ్లం (Essential amino acid) కానిది?
    1) గ్లైసిన్ 2) వాలిన్
    3) ల్యూసిన్ 4) లైసిన్
26. ఉన్ని, పట్టు వంటి వాటిలో ఉన్న ప్రొటీన్ ఏది?
    1) మైయోసిన్ 2) అల్బుమిన్స్
    3) కెరటిన్ 4) పైవన్నీ
27. వీటిలో సహజ పాలిమర్ ఏది?
    1) రేయాన్ 2) నైలాన్
    3) బూనా-s 4) రబ్బర్
28. దువ్వెనల తయారీలో ఉపయోగించే పాలిమర్ ఏది?
    1) PVC 2) పాలిప్రొపీన్
    3) బెకలైట్ 4) పాలిస్టైరిన్
29. సోయా చిక్కుడు గింజలు ఏ ఫాటీ ఆమ్లాల వనరు?
    1) లారిక్ ఆమ్లం 2) స్టియరిక్ ఆమ్లం
    3) లినోలినిక్ ఆమ్లం 4) ఓలియిక్ ఆమ్లం
30. జె.ఏస్పిడిన్ కనుగొన్నది ఏది?
    1) గాజు 2) కృత్రిమ దారాలు
    3) సిమెంట్ 4) రంజనాలు
31. ఒక ధాతువును అధిక గాలి సమక్షంలో దాని ద్రవీభవన స్థానం కంటే తక్కువ ఉష్ణోగ్రత వద్ద తీవ్రంగా వేడి చేయడాన్ని ఏమ ంటారు?
    1) భస్మీకరణం 2) భర్జనం
    3) ప్రగలనం 4) క్షయకరణం
32. 'గెలీనా' (Galena) ఏ లోహం ధాతువు?
    1) మెర్క్యురీ 2) వెండి
    3) సీసం 4) కాల్షియం
33. జర్మన్ సిల్వర్‌లోని సంఘటనాలు?
    1) కాపర్, జింక్, నికెల్
    2) కాపర్, టిన్, నికెల్
    3) కాపర్, జింక్, టిన్
    4) కాపర్, జింక్, అల్యూమినియం
34. అణుచలన సిద్ధాంతం ప్రకారం వాయు అణువుల సగటు గతిజ శక్తి (E_K), పరమ ఉష్ణోగ్రత (T) ల మధ్య సంబంధాన్ని కిందివిధంగా సూచించవచ్చు?
    1) $E_K \propto T^2$ 2) $E_K \propto T$
    3) $E_K \propto 1/T$ 4) $E^2_K \propto T$
35. ఒకే ఉష్ణోగ్రత వద్ద ఉన్న 3g హైడ్రోజన్, 4g ఆక్సిజన్ వాయువుల గతిజశక్తి నిష్పత్తిని లెక్కిస్తే అది ఎంత ఉంటుంది?
    1) 3:4 2) 12:1
    3) 1:12 4) 4:3
36. కిందివాటిలో వాండర్‌వాల్ బలాలు ఏవి?
    1) పదార్థంలోని కణాలైన పరమాణువులు లేదా అణువుల మధ్య బలాలు
    2) విరుద్ధ విద్యుదావేశాలు గల అయాన్‌ల మధ్య గల స్థిరవిద్యుత్ ఆకర్షణ బలాలు
    3) అణువులు, పరమాణువుల మధ్య ఉండే సంయోజనీయ బంధాలు
    4) కేంద్రక కణాల మధ్య ఆకర్షణ బలాలు
37. వాయువు వ్యాపనం రేటు దాని సాంద్రత వర్గమూలానికి విలోమానుపాతంలో ఉంటుంది. ఇది ఏ నియమం?
    1) డాల్టన్ పాక్షిక పీడనాల నియమం
    2) గ్రాహం వాయు వ్యాపన నియమం
    3) అవగాడ్రో నియమం
    4) చార్లెస్ వాయు వ్యాపన నియమం
38. సోమర్‌ఫీల్డ్ (Somerfield) దీర్ఘవృత్తాకార కక్ష్య అనే భావనను కింది విషయాన్ని విశదీకరించడానికి ప్రవేశపెట్టారు?
    1) రేఖావర్ణపటంలోని రేఖలను విశదీక రించడానికి
    2) రేఖావర్ణపటంలోని రేఖలు ఉపరేఖలుగా విడిపోవడాన్ని విశదీకరించడానికి
    3) పట్టిక వర్ణపట రేఖలను విశదీకరించ డానికి
    4) హైడ్రోజన్ వర్ణపటంలోని రేఖలను వివరించడానికి
39. d ఉప కర్పరంలోని ఆర్బిటాళ్ల సంఖ్య?
    1) 1 2) 3 3) 5 4) 7
40. ఒక ఆర్బిటాల్‌లో గరిష్ఠంగా ఉంచగలిగే ఎలక్ట్రాన్‌ల సంఖ్యను తెలియచేయడానికి ఏ నియమం ఉపయోగపడుతుంది?
    1) పౌలీవర్జన నియమం
    2) ఆఫ్‌బౌ నియమం
    3) హుండ్ నియమం
    4) మాయిలర్ చిత్రం
41. పరమాణు ద్రవ్యరాశులను ఆరోహణ క్రమంలో ఒక క్రమపద్ధతిలో అమర్చి ఆవర్తన పట్టికను తయారుచేసిన శాస్త్రవేత్త?
    1) మోస్లే 2) మెండలీఫ్
    3) న్యూలాండ్స్ 4) డాబర్‌నీర్
42. ఆవర్తన పట్టికలో X అనే ఒకటో గ్రూపు మూలకం, Y అనే 17వ గ్రూపు మూలకం సంయోగం చెంది ఒక సమ్మేళనాన్ని ఏర్పరిస్తే దాని ఫార్ములా?
    1) X_3Y 2) X_2Y
    3) XY 4) X_2Y_3
43. ఏ రసాయన బంధాన్ని ఎలక్ట్రోవాలెంట్ బంధం (electro valent bond) అని కూడా అంటారు?
    1) సంయోజనీయ బంధం
    2) సమన్వయ సంయోజనీయ బంధం
    3) హైడ్రోజన్ బంధం
    4) అయానిక బంధం
44. వెస్పర్ (VSEPRT) సిద్ధాంతం ప్రధానంగా దేనిని వివరించడంలో విఫలమైంది?
    1) బంధ దైర్ఘ్యం 2) బంధ కోణం
    3) బంధ శక్తి 4) బంధ స్వభావం
45. అమ్మోనియాలో $H\hat{N}H$ బంధ కోణం విలువ?
    1) 104°31' 2) 107°48'
    3) 109°28' 4) 90°
46. ఆవర్తన పట్టికలోని ఏ గ్రూపు మూలకాలను చాల్కోజనులు అంటారు?
    1) 14 2) 15 3) 16 4) 17

సమాధానాలు

1) 4	2) 2	3) 1	4) 2	5) 4
6) 3	7) 4	8) 2	9) 3	10) 1
11) 1	12) 1	13) 3	14) 3	15) 1
16) 1	17) 3	18) 3	19) 1	20) 3
21) 2	22) 4	23) 3	24) 2	25) 1
26) 3	27) 4	28) 3	29) 4	30) 3
31) 2	32) 3	33) 1	34) 2	35) 2
36) 1	37) 2	38) 2	39) 4	40) 1
41) 2	42) 3	43) 4	44) 3	45) 2
46) 3.				

సామాజిక, ఆర్థిక సంక్షోభం నుంచే నక్సలిజం..

నక్సలిజానికి మూలాలు ఏంటి? పశ్చిమ బెంగాల్‌లోని నక్సల్‌బరీలో వచ్చిన ఉద్యమం తెలుగు ప్రాంతాలకు ఎలా విస్తరించింది? నక్సల్‌బరీలో వచ్చిన ఉద్యమం అక్కడ ఎక్కువ రోజులు మనలేదు కానీ, తెలుగు రాష్ట్రాల్లో వచ్చిన ఉద్యమం కొనసాగడానికి కారణాలేమిటి? తెలంగాణలో నక్సలైట్ ఉద్యమం గురించి సమగ్ర అవగాహన పొందేందుకు.. ముందుగా నక్సలైట్ ఉద్యమానికి కారణాలు, నాటి జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులు, తెలంగాణ ప్రాంతంలో జరిగిన సాయుధ పోరాటం, దాని ప్రభావం గురించిన వివరాలు..

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ చరిత్ర



స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో బ్రిటిష్ ఆధీనంలోని ప్రెసిడెన్సీ ప్రాంతాల్లో జాతీయ ఉద్యమం బలంగా ఉండేది. కానీ రాచరిక పాలన కొనసాగిన ప్రాంతాల్లో మాత్రం స్వాతంత్య పోరాటాలు పెద్దగా లేవనే చెప్పొచ్చు. నిజాం పాలనలో ఉన్న హైదరాబాద్ సంస్థానంలోనూ స్వాతంత్ర్య ఉద్యమాలు లేవు. బ్రిటిష్ పాలనలో ఉన్న ఆంధ్రప్రాంతంలో స్వాతంత్ర్య పోరాటాలు, సంస్కరణ ఉద్యమాలు జరిగాయి. వ్యవసాయాభివృద్ధి కూడా జరిగింది. నిజాం పాలనలో హైదరాబాద్ నగరం కొంత అభివృద్ధి చెందింది, కానీ ఈ సంస్థానంలోని గ్రామాల్లో ప్రగతి జాడలేదు.

భూస్వామ్య వ్యవస్థ అరాచకం

నిజాం పాలనలో ఎలాంటి ప్రామాణికత లేని పన్నుల విధానంతో ప్రజలు, రైతులు వేధింపులకు గురయ్యారు. నిజాం రాజుల కాలంలో తెలంగాణలో భూస్వామ్య విధానం ఉండేది. భూస్వాములు, దేశ్‌ముఖ్‌లు, దేశ్‌పాండేలతో కూడిన అరాచక వ్యవస్థ ఉండేది. వీళ్ల వేలాది ఎకరాల భూములు కలిగి ఉండేవారు. గ్రామాల్లో ప్రజలు ఈ భూస్వాముల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి జీవనం సాగించేవారు. ముఖ్యంగా మహిళలు, రైతులు, కూలీల జీవనం దయనీయంగా ఉండేది. వెట్టి వ్యవస్థ అమల్లో ఉండేది. వ్యవసాయం చేయడం చాలా కష్టమనే నిస్సహాయ పరిస్థితి రైతుల్లో కనిపించేది. హైదరాబాద్ సంస్థానంలో స్వాతంత్ర్య ఉద్యమాలు జరగకపోవడం, కాంగ్రెస్ పార్టీని నిషేధించడం, సామాజిక ఉద్యమాలకు వెసులుబాటు లేకపోవడం లాంటి కారణాలతో గ్రామీణ ప్రాంతాల్లోని పేదలు, బడుగులు, దళితులు దయనీయ జీవనం గడిపారు. దేశవ్యాప్తంగా జరిగిన స్వాతంత్ర్య ఉద్యమం కూడా గ్రామీణ స్థాయిలో భూ సంస్కరణల కోసం దోహదపడలేదు. రైతులను సమీకరించి వారి సమస్యలను పరిష్కరించే దిశగా పని చేయలేదు. మహాత్మా గాంధీ నాయకత్వంలో జరిగిన స్వాతంత్ర్య ఉద్యమం వలసవాదాన్ని వ్యతిరేకిస్తూ ముందుకుసాగినా.. అది భూస్వామ్య విధానానికి వ్యతిరేకంగా పోరాడే ప్రయత్నం చేయలేదు. దీంతో వలసవాదులు దేశం విడిచివెళ్లి, అధికార మార్పిడి జరిగినప్పటికీ భూస్వామ్య విధానం అలాగే కొనసాగింది. భూస్వామ్య వ్యవస్థ ముఖ్య లక్షణం.. ఉత్పాదకతను పెరగనీయకపోవడం. అయితే 1930వ దశకం నాటికి వ్యాపార పంటల విస్తరణ జరగడం వల్ల ప్రజల్లో చైతన్యం పెరుగుతుందని గ్రహించిన భూస్వాములు వేలాది ఎకరాల భూములను పడావుగా ఉంచారు. దీంతో పేద ప్రజలకు పని దొరకని పరిస్థితి ఏర్పడింది. 1940వ దశకం నాటికి తెలంగాణలో విధ్వంసం ఊహించలేని స్థాయికి చేరింది. భూస్వాములు మహిళల పట్ల అమానుషంగా ప్రవర్తించారు. మహిళలు లైంగిక వేధింపులకు కూడా గురయ్యారు.

సాయుధ పోరాటం

దేశవ్యాప్తంగా 1930వ దశకంలో కమ్యూనిస్టు పార్టీ భూమిలేని రైతులను సమీకరించి, భూస్వాములను ఎదురించడం ప్రారంభించింది. ఆంధ్ర ప్రాంతంలోనూ కమ్యూనిస్టు పార్టీ బలమైన శక్తిగా అవతరించింది. తెలంగాణలో భువనగిరిలో 1944లో జరిగిన పదకొండో ఆంధ్రమహాసభలో సైద్ధాంతిక విభేదాల వల్ల మితవాద సభ్యులు ఆంధ్రమహాసభ నుంచి నిష్క్రమించారు. దీంతో ఆంధ్రమహాసభ పూర్తిగా కమ్యూనిస్టుల చేతుల్లోకి వెళ్లింది. తెలంగాణలో రావి నారాయణ రెడ్డి, బద్దం ఎల్లా రెడ్డి తదితరులు పుచ్చలపల్లి సుందరయ్య సహాయంతో సాయుధ పోరాటాన్ని ఉధృతం చేశారు. భూస్వాములకు వ్యతిరేకంగా సాగిన ఈ పోరాటంలో 5 లక్షల ఎకరాలకుపైగా భూమిని పేదలకు పంచారు. ఈ సమయంలో కొందరు భూస్వాములు మరణించారు. మరికొందరు వలస వెళ్లారు. 1944 నుంచి 1952 వరకు జరిగిన సాయుధ పోరాటానికి చారిత్రక నేపథ్యం ఉంది. సాయుధ పోరాటాన్ని అర్థం చేసుకోకపోతే తెలంగాణలో నక్సలైట్ ఉద్యమాన్ని అవగాహన చేసుకోలేం.

దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించినా..

1940లలో అంతర్జాతీయంగా, జాతీయంగా కీలక పరిణామాలు సంభవించాయి. రెండో ప్రపంచ యుద్ధంలో బ్రిటన్ గెలిచినప్పటికీ.. యుద్ధంలో ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయింది. మూడో ప్రపంచ దేశాలపై బ్రిటన్ ప్రభావం, పట్టు క్రమేణా సడలుతూ వచ్చింది. జాతీయంగా మన దేశంలో స్వాతంత్ర్య ఉద్యమం ఊపందుకుంది. ఇలాంటి పరిస్థితుల్లో 1947 ఆగస్టు 15 భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. కానీ తెలంగాణ ప్రజలు మాత్రం స్వేచ్ఛా వాయువులకు దూరంగానే ఉన్నారు. ఇక్కడ సాయుధ పోరాటం జరుగుతూనే ఉంది. హైదరాబాద్ సంస్థానంలో నిజాం పాలనే కొనసాగుతోంది. ఆ సమయంలో ఒకవేళ హైదరాబాద్ సంస్థానం దేశంలో విలీనమైనా.. ఈ ప్రాంతం కమ్యూనిస్టుల ఆధీనంలో ఉండటం అప్పటి జాతీయ నాయకత్వానికి ఏమాత్రం ఇష్టం లేదు. సాయుధ పోరాటాన్ని అణిచివేయాలనే యోచన తప్ప, దాన్ని స్వాతంత్ర్య ఉద్యమంలో భాగంగా గుర్తించడానికి కేంద్ర ప్రభుత్వం ఇష్టపడలేదు. భారత సైన్యంతో ఇక్కడి కమ్యూనిస్టులను, సాయుధ పోరాటాన్ని అణిచివేసే ప్రయత్నం జరిగింది. మరోవైపు నిజాం రాజు హైదరాబాద్ సంస్థానాన్ని భారత యూనియన్‌లో కలపడానికి అంగీకరించలేదు. ఇక్కడ నిజాం 'రజాకార్లు' అనే ప్రైవేట్ మిలటరీ వ్యవస్థను ఏర్పరచుకున్నాడు. వీరు ప్రజలను భయాందోళనలకు గురి చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో విపరీతమైన విధ్వంసాన్ని సృష్టించారు. ప్రజలను చంపడం, మహిళలపై అత్యాచారాలు లాంటి అనేక అకృత్యాలకు పాల్పడ్డారు. అలాంటి పరిస్థితుల్లో రజాకార్లను ఎదుర్కొని ప్రజలకు రక్షణ కల్పించింది కమ్యూనిస్టు పార్టీయే. కేంద్ర ప్రభుత్వం ఈ ప్రాంతంలోకి రజాకార్ల ఆగడాలను అరికట్టడానికి సైన్యాన్ని పంపించింది. కానీ, సైన్యం రజాకార్లకు చెక్ పెడుతూనే.. ఇక్కడి కమ్యూనిస్టు పార్టీని కూడా అణిచివేసింది. భారత ప్రభుత్వం 1948 సెప్టెంబర్ 13న ప్రారంభించిన పోలీస్ చర్యతో నిజాం రాజు భారత సైన్యానికి లొంగిపోయాడు. 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్, భారత యూనియన్‌లో విలీనం అయింది. ఆ తర్వాత కూడా సాయుధ పోరాటం 1952 వరకూ భిన్న రూపాల్లో కొనసాగింది. భారత దేశానికి స్వాతంత్ర్యం రావడం, హైదరాబాద్ భారత యూనియన్‌లో విలీనమవడం, ఇక్కడ రాచరిక వ్యవస్థ రద్దు తదితర కారణాలతో సాయుధ పోరాట విరమణ జరిగింది. కమ్యూనిస్టు పార్టీ 1952లో జరిగిన ఎన్నికల్లో ఘనవిజయం సాధించింది. ముఖ్యంగా కృష్ణా, గుంటూరు జిల్లాల్లో పూర్తి సీట్లను గెలుచుకుంది. ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాల్లో బలమైన శక్తిగా ఉన్న కమ్యూనిస్టు పార్టీ తర్వాత విశాలాంధ్ర భావనను బలంగా సమర్థించింది. ఒకానొక సమయంలో అధికారం చేపడుతుందని అనుకున్న కమ్యూనిస్టు పార్టీ ఆ తర్వాత రాజకీయంగా ఎదగలేకపోయింది.

సరికొత్త అవతారంలో భూస్వాములు

1947 నుంచి 1967 వరకు భారత ప్రజలకు రాజ్యాంగం కల్పించిన హామీలు, విశ్వాసం మేరకు తమ జీవితాలు మెరుగుపడతాయనే కొత్త ఆశలు కలిగాయి. అదేవిధంగా తెలంగాణ ప్రజలు కూడా విశ్వాసం ఏర్పరచుకున్నారు. అయితే స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసిన కాంగ్రెస్ పార్టీ.. భూస్వాములతోగానీ, భూస్వామ్య వ్యవస్థతోగానీ పోరాటం చేయలేదు. కేంద్ర ప్రభుత్వం 1958లో జమీందారీ వ్యవస్థను రద్దు చేసింది. కానీ సరైన విధానపరమైన నిర్ణయాలు తీసుకోకపోవడం, భూసంస్కరణలను పెద్ద ఎత్తున చేపట్టకపోవడం, వ్యవసాయిక సంబంధాల్లో తీసుకు రావాల్సిన మార్పులు తేవడంలో కాంగ్రెస్ పార్టీ విఫలమైంది. సాయుధ పోరాటంలో గ్రామాలను వదిలి నగరాలకు వలస వెళ్లిన భూస్వాములు.. కాంగ్రెస్ పార్టీలో చేరి కాంగ్రెస్ నేతలుగా మారి తిరిగి గ్రామాల్లోకి వెళ్లారు. వీరు గ్రామాల్లో తమ పూర్వ ఆధిపత్య పునరుద్ధరణ కోసం ప్రయత్నించారు. కమ్యూనిస్టు పార్టీ భావజాలాన్నే (భూ సంస్కరణలు, భూస్వామ్య వ్యవస్థ రద్దు మొదలైనవి) తమ భావజాలంగా పేర్కొన్న కాంగ్రెస్ పార్టీ తర్వాతి ఎన్నికల్లో విజయం సాధించింది. అంతేకాకుండా గ్రామీణ ప్రాంతాల్లో భూస్వాములు కాంగ్రెస్ పార్టీ హయాంలో మరింత బలపడ్డారు.

నక్సల్‌బరీ నిప్పురవ్వ

ఇలాంటి పరిణామాలు ప్రజల ఆశలను వమ్ము చేశాయి. స్వయం పాలన వచ్చినా తమ జీవితాలు బాగుపడలేదని గ్రామీణ ప్రజలు అసంతృప్తికి గురయ్యారు. దీనికి తోడు వడ్డీ వ్యాపారుల దోపిడీ, భూస్వాముల అణచివేత చర్యలు అధికమయ్యాయి. వీటికి వ్యతిరేకంగా పశ్చిమబెంగాల్‌లోని 'నక్సల్‌బరీ' గ్రామంలో గిరిజన రైతులు ఉవ్వెత్తున తిరుగుబాటు చేశారు. ఇక్కడ ఈ ఉద్యమం ఎక్కువ కాలం నిల్వలేదు. కొద్దికాలానికే అణిచివేశారు. కానీ, నక్సల్‌బరీలో ప్రారంభమైన పోరాటం భిన్నరూపాల్లో దాదాపు 45 ఏళ్లకు పైగా దేశవ్యాప్తంగా విస్తరించింది. రాజ్యం ఎన్ని అణచివేత మార్గాలను అనుసరిస్తున్నా.. ఉద్యమం ఏదో ఒక రూపంలో కొనసాగుతూనే ఉంది. నక్సలైట్ ఉద్యమం తెలుగు ప్రాంతాల్లో మొదటగా శ్రీకాకుళం జిల్లాలో మొదలైంది. నక్సల్‌బరీలానే ఇక్కడి గిరిజన రైతులు దోపిడీకి వ్యతిరేకంగా తిరుగుబాటు చేశారు.

ఈ ఉద్యమాన్ని కూడా ఏడాదిలోపే అణిచివేశారు. తర్వాత ఇది ఉత్తర తెలంగాణ ప్రాంతానికి విస్తరించింది. అయితే నక్సల్‌బరీ, శ్రీకాకుళం, ఉత్తర తెలంగాణ ఉద్యమాలకు మౌలిక తేడా ఉంది. నక్సల్‌బరీ, శ్రీకాకుళంలో గిరిజన పోరాటం జరిగింది. కానీ, ఉత్తర తెలంగాణకు మాత్రం ఈ ఉద్యమం రైతు కూలీల పోరాటంగా వచ్చింది. ఉత్తర తెలంగాణలో నక్సల్‌బరీకి ప్రతిస్పందన రావడానికి ప్రధాన కారణాలు... ఇదే ప్రాంతంలో రెండు దశాబ్దాల క్రితం సాయుధ పోరాటం జరగడం, నాటి సాయుధ పోరాటాన్ని అర్ధాంతరంగా విరమించడం, భూస్వాములు తిరిగి గ్రామాలకు వెళ్లడం, భూస్వామ్య పద్ధతులు మరో రూపంలో తిరిగి తెలంగాణలో చేరడం లాంటివి. అయితే 1940వ దశకంలో ఉన్న భూస్వామ్య పద్ధతులు స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత తెలంగాణలోని ఇతర జిల్లాల్లో కొంతమేర తగ్గినా.. కరీంనగర్ జిల్లాలో 1970వ దశకంలో కూడా ఈ పద్ధతులు అంతే అమానుషంగా కొనసాగడం వల్ల జగిత్యాల, సిరిసిల్ల పోరాటాలు వచ్చాయి. ప్రత్యేకంగా ఈ ఉద్యమాల గురించి చెప్పుకోవడానికి కారణం.. ఈ రెండు కరీంనగర్ జిల్లాలోనే జరిగాయి. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ప్రభుత్వం భూ సంస్కరణలు పెద్ద ఎత్తున ప్రవేశపెట్టి, భూస్వాముల అధికారాన్ని నియంత్రించి ఉంటే నక్సలబరీ ఉద్యమం రావడానికి చారిత్రక అవసరం ఉండేది కాదు.

చరిత్ర కొనసాగింపు

స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత తిరిగి గ్రామాల్లోకి వచ్చిన భూస్వాముల ప్రయోజనాలను కాపాడే ప్రయత్నం రాజ్యం ద్వారా జరిగింది. చరిత్ర కొనసాగింపుగా అవే ఆధిపత్య, అణచివేత పద్ధతులు కొనసాగడం వల్ల ప్రజలు పోరాట రూపాలను తీసుకోవాల్సి వచ్చింది. ఆ రూపాలే నక్సల్‌బరీ ఉద్యమం. తెలంగాణలో నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, నల్లగొండ జిల్లాల్లో సాయుధ పోరాటానికి కొనసాగింపుగా, నక్సల్‌బరీ ఉద్యమ స్ఫూర్తిగా పెద్ద ఎత్తున యువత ఉద్యమంలోకి వచ్చారు. ఇంజనీరింగ్, మెడికల్ కాలేజీల నుంచి బాగా చదువుకున్న యువత ఉద్యమంలో చేరి కీలక పాత్ర పోషించారు. ప్రస్తుతం మావోయిస్ట్ పార్టీకి జాతీయ స్థాయిలో ప్రాతినిధ్యం వహిస్తున్న వారందరూ ఉత్తర తెలంగాణ ప్రాంతానికి చెందిన వారే. దీన్ని బట్టి ఉద్యమంలో తెలంగాణ యువత భాగస్వామ్యాన్ని అర్థం చేసుకోవచ్చు.

విరసం, పౌర హక్కులు, కవులు, కళాకారులు మొదలైన వారు ఈ ఉద్యమ ప్రభావానికి లోనయ్యారు. తెలంగాణ సమాజంలోని అన్ని రంగాల మీద దీని ప్రభావం ఉంది. ఈ ఉద్యమం లేవనెత్తిన ప్రశ్నలకు ప్రజాస్వామ్య పరిష్కారానికి బదులుగా, అణచివేత మార్గాలనే ప్రభుత్వం అవలంబించడం వల్ల ఉద్యమానికి సంబంధించి ముఖ్యాంశాలు మరుగునపడి హింస.. ప్రతిహింసగా మారింది. దీంట్లో ప్రాణనష్టం క్రమక్రమంగా ఎక్కువ అవుతూ వచ్చింది. ప్రాణ నష్టం పోలీసులకు, నక్సలైట్లకే పరిమితం కాకుండా పౌర సంఘాల్లో పనిచేసే వారు, కవులు, కళాకారులు కూడా అభద్రతభావంతో ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. నక్సలైట్ ఉద్యమానికి పరిష్కారాన్ని శాంతి భద్రతల సమస్యగా కాకుండా, సామాజిక, ఆర్థిక సమస్యగా చూడాలి.

To read between the lines...



Bank Exams
GENERAL ENGLISH

Choose the correct form of the verb (1-3)

1. My uncle ____ with us for last three years.
1) stay 2) stayed 3) stays 4) has been staying

2. He ____ tired because he ____ since morning.
1) feel; work 2) feels; works 3) felt; had been working 4) felt; worked

3. She told me his name after he ____ the room.
1) leave 2) left 3) leaves 4) will leave

Fill in the blanks with appropriate preposition (4-6)

4. He aspires ____ the post of a professor.
1) to 2) at 3) from 4) for

5. He was born ____ a family of clerks.
1) on 2) in 3) into 4) with

6. You should generally pass ____ the fault of your friends.
1) at 2) along 3) away 4) by

Fill in the blanks with an appropriate word from the four options given (7-10)

7. This is a ____ opportunity to enjoy the holiday of a lifetime in Goa.
1) brisk 2) active 3) golden 4) coarse

8. He doesn't know much about the subject, but he's very _____.
1) vociferous 2) quiet 3) enthusiastic 4) dull

9. _____ books I had kept for you were stolen.
1) few 2) a few 3) the few 4) an few

10. Officers responsible for an _____ coup were punished.
1) mature 2) young 3) successful 4) abortive

Fill in the blanks with suitable articles (11-13)

11. ___ Iron is ___ kind of material.
1) The; a 2) A; a 3) A; an 4) No article; a

12. I like using ____ knife and ____ fork while eating.
1) A; a 2) A; an 3) A; the 4) A; No article

13. We started late in ___ afternoon.
1) a 2) an 3) the 4) No article

Choose the synonym of the underlined word in the sentence (14-15)

14. An ambiguous statement means
1) Uninteresting and too lengthy
2) Forceful and convincing
3) Capable of being understood in more than one sense
4) Based upon good judgment

15. Who would like such an impudent fellow?
1) Civilized 2) Humble 3) Respectful 4) Cheeky

Choose the antonym of the underlined word in the sentence (16-17)

16. The criminal was convicted by the judge.
1) Offended 2) Criminal 3) Condemned 4) Acquitted

17. His urbane attitude won him many friends.
1) Indifferent 2) Violent 3) Rustic 4) Rude

18. To read between the lines means
1) Suspect 2) Read carefully 3) Understand the hidden meaning 4) To do useless things

19. Give a word that collocates with "Fixed"
1) Court 2) Office 3) Rate 4) Ward

Choose the meaning of the underlined word in the given context (20-21)

20. Irrigation canals provide arable lands.
1) Abundant 2) Ploughable 3) Suitable 4) Desert like

21. My husband bugs me ad infinitum.
1) At home 2) At will 3) Forever 4) Occasionally

22. A: Oh, I've just realized, I haven't got any money.
B's response is ________
1) Is it? 2) Was it? 3) How come? 4) Haven't you?

23. A: It will stop raining soon.
B: Then we'll go out.
Combine the two sentences
1) We shall be going out when it stops raining.
2) We may go out when it stops raining.
3) We'll go out when it stops raining.
4) We will be going out as soon it stops raining soon.

24. A said: "Are you in a hurry?"
B's response is __________
1) Yes, I got plenty of time.
2) No, I've got plenty of time
3) Although I got plenty of time
4) Nevertheless I may not come

25. The sentence which is incorrect from the following four options is:
1) I wish you would listen to me
2) I wish I would have more free time
3) I wish the weather would change
4) I wish you wouldn't complain all the time

26. They asked me some difficult questions at the interview. (Change into passive voice)
1) I was asked some difficult questions at the interview.
2) I was being asked some difficult questions at the interview.
3) They were asked some difficult questions at the interview.
4) I had been asked some difficult questions at the interview.

27. "Stay in the bed for a few days," the doctor said to me. (Write the reported speech)
1) The doctor tells me to stay in bed for a few days.
2) The doctor said to me to stay in bed for a few days.
3) The doctor told me to stay in bed for a few days.
4) The doctor asked to me to stay in bed for a few days.

Complete the sentence with an appropriate word.

28. ___ my parents are from London.
1) Both 2) Neither 3) Either 4) Either of

29. You have just been to a cinema. The film was extremely boring. What do you say to your friend in the above situation?
1) That's the bore film I had ever seen.
2) That's the most interesting film I've ever seen.
3) That's the most boring film I've ever seen.
4) That's the most boring film that I have seen.

30. A: I lost all my money and I also lost my passport.
B: I lost all my money and I lost also my passport.
Which option is correct?
1) Only A 2) Only B 3) Both A & B 4) Neither A nor B

Choose the wrongly spelt word from the options given below (31-32)

31. 1) Pronunciation 2) Precision 3) Submission 4) Parsuasion

32. 1) Jovial 2) Comission 3) Dictionary 4) Mansion

Identify the parts of speech of the underlined word (33-34)

33. We had our breakfast at a cafe near the rail station.
1) Noun 2) Adjective 3) Adverb 4) Verb

34. The weather was very cold.
1) Noun 2) Adjective 3) Adverb 4) Verb

35. The odd one out from the following:
1) An army of ants
2) A flight of birds
3) A flock of fish
4) A flock of sheep

36. Identify the complex sentence from the following options.
1) Being an English teacher with a penchant for syntactical complexity, I love simple sentences.
2) Being an English teacher with a penchant for syntactical complexity, I love to read simple sentences upon getting up and before going to bed.
3) I can name several conjunctive adverbs; consequently, my friends are impressed.
4) Because people know that I am an English teacher, they make allowances for how I dress and what I say.

37. The statue that is made of marble was bought from Jaipur. (Write the simple sentence)
1) The marble statue was bought from Jaipur.
2) The statue is made of marble and had been bought from Jaipur.
3) The statue which is made in marble was bought from Jaipur.
4) The statue of marble was being bought from Jaipur.

38. I have no money to lend you. (Convert into a complex sentence)
1) I have no money in order I can lend you.
2) I have no money that I can lend you.
3) I have no money that to I can lend you.
4) I have no money that I cannot lend you.

39. Very few boys in the class are as tall as John. (Write the comparative degree)
1) John is taller than other boys in the class.
2) John is taller than most boys in the class.
3) John is taller than much other boys in the class.
4) John is taller than most other boys in the class.

40. All the sentences mean the same except
1) Madurai is the oldest town in Tamilnadu.
2) Madurai is older than any other city in Tamilnadu
3) Many other cities in Tamilnadu are as old as Madurai.
4) No other city in Tamilnadu is older than Madurai.

41. The following sentence has the sentence structure
The leaves turn yellow.
1) S+V+C 2) S+V+O 3) S+V+IO 4) S+V+DO

Choose the appropriate question tag (42-45)

42. It won't be hard to convince her.
1) Won't it? 2) Will it? 3) Is it? 4) Was it?

43. Seetha doesn't like him.
1) Doesn't she? 2) Does seetha? 3) Doesn't seetha? 4) Does she?

44. He plays pretty well.
1) Is he? 2) Did he? 3) Was he? 4) Doesn't he?

45. She is writing her homework.
1) Is she? 2) Was she? 3) Isn't she? 4) Does she?

Key:

1) 4	2) 3	3) 2	4) 4	5) 3
6) 4	7) 3	8) 3	9) 3	10) 4
11) 4	12) 4	13) 3	14) 3	15) 4
16) 4	17) 3	18) 3	19) 3	20) 2
21) 3	22) 4	23) 3	24) 2	25) 2
26) 1	27) 3	28) 1	29) 3	30) 1
31) 4	32) 2	33) 1	34) 2	35) 3
36) 3	37) 1	38) 2	39) 4	40) 3
41) 1	42) 2	43) 4	44) 4	45) 3